

ఈనాడు



విజయవాడ 15-10-2024 మంగళవారం సిటీ సంపుటి 51 . సంచిక 65
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 12
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఆర్థిక అసమానతలపై పరిశోధనకు నోబెల్

అర్థశాస్త్రంలో ముగ్గురిని వరించిన పురస్కారం

స్టాక్‌హోం: దేశాల మధ్య ఆర్థిక అసమానతలకు కారణాలపై పరిశోధన చేసిన ముగ్గురు ప్రొఫెసర్లకు ఆర్థికశాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ పురస్కారం లభించింది. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)కి చెందిన డారెన్ అసెమోగ్లు, సైమన్ జాన్సన్‌లతో పాటు.. షికాగో యూనివర్సిటీకి చెందిన జేమ్స్ రాబిన్సన్‌లను ఈ ప్రతిష్ఠాత్మక బహుమతికి ఎంపిక చేసినట్లు సోమవారం 'రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' ప్రకటించింది. కొన్ని దేశాలే ఎందుకు అభివృద్ధి చెందుతున్నాయి..? కొన్ని దేశాలు ఎందుకు ఎప్పుడూ పేదరికంలో మగ్గుతున్నాయి..? అన్న అంశంపై వీరు చేసిన పరిశోధనకు ఈ అవార్డును అందిస్తున్నట్లు అకాడమీ తెలిపింది. ఓ దేశ శ్రేయస్సులో సామాజిక సంస్థల ప్రాముఖ్యతను ఈ ముగ్గురు ఆర్థికశాస్త్రవేత్తలు సవివరంగా (మిగతా 3లో)



డారెన్ అసెమోగ్లు | సైమన్ జాన్సన్ | జేమ్స్ రాబిన్సన్

బంగాళాఖాతంలో నేడు తీవ్ర అల్పపీడనం

పలు జిల్లాల్లో భారీ వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో సోమవారం తెల్లవారుజామున అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ మంగళవారం నాటికి తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. తర్వాతి 48 గంటల్లో మరింత బలపడి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా తీరాల వైపు కదులుతుందని వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావంతో గురువారం వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకులు స్టెల్లా తెలిపారు. 'దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయి. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడతాయి. బుధవారం రెండు, మూడు చోట్ల అత్యంత భారీ వర్షాలకు (మిగతా 3లో)



నెల్లూరులో సోమవారం జలమయమైన రహదారి

ఆకర్షణీయ ఆకృతులు

రాజధానిలో ఐకానిక్ భవనాలు

అద్భుతంగా అమరావతి

- అప్పటి డిజైన్‌లతోనే హైకోర్టు, శాసనసభ, సచివాలయ భవనాలు
- ప్రభుత్వ నిర్ణయం
- మళ్లీ ముందుకొచ్చిన నార్మన్ ఫోస్టర్!

ఈనాడు - అమరావతి

రాజధాని అమరావతిలో శాసనసభ, హైకోర్టు, సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయ భవనాల ఆకృతులను మార్చరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పరిపాలనా నగర ప్రణాళికతో పాటు, ఆ ఐకానిక్ భవనాలకు ఆకృతుల్ని 2018లో లండన్‌కు చెందిన ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ సంస్థ నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ రూపొందించింది. రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలోకి వచ్చి, రాజధాని నిర్మాణాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించాక... ఐకానిక్ భవనాల ఆకృతులపై ఉన్నతస్థాయిలో చర్చ జరిగింది. దాదాపు ఆరేళ్ల క్రితం రూపొందించిన ఆ ఆకృతుల్లో ఇప్పుడేమైనా మార్పులు చేయాలా అన్న కోణంలో చర్చించారు. వాటి బాహ్య ఆకృతుల్లో ఎలాంటి మార్పులూ చేయరాదని, అవసరమైతే అంతర్గతంగా కొన్ని మార్పులు చేయాలన్న అభిప్రాయానికి వచ్చారు. వాటిని మారిస్తే మరో ఏడాదిన్నర సమయం వృథా అవుతుందన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. పైగా హైకోర్టు, సచివాలయం టవర్ల పునాదుల నిర్మాణం ఇప్పటికే పూర్తయినందున... ఇప్పుడు (మిగతా 3లో)




అప్పట్లో ఆకృతులు ఇలా..!

అప్పట్లో శాసనసభ భవనాన్ని బోర్లించిన లిల్లీ పువ్వు ఆకారంలో, హైకోర్టు ఆకృతిని బౌద్ధ స్తూపం స్ఫూర్తితో రూపొందించారు. సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయ భవనాలను ఐదు టవర్లుగా... డయాగ్రిడ్ విధానంలో నిర్మించాలనుకున్నారు. అప్పటి అంచనాల ప్రకారం వాటి నిర్మాణ వ్యయం రూ.11,752 కోట్లు. శాసనసభ భవనం నిర్మితప్రాంతం 11.67 లక్షలు, హైకోర్టు భవనం నిర్మిత ప్రాంతం 16.85 లక్షలు, సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయ భవనాల నిర్మిత ప్రాంతం 68.88 లక్షల చదరపు అడుగులు. అప్పట్లో హైకోర్టు, సచివాలయ భవనాల నిర్మాణానికి టెండర్లు పిలిచి, పనులు అప్పగించారు. పునాదుల నిర్మాణం పూర్తయింది. వాటి పునాదులకు అప్పట్లో రూ.330 కోట్లు వరకు ఖర్చయింది. శాసనసభ భవనానికి శంకుస్థాపన జరిగింది. ఆ తర్వాత జగన్ ప్రభుత్వం పనులు నిలిపేసింది.

ఉపాధే లెక్క..

ప్రోత్సాహకం పక్కా

- నూతన పారిశ్రామిక విధానంపై కసరత్తు
- ఐదేళ్లలో.. 5 లక్షల మందికి ఉపాధి
- టాపప్ మెకానిజంలో ప్రోత్సాహకం లెక్కింపు
- యంత్రాల కొనుగోలుకు కొంత చేయూత
- అధికారులతో సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



ఈనాడు, అమరావతి: పెట్టుబడుల ఆకర్షణ.. ఎక్కువమందికి ఉపాధి కల్పన ప్రధాన లక్ష్యాలుగా నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రభుత్వం రూపొందిస్తోంది. ఐదేళ్లలో ఐదు లక్షల మందికి ఉపాధి లక్ష్యాన్ని నిర్దేశించింది. పెట్టుబడులతో వచ్చే సంస్థలకు మూలధన పెట్టుబడిపై 'బేస్' ప్రోత్సాహకాలను ఇస్తూనే.. అవి కల్పించే ఉపాధి లెక్కల ప్రకారం టాపప్ (అదనపు) మెకానిజంలో ప్రోత్సాహకాలు అందించే విధానానికి శ్రీకారం చుట్టబోతోంది. గత పాలసీలకు భిన్నంగా మూలధన పెట్టుబడిపై రాయితీ.. పరిశ్రమలు కల్పించే ఉపాధి ఆధారంగా ప్రోత్సాహకాలు.. టాపప్ విధానంలో అదనపు ప్రోత్సాహకాలను ప్రభుత్వం తీసుకురాబోతోంది. ముసాయిదా ఇండస్ట్రియల్, ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీలపై సచివాలయంలో సీఎం చంద్రబాబు సోమవారం సమీక్షించారు. ఈ నెల 16న మంత్రిమండలి సమావేశంలో చర్చించి.. నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉంది. ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు సంబంధించి రూపొందించిన పాలసీపై మరికొంత కసరత్తు చేయాలని అధికారులకు ఆయన సూచించారు. పాలసీ ప్రకటించిన వెంటనే కన్సెంట్ ఆఫ్ ఎస్టాబ్లిష్‌మెంట్, వాణిజ్య ఉత్పత్తిలోకి వచ్చే తేదీని ప్రకటించిన మొదటి 200 కంపెనీలకు అదనపు ప్రోత్సాహకాలు (మిగతా 3లో)

పల్లె పండగతో మహర్దశ

- గ్రామాల్లో రూ.4,500 కోట్లతో 30 వేల పనుల పూర్తి
- కృష్ణా జిల్లా కంకిపాడు సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు, ఈనాడు డిజిటల్ - అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో వేధిస్తున్న 30 వేల సమస్యలను రూ.4,500 కోట్లతో వచ్చే సంక్రాంతిలోగా పరిష్కరిస్తామని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. కృష్ణా జిల్లా కంకిపాడులో 'పల్లె పండగ' కార్యక్రమానికి సోమవారం ఆయన శ్రీకారం చుట్టారు. కంకిపాడులో రూ.91 లక్షలతో 11 సిమెంటు రోడ్లు, రూ.4.15 లక్షలతో రెండు గోకులాలు, పునాదిపాడులో రూ.54 లక్షలతో రెండు సిమెంటు రోడ్ల పనులకు పవన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. 'ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా 13,326 పల్లెల్లో గ్రామసభలు నిర్వహించి సిమెంట్ రహదారులు, బీటీ రోడ్లు, ప్రహరీలు, గోకులాలు, పారిశుద్ధ్య పనులు అన్నీ కలిపి 30 వేల అభివృద్ధి పనులు చేపట్టాలని తీర్మానం చేశాం. వాటన్నింటికీ పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 20 వరకు శంకుస్థాపన చేస్తాం. పనులను సంక్రాంతి లోపు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. ప్రతి గ్రామంలో జరుగుతున్న పనుల వివరాలను ప్రజలందరికీ తెలియజేసేలా సమాచార బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. సామాన్యులొచ్చి పనులు, నిధులు, నాణ్యతా తెలుసుకునేలా అత్యంత పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేశాం' అని వివరించారు. (మిగతా 3లో)



'పల్లె పండగ' ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్

అవినీతి అధికారులు మాకొద్దు

తాను అన్ని విషయాల్లో ఎంత పారదర్శకంగా ఉంటున్నానో.. అధికార యంత్రాంగం కూడా అలాగే ఉండాలని కోరుకుంటున్నట్లు పవన్ అన్నారు. 'కాకినాడలో ఓ ఐఎఫ్ఎస్ అధికారి తీరుపై ఇటీవల ఫిర్యాదులొచ్చాయి. నా పేరు చెప్పి డబ్బులు అడిగినట్లు తెలిసింది. నా దృష్టికి రాగానే విచారణ చేసి అవసరమైతే సస్పెండ్ చేయాలని ఆదేశించా. అవినీతి అధికారులు మాకొద్దు. ఎవరు లంచం పేరుతో ఇబ్బంది పెట్టినా మా దృష్టికి తీసుకురండి' అని పవన్ పేర్కొన్నారు. నిజాయతీగా పని చేసే సిబ్బందికి ఎప్పుడూ ప్రోత్సాహం ఉంటుందన్నారు.

10% మద్యం దుకాణాలు మహిళలకే

- లాటరీలో 345 దుకాణాలు దక్కించుకున్న మగువలు
- అత్యధికంగా విశాఖపట్నంలో 31 మందికి
- ఎక్కువ పోటీ ఉన్న మూడూ తెలంగాణ వాసులకే
- రాష్ట్రంలో ప్రశాంతంగా ముగిసిన మద్యం దుకాణాల లైసెన్సుల కేటాయింపు



విజయవాడలోని గురునానక్ కాలనీ నాక్ కల్యాణ మండపంలో లాటరీ తీసి దుకాణాల కేటాయింపును ప్రకటిస్తున్న అధికారి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మద్యం దుకాణాల లైసెన్సుల కేటాయింపు ప్రక్రియ ఒకటి, రెండు చోట్ల చిన్న ఘటనలు మినహా ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తయింది. 26 జిల్లాల పరిధిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో సోమవారం లాటరీ ద్వారా ఎంపిక నిర్వహించగా.. 3,396 మద్యం దుకాణాలకు గాను 345 మహిళలే దక్కించుకున్నారు. మొత్తంగా 10.20 శాతం దుకాణాలు వారికే లభించాయి. అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 31, అనకాపల్లిలో 25, శ్రీకాకుళం, విజయనగరం, నెల్లూరు జిల్లాల్లో 24 చొప్పున మహిళలకే లభించాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన లాటరీ ప్రక్రియ సాయంత్రం 5 గంటలకు (మిగతా 3లో)

ఇదీ సంగతి!



మొన్న వరదలకు కొట్టుకొచ్చి, ఇక్కడే సురక్షితమని దీనిపైనే నివాసం ఏర్పరచుకున్నా సార్!

కెనడా మళ్లీ కయ్యం

- మన రాయబారిపై బురద
- నిజ్జర్ హత్య కేసుతో ముడిపెట్టే యత్నం
- ట్రూడో సర్కారు నిర్వాకాన్ని తీవ్రంగా ఆక్షేపించిన భారత్
- హైకమిషనర్ ఉపసంహరణకు తక్షణ నిర్ణయం
- దౌత్యవేత్తల పరస్పర బహిష్కరణ

దిల్లీ: కెనడా మరోసారి గిల్లికజ్జాలకు దిగింది. భారత్‌పై తీవ్ర ఆరోపణలకు ఉపక్రమించింది. సిక్కుల అతివాద నేత హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసు అనుమానితుల జాబితాలో ఏకంగా భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్ వర్మను చేర్చడానికి ప్రయత్నించింది. ఈ పరిణామం రెండు దేశాల మధ్య మళ్లీ అగ్గి రాజేసింది. కెనడా వైఖరిపై భారత విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) మండిపడింది. ఆ దేశానికి తీవ్రస్థాయిలో నిరసన తెలిపింది. ఓటుబ్యాంకు రాజకీయాల్లో భాగంగా కెనడా ప్రభుత్వం మన రాయబారిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ, పెద్దఎత్తున బురద జల్లే ప్రయత్నం చేస్తోందని తీవ్ర పదజాలంతో ఆక్షేపించింది. సంజయ్ కుమార్ వర్మకు 36 ఏళ్ల దౌత్య అనుభవం ఉంది. ఆయన 1988 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారి. 2022 సెప్టెంబరులో కెనడాలో బాధ్యతలు స్వీకరించారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన్ని, మరికొందరు అధికారుల్ని అక్కడి నుంచి వెనక్కి తెచ్చేయాలని కేంద్రం నిర్ణయించింది. దిల్లీలో ఉంటున్న కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించాలని కూడా నిర్ణయం తీసుకుంది. వారు ఈ నెల 19వ తేదీ రాత్రి 11.59 గంటల్లోగా భారత్‌ను వీడి వెళ్లాలని గడువు విధించింది. దీనికి ప్రతిగా కెనడా సైతం ఆరుగురు భారత దౌత్యాధికారుల్ని బహిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

"నిజ్జర్ హత్య కేసులో (మిగతా 2లో)



దిల్లీలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారులతో భేటీ అనంతరం బయటకు వస్తున్న కెనడా తాత్కాలిక హైకమిషనర్ స్టీవార్ట్ వీలర్

తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో

చైతన్య లొంగుబాటు

- నాటి ఘటనలో మొదటి నిందితుడు
- 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు
- వైకాపా పాలనలో దందాలు, దౌర్జన్యాలతో హల్‌చల్

ఈనాడు, అమరావతి: మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులో మొదటి నిందితుడు పానుగంటి చైతన్య ఎట్టకేలకు సోమవారం మంగళగిరి న్యాయస్థానంలో లొంగిపోయారు. వైకాపాకు చెందిన న్యాయవాదులతో కలిసి ఎవరూ గుర్తుపట్టకుండా ముసుగు ధరించి వచ్చి న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు. న్యాయస్థానం ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. పోలీసులు ఆయనకు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు చేయించి, గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. కోర్టులో చైతన్య లొంగిపోయిన విషయం తెలుసుకుని దర్యాప్తు అధికారులు హడావుడిగా అక్కడికి చేరుకున్నారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో మొదటి నిందితుడిగా ఉన్న చైతన్య (మిగతా 3లో)




వైద్య పరీక్షల అనంతరం చైతన్యను జైలుకు తరలిస్తున్న పోలీసులు

(c) eenadu

వరదలతో కష్టకాలం
దాతల అభయహస్తం

కుండపోతగా కురిసిన వర్షాలతో ఎటు చూసినా నీరు ఏరులై పారింది. వరదల ధాటికి పొలాలన్నీ దెబ్బతినగా, ఇళ్లన్నీ నీట మునిగాయి. ఉన్నదంతా కోల్పోయిన అభాగ్యులు సాయం కోసం నిరీక్షిస్తున్నారు. వారికి అండగా నిలిచేందుకు పలువురు మానవత్వంతో ముందుకొస్తున్నారు.



చిలుకూరి వెంకట రాఘవయ్య, విశాఖపట్నం
విరాళం: రూ.1,00,000



డా.బి.కనకరాజు, భవ్య తులసీవనం, హైదరాబాద్
విరాళం: రూ.1,00,000

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరపున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
సుంకర స్వరాజ్యలక్ష్మి, కుటుంబ సభ్యులు (కీ.శే.సుంకర వాసుదేవరావు గారి జ్ఞాపకార్థం), మైలవరం, ఎన్టీఆర్ జిల్లా	30,000
చేగు తిప్పయ్యశెట్టి ఆదినారాయణ గుప్తా, హిందూపురం, శ్రీ సత్యసాయి జిల్లా	15,000
అడుసుమిల్లి రమేశ్, బిట్స్ పిలానీ, హైదరాబాద్ క్యాంపస్	10,000
పగడాల అరుణ, హైదరాబాద్	10,000
బి.కృష్ణారెడ్డి, హైదరాబాద్	10,000
అమరావతి సాయిప్రసాద్ శర్మ, హైదరాబాద్	10,000
ఎన్.వరలక్ష్మి, హైదరాబాద్	10,000
దాట్ల సూర్య అప్పలరాజు, రాజుల తాళ్లవలస, విశాఖపట్నం జిల్లా	10,000
కాలిపు కూర్మావతారం, విశాఖపట్నం	10,000
డా.మధుసూదన్‌దేశాయ్, ఆదోని, కర్నూలు జిల్లా	10,000
ఎన్.సత్యనారాయణ గుప్తా (న్యాయవాది), కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా	5,116
శ్రీధర రాము శర్మ ఛారిటబుల్ ట్రస్టు, పొలాస, జగిత్యాల జిల్లా	5,051
డి.విశాలాక్షి, హైదరాబాద్	5,001
ఎం.పురందర్‌నాయుడు, కొత్త ఇండ్లు, తిరుపతి జిల్లా	5,001
ఉప్పర సురేశ్‌బాబు (కీ.శే.హనుమంతు (న్యాయవాది) గారి జ్ఞాపకార్థం), ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా	5,001
యర్నాకుల రాంబాబు, శ్రీకాకుళం	5,000
కనుపూరు పెంచలయ్య, రత్నకుమారి, హైదరాబాద్	5,000
ఎం.హరినారాయణరెడ్డి (విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు), మిట్టూరు, చిత్తూరు జిల్లా	5,000

ఇంటికో కన్నీటి కథ తీర్చాలి బాధితుల వెత

RAMOJI GROUP

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు
ఈనాడు రిలీఫ్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విజయవాడ నుంచి విశాఖకు మరో రెండు విమాన సర్వీసులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విశాఖకు మరో రెండు విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 27 నుంచి సర్వీసును ప్రారంభిస్తామని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఇప్పటికే ప్రకటించగా.. ఇండిగో సంస్థ కూడా ఆ రోజు నుంచే విశాఖకు తమ సర్వీస్‌ను ప్రారంభించనుంది. ఇండిగో విమానం సాయంత్రం 7.15 గంటలకు బయలుదేరి రాత్రి 8.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది. అక్కడ విమానం తిరిగి 8.45 గంటలకు బయలుదేరి రాత్రి 9.50 గంటలకు విజయవాడ వస్తుందని అధికారులు తెలిపారు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ఉదయం 9.35 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి 10.35 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరిగి రాత్రి 7.55 గంటలకు బయలుదేరి 9 గంటలకు విశాఖపట్నం వెళ్తుంది. ఈ సర్వీస్‌ల రాకతో విజయవాడ-విశాఖ విమాన సర్వీస్‌ల సంఖ్య మూడుకు చేరనుంది.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)
E PROCUREMENT SHORT TENDER NOTICE
NIT No.03/MAU61/89/2024-HB Dt.14.10.2024.
Name of Work: "CRDA-Repairs to Damaged false ceiling, toilet fittings, Electrical repairs and Providing mesh type enclosures at AMARAVATHI Skill Development HUB building at Thullur"- Estimate Amount: Rs.22,85,000/-. The bid can be downloaded on AP e-procurement portal from 15.10.2024 to 24.10.2024 up to 14.00 Hrs. Due date for submission of Bid 24.10.2024 up to 15.00 Hrs, Technical bid opening 24.10.2024 @16.00Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Vijayawada.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నిట్ నెం. 13-14/TO/SE(R&B)OGL/2024-25, తేది: 01.10.2024.
ప్రకాశం జిల్లాలో 2 అత్యవసర మరమ్మతు పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. 2 పనులకు అంచనా విలువ: రూ.110.29 లక్షలు. బిడ్స్ స్వీకరణకు చివరి తేది: 21.10.2024 మ.3.30 గం.కు. తదుపరి వివరాలకు ఇ-మార్కెట్‌ప్లేస్ అనగా tender.apeprocurement.gov.in ను చూడవచ్చును. ఫోన్ నెం. 220170
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, (R&B) సర్కిల్, ఒంగోలు
DIPR No. 14254/CL/ADVT/1/1/2021-22

GOVERNMENT OF ANDHRA PRADESH
EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION, VIJAYAWADA
E-procurement Tender Notice
NIT No. 10 to 30/MD/APEWIDC/VJA/2024-25, Dated: 09-10-2024
Downloading commencement on 18-10-2024 and closing date may be viewed in e-procurement.gov.in
Tenders are invited for Construction and Renovation of Govt. Degree Colleges in Andhra Pradesh (21 Works) under PM Usha Scheme with estimate cost ranging of Rs. 325.00 Lakhs to Rs. 600.00 Lakhs.
Further details may be viewed at http://tender.apeprocurement.gov.in Contact No. 08645 295758.
Note : 1. Changes/ amendment if any will only be communicated through above e-procurement platform.
Sd/- Managing Director, APEWIDC, Vijayawada.

జల సంరక్షణలో ఉత్తమ జిల్లా విశాఖ

- ఉత్తమ పంచాయతీ హంపాపురం
- రాష్ట్రం నుంచి మూడు ఉత్తమ సంస్థలు
- ఉత్తమ రాష్ట్రాలుగా ఒడిశా, ఉత్తర్‌ప్రదేశ్
- జాతీయ జల అవార్డుల ప్రకటన

ఈనాడు, దిల్లీ: కేంద్ర జల్‌శక్తి శాఖ 2023 సంవత్సరానికిగాను ప్రకటించిన 5వ జాతీయ జల అవార్డుల్లో విశాఖపట్నం దక్షిణాది రాష్ట్రాల్లో ఉత్తమ జిల్లాగా నిలిచింది. అలాగే ఉత్తమ గ్రామ పంచాయతీల కేటగిరీలో అనంతపురం జిల్లాలోని హంపాపురం గ్రామం మూడో ర్యాంకు కైవసం చేసుకొంది. సంస్థల కేటగిరీలో గుంటూరులోని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ 2వ ర్యాంకు, విశాఖపట్నానికి చెందిన శ్రీతిరుమల నగర్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ 3వ ర్యాంకు దక్కించుకున్నాయి. తిరుపతి ఐఐటీ స్పెషల్ మెన్షన్ అవార్డును దక్కించుకొంది. సోమవారం కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఈ అవార్డులను ప్రకటించారు. ఈనెల 22న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజేతలకు అవార్డులు ప్రదానం చేస్తారని వెల్లడించారు. ఉత్తమ రాష్ట్రాలుగా ఒడిశా, ఉత్తర ప్రదేశ్‌లు తొలి రెండు ర్యాంకులు గెలుచుకోగా, పుదుచ్చేరి, గుజరాత్‌లు కలిసి మూడో ర్యాంకును సంయుక్తంగా కైవసం చేసుకున్నాయి.

అవార్డు దక్కింది ఇందుకే

విశాఖపట్నం జిల్లా నీటి సంరక్షణలో ప్రతిభ చూపినందుకే దక్షిణాదిలో ఉత్తమ జిల్లా ర్యాంకును కైవసం చేసుకున్నట్లు కేంద్ర జల్‌శక్తి శాఖ తెలిపింది. ఇక్కడ అమృత్ సరోవర్ పథకం కింద 33 జలవనరులను పునరుద్ధరించారు. 2,400 కృత్రిమ రీఛార్జి నిర్మాణాలను ఆధునికీకరించారు. దీనివల్ల 87.74 కిలో లీటర్ల నీటి పొదుపు జరిగింది. శారదానదిపై 336 మీటర్ల మేర గట్లను పునరుద్ధరించి వరద మైదానాలను (ఫ్లడ్ ప్లెయిన్స్) సంరక్షించారు. ముడసర్లోవ రిజర్వాయర్‌లో పూడిక తీత వల్ల అందులో నిల్వ సామర్థ్యం 20% పెరిగింది. జిల్లాలోని 491 జలవనరులను జియో ట్యాగింగ్ చేశారు. ముడసర్లోవ రిజర్వాయర్‌లో 2 మెగా వాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించారు.

ఉత్తమ పంచాయతీ హంపాపురం

అనంతపురం పట్టణానికి సమీపంలోని హంపాపురం గ్రామ పంచాయతీ 78 నీటి సంరక్షణ నిర్మాణాలతోపాటు, కొండ ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, మినీ పర్కులేషన్ ట్యాంకులు, పంట కుంటలు, చేపల చెరువులు, ఇంకుడు గుంతలు, ట్రెంచ్‌ల తవ్వకం, చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టినందుకు దేశంలో ఉత్తమ పంచాయతీల కేటగిరీలో మూడో స్థానంలో నిలిచింది. పంచాయతీ పరిధిలో జల సంరక్షణ చర్యల కారణంగా 2.60 లక్షల కిలోలీటర్ల నీటి నిల్వసామర్థ్యం పెరిగినట్లు కేంద్ర జల్‌శక్తి శాఖ తెలిపింది.

కోనేరు లక్ష్మయ్య ఫౌండేషన్ ముందుచూపు


వాననీటి సంరక్షణలో కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ముందుచూపు ప్రదర్శించింది. గుంటూరులోని తమ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 28 వాననీటి సంరక్షణ గుంతలు నిర్మించి 3,800 ఘనపు మీటర్ల నీటిని నిల్వచేసింది. 2,360 ఘనపు మీటర్ల సామర్థ్యంతో 9 భూగర్భ సంప్‌లు నిర్మించింది. వాననీటిని దాదాపు 100% సంరక్షించి సమర్థంగా వినియోగిస్తున్నందుకు కేంద్ర ప్రభుత్వం ఈ సంస్థకు అవార్డు ప్రకటించింది.

◆ విశాఖపట్నంలోని శ్రీతిరుమల నగర్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ తమ కాలనీలో 100 రూఫ్‌టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు చేపట్టి 16 లక్షల లీటర్ల నీటిని ఆదా చేసింది. పార్కులు, రహదారి పల్లపు ప్రాంతాల్లో 62 నిర్మాణాలు, ట్రెంచ్‌లు నిర్మించి వర్షపునీటిని ఒడిసిపట్టడం ద్వారా 30.97 లక్షల లీటర్ల నీటిని ఆదాచేసింది. దీనికితోడు పరిసర ప్రాంతాల్లో 3 వేల చెట్లను సంరక్షిస్తోంది.

◆ తిరుపతి ఐఐటీ ఈ పోటీలో స్పెషల్ మెన్షన్ గెలుచుకొంది. వాననీటిని 100% సేకరించే విధంగా 8.37 కోట్ల లీటర్ల సామర్థ్యంతో 2 పెద్ద చెరువులు నిర్మించినందుకు ఈ సంస్థ ఎంపికైంది. అలాగే క్యాంపస్ వ్యాప్తంగా 5,200 స్థానిక మొక్కలను నాటి వాటిని కాపాడేందుకు ప్రయత్నించినందుకు గుర్తింపు లభించింది.

శ్రీసత్యసాయి జిల్లాలో అత్యాచార ఘటనపై విచారణకు ప్రత్యేక కోర్టు

- నిందితులకు త్వరగా శిక్ష పడేలా చేస్తాం
- మహిళల భద్రతపై రాజీపడే ప్రసక్తే లేదు
- సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- డీజీపీ, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష



ఈనాడు, అమరావతి: శ్రీసత్యసాయి జిల్లాలో అత్తాకోడళ్లపై సామూహిక అత్యాచార ఘటనలో నిందితులకు తక్షణం శిక్ష పడేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. కేసు విచారణ త్వరితగతిన పూర్తయ్యేలా హైకోర్టుకు విన్నవించి ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేద్దామని అన్నారు. గతంలో బాపట్ల జిల్లాలో మహిళలపై సామూహిక అత్యాచారం, హత్య ఘటనపైనా ప్రత్యేక కోర్టు ద్వారా విచారణ జరిపించి నిందితులకు వెంటనే శిక్ష పడేలా చేయాలని పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో జరిగిన దురాగతంపై దర్యాప్తు జరుగుతున్న తీరుని డీజీపీ ద్వారకా తిరుమల రావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సీఎం సోమవారం సమీక్షించారు. మహిళలపై నేరాలకు పాల్పడేవారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. మహిళలపై నేరాలకు పాల్పడితే శిక్ష తప్పదన్న భయం నేరస్తుల్లో రావాలని ఆయన స్పష్టం చేశారు. మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు వంటి ఘటనలపై కఠినంగా వ్యవహరించి, బాధితులకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడేందుకు, మహిళలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో జరిగిన ఘటనకు సంబంధించి ఇప్పటికే పలు కీలక అంశాలను దర్యాప్తు బృందం రాబట్టిందని తెలిపారు. నేరస్తుల్ని గుర్తించేందుకు, కట్టడి చేసేందుకు, కఠినంగా శిక్షించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సాక్ష్యాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. నేరాల్ని అరికట్టేందుకు ప్రజలూ సహకరించాలని, ఎక్కడైనా లైంగిక వేధింపులు, ఘర్షణలు, వివాదాలు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే.. ఆ సమాచారాన్ని, ఆధారాల్ని పోలీసులకు అందజేయాలని కోరారు. ప్రతి వ్యక్తి, ప్రతి మహిళ స్వేచ్ఛగా తిరిగేలా శాంతిభద్రతలు కల్పించేందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకుంటామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఏపీ రోడ్ల అభివృద్ధికి రూ.400 కోట్లు

కేంద్రమంత్రి గడ్కరీ వెల్లడి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో 200.06 కి.మీ. పొడవైన 13 రాష్ట్ర రోడ్ల అభివృద్ధికి కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి (సీఆర్ఐఎఫ్) నుంచి రూ.400 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ సోమవారం ఎక్స్‌లో వెల్లడించారు. గుంటూరు-నల్లపాడు రైల్వే మార్గంలో రూ.98 కోట్లతో శంకర్ విలాస్ ఆర్వోబీని 4 వరుసలతో నిర్మించడానికి ఆమోదం తెలిపినట్లు ప్రకటించారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు.. కేంద్రమంత్రిని కలిసి రాష్ట్ర అవసరాల గురించి చర్చించిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది.

మాజీ సైనికోద్యోగుల కార్పొరేషన్ ఏర్పాటు


మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన మరో హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. ఆంధ్రప్రదేశ్‌లో మాజీ సైనికోద్యోగుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. రూ.10 కోట్ల కార్పస్ ఫండ్‌తో దీన్ని నెలకొల్పింది. అవసరాన్ని బట్టి ఈ కార్పొరేషన్‌కు మరిన్ని నిధులు ఇవ్వనుంది. హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మరిన్ని వివరాలు https://epaper.eenadu.net

అమరావతిలో తుది దశకు జంగిల్ క్లియరెన్స్

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు తుది దశకు చేరాయి. సుమారు 24 వేల ఎకరాల్లో రూ.36 కోట్ల వ్యయంతో ఆగస్టులో చేపట్టిన ఈ పనులు దాదాపు 96 శాతం మేర పూర్తయ్యాయి. భారీ వర్షాల కారణంగా కొద్ది రోజులు ఆటంకం ఏర్పడినా తరువాత యథావిధిగా కంప చెట్ల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. గుత్తేదారు సంస్థ ఎన్‌సీసీ మొత్తం 99 గ్రిడ్స్‌గా విభజించి సుమారు 400 యంత్రాలతో ఈ పనులు చేపట్టింది. తొలగించిన ముళ్ల చెట్లు ఎండిపోయాక ముక్కలుగా కత్తిరించేందుకు త్వరలో హైదరాబాద్ నుంచి ఎనిమిది ప్రత్యేక యంత్రాలను తీసుకురానున్నారు. ఆ ముక్కలను సిమెంట్ పరిశ్రమలు, విద్యుదుత్పత్తి కేంద్రాలకు తరలించనున్నారు. వైకాపా హయాంలో అడవిలా కనిపించిన రాజధాని నేడు రహదారులు, భవనాలతో చూడచక్కగా ఉంది.



జంగిల్ క్లియరెన్స్ పనుల తరువాత అమరావతి డ్రోన్ చిత్రం

కెనడా మళ్లీ కయ్యం

(మొదటి పేజీ తరువాయి)

'పరిశీలించాల్సి ఉన్న వ్యక్తుల' జాబితాలో హైకమిషనర్, ఇతర దౌత్యవేత్తలు ఉన్నట్లు ఆదివారం కెనడా నుంచి దౌత్యపరమైన సమాచారం అందింది. మన అధికారుల మీద నిందలు వేయడానికి జరుగుతున్న తాజా ప్రయత్నాలపై తగిన చర్యలు తీసుకుంటున్నాం. నిజ్జర్ హత్యపై కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో గత ఏడాది సెప్టెంబరులో కొన్ని ఆరోపణలు చేశారు. అప్పటినుంచి ఎన్నిసార్లు భారత ప్రభుత్వం కోరినా ఆ దేశం ఎలాంటి ఆధారాలను సమర్పించలేకపోయింది. ఆరోపణలు అర్థరహితమని ఇప్పటికే తిప్పికొట్టాం. 2020లో భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేలా ట్రూడో కొన్ని వ్యాఖ్యలు చేశారు. తాజాగానూ దర్యాప్తు ముసుగులో భారత్‌పై మచ్చవేసేందుకు కెనడా ప్రయత్నిస్తోంది" అని ఎంఈఏ ఒక ప్రకటనలో పేర్కొంది.

2018 నుంచి ఘర్షణాత్మకమే

ట్రూడో 2018 నుంచే ఘర్షణాత్మక వైఖరిని అవలంబిస్తున్నట్లు ఆధారాలున్నాయని ఎంఈఏ తెలిపింది. భారత్‌లో వేర్పాటువాదాన్ని ఎగదోసేవారిని ట్రూడో తన మంత్రివర్గంలో చేర్చుకోవడాన్ని గుర్తుచేసింది. "కెనడా రాజకీయాల్లో విదేశాల ప్రమేయంపై వస్తున్న విమర్శల్ని తట్టుకోలేక భారత్‌ను అప్రతిష్ఠపాల్జేయాలని ట్రూడో సర్కారు ప్రయత్నిస్తోంది. రాజకీయ ప్రయోజనాల కోసం భారత వ్యతిరేక వేర్పాటువాదులను ఎగదోస్తోంది. అక్కడున్న ఉగ్రవాదుల అప్పగింత కోసం ఎన్నిసార్లు అభ్యర్థనలు పంపినా పట్టించుకోవడం లేదు" అని వివరించింది.

తాత్కాలిక హైకమిషనర్‌ను పిలిపించి నిరసన

తాజా పరిణామం నేపథ్యంలో దిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ (షాజేడఫైర్) స్టీవార్ట్ వీలర్‌ను ఎంఈఏ పిలిపించి నిరసన తెలిపింది. నిరాధార ఆరోపణల్ని ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేసింది. కెనడా ప్రస్తుత సర్కారు హయాంలో భారత దౌత్యవేత్తల భద్రతపై తమకు ఏమాత్రం నమ్మకం లేదని తెలిపింది. (వారిని వెనక్కి తీసుకువచ్చేస్తామని ఆ తర్వాత ప్రకటించింది.) వేర్పాటువాదం, హింస, తీవ్రవాదాలకు ట్రూడో సర్కారు ఇస్తున్న మద్దతుపై తదుపరి చర్యలు తీసుకునే హక్కు భారత్‌కు ఉందని వీలర్‌కు వెల్లడించింది. కెనడా పౌరుడిని కెనడా గడ్డపై హత్య చేయడంలో భారత ఏజెంట్ల పాత్రపై తాము తిరుగులేని ఆధారాలు సమర్పించామని వీలర్ విలేకరులకు తెలిపారు.

◆ భారత్ హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించాలని కెనడా కూడా నిర్ణయించినట్లు అక్కడి ప్రసార మాధ్యమాలు వెల్లడించాయి. నిజ్జర్ హత్య కేసులో వీరి పాత్ర ఉన్నట్లు 'రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్' (ఆర్‌సీఎంపీ) వద్ద ఆధారాలున్నాయని ఒక అధికారి తెలిపినట్లు పేర్కొన్నాయి. అధికారిక సమాచారం వెల్లడి కావాల్సి ఉంది.

గ్రహం అనుగ్రహం
15-10-2024 మంగళవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం
త్రయోదశి: రా. 10-09 తదుపరి చతుర్దశి
పూర్వాభాద్ర: రా. 8-58 తదుపరి ఉత్తరాభాద్ర
వర్జ్యం: ఉ. 5-58 వరకు తిరిగి తె. 5-54 నుంచి
అమృత ఘడియలు: మ. 1-46 నుంచి 3-31 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-15 నుంచి 9-02 వరకు తిరిగి రా. 10-32 నుంచి 11-21 వరకు
రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ. 5.56; సూర్యాస్తమయం: సా.5.37

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తాడేపల్లిగూడెం	34.2	25.0
రాజమహేంద్రవరం	34.0	25.0
అనంతపురం	33.5	24.1
విజయనగరం	33.0	27.0
విశాఖపట్నం	32.8	25.2
శ్రీకాకుళం	32.0	26.0
హైదరాబాద్	31.0	23.6
విజయవాడ	30.6	26.4
నరసాపురం	30.4	25.6
నల్గొండ	29.5	23.8
గుంటూరు	29.0	25.0
తిరుపతి	28.6	24.6
కర్నూలు	28.5	25.0
ఒంగోలు	26.3	25.0
నెల్లూరు	26.1	24.0
కడప	26.0	24.0

రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో సభలు

డిసెంబరులోగా పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు

ఈనాడు, అమరావతి: భూముల రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామ సభల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డిసెంబరు 31లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలంలోని 13 గ్రామసచివాలయాల పరిధిలో ఈ నెల 30వ తేదీ వరకు సభలు జరుగుతాయని అక్కడి జిల్లా యంత్రాంగం ప్రకటించింది. దూరాన్నిబట్టి ఒకేరోజు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో రెండు సభలను నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రీ-సర్వేపై రైతుల్లో అవగాహన కల్పించాలని రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లను ప్రభుత్వం ఆదేశించింది. తదనుగుణంగా నిర్వహించే గ్రామసభల్లో అన్ని రకాల భూసమస్యలపై విజ్ఞప్తులు స్వీకరిస్తారు. రీ-సర్వేతో నష్టపోయినట్లు రైతులెవరైనా ఫిర్యాదు చేస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటారు.

ఇస్రో అధిపతి సోమనాథ్‌కు ఐఏఎఫ్ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఇస్రో అధిపతి సోమనాథ్

శ్రీహరికోట, న్యూస్‌టుడే: చంద్రుడిపై పరిశోధనల్లో గణనీయ పురోగతి సాధించిన చంద్రయాన్-3 మిషన్‌కు నేతృత్వం వహించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అధిపతి, డీవోఎస్ సెక్రటరీ డాక్టర్ సోమనాథ్‌కు ప్రతిష్ఠాత్మక ఐఏఎఫ్ వరల్డ్ స్పేస్ పురస్కారం దక్కింది. ఇటలీలోని మిలాన్‌లో సోమవారం జరిగిన పురస్కార ప్రదానోత్సవంలో ఐఏఎఫ్ ప్రతినిధుల చేతుల మీదుగా ఆయన అవార్డును స్వీకరించారు. ఈ పురస్కారాన్ని అందుకున్నందుకు గౌరవంగా ఉందని సోమనాథ్ పేర్కొన్నారు.

ఐసీఐసీఐ బ్యాంకు బాధితులకు పది రోజుల్లోనే నగదు చెల్లింపులు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడ భారతీనగర్ ఐసీఐసీఐ బ్యాంకు శాఖల్లో గత మేనేజర్ నరేష్ చేతిలో మోసపోయిన ఖాతాదారులకు నగదు చెల్లించే ప్రక్రియను బ్యాంకు ఉన్నతాధికారులు సోమవారం నుంచి ప్రారంభించారు. తొలుత ఈ నెల 3న చిలకలూరిపేట బ్రాంచిలో నరేష్ చేసిన మోసాలను జోనల్ మేనేజర్ సందీప్ మెహ్రా గుర్తించారు. అతను పనిచేసిన కాలంలో వివిధ శాఖల్లో కలిపి మొత్తం 72 మంది ఖాతాదారుల నుంచి రూ.28 కోట్లు కాజేసినట్లు విజయవాడలోని సీఐడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి కేసు గుంటూరు సీఐడీ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో గుంటూరు సీఐడీ అదనపు ఎస్పీ ఆదినారాయణ, సీఐ సంజీవ్‌కుమార్ చిలకలూరిపేటలోని ఐసీఐసీఐ బ్యాంకుకు వచ్చి సిబ్బందిని విచారించారు. అనంతరం బాధితులను పిలిపించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. సోమవారం నుంచి బ్యాంకు ఉన్నతాధికారులు ఖాతాదారులకు నగదు చెల్లించే ప్రక్రియ ప్రారంభించారు.

6 జిల్లాల్లో సహాయ, పునరావాసానికి రూ.6 కోట్లు

ఈనాడు, అమరావతి: అల్పపీడనం, భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఆరు జిల్లాల్లో సహాయ, పునరావాస చర్యలకు ప్రభుత్వం రూ.6 కోట్లు విడుదల చేసింది. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలకు రూ.కోటి చొప్పున విడుదల చేస్తూ రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోదియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరద ప్రాంతాల్లో పునరావాస శిబిరాలు, తాగునీరు, ఆహారం, పాలు, ఆరోగ్య శిబిరాలు, పారిశుద్ధ్య చర్యలతో పాటు వరద బాధితులను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకోవాలని పేర్కొన్నారు. రోడ్లపై చెట్లు పడిపోతే తొలగించేందుకు ఆర్అండ్‌బీ, పురపాలక, పంచాయతీరాజ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సహకారం తీసుకోవాలని సూచించారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో రూ.200 కోట్ల అవినీతి

- గత ప్రభుత్వంలో ఆళ్ల రామకృష్ణారెడ్డి బినామీకి కాంట్రాక్టులు
- కీలకంగా వ్యవహరించిన వై.శ్రీలక్ష్మి, పూజారి ఆనంద్‌రావు
- తెదేపా నేత మన్నవ సుబ్బారావు ధ్వజం

ఈనాడు, అమరావతి: గత ప్రభుత్వంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో రూ.200 కోట్ల మేర అవినీతి జరిగిందని తెదేపా నేత, గుంటూరు మిర్చియార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు విమర్శించారు. అడ్డగోలుగా నిబంధనలను మార్చేసి వైకాపా మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి బినామీ అయిన షేక్ జాన్‌సైదాకు అడ్డగోలుగా టెండర్లు కట్టబెట్టారని మండిపడ్డారు. దీంట్లో అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, స్వచ్ఛ ఆంధ్ర సీఈ పూజారి ఆనంద్‌రావు కీలకంగా వ్యవహరించారని సోమవారం మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణతో కలిసి మన్నవ సుబ్బారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. '2014-19 మధ్య 20 మంది గుత్తేదారులు చేసిన పనులను.. గత వైకాపా ప్రభుత్వం జ్ఞానేశ్వర ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, క్రితి ఇంజినీరింగ్ సర్వీసెస్ అనే రెండు కంపెనీలకే కట్టబెట్టింది. ఈ రెండింటికీ పల్నాడు జిల్లా, చిలకలూరిపేటకు చెందిన షేక్ జాన్‌సైదా యజమాని. ఈ రెండు కంపెనీలకు ఎలాంటి ఆస్తులు, బ్యాంకు లిమిట్స్ లేవు. కేవలం అధికారుల అండదండలు, ఫోర్జరీ డాక్యుమెంట్లతో రూ.వందల కోట్ల విలువగల టెండర్లు పొందారు. రూ. 20 కోట్ల కాంపాక్ట్ బిన్నులు, రూ.వంద కోట్ల విలువైన ట్రై సైకిళ్లు, 40 లీటర్ల సామర్థ్యం ఉన్న హెచ్‌డీపీఈ బిన్నులు, రూ. 120 కోట్ల విలువైన పది లీటర్ల సామర్థ్యం ఉన్న హెచ్‌డీపీఈ డస్ట్ బిన్నుల కాంట్రాక్టులు దక్కించుకున్నారు. అన్నీ నాసి రకానిని సరఫరా చేశారు. అది కూడా 60 శాతం మాత్రమే జరిగింది' అని సుబ్బారావు వెల్లడించారు.

ఒక్క ట్రాక్టర్ ట్రైలర్ కూడా ఇవ్వలేదు..

'2,200 పంచాయతీలకు రూ.74 కోట్ల విలువైన ట్రాక్టర్ ట్రైలర్ల సరఫరాకు గతేడాది మే నెలలో వర్క్ ఆర్డర్ తీసుకున్నారు. 180 రోజుల్లో వీటిని సరఫరా చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఒక్కటి కూడా అందించలేదు' అని వివరించారు.

ఉద్యోగ అవకాశాలు

కావలెను
ప్రముఖ NGO అయినటువంటి మా సంస్థ నందు పనియు చేయుటకు సిబ్బంది కావలెను
చంద్రగిరి - తిరుపతి, ఉరవకొండ- అనంతపురం, యెమ్మిగనూరు - కర్నూల్, పెనుగొండ, కదిరి, మడకశిర- శ్రీ సత్య సాయి, కొవ్వూరు - నెల్లూరు, గురజాల, సత్తెనపల్లి - పల్నాడు, తాడికొండ, పొన్నూరు - గుంటూరు, రేపల్లె- బాపట్ల, మచిలీపట్టణం - కృష్ణ, నూజివీడు - ఏలూరు, ఆచంట - వెస్ట్ గోదావరి, రామచంద్రపురం- కోనసీమ, యలమంచిలి -అనకాపల్లి, టెక్కలి- శ్రీకాకుళం, సాలూరు - మన్యం,
పైన తెలుపబడినటువంటి నియోజకవర్గాల వారీగా (జిల్లాలలో) మా సంస్థ నందు పనియు చేయుటకు ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ అర్హత కలిగివుండి ఆసక్తిగల వారు మీ యొక్క Resume మాకు పంపగలరు.
Email : curd461@gmail.com
101, సుభద్ర ఎన్‌క్లేవ్, SBI ఎల్లారెడ్డిగూడ బ్రాంచ్ ఎదురుగా, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్ -500073
Contact : 6302336200,7675025129

A for Appointments
ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు విజయవాడ
Cell: 80080 03297

(c) eenadu


విశాఖలోని చిల్డ్రన్ ఎరీనాలో మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియకు వచ్చిన మహిళ

10% మద్యం దుకాణాలు మహిళలకే

(మొదటి పేజీ తరువాయి)

ముగిసింది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లా వత్సవాయిలోని 96వ నంబరు దుకాణానికి 132, 97వ నంబరు దుకాణానికి 120, పెనుగంచిప్రోలులోని 81వ నంబరు దుకాణానికి 110 దరఖాస్తులు వచ్చాయి. ఈ మూడు దుకాణాల లైసెన్సులు లాటరీలో తెలంగాణ రాష్ట్రం వారినే వరించడం విశేషం. 96వ నంబరు దుకాణం ఖమ్మం జిల్లా ఖానాపురానికి చెందిన చెరుకుపల్లి సత్యనారాయణకు దక్కగా... 97వ నంబరు దుకాణం రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన బండి అనూషకు, 81వ నంబరు దుకాణం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన తల్లపల్లి రాజుకు లభించాయి. ఏలూరు జిల్లా కుక్కునూరు 121వ నంబరు దుకాణానికి 108 దరఖాస్తులు రాగా.. విలీన మండలాల్లో ఒకటైన వేలేరుపాడు మండలానికి చెందిన కామినేని శివకుమారి లాటరీలో దక్కించుకున్నారు. వీరందరికీ తెలంగాణలో మద్యం వ్యాపారాలున్నాయి.

భాజపా అనంతపురం జిల్లా అధ్యక్షుడికి 5 దుకాణాలు

■ అనంతపురం జిల్లా భాజపా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావుకు ధర్మవరం నియోజకవర్గం పరిధిలోని ధర్మవరం, బత్తలపల్లి, ముదిగుబ్బల్లో 5 మద్యం దుకాణాలు దక్కాయి. మడకశిర నియోజకవర్గంలో నాలుగు దుకాణాలు మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రధాన అనుచరులైన వెంకటసుబ్బారెడ్డి, వైజయంతిమాల దంపతులకు లభించాయి.

■ వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలోని నాలుగు మద్యం దుకాణాలు బీఆర్‌కే న్యూస్ ఛానల్ యాజమాన్య ప్రతినిధులకు వరించాయి. ఆ ఛానల్ రిపోర్టర్ లాటరీ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ నియోజకవర్గంలో మద్యం దుకాణాలకు తక్కువగా దరఖాస్తులు రావటంతో వారు దరఖాస్తులు వేసి దక్కించుకున్నారు.

మంత్రి నారాయణ 100 దరఖాస్తులు వేయిస్తే.. 3 వరించాయి

మొన్నటి ఎన్నికల్లో తన విజయం కోసం పని చేసిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల కోసం మంత్రి నారాయణ నెల్లూరు జిల్లాలో తన సొంత డబ్బులు రూ.2 కోట్లతో మద్యం దుకాణాలకు 100 దరఖాస్తులు వేశారు. వారికి మొత్తంగా మూడు దుకాణాలు లభించాయి. ఒక్కో దుకాణాన్ని ఐదుగురు చొప్పున మొత్తం 15 మంది నిర్వహించుకునేందుకు వీలుగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆ లైసెన్సులు అప్పగించేశారు.


లాటరీ ప్రక్రియలో పాల్గొనేందుకు వెళుతూ కర్నూలు జడ్పీ కార్యాలయం వద్ద బారులు తీరిన దరఖాస్తుదారులు

తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల వారికీ..

దేశంలోని ఏ రాష్ట్రం వారైనా సరే మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈసారి అవకాశమివ్వటంతో ఇతర రాష్ట్రాలవారు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వేశారు. వారిలో కొంతమందికి దుకాణాలు దక్కాయి.

■ విజయవాడలోని 14, 18వ నంబరు దుకాణాలు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రాహుల్ శివ్‌హరే, అర్పిత్ శివ్‌హరేకు లభించాయి. మచిలీపట్నంలో ఓ దుకాణాన్ని కర్ణాటకకు చెందిన మహేష్ బాతే, మరో దుకాణాన్ని దిల్లీ వాసి లోకేశ్ చంద్ దక్కించుకున్నారు.

■ ఒడిశాకు చెందిన మద్యం వ్యాపారులకు శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో రెండేసి దుకాణాలు వచ్చాయి.

■ కర్నూలు జిల్లాలో 10 మద్యం దుకాణాలు కర్ణాటక, తెలంగాణలకు చెందిన వ్యాపారులు దక్కించుకున్నారు.

■ పలు జిల్లాల్లో ప్రవాసాంధ్రులు వారి పేరిట, వారి బంధువులు, కుటుంబీకుల పేరిట దరఖాస్తులు చేయగా వారికి దుకాణాలు లభించాయి.

480 దరఖాస్తులకు 11 దుకాణాలు

■ విజయవాడకు చెందిన ఓ బార్ యజమాని.. తన బృందంతో కలిసి 480 దరఖాస్తులు వేయగా 11 దుకాణాలు వచ్చాయి.

■ విజయవాడకు చెందిన మరో మద్యం వ్యాపారి.. తన బృందంతో కలిపి 360 దరఖాస్తులు వేయగా 5 దుకాణాలు లభించాయి.

■ విశాఖపట్నం జిల్లాలో నోయిడాకు చెందిన కొంతమంది వ్యాపారులు భారీగా దరఖాస్తులు చేసి.. కొన్ని దుకాణాలు దక్కించుకున్నారు.

■ అమరావతికి చెందిన ఓ వ్యక్తి, ఆయన బృందం.. 172 దరఖాస్తులు వేయగా 2 దుకాణాలు దక్కాయి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఓ ముఖ్య నాయకుడి స్నేహితుడు 112 దరఖాస్తులు వేయగా.. రెండు దుకాణాలు లభించాయి.

■ తాడిపత్రి నియోజకవర్గంలో అత్యధిక దుకాణాలకు మూడేసి దరఖాస్తులే వచ్చాయి. వాటిలో అధిక శాతం తెదేపా నేత జేసీ ప్రభాకరరెడ్డి అనుచరులకే దక్కాయి.

పిల్లాపాపలతో లాటరీకి హాజరైన మహిళలు

విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తిరుపతి, అన్నమయ్య, అనకాపల్లి సహా అన్ని జిల్లాల్లో లాటరీ ప్రక్రియలో పాల్గొనేందుకు మహిళలూ వచ్చారు. కొందరైతే పిల్లాపాపల్ని వెంటపెట్టుకుని మరీ హాజరయ్యారు. పలువురు మద్యం వ్యాపారులు అదృష్టం వరిస్తుందనే ఉద్దేశంతో వారి భార్య, తల్లి పేర్లతో దరఖాస్తులు చేయించారు. దీంతో వారంతా లాటరీ ప్రక్రియలో పాల్గొనేందుకు వచ్చారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో 32 దుకాణాలుంటే వాటిలో ఆరు మహిళలకే వచ్చాయి

పెట్రోల్ బంకులో పనిచేసే వ్యక్తికీ..

■ ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని 80వ నంబరు దుకాణం ఎన్.రామకృష్ణ అనే వ్యక్తికి దక్కింది. ఆయన గత పదేళ్లుగా పెట్రోల్ బంకులో బాయ్‌గా పనిచేస్తున్నారు. కొంతమందితో కలిసి బృందంగా ఏర్పడి ఆయన దరఖాస్తు చేసుకోగా.. అదృష్టం వరించింది.

■ విశాఖ జిల్లాకు చెందిన ఓ మద్యం వ్యాపారి తన బృందంతో కలిపి 168 దరఖాస్తులు వేయగా 11 దుకాణాలు లభించాయి.


విశాఖలో 168 దరఖాస్తులకు 11 దుకాణాలు లాటరీలో దక్కడంతో వివరాలు పరిశీలించుకుంటున్న మహిళలు, దరఖాస్తుదారులు

ప్రకటనలో పొరపాట్లతో అభ్యంతరాలు

■ శ్రీకాకుళం జిల్లాలోని 42వ నంబరు మద్యం దుకాణానికి లాటరీ తీసి 6వ నంబరు దరఖాస్తుదారు ఎంపికైనట్లు తొలుత కలెక్టర్ ప్రకటించారు. అయితే అది 6 కాదని.. 9వ నంబరు అని మళ్లీ ప్రకటించటంతో దరఖాస్తుదారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అది 9వ నంబరేనని కలెక్టర్ పూర్తిగా స్పష్టతిచ్చి, అనుమానాలు నివృత్తి చేయటంతో వివాదం సద్దుమణిగింది.

■ పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని 24వ నంబరు దుకాణానికి లాటరీలో 7వ నంబరు దరఖాస్తుదారు ఎంపికగా.. జిల్లా కలెక్టర్ దాన్ని పొరపాటున ఒకటిగా చదివారు. ఆ తర్వాత స్పష్టతివ్వటంతో వివాదం సద్దుమణిగింది.

ఉదయం ఫిర్యాదు.. సాయంత్రానికి ప్రత్యక్షం

శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలోని 57వ నంబరు దుకాణం రంగనాథ్ అనే వ్యక్తికి దక్కింది. లాటరీ ప్రక్రియ పూర్తిచేసుకుని బయటకురాగానే గుర్తుతెలియని వ్యక్తులు ఆయన్ను అపహరించారంటూ రంగనాథ్ భార్య ఆశ్విని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రికి ఆయన పోలీసు స్టేషన్‌లో ప్రత్యక్షమవడంతో వివాదం ముగిసింది.

అద్భుతంగా అమరావతి



(మొదటి పేజీ తరువాయి)

ఆకృతులను మార్చాలనుకోవడం సరికాదన్న అభిప్రాయానికి వచ్చింది. హైకోర్టు భవన ఆకృతులకు సంబంధించి హైకోర్టు న్యాయమూర్తులతో ఇటీవల సీఆర్‌డీఏ అధికారులు సమావేశమై, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. మరోపక్క ఐకానిక్ భవనాల డిజైన్లకు సంబంధించి పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ఆర్కిటెక్ట్ నియామకానికి సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. లండన్ సంస్థ నార్మన్ ఫోస్టర్ ప్రతినిధులు కూడా ప్రీబిడ్ మీటింగుకు హాజరయ్యారు. ఆ సంస్థ కూడా బిడ్ దాఖలు చేసి ఉంటుందని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. మరో మూడు నాలుగు రోజుల్లో బిడ్‌లు తెరిచి ఆర్కిటెక్ట్‌ను ఖరారు చేయనున్నారు. హైకోర్టు, సచివాలయ భవనాల పునాదులు పటిష్ఠంగానే ఉన్నాయని చెన్నై ఐఐటీ నిపుణులు సర్టిఫై చేయడంతో ఆ భవనాల నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలిచేందుకు సీఆర్‌డీఏ సన్నాహాలు చేస్తోంది.

జగన్ ప్రభుత్వం ముప్పు తిప్పలు పెట్టినా..!

2019కి ముందు తెదేపా హయాంలో అమరావతి నిర్మాణంలో పాలుపంచుకున్న ప్రఖ్యాత సంస్థలేవీ... ఇప్పుడు మళ్లీ ఆ అవకాశం వస్తే వదులుకోవడానికి సిద్ధంగా లేవు. నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ సంస్థ మళ్లీ అమరావతి నిర్మాణంలో భాగస్వామి అయ్యేందుకు ఆసక్తి చూపడమే ఇందుకు నిదర్శనం. జగన్ ప్రభుత్వంలో అనేక చేదు అనుభవాల్ని ఎదుర్కొన్న విదేశీ సంస్థల్లో నార్మన్ ఫోస్టర్ కూడా ఉంది. వైకాపా ప్రభుత్వం...నార్మన్ ఫోస్టర్ వంటి సంస్థల్నీ అనేక ఇబ్బందులు పెట్టింది. వారితో సీఆర్‌డీఏ చేసుకున్న ఒప్పందాల్ని కాలరాసింది. నార్మన్ ఫోస్టర్ సంస్థకు బకాయిలు చెల్లించకుండా ముప్పుతిప్పలు పెట్టింది. చివరకు బకాయిలు వసూలు చేసుకోవడానికి నార్మన్ ఫోస్టర్ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అన్ని వేధింపులు ఎదుర్కొన్న తర్వాత కూడా నార్మన్ ఫోస్టర్ సంస్థ... మళ్లీ ముందుకు వస్తుందని సీఆర్‌డీఏ అధికారులు ఊహించలేదు. కానీ ప్రీబిడ్ మీటింగుకు హాజరవడంతో...ఆ సంస్థ ఆసక్తిగా ఉందన్న విషయం తెలిసింది. ఆ సంస్థ ప్రీబిడ్ మీటింగుకు మాత్రమే హాజరైందా? బిడ్ కూడా దాఖలు చేసిందా అన్న విషయంలో స్పష్టత లేదు. ఒక వేళ ఆ సంస్థ బిడ్ వేసి, దానికే టెండరు ఖరారైతే సమయం కలిసి వస్తుందని సీఆర్‌డీఏ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

బంగాళాఖాతంలో నేడు తీవ్ర అల్పపీడనం

(మొదటి పేజీ తరువాయి)

అవకాశముంది. తీరప్రాంత జిల్లాల్లో గంటకు గరిష్ఠంగా 55 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయి' అని వివరించారు. గురువారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు ఒడ్డుకు తిరిగి రావాలని సూచించారు. విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం (సీడబ్ల్యూసీ) రాష్ట్ర ప్రభుత్వం, అన్ని జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేసింది.

వివిధ ఏజెన్సీల అంచనాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్రత వేగంగా పెరుగుతోందని ఐఎండీ జీఎఫ్ఎస్ (గ్లోబల్ ఫోర్‌కాస్ట్ సిస్టమ్) అంచనా వేస్తోంది. బుధవారం నాటికి తీవ్ర తుపానుగా రూపాంతరం చెంది, చెన్నైకి దక్షిణంగా తీరం దాటవచ్చని సూచించింది. తీరం దాటిన తర్వాత బలహీనపడి, అరేబియా సముద్రంలోకి వెళ్లి మళ్లీ అతి తీవ్రతుపానుగా బలపడుతుందనే అంచనాలున్నాయి. ఇది కేవలం అల్పపీడనంగానే దక్షిణ కోస్తాలో తీరం దాటొచ్చని కొన్ని వాతావరణ నమూనాలు అంచనా వేస్తున్నాయి. దీనిపై బుధవారం నాటికి స్పష్టత వస్తుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు అరేబియా సముద్రంలో వాయుగుండం కొనసాగుతోంది. ఇది ఒమన్ తీరం వైపు కదులుతోంది. రానున్న 24 గంటల్లో తీవ్ర అల్పపీడనంగా బలహీనపడనుంది.

■ శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అన్నమయ్య జిల్లాల్లో సోమవారం ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. అత్యధికంగా సాయంత్రం 6 గంటల వరకు నెల్లూరు జిల్లా కొడవలూరులో 11 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఇదే జిల్లాలోని ఇసకపల్లి-10.9, కావలి-10.6, బుచ్చిరెడ్డిపాలెం-9.7, దగదర్తి-9.3, బాగోలు-8.6, తిరుపతి జిల్లా చింతవరంలో 8.2 సెం.మీ వర్షం కురిసింది.

విపత్తు బృందాలు సిద్ధం: హోం, మున్సిపల్ మంత్రులు

ఈనాడు, విశాఖపట్నం, నెల్లూరు: అల్పపీడనం నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడామని, సెలవులో ఉన్న అధికారులు విధుల్లోకి రావాల్సిందిగా సూచించామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. 'ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ముంపునకు ఆస్కారమున్న ప్రాంతాలకు ముందుగానే పంపిస్తాం. తుపాను షెల్టర్లను సిద్ధం చేస్తున్నాం. కర్నూలు, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో జిల్లా కేంద్రాలతో పాటు ప్రతి మండలంలోనూ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేస్తాం. డ్రోన్లను సిద్ధం చేశామ'ని అనిత వివరించారు. నెల్లూరు నుంచి మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అన్ని నగరాలు, పట్టణాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

అన్ని శాఖలూ అప్రమత్తం: సీఎస్

వర్షాల నేపథ్యంలో పోలీసు, పంచాయతీరాజ్, జలవనరులు, ఆర్‌అండ్‌బీ శాఖల సిబ్బందిని అప్రమత్తం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్‌ప్రసాద్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోదియా జిల్లా కలెక్టర్లకు సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నుంచి వారు అధికారులతో సమీక్షించారు.

ఉపాధే లెక్క.. ప్రోత్సాహకం పక్కా

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలన్న నిర్ణయంపై ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్క్రో ఖాతా ద్వారా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలను చెల్లించే విధానాన్ని తీసుకురావాలని ఆలోచిస్తున్నాం. దీనివల్ల పారిశ్రామిక వేత్తలకు జాప్యం లేకుండా ప్రోత్సాహకాలు అందుతాయి. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో ఇది కీలకంగా మారుతుంది' అని అభిప్రాయపడ్డారు.

ఉపాధి లెక్కల ఆధారంగా..

సంస్థలు పెట్టే పెట్టుబడితో సంబంధం లేకుండా.. అవి కల్పించే ఉపాధి ఆధారంగా ప్రోత్సాహకాలను చెల్లించే విధానాన్ని ప్రభుత్వం తీసుకురాబోతోంది. రూ.కోటి పెట్టుబడితో ఐదుగురికి ఉపాధి కల్పిస్తే ప్రోత్సాహకాల కింద ఎంత ఇస్తారు.. అదే పెట్టుబడితో 10 మందికి ఉపాధి కల్పిస్తే ఎంత.. అనేది ప్రభుత్వం ప్రకటించనుంది. దీనికోసం టాపప్ మెకానిజాన్ని తీసుకురాబోతోంది. అన్ని కంపెనీలకు బేస్ ఇన్సెంటివ్ చెల్లించి.. అవి కల్పించే ఉపాధి లెక్కల ఆధారంగా అదనపు ప్రోత్సాహకాలు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది.

టాపప్ మెకానిజంలో అదనంగా 10 శాతం

మూలధన పెట్టుబడిలో కొంత శాతాన్ని ప్రభుత్వం ప్రోత్సాహకాల కింద అందిస్తుంది. కర్ణాటక 48 శాతం, ఒడిశా 52 శాతం, తమిళనాడు 38 శాతం చొప్పున ఇస్తున్నాయి. ఇక్కడా అదే తరహాలో బేస్ ప్రోత్సాహకాలను ఇస్తూనే.. టాపప్ మెకానిజంలో అదనంగా కూడా ఇవ్వనున్నారు. ఉపాధి ఆధారంగా 2 శాతం, గ్రీన్ ఇండస్ట్రీ కింద మరో 2 శాతం.. స్థానికంగా మెటీరియల్ ప్రొక్యూర్ చేసుకునే కంపెనీలు 1 శాతం చొప్పున.. అదనపు ప్రోత్సాహకాలు పొందవచ్చు.

■ కాలుష్య నియంత్రణకు తీసుకున్న చర్యల ఆధారంగా ప్రోత్సాహకాల్లో మార్పు ఉంటుంది.

తర్వాతా చేయూత

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ప్రభుత్వం తీసుకురాబోతోంది. దీని ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు ముందు అయ్యే ఖర్చుల భారాన్ని కొంతమేర తగ్గించడం.. ఉత్పత్తిలోకి వచ్చిన తర్వాత విద్యుత్ సబ్సిడీ, స్టాంపు డ్యూటీ మినహాయింపు, జీఎస్టీ మినహాయింపులు, లోకల్ ప్రొక్యూర్‌మెంట్ సబ్సిడీ వంటివి ఇవ్వనుంది.


పరిశ్రమల విధానంపై అధికారి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. చిత్రంలో మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్

చిన్న పరిశ్రమలకూ ప్రాధాన్యం

భారీ పరిశ్రమలను ఆకర్షిస్తూనే.. చిన్న పరిశ్రమలనూ ప్రోత్సాహించేలా నూతన ఎంఎస్ఎంఈ పాలసీ తీసుకురాబోతోంది. దీనిపై జరిగిన చర్చలో సీఎం మాట్లాడుతూ.. 'ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యంతో ఎంఎస్ఎంఈ పాలసీ ఉండాలి. మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు మరో 5 శాతం అదనపు ప్రోత్సాహకాలను ప్రభుత్వం ఇస్తుంది' అని పేర్కొన్నారు.

అమరావతిలో టాటా ఇన్నోవేషన్ హబ్..

దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటా పేరిట అమరావతిలో 'టాటా ఇన్నోవేషన్ హబ్' ఏర్పాటుకు ప్రభుత్వం విధివిధానాలను ఖరారు చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్ స్టార్టప్స్, ఫెసిలిటీ కేంద్రంగా అమరావతిలో ఇన్నోవేషన్ హబ్ పనిచేస్తుంది. దీనికి అనుబంధంగా రాష్ట్రంలో మరో 5 ప్రాంతాల్లో సెంటర్స్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. జీఎంఆర్, కియా వంటి మల్టీనేషనల్ కంపెనీలకు మెంటార్ బాధ్యతలు అప్పగించాలని ఆలోచిస్తోంది. ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా కూడా పంచుకున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి ప్రాధాన్యం: సీఎస్ నీరబ్ కుమార్

ఆక్వా, పౌల్ట్రీ రంగంలో మాదిరే ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఫలితాలు సాధించే విధానాలను అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులకు సూచించారు. 'పౌల్ట్రీ రంగంతో పాటు పాడి పరిశ్రమ, మేకలు, గొర్రెల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలి' అని వివరించారు.

చైతన్య లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెలువడిన రోజున ఉదయం ఏఎన్‌యూ వద్ద పోలీసులకు కనిపించారు. వైకాపా ఓటమి పాలవడంతో అదే రోజు గుంటూరును వీడినట్లు గుర్తించారు. అతను పట్టుబడితేనే కేసు దర్యాప్తు వేగవంతమవుతుందని పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా నాలుగైదు బృందాలను కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, దిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాలకు పంపించారు. ఫోన్ స్విచాఫ్ చేయడంతో అతని కదలికలను గుర్తించడం కష్టమైంది. ప్రస్తుతం కస్టడీ పిటిషన్ వేసి విచారణకు తీసుకోవాలనిపోలీసులు భావిస్తున్నారు.

నాడు దౌర్జన్యాలెన్నో.. గుంటూరు నగరానికి చెందిన చైతన్యకు తొలి నుంచి దుందుడుకుగా, అల్లరి చిల్లరగా తిరిగేవాడని పేరుంది. వైకాపా అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి ప్రధాన అనుయాయుడిగా నిత్యం ఆయనతో కలిసి తిరుగుతూ గుంటూరులో హల్‌చల్ చేశారు. అధికారం ముసుగులో ఐదేళ్లపాటు అనేక దందాలు, దౌర్జన్యాలు సాగించారు. గత ఎన్నికలకు ముందు వైకాపా నిర్వహించిన సిద్ధం సభలు, ఆ పార్టీ సమావేశాలకు జనాల్ని తరలించటంలోనూ క్రియాశీలకంగా వ్యవహరించారు. బుడంపాడు వద్ద నిర్వహించిన వైకాపా 'సిద్ధం' సభలో డ్రోన్లు ఎగరేశారన్న అనుమానంతో చైతన్య అనుచరులు.. ఏకంగా పోలీసులపై దాడికి పాల్పడిన ఘటన అప్పట్లో పెద్ద సంచలనమైంది. వైకాపా ముఖ్య నేతల పుట్టినరోజు వేడుకల పేరు చెప్పి చైతన్య గుంటూరులో వ్యాపార వర్గాలను బెదిరించి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడ్డారనే బలమైన ఆరోపణలున్నాయి. కళాశాలల విద్యార్థులకు మద్యం, సిగరెట్లు, గంజాయి వంటివి సరఫరా చేసి వారితో పార్టీ ర్యాలీలు నిర్వహించేవారు. విజయవాడ ప్రాంతంలోనూ అనేక దందాలకు పాల్పడ్డారని పోలీసులు గుర్తించారు. ఇలాంటి కార్యకలాపాలతో వైకాపా ముఖ్య నేతల దృష్టిని ఆకర్షించారు. వైకాపా పెద్దల ఆదేశాలతో తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి జరిగిన రోజు గుంటూరు నుంచి పెద్దఎత్తున యువకులను తీసుకెళ్లారని పోలీసులు గుర్తించారు. దీంతో కేసులో మొదటి నిందితుడిగా చైతన్య పేరు చేర్చారు.

ఎలక్ట్రానిక్ పాలసీపై తుది కసరత్తు పూర్తి

వచ్చే మంత్రివర్గ సమావేశం ముందుకు నూతన పాలసీ ● ముసాయిదా ఐటీ, డ్రోన్ పాలసీలను మెరుగుపరచాలి ● అధికారులకు చంద్రబాబు సూచన

ఈనాడు, అమరావతి: ఎలక్ట్రానిక్ పాలసీని వచ్చే మంత్రిమండలి సమావేశం ముందుకు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. సచివాలయంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, డ్రోన్ పాలసీలపై సీఎం చంద్రబాబు అధికారులతో సోమవారం సమీక్షించారు. ఎలక్ట్రానిక్ పాలసీ విధానాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన రెండు పాలసీలను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న విధానాలను పరిశీలించాలి. వాటి ఆధారంగా మెరుగైన పాలసీలు రూపొందించాలి" అని పేర్కొన్నారు. నూతన పాలసీలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారులు సీఎంకు వివరించారు.

డ్రోన్ సమ్మిట్‌కు 400 మంది ప్రతినిధులు

ఈ నెల 22, 23 తేదీల్లో అమరావతిలో నిర్వహించే డ్రోన్ సమ్మిట్‌కు వివిధ రాష్ట్రాలకు చెందిన 400 మందికి పైగా ప్రముఖులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నారని సీఎం పేర్కొన్నారు. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంలో నిర్వహించే సమ్మిట్‌ను విజయవంతం చేయడంపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో డ్రోన్ సమ్మిట్ నిర్వహణపై అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. "విద్యార్థులు, నిపుణులు, సాంకేతిక నిపుణులు కార్యక్రమానికి హాజరవుతారు. డ్రోన్ తయారీ సంస్థలు, వినియోగదారులు ప్రదర్శన ఇవ్వనున్నారు. 5 వేల డ్రోన్లతో ప్రత్యేక ప్రదర్శన ఉంటుంది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ అండ్ మెడికల్ డెలివరీ, నేచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మెరుగైన పాలన కోసం సర్వే, మ్యాపింగ్, రవాణా, లాజిస్టిక్స్, ఏవియేషన్‌తో పాటు 9అంశాలను సమ్మిట్‌లో భాగస్వామ్యం చేస్తున్నాం" అని సీఎంకు అధికారులు తెలిపారు.

AP LAWCET / PGLCET-2024 - ADMISSIONS
(CONDUCTED ON BEHALF OF APSCHE)
ACHARYA NAGARJUNA UNIVERSITY, GUNTUR-522 510.
NOTIFICATION
The qualified and eligible candidates of **AP LAWCET/ PGLCET-2024** are hereby informed to register for admission into the First Year of 3 Year, 5 Year LLB and LLM Courses for the Academic Year **2024-2025** from **16-10-2024 to 20-10-2024.** The detailed notification is placed in website: **https://cets.apsche.ap.gov.in.**
Date: 14-10-2024 Sd/- CONVENER,
Place: Nagarjuna Nagar AP LAWCET/PGLCET-2024 ADMISSIONS

ఆర్థిక అసమానతలపై పరిశోధనకు నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

వివరించారని పేర్కొంది. "చట్టపాలన పేలవంగా ఉన్న సమాజాలు, జనాభాను దోపిడీ చేసే సంస్థలు... అభివృద్ధిని, మెరుగైన మార్పును సృష్టించలేవని వీరి పరిశోధనలో తేలింది. ఆర్థిక అసమానతలు తగ్గించడంలో సామాజిక సంస్థల కీలక పాత్రను వీరు వివరించారు. కొన్ని దేశాలు ఎందుకు ఎదుగుతున్నాయి..? మరి కొన్ని ఎందుకు విఫలమవుతున్నాయి..? అందుకు మూలకారణాలేంటి.. ? మరింత మెరుగ్గా తెలుసుకోవడానికి ఈ పరిశోధన ఉపయోగపడనుంది" అని అవార్డు ఎంపిక కమిటీ నిపుణులు తెలిపారు. అసెమోగ్లు, రాబిన్సన్‌లు కలిసి 2012లో 'వై నేషన్స్ ఫెయిల్- ది ఆరిజన్స్ ఆఫ్ పవర్, ప్రాస్పర్టీ, అండ్ పావర్టీ' పుస్తకాన్ని కూడా రచించారు. ఇందులో కొన్ని దేశాలు అభివృద్ధి చెందకపోవడానికి మానవ తప్పిదాలే కారణమని వాదించారు.

పల్లె పండగతో మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ రోజు శంకుస్థాపనలు జరిగాయని, పనులు సత్వరం పూర్తి కావాలంటే అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో విచ్చలవిడిగా నిధులు మళ్లించారని.. వాటిని ఏం చేశారన్నది కూడా తెలియడం లేదని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్ మంత్రిగా ఎవరున్నారో కూడా ఎవరికీ తెలియని దౌర్భాగ్యం నెలకొందన్నారు. 151 మంది ఎమ్మెల్యేలున్నా వారెప్పుడూ ప్రజా సమస్యలను పట్టించుకోలేదని మండిపడ్డారు.

డబ్బులున్న శాఖ నా దగ్గరే ఉందన్నారు..


ప్రస్తుతం ముఖ్యమంత్రిగా సుదీర్ఘ అనుభవం ఉన్న చంద్రబాబు ఉండటం రాష్ట్రానికి వరమని పవన్ కొనియాడారు. పరిపాలనలో ఆయనే తనకు స్ఫూర్తి అన్నారు. 'చంద్రబాబు అన్ని విషయాల్లోనూ అపార అనుభవంతో, చాలా లోతుగా దృష్టి సారించి క్యాబినెట్ సమావేశాల్లో అధికారులకు దిశా నిర్దేశం చేస్తుంటారు. ప్రస్తుతం రాష్ట్రంలో డబ్బులున్న శాఖ పవన్ వద్దే ఉందంటూ ఇటీవల ఆయన ఓ సభలో అన్నారు. దానికి కారణం ఒక్క ఉపాధి హామీ పనులకే ఏటా కేంద్రం నుంచి మనకు రూ.10 వేల కోట్ల నిధులు వస్తున్నాయి. వీటన్నింటినీ పక్కాగా ప్రజలకు చేర్చేందుకు నిరంతరం పనిచేస్తున్నాను. గ్రామాల్లో ఉండే వారికి కనీసం 100 రోజులు పని కల్పించే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. గ్రామాల అభివృద్ధి కోసం నిర్వహించుకుంటున్న పల్లె పండగతో మాట ఇచ్చినట్టే అభివృద్ధి చేసి చూపిస్తాం. ప్రధానితో నాకు సన్నిహిత సంబంధాలున్నాయి. నేను ప్రధానిని ఏది కోరినా అది రాష్ట్రాభివృద్ధి కోసమే' అని పేర్కొన్నారు.


పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల శిలాఫలకాన్ని కంకిపాడులో ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, చిత్రంలో ఎంపీ బాలశౌరి, మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు

ముందు బాధ్యత.. తర్వాతే వినోదం

'ఓజీ.. ఓజీ.. అంటూ అభిమానులు నినాదాలు చేస్తుంటే.. నేను మోదీ మోదీ అనుకునేవాణ్ని. ఆ తర్వాతే ఓజీ అని అర్థమైంది' అని పవన్ వ్యాఖ్యానించారు. 'సినిమాలు చేయాలని నాకూ ఉంది. కానీ ప్రస్తుతం ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు సహా మౌలిక వసతులను ఏర్పాటు చేయడం నా బాధ్యత. దానికే తొలి ప్రాధాన్యమిస్తాను. అందుకే కష్టపడుతున్నాను. ఆ తర్వాతే వినోదాన్ని ఆస్వాదిద్దాం. నాతో పాటు తోటి హీరోలందరిలో ఒక్కొక్కరిదీ ఒక్కో శైలి. అందరు హీరోలూ బాగుండాలి. మంచి సినిమాలు చేయాలి' అని పవన్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీ బాలశౌరి, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా, ఐఏఎస్ అధికారులు శశిభూషణ్‌కుమార్, కృష్ణతేజ, కలెక్టర్ బాలాజీ, జనసేన పార్టీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముప్పా రాజా, పాపారావు, కంకిపాడు సర్పంచి బి.రమణ పాల్గొన్నారు.

" The Foundation you laid has given us the opportunity to build upon and make a difference to future generations. We remember you with gratitude on your 104th Birth Anniversary "



Dr.B.V.Raju Garu
15-10-1920 - 08-06-2002
Fondly remembered by Management and Employees
VISHNU Dr.B.V.Raju Foundation
Sri Vishnu Educational Society


ఈనాడు

'ఉపా' గుప్పిట్లో జీవించే హక్కు!

ఎవరినైనా అంత సులువుగా జైల్లో నిర్బంధించే సంపూర్ణాధికారాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సిన అవసరం లేదని రాజ్యాంగ సభ చర్చల్లో భాగంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్పష్టంగా పేర్కొన్నారు. కిరాతక చట్టాల ద్వారా ఆ నిరంకుశాధికారాన్ని గుప్పిట పట్టిన పాలకులు- రాజ్యాంగదత్తమైన పౌరహక్కులను దశాబ్దాలుగా చెరబడుతున్నారు. చేయని నేరానికి పదేళ్ల పాటు కారాగారంలో మగ్గిపోయిన ప్రొఫెసర్ సాయిబాబా మొన్న శనివారం మరణించారు. తొంభైశాతం అంగవైకల్యం కలిగిన ఆయన చీకటికొట్టంలో నరకం చవిచూస్తూ, కన్నతల్లి కడసారి చూపునకూ నోచుకోలేకపోయారు. సాయిబాబాపై మోపిన నేరాభియోగాలకు ఆధారాల్లేవని నిర్ధారించిన బాంబే హైకోర్టు- ఆయన అనుభవిస్తున్న జీవితఖైదును మొన్న మార్చిలో రద్దుచేసింది. సాయిబాబాను దోషిగా తేల్చిన నేర విచారణను 'న్యాయ వైఫల్యం'గా అభివర్ణించింది. సాయిబాబా విషాదాంతం దరిమిలా 'ఉపా' (చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధ చట్టం) దుర్వినియోగమవుతున్న తీరు మరోసారి చర్చనీయాంశమైంది. కర్కశ నిబంధనలతో కూడిన ఈ చట్టంతో ప్రజానీకానికి మేలు కంటే నష్టమే ఎక్కువగా జరుగుతోందన్నది నిర్వివాదాంశం!

నేరగాళ్లను శిక్షించాలి, నిర్దోషులను రక్షించాలి... ఇదీ సహజ న్యాయసూత్రం! కానీ, మన దేశంలోనేమో వేలకోట్ల రూపాయలను దిగమింగేసి నిర్లజ్జగా బోరవిరుచుకుని తిరిగే ప్రబుద్ధులకు సకాలంలో శిక్షలు పడవు. అత్యాచారం, హత్య కేసుల్లో దోషి డేరా బాబా లాంటి వాళ్లు తరచూ పెరోల్‌పై బయటికి వస్తుంటారు. అదే సమయంలో సామాన్యులెందరో పోలీసుల అమానుషత్వానికి బలైపోతుంటారు. మహమ్మద్ అలీ భట్, లతీఫ్ అహ్మద్ వజా, మీర్జా నిస్సార్ హుస్సేన్ అనే కశ్మీరీ యువకులపై ఉగ్రవాద ముద్రవేసి 1996లో అరెస్టు చేశారు. అప్పటినుంచి కటకటాల్లోనే మగ్గిపోయిన ఆ ముగ్గురు- 23 ఏళ్ల తరవాత నిర్దోషులుగా బయటి ప్రపంచంలోకి వచ్చారు. ఇలాంటి బాధితులు కోకొల్లలు! 84ఏళ్ల కురువృద్ధుడు, పార్కిన్‌సన్స్ వ్యాధిగ్రస్తుడు ఫాదర్ స్టాన్ స్వామి 'ఉపా' కేసులో విచారణ ఖైదీగా జైలులోనే ప్రాణాలు విడిచారు. అధికారిక సమాచారం ప్రకారం, 2014-2022 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా 8719 'ఉపా' కేసులు నమోదయ్యాయి. కానీ, వాటిలో శిక్షలు పడినవి 222 మాత్రమే. ఆ ఎనిమిదేళ్లలో 14,809 మంది 'ఉపా' కింద అరెస్టు అయితే- 356 మందిపైనే నేరాభియోగాలు రుజువయ్యాయి. 'ఉపా' కేసుల బనాయింపు విచ్చలవిడిగా నిర్హేతుకంగా సాగుతోందనడానికి ఈ గణాంకాలే నిదర్శనాలు!

'న్యూస్‌క్లిక్' వార్తా పోర్టల్ వ్యవస్థాపక సంపాదకులు ప్రబీర్ పురకాయస్థపై 'ఉపా' కేసును సుప్రీంకోర్టు ఇటీవల కొట్టేసింది. ఆయన అరెస్టు చెల్లదంటూ యంత్రాంగానికి న్యాయపాలిక గట్టిగా చీవాట్లేసింది. 'ఉపా' కబంధ హస్తాల్లో బందీ అయిన కేరళ పాత్రికేయుడు సిద్దిక్ కప్పన్‌కు బెయిల్ మంజూరు చేస్తూ- 'న్యాయంకోసం నోరెత్తడమూ నేరమేనా?' అని 'సుప్రీమ్' నిగ్గదీసింది. విమర్శించడం, విభేదించడం, ప్రశ్నించడం- ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైనవి. అసమ్మతిని అణచివేసే ఆరాటంలో ఉగ్రవాద చర్యలకు, రాజ్యాంగబద్ధమైన నిరసన హక్కుకు మధ్య ఉండే విభజన రేఖను చెరిపేయడం జాతికి శ్రేయస్కరం కాదు. మానవ హక్కులను కాలరాస్తున్న 'ఉపా'ను సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రోహింటన్ నారిమన్ 'క్రూర చట్టం'గా ఛీత్కరించారు. ప్రస్తుత రూపంలో ఆ చట్టం ఆమోదయోగ్యం కానేకాదని జస్టిస్ దీపక్ గుప్తా తేల్చిచెప్పారు. జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ గోపాలగౌడ, జస్టిస్ అఫ్తాబ్ ఆలం వంటివారెందరో 'ఉపా'ను నిరసిస్తున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడికోసం శాసనాలెన్నో ఉన్నాయి. కాబట్టి పౌరుల జీవించేహక్కు, వ్యక్తిగత స్వేచ్ఛలను హరిస్తున్న 'ఉపా'ను వదిలించుకోవడమే ఉత్తమం!



అవినీతి లాంటి చెడు మొదలయ్యేది ఎక్కడ? అంతులేని దురాశ నుంచే కదా! అవినీతిరహిత సమాజం కోసం చేసే పోరాటాన్ని ఈ దురాశను నిర్మూలించడంతోనే ప్రారంభించాలి. 'సమాజానికి నేనేం ఇవ్వగలను' అన్న స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో మొలకెత్తాలి.

– ఏపీజే అబ్దుల్ కలామ్

సృష్టికర్త సౌందర్యం

మనసు పెట్టి మన చుట్టూ ఉన్న ప్రకృతిలోని అపారమైన అందాలను గమనించారా? ఆ అందమే ఆనందానికి మూలం. మైమరపించే పరిమళాలతో రకరకాల పువ్వులు... సంగీత సరాగాలను ఆలపించే పక్షులు! ముద్దులొలికే చెవుల పిల్లులు, పురి విప్పి ఆడే నెమళ్లు, చిన్నా పెద్దా రకరకాల జంతువులతో విస్తరించిన అరణ్యాలు... అన్నీ ప్రకృతి అందాలలోని భాగాలే. చెట్లు, ఆకాశం, భూమి, సముద్రాలు, గలగలమని గానం చేస్తూ ప్రవహించే నదీనదాలు, లోతైన లోయలు, ఎత్తైన కొండలతో ప్రకృతి సౌందర్యం హృదయాన్ని ఊయలలూగిస్తుంది. ఇవన్నీ భూమికి దేవుడిచ్చిన అమూల్యమైన బహుమతులు. మన తిండి, బట్ట, నీడ... అన్నీ ప్రకృతి ప్రసాదాలే. ఈ ప్రకృతి మానవాళికి చాలా ముందు నుంచి ఉనికిలో ఉంది. ఈ ఉనికికి... అది ఇచ్చే ఆనందం ఆహ్లాదానికి కారణం ఎవరు... ఎవరా సృష్టికర్త? ఆయనలోని సౌందర్యమెంత! ఆ పారమార్థిక సోయగమెంత... సొగసెంత?



అంతర్యామి

విశ్వాంతరాళాల్లోని రహస్యాలు ఎంత అద్భుతాలో దైవం అంతకన్నా అద్భుతమంటారు. ఆ అద్భుతాన్ని వేదాంతం (ఉత్కృష్ట జ్ఞానం) వల్ల తెలుసుకోగలమని చెబుతారు. ఈ జ్ఞానంలోనే దైవశక్తినీ ఆ శక్తి సౌందర్య లాలిత్యాలనూ నిర్వచించారు. దైవంలోని అందాలు వర్ణనకు అతీతమైనవని అపర విద్య తెలుపుతోంది. దైవం అందాన్ని ఊహించుకుంటే ఒక ప్రామాణికమైన రూపం తోచదు. అందుకే తాళ్లపాక అన్నమయ్యకు వేంకటేశ్వరుడి సొగసులు సొబగులు ఒకేరకంగా కనిపించలేదు. 'ఒకపరి కొకపరి కొయ్యారమై మొకమున కళలెల్ల మొలచినట్లుండె' అంటూ భావోద్వేగం చెందాడు. ఆ రూపసి అందాలను వర్ణిస్తూ 'జగదేకపతిమేన చల్లిన కర్పూరధూళి/జిగికొని నలువంక చిందగాను/ మొగి చంద్రముఖి నురమున నిలిపెగాన/ పొగరు వెన్నెల దిగబోసినట్లుండె' అని భావించాడు. భావమే ఇంత గొప్పగా ఉంటే... నిజరూపం వర్ణించ తరం కాదు. సృజనకారుడి సౌందర్యం ఇంత గొప్పగా ఉంటే... ఆ శక్తి సృజించిన ప్రకృతి అందాలు ఇంకెంతో పారవశ్యం కలిగిస్తాయి.

త్యాగయ్య శ్రీరాముణ్ని కీర్తిస్తూ 'సొగసు జూడ తరమా/నీ సొగసు జూడ తరమా/ వర బింబ సమాధరము వకుల సుమంబుల ఉరము/కర ధృత శర కోదండ మరకతాంగ వరమైన..' అంటూ పొగిడాడు. తన దైవాన్ని మరింత కీర్తిస్తూ... 'రామ నీ సమానమెవరు/ భామ మరువంపు మొలక/ భక్తియను పంజరపు చిలుక' అంటూ మొలక, చిలుకలతో పోల్చాడు. వర్ణనకు అందనంత లావణ్యం లాలిత్యం కలగలిపిన ఆ దైవశక్తిని ఇంతని వర్ణించలేం. ఆ ఈశ్వరుడు అమర్చిన ఈ లోకానులోకాలు, ఈ ప్రకృతి... జీవరాశులన్నింటికీ అందంగా కనిపిస్తూ ఆనందాలను పంచుతున్నాయి. కాబట్టే వాటిని మనం ఆస్వాదించగలుగుతున్నాం.

– అప్పరుసు రమాకాంతరావు

జీఎస్టీ భారం తగ్గేనా?



సామాన్యులకు ఎంతో మేలు కలుగుతుందని, పన్నుల విధానంలో నూతన విప్లవం అంటూ ఏడేళ్ల క్రితం వస్తు సేవల పన్నును (జీఎస్టీ) అమలులోకి తెచ్చారు. కాలక్రమేణా మరిన్ని వస్తువులను జీఎస్టీ పరిధిలోకి చేర్చారు. వాటి పన్నుశ్లాబు రేట్లను మారుస్తున్నారు. ఫలితంగా పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం తప్పడం లేదు.

ప్రతివ్యక్తీ తప్పనిసరిగా ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సిందే. ప్రత్యక్ష, పరోక్ష అని పన్నులు రెండు రకాలు. పరోక్ష పన్నులు పేద, మధ్యతరగతిపై ఎక్కువ భారం మోపుతాయి. ఇండియాలో కాలక్రమేణా మొత్తం పన్ను రాబడిలో పరోక్షపన్నుల వాటా పెరిగింది. మనదేశంలో ప్రత్యక్ష, పరోక్ష పన్ను రాబడుల నిష్పత్తి 1990 నాటికి దాదాపు 20:80శాతం. అధిక పన్నురేట్లు, సంక్లిష్టమైన చట్టాలు, ఎగవేత తదితర సమస్యలను పరిష్కరించేందుకు 1991లో పన్ను సంస్కరణలను అమలు చేశారు. ఒక దేశం-ఒకే పన్ను అనే లక్ష్యంతో 2017 జులై ఒకటిన వస్తుసేవల పన్ను(జీఎస్టీ)ను అమలులోకి తెచ్చారు. దేశమంతా ఒక వస్తువుకు ఒకే రకమైన పన్ను ఉండటం, పన్నుపై పన్ను వేయకపోవడం, వస్తు సేవల ధరలను తగ్గించడం, ఎగుమతులను ప్రోత్సహించడం వంటివి జీఎస్టీ లక్ష్యాలు. సుమారు దశాబ్దకాలం చర్చల తరవాత దీన్ని పట్టాలకు ఎక్కించారు.

సామాన్యులకు ఏదీ ఉపశమనం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటి పరిధికి లోబడి జీఎస్టీని వసూలు చేస్తాయి. అంతర్రాష్ట్ర వస్తు వ్యాపారం, సేవల దిగుమతులపై పన్ను విధించే అధికారం కేంద్రానికి ఉంది. జీఎస్టీ అమలు వల్ల రాష్ట్రాలకు కలిగే నష్టాన్ని భర్తీ చేయడానికి సెస్సును సైతం తెచ్చారు.

జీఎస్టీ వసూళ్లు (కోట్ల రూపాయల్లో)

	ఆగస్టు 2023	ఆగస్టు 2024
సీజీఎస్టీ	28,328	30,862
ఎస్‌జీఎస్టీ	35,794	38,411
ఐజీఎస్టీ	83,251	93,621
సెస్సు	11,695	12,068
స్థూల రాబడి	1,59,069	1,74,962

ప్రారంభంలో అనేక ఆహార, నిత్యావసరాలపై జీఎస్టీని మినహాయించారు. పెట్రోలు, డీజిల్‌ను జీఎస్టీ నుంచి తప్పించి యథాతథంగా కొనసాగించారు. వస్తు సేవల పన్ను అమలుకోసం విధివిధానాలు రూపొందించడం జీఎస్టీ కౌన్సిల్ బాధ్యత. ఇందులో రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా, కేంద్ర ఆర్థిక మంత్రి అధ్యక్షులుగా ఉంటారు. వినియోగదారుల ప్రయోజనాలు, ప్రభుత్వాల రాబడి అవసరాలను దృష్టిలో పెట్టుకుని శ్లాబు రేట్లలో, పన్నును వర్తింపజేయడంలో కౌన్సిల్ మార్పులు చేస్తుంటుంది. ఇప్పటి వరకు 54 జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. జీఎస్టీ వల్ల పేద, మధ్యతరగతికి మేలు కలుగుతుందని మొదట్లో చెప్పినా- పారిశ్రామిక, వ్యాపార వర్గాలు దాన్ని వ్యతిరేకించాయి. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సైతం తమ పన్ను రాబడులు తగ్గుతాయని సందేహించాయి. అయితే, జీఎస్టీ రాబడి క్రమేణా, ముఖ్యంగా గత రెండేళ్లలో గణనీయంగా పెరిగింది. ప్రారంభంతో పోలిస్తే పోనుపోను మరిన్ని వస్తు సేవలను కొత్తగా జీఎస్టీ పరిధిలోకి తెచ్చారు. వాటి పన్ను శ్లాబు రేట్లను మార్చారు. ఈ క్రమంలో సామాన్యులకు కీలకమైన నిత్యావసరాలపై పన్ను లేకుండా, ఎవరో కొద్దిమంది మాత్రమే వాడే విలాస వస్తువులపై అధిక పన్నురేట్లను విధించి జీఎస్టీలో పురోగమన పద్ధతిని అనుసరించాల్సిన అవసరం ఉంది.

సమగ్రంగా విశ్లేషించి...

పన్ను పరిధి విస్తృతమవడం, శ్లాబు రేట్ల మార్పు, యంత్రాంగం పనితీరులో మెరుగుదల, కృత్రిమ మేధ వినియోగం, ఎగవేతల తగ్గుదల తదితరాల వల్ల ఇటీవలి కాలంలో జీఎస్టీ వసూళ్లు పెరిగాయి. అదే సమయంలో జీఎస్టీ పరిధి విస్తరణ, శ్లాబు రేట్ల మార్పు వల్ల పేద, మధ్య తరగతిపై ఆర్థిక భారం పెరిగింది. ఉదాహరణకు వెన్న, నెయ్యి వంటి పాల ఉత్పత్తులు, పండ్ల రసాలు, ప్యాకింగ్ చేసిన కొబ్బరినీళ్లు తదితరాలపై 12శాతం పన్ను విధించారు. ఆరోగ్య భారత్ వంటి లక్ష్యాలకు ఇది విఘాతకరమే. కొన్ని ఔషధాలపైనా 18శాతం దాకా పన్నులు వడ్డిస్తున్నారు. ప్రాణాధారమైన ఔషధాలను జీఎస్టీ పరిధి నుంచి మినహాయించి, ఇతర మందులపై కనిష్ఠ స్థాయిలో పన్ను విధించాల్సిన అవసరం ఉంది. పెన్నులు, టూత్‌పేస్టులు వంటి వాటిపై జీఎస్టీని ప్రజలు భారంగా భావిస్తున్నారు. జీవిత, ఆరోగ్య బీమాల ప్రీమియాలపై పన్ను మీద ఇటీవల 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో లోతుగా చర్చించడం హర్షణీయమే. బ్యాంకింగ్ రంగ సేవలకు సంబంధించి అల్పాదాయవర్గాలకు కొన్ని రాయితీలను అందించాలి.

జీఎస్టీని ఆదాయ మార్గంగా భావిస్తూ ఎడాపెడా పన్నులు విధించడం, రేట్లను పెంచడం సరికాదు. రాబడిని పెంచే ఇతర మార్గాలను, ముఖ్యంగా పన్నేతర దారులను ప్రభుత్వం అన్వేషించాలి. ప్రజల అభ్యర్థనల మేరకు పన్నురాయితీల సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని కేంద్ర ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. దానితో పాటు వస్తుసేవల పన్ను నిర్మాణాన్ని సమగ్రంగా విశ్లేషించి పన్నురేట్లను హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఉంది. పెరుగుతున్న ఆహార ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని పన్ను నిర్మాణంలో మార్పులు చేయాలి. జీఎస్టీని ఒక రాబడి సాధనంగా మాత్రమే చూడకుండా ప్రజా ప్రయోజనాలను పరిరక్షించేలా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కేంద్రం దాన్ని చక్కదిద్దాలి. రాబోయే 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు విధివిధానాలు రూపొందిస్తారని ఆశిద్దాం.



ఆచార్య రొక్కం సుదర్శనరావు
ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ కమిషన్ మాజీ సభ్యులు



ఒక కల... ఒక చెయ్యి!

అది 1936. హంగరి దేశానికి చెందిన కరోలీ టకక్స్ సైన్యంలో చేరాడు. కొద్ది రోజుల్లోనే రైఫిల్ షూటింగ్‌లో ప్రావీణ్యం సాధించాడు. ఒలింపిక్స్‌లో పాల్గొని దేశానికి పతకం తీసుకురావాలని కలలుగన్నాడు. కానీ దేశంలో నాటి నిబంధనల ప్రకారం సైన్యంలో ఆఫీసర్ ర్యాంకులో ఉన్నవారికే ఒలింపిక్స్‌లో పాల్గొనే అర్హత ఉంటుంది. దాంతో ఒక అవకాశాన్ని కోల్పోయాడు.

ప్రభుత్వం నిబంధనలను సడలించడంతో 1940 టోక్యో ఒలింపిక్స్‌కి కరోలీ అర్హత సాధించాడు. రేయింబవళ్లు సాధన చేశాడు. అంతలోనే అనుకోని విషాదం అతని కలలపై నీళ్లు చల్లింది. 1938లో సైనిక శిక్షణ పొందుతున్నప్పుడు ప్రమాదవశాత్తు ఓ గ్రెనేడ్ అతని కుడి చేతిలో పేలి తీవ్ర గాయాలయ్యాయి. ఇక ఎప్పటికీ అతడు షూటింగ్ చేయలేడని వైద్యులు తేల్చి చెప్పారు. కానీ కరోలీ ఓటమిని అంగీకరించ దలచుకోలేదు. ఎడమ చేత్తో సాధన మొదలెట్టాడు. కుడి చేతితో సమానంగా లక్ష్యాన్ని ఛేదించగలిగే నైపుణ్యంతో ఒలింపిక్స్‌కి సిద్ధమయ్యాడు. కానీ రెండో ప్రపంచ యుద్ధం వల్ల ఆ ఏడాది ఒలింపిక్స్ రద్దయ్యాయి. ఇంకో అవకాశం చేజారిపోయింది. తరవాత ఒలింపిక్స్ 1944లో. అప్పటికి అతని వయసు 34. ఎలాగైనా పతకం సాధించాలనే లక్ష్యంతో మళ్లీ సాధన చేశాడు. ఆ సంవత్సరం కూడా ఒలింపిక్ గేమ్స్ రద్దయ్యాయి. మూడో అవకాశమూ చేజారింది.

కరోలీ వయసు 38. నిరాశ నిస్పృహలను దరి చేరనీయకుండా సాధన కొనసాగించాడు. అథ్లెట్‌కి అవసరమైన శారీరక దృఢత్వాన్నీ, సన్నద్ధతనీ కాపాడుకుంటూ వచ్చాడు. ఎట్టకేలకు 1948 లండన్ ఒలింపిక్స్ రానే వచ్చాయి. ఏళ్ల తరబడి శ్రమ, చేజారిన అవకాశాలు, కాలం విసిరిన సవాళ్లు... అన్నీ ఒక్కసారిగా కళ్లముందు కదలాడాయి. మిగతా షూటర్లంతా మొదటినుంచి తమకు అలవాటైన చేత్తో పోటీ పడ్డారు. కరోలీ మాత్రం తనకు మిగిలిన, కొత్తగా సాధన చేసిన ఒంటి చేత్తోనే బరిలో దిగాడు. మొక్కవోని అతని కృషి, పట్టుదల గెలిచాయి. స్వర్ణపతకం సొంతమైంది. 12 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ ఫలించి బంగారు పతకాన్ని ముద్దాడాడు. తరవాత 1952 ఒలింపిక్స్ లోనూ మరో స్వర్ణాన్ని తన ఖాతాలో వేసుకుని తిరుగులేని క్రీడాకారుడిగా గుర్తింపు పొందాడు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందికి ఆదర్శంగా నిలిచాడు.

ఒక్క ఓటమికీ చిన్న కష్టానికీ కుంగిపోయేవారికి కరోలీ జీవితం స్ఫూర్తిదాయకం. ఒక చేయి పోయిందని బాధపడాల్సిన సమయంలో అతడు ఉన్న రెండో చేతిని ఎలా ఉపయోగించుకోవాలీ- అని ఆలోచించాడు. విజయం సాధించాడు. ఇతరులతో పోల్చుకుంటూ 'నాకు ఇది లేదు, అది లేదు...' అని బాధపడటం కన్నా ఉన్నవాటిని సమర్థంగా ఉపయోగించుకుంటే కలలు నిజమవుతాయని కరోలీ జీవితగాథ చెబుతోంది కదూ!

– ఎన్.బాలస్వామి



చిరుధాన్యాల సిరులు

ఆరోగ్య పరిరక్షణపై కొంతకాలంగా ప్రజల్లో అవగాహన పెరిగింది. దాంతో పోషక విలువలు అధికంగా ఉండే చిరుధాన్యాల వినియోగానికి చాలామంది మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో దేశీయంగా జొన్న, సజ్జ, రాగి, ఇతర తృణధాన్యాలకు గిరాకీ ఎక్కువయ్యింది. వాటి సాగు, ఉత్పత్తీ అయిదేళ్ల క్రితంతో పోలిస్తే పెరిగాయి. గత అయిదేళ్లలో ఇండియాలో చిరుధాన్యాల ఉత్పత్తి, 2023-24లో మూడో ముందస్తు అంచనా...

(లక్షల టన్నుల్లో)

2018–19	137.11
2019–20	172.61
2020–21	180.21
2021–22	160
2022–23	173.21
2023–24	174.08

(ఆధారం: కేంద్రం వెల్లడించిన వివరాలు)

ఆసియాన్ తోడుగా... డ్రాగన్‌కు దీటుగా!



హిందూ మహాసముద్రంలో ఆఫ్రికా తూర్పుతీరం నుంచి పసిఫిక్ మహాసముద్రంలో జపాన్ వరకు విస్తరించిన సాగర ప్రాంతాన్ని ఇండో-పసిఫిక్‌గా వ్యవహరిస్తున్నారు. ఇందులో అంతర్భాగమైన దక్షిణ చైనా సముద్రమంతా తనదేనంటూ పలు దేశాలతో డ్రాగన్ పేచీలు పెట్టుకుంటోంది. దాని దుందుడుకుతనాన్ని నిలువరించడానికి ఆసియాన్ దేశాలతో కలిసి ఇండియా కృషి చేస్తోంది.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి భారత్‌తో పాటు ఆగ్నేయాసియా దేశాల సంఘం (ఆసియాన్) ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. వీటిలో మొదటిది- భారత్ 2019లో ప్రారంభించిన ఇండో-పసిఫిక్ మహాసముద్రాల సహకార ప్రణాళిక (ఐపీఓఐ). రెండోది- ఇండో-పసిఫిక్‌పై ఆసియాన్ దృక్పథం (ఏఓఐపీ). ఈ రెండు కార్యక్రమాలు ఇండో-పసిఫిక్ తీర దేశాలకు భద్రత, స్థిరత్వం సాధించడానికి ఉద్దేశించిన స్వచ్ఛంద పథకాలు. తూర్పు ఆసియా శిఖరాగ్ర సభ (ఈఏఎస్) వంటి ఆసియాన్ వేదికలపై ఇండో-పసిఫిక్ సహకార వృద్ధికి కృషి చేయాలని ఏఓఐపీ లక్షిస్తోంది. ఇక ఐపీఓఐ- భారత్ చేపట్టిన 'సాగర్' పథకం ప్రాతిపదికపై ఇండో-పసిఫిక్‌లో భద్రత, సహకార వృద్ధికి తోడ్పడుతోంది. 2019లో బ్యాంకాక్‌లో జరిగిన ఈఏఎస్ సభలో ప్రధాని మోదీ ఐపీఓఐని ఆవిష్కరించారు. అదే సభలో ఏఓఐపీ కూడా ప్రకటితమైంది. ఐపీఓఐలో ఆసియాన్ సభ్యదేశాలైన ఇండోనేసియా, థాయ్‌లాండ్, సింగపూర్‌లతోపాటు 'క్వాడ్' సభ్యదేశాలైన అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లు కూడా భాగస్వాములని విదేశాంగ శాఖ ప్రతినిధి జయదీప్ మజుందార్ వెల్లడించారు. వాటితోపాటు తూర్పు, ఆగ్నేయాసియా దేశాలనూ ఐపీఓఐలో కలుపుకొనిపోతున్నామని ఆయన వివరించారు.

పటిష్ఠ బంధానికి పది సూత్రాలు

లావోస్ రాజధాని వియంటియాన్‌లో ఈనెల 10న జరిగిన 21వ ఆసియాన్-భారత్ శిఖరాగ్ర సభలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. అన్ని దేశాలు పరస్పర సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతలను గౌరవించాలని ఆయన పిలుపిచ్చారు. భారత్ ప్రారంభించిన 'తూర్పు దిశగా కార్యాచరణ' పథకానికి పదేళ్లు నిండిన సందర్భంగా ఆసియాన్ దేశాలతో సంబంధాలను మరింత పటిష్ఠపరచుకోవడానికి పది సూత్రాల పథకాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా భారత్-ఆసియాన్‌ల మధ్య కుదిరిన సరకుల వాణిజ్య ఒప్పందాన్ని 2025లో సమీక్షిస్తారు. డిజిటల్-సైబర్ భద్రత కోసం సంప్రదింపులు చేపడతారు. 2025ను భారత్-ఆసియాన్ పర్యటక సంవత్సరంగా ప్రకటించడంతో పాటు యువజన సదస్సులు, అంకుర సంస్థల ఉత్సవం నిర్వహించడం వంటివి ఈ పథకంలో ఉన్నాయి. గడచిన దశాబ్దంలో భారత్-ఆసియాన్ వాణిజ్యం రెండింతలై 13,000 కోట్ల డాలర్లను మించిపోయిందని మోదీ ప్రస్తావించారు. తూర్పు ఆసియా శిఖరాగ్ర సభ, ఆసియాన్‌లతోపాటు పాశ్చాత్య దేశాల భాగస్వామ్యంతో ఐపీఓఐని భారత్ ముందుకు తీసుకెళ్తోంది. ఐపీఓఐ ఏడు మూలస్తంభాలపై నిలిచింది. సాగర భద్రతకు బ్రిటన్‌తో; సాగర జీవావరణ పరిరక్షణకు థాయ్‌లాండ్, ఆస్ట్రేలియాలతో ఇండియా కలిసి పనిచేస్తోంది. సాగర వనరుల వినియోగానికి ఫ్రాన్స్, ఇండోనేసియాలతో... వనరుల వినియోగ సామర్థ్యాలను పెంచుకోవడానికి జర్మనీతో భారత్ జట్టుకట్టింది. ప్రకృతి ఉత్పాతాల నిభాయింపునకు బంగ్లాదేశ్‌తో; శాస్త్ర, సాంకేతిక రంగాల విషయంలో ఇటలీ, సింగపూర్‌లతో కలిసి అడుగులు వేస్తోంది. వాణిజ్యం, సాగర రవాణా, టెలికం అనుసంధానతలకు జపాన్, అమెరికాల భాగస్వామ్యంతో ఇండియా పనిచేస్తోంది. ఎటువంటి ఒప్పందం లేకుండా, స్వచ్ఛందంగా లక్ష్యసాధనకు తోడ్పడే చట్రమే ఐపీఓఐ. దీన్ని ముందుకు తీసుకెళ్లడానికి క్వాడ్‌తో పాటు భారత్-ఆస్ట్రేలియా భాగస్వామ్యం అక్కరకొస్తోంది. ఇండో-పసిఫిక్‌లో సహకార సాధనకు ఆసియాన్ దృక్పథం(ఏఓఐపీ) తోడ్పడుతోంది. ఇండో-పసిఫిక్‌లో ఆసియాన్ దేశాలకున్న వ్యూహపరమైన ప్రాధాన్యాన్ని చాటిచెప్పడం ఏఓఐపీ ప్రధానోద్దేశం.

ప్రతికూలతలను అధిగమించడానికి...


దక్షిణ చైనా సముద్రంలో ఆసియాన్ సభ్యదేశమైన ఫిలిప్పీన్స్‌పై డ్రాగన్ నౌకలు పదేపదే కయ్యానికి కాలుదువ్వుతున్నాయి. మరోవైపు అమెరికా-చైనాల మధ్య వాణిజ్య, సైనిక వైరం ముదురుతోంది. చైనా ఎలక్ట్రిక్ వాహనాలు, ఇతర ఎగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధిస్తోంది. ఇది చైనా ఎగుమతులనే కాకుండా, ఆ దేశ ఆర్డర్లపై ఆధారపడిన ఆసియాన్ దేశాలకూ నష్టదాయకంగా పరిణమించనుంది. దీన్ని అధిగమించడానికి ఆసియాన్ సభ్యదేశాలైన వియత్నాం, ఇండోనేసియాలు ఇప్పటికే చైనాకు ప్రత్యామ్నాయంగా పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రాలుగా ముందుకొస్తున్నాయి. ఏదిఏమైనా అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం ప్రధానంగా ఎగుమతులపై ఆధారపడిన ఆసియాన్ దేశాలపై ప్రతికూల ప్రభావాన్ని కనబరచకమానదు. దీన్ని నివారించడానికి క్వాడ్ సభ్యదేశాలైన భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో సన్నిహిత ఆర్థిక, వ్యూహ సంబంధాలను నెరపడం ఆసియాన్‌కు అనివార్యమవుతుంది. ఆసియాన్ ప్రకటించిన ఏఓఐపీ, భారత్ చేపట్టిన ఐపీఓఐలు ఈ దిశగా పడిన సరైన అడుగులు!

– అరూణిమ్ భుయాన్, విదేశాంగ వ్యవహారాల నిపుణులు

హాయ్! బుజ్జీ!!

నమ్మకం

పూర్వం రామలింగం అనే పెద్దబొరుగుల వ్యాపారి ఉండేవాడు. నాణ్యమైన, రుచికరమైన బొరుగులు అమ్మేవాడు. అతడి దగ్గర ఒక గుమస్తా ఉద్యోగం ఖాళీ అయింది. ఆసక్తి ఉన్నవారు తనను సంప్రదించవచ్చని దండోరా వేయించాడు. కానీ వారికి ఓ పరీక్ష పెడతానని, అందులో నెగ్గిన వారినే ఉద్యోగానికి ఎంపిక చేసుకుంటానని మెలిక పెట్టాడు. 'దోసిలిలో బొరుగులు పోస్తాం. వాటిలో చిన్న చిన్న రాళ్లుంటాయి. బాగా ఊది చేతిలో మిగిలిన వాటిని మాత్రమే తినాలి' అని ప్రకటించాడు.



చాలా మంది ముందు ఉత్సాహం చూపారు. కానీ.. వారిలో ఓ అనుమానం మొదలైంది. 'గట్టిగా ఊదితే బొరుగులన్నీ గాలికి ఎగిరిపోతాయి కదా. మిగిలేది రాళ్లే. వాటిని ఎలా తినగలం' అనుకుని ఎవరూ ప్రయత్నించలేదు. పొరుగూరు నుంచి మురహరి ఒక్కడు మాత్రమే అక్కడికి వచ్చాడు. ఎవరు ఎన్ని చెప్పినా, వ్యాపారి పెట్టిన పోటీకి సిద్ధమయ్యాడు. దోసిలిలో బొరుగులు పోసుకుని, గట్టిగా ఊదాడు. అన్నీ నేలమీద పడిపోయాయి. చేతిలో మిగిలిన వాటి వైపు చూశాడు. ఆశ్చర్యం.. అవి రాళ్లు కాదు. బెల్లం ముక్కలు. గబగబా వాటిని తిన్నాడు. 'నీకు రాళ్లు తినాల్సి వస్తుందని భయమేయలేదా? ఈ పరీక్షలో ఏ ధైర్యంతో పాల్గొన్నావు?' అని వ్యాపారి మురహరిని ప్రశ్నించాడు. 'చాలా పేరున్న అంగడి మీది. ఉద్యోగం కోసం వచ్చేవారికి మీరు రాళ్లు ఎందుకు పెడతారు? అలా చేస్తే మీకే చెడ్డపేరు వస్తుంది కదా! అసలు రాళ్లూ రప్పలు మీ బొరుగుల్లో ఎందుకు ఉంటాయి చెప్పండి' అని బదులిచ్చాడు అతడు. తన వ్యాపారం మీద మంచి నమ్మకమున్న యువకుడు దొరికాడని రామలింగం సంతోషించాడు. వెంటనే మురహరిని ఉద్యోగంలోకి తీసుకున్నాడు.

– ఆర్.సి.కృష్ణస్వామిరాజు

రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. వాటిని సరైన పదాలతో కలిపి అర్థవంతంగా చేయండి.

గాలి	మురళీ	తోట	జ్ఞానం	చెవుల
పిల్లి	జ్ఞాపక	బాట	చిచ్చర	సారి
వాటం	పిడుగు	గానం	ఓడ	గాయలు
ఎడారి	కాల	మాలి	శక్తి	కూర

పవన్ ఉండగా.. పల్లెకు పండగే..





కృష్ణా జిల్లాపై ఉపముఖ్యమంత్రి వరాల జల్లు

ఈనాడు, అమరావతి, కంకిపాడు, న్యూస్‌టుడే

కృష్ణా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న అనేక సుదీర్ఘ సమస్యలను 'పల్లెపండగ'లో భాగంగా పరిష్కరించేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ వెల్లడించారు. కంకిపాడులో సోమవారం జరిగిన 'పల్లెపండగ' కార్యక్రమం ప్రారంభోత్సవంలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాపై వరాల జల్లు కురిపించారు. కంకిపాడు సీహెచ్‌సీ ప్రహరీ, 11 అంతర్గత సీసీ రహదారులు, రెండు మినీ గోకులాలు, పునాదిపాడు గ్రామ పరిధిలో రెండు అంతర్గత రహదారుల నిర్మాణానికి పవన్ శంకుస్థాపన చేశారు. కంకిపాడు నుంచి గొడవర్రు మీదుగా రొయ్యూరు రహదారి పునరుద్ధరణ పనులను వెంటనే చేపట్టాలంటూ జిల్లా కలెక్టర్‌ను పవన్ ఆదేశించారు. ఎదురుమొండి, నాగాయలంక, గొల్లమంద, బ్రహ్మయ్యతోట తదితర లంక గ్రామాలకు అనుసంధాన రహదారులు లేక అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులను తీరుస్తామని తెలిపారు. ఈ గ్రామాల్లోని 8వేల మంది ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా రహదారుల అభివృద్ధికి ఆదేశాలు జారీ చేశారు. ★ మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి విజ్ఞప్తి మేరకు మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైన్‌ను పట్టాలెక్కించేందుకు కేంద్రంతో మాట్లాడి, త్వరలోనే కార్యాచరణ మొదలెట్టేలా చర్యలు తీసుకుంటామని పవన్ హామీ ఇచ్చారు. గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని 43 గ్రామాల్లో ప్రజలు తాగుతున్న జలాలు పసుపు పచ్చగా ఉన్నాయంటూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పవన్ దృష్టికి తీసుకొచ్చారు. ఆ మంచి నీటి బాటిళ్లను పవన్ సభలో చూపిస్తూ.. ఈ సమస్య పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధులపై నివేదిక ఇవ్వాలని సూచించారు. ★ కంకిపాడు, పునాదిపాడు, ఈడుపుగల్లు, గోసాల, ఉప్పలూరు తదితర కూడళ్లలో ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలు ఆకట్టుకున్నాయి. ★ ఉదయం వర్షం రావడంతో పల్లె పండగ నిర్వహణలో ఇబ్బందులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తమైంది. అయితే సభా కార్యక్రమాలు ముగిసే వరకు వర్షం పడలేదు. ★ పవన్ ప్రసంగిస్తున్న సమయంలో సభ మొత్తం కరతాళ ధ్వనులతో మారుమోగింది. యువత, మహిళలు భారీగా తరలివచ్చారు. డిజిటల్ తెరపై పవన్ కనిపించిన ప్రతిసారీ అభిమానులు పూల వర్షం కురిపించారు. ★ ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, కాగిత కృష్ణ ప్రసాద్, వెనిగండ్ల రాము, కలెక్టర్ డి.కె.బాలాజీ తదితరులు పవన్‌కు జ్ఞాపిక అందజేశారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆంజనేయస్వామి కాంస్య విగ్రహాన్ని పవన్‌కు అందజేసి సత్కరించారు.




డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఆయన కుమారుడు వెంకట్రామ్


నీరు రంగు మారి వస్తోందని పవన్‌కు చూపిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్

మహాత్ముడి స్ఫూర్తితోనే.. – ఎంపీ వల్లభనేని బాలశౌరి



గ్రామాలు సామాజికంగా, ఆర్థికంగా పరిపుష్టి చెందినేతే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతాయన్న మహాత్మాగాంధీ మాటలను స్ఫూర్తిగా తీసుకుని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పల్లెపండగ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దేశ చరిత్రలో ఎక్కడా జరగని విధంగా ఒక్క రోజులోనే 13,326 పల్లెల్లో గ్రామసభలు నిర్వహించి రికార్డు సృష్టించారు. గత ప్రభుత్వంలో దాదాపు 5 వేల మంది కౌలు రైతులు ఆత్మహత్యకు పాల్పడితే ఆ బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున తన సొంత డబ్బులను పవన్ ఇచ్చారు. ఇటీవల కురిసిన వరదల కారణంగా 400 గ్రామాల్లో నష్టం జరిగితే ఒక్కో పంచాయతీకి రూ.లక్ష చొప్పున రూ.4 కోట్లు సొంత డబ్బులు అందించారు. గత ప్రభుత్వంలో కేంద్రం ఇచ్చిన జలజీవన్ మిషన్ నిధులు సక్రమంగా వినియోగించుకోకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవస్థలు తప్పడం లేదు. ఆ నిధులు సద్వినియోగం చేసుకొని మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో ప్రజల దాహార్తి తీరుస్తాం. కృష్ణా జిల్లావాసుల చిరకాల కోరిక.. మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైను ప్రాజెక్టును త్వరలోనే సాకారం చేస్తాం.

వైకాపా పాలనలో సర్పంచులు రోడ్డపాలు – కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ మంత్రి




గత వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో రహదారులు వేయించిన సర్పంచులు, గుత్తేదారులు సకాలంలో బిల్లులు రాకపోవడంతో రోడ్డు పాలయ్యారు. వారి అప్పులు అమ్ముకునే పరిస్థితికి వచ్చారు. పంచాయతీ కార్యాలయాలకు పార్టీ రంగులు వేసేందుకు తప్ప గ్రామాల్లో అభివృద్ధి పనులకు నోచుకోలేదు. కేంద్రం గ్రామాలకు విడుదల చేసిన రూ.12వేల కోట్లు సక్రమంగా వినియోగించుకోలేకపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే రూ.4,500 కోట్లతో 30వేల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. 3వేల కి.మీ సీసీ రోడ్లు, 500 కి.మీ తారు రోడ్లు, 10వేల వాననీటి కుంటలు నిర్మిస్తున్నారు.

మాచవరం వద్ద కుంగిన రైల్వే ట్రాక్

పొన్నూరు, బాపట్ల, గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: చెన్నై నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మాచవరం రైల్వేస్టేషన్ సమీపంలో ఇటీవల రైల్వే ట్రాక్ ఒక వైపు కుంగింది. రెండు రోజులు నుంచి వర్షాలు కురవడంతో అక్కడ ప్రమాదకరంగా ఉంది. ఆ మార్గంలో రాకపోకలు నిర్వహించే రైళ్లను అతి తక్కువ వేగంతో కొనసాగిస్తున్నారు. రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి యుద్ధ ప్రాతిపదికపై మరమ్మతుల ప్రక్రియను చేపట్టగా.. ఈ పనులకు వర్షం అడ్డంకిగా మారింది. మాచవరంలో సిగ్నల్ వ్యవస్థ పనిచేయకపోవడంతో సోమవారం రాత్రి తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అక్కడ నిలిచిపోయింది. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వందే భారత్ రైలును అప్పికట్లకు వెనుకకు పంపించారు. అప్పికట్ల నుంచి నిడుబ్రోలు వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాక్‌పై వందేభారత్ రైలును పంపారు. అదే ట్రాక్‌లో మిగిలిన రైళ్లను పంపిస్తున్నారు. ఆ మార్గంలో రైళ్ల ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డారు.

జై భవానీ..

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే




ఘాట్‌రోడ్డు వద్ద అమ్మవారికి నమస్కరిస్తూ..


తరలివస్తున్న భవానీలు

దసరా శరన్నవరాత్రి వేడుకలు ముగిసినా ఇంద్రకీలాద్రిపై జగన్మాత దుర్గమ్మ దర్శనానికి భవానీ దీక్షాధారుల రద్దీ సోమవారం కూడా కొనసాగింది. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. మరో రెండు రోజులు భవానీ దీక్షాధారులు అమ్మవారి దర్శనానికి వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఇరుముడి సమర్పించిన భక్తులకు అవసరమైన ప్రసాదాలను కౌంటర్లలో సిద్ధం చేశారు. వినాయకుడి గుడి నుంచి క్యూలైన్లలో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని కనకదుర్గానగర్‌కు చేరుకున్నారు. కనకదుర్గానగర్‌లో అన్నప్రసాదం స్వీకరించిన భక్తులు ప్రసాదాల కౌంటర్ల వద్ద బారులు తీరుతున్నారు.

దీక్షాధారులతో ఇంద్రకీలాద్రిపై క్యూలైన్లు రద్దీ

కౌంటర్లు పెంచాలి

మూలానక్షత్రం నాటి నుంచి ఉత్సవాలు ముగిసేవరకు భక్తుల రద్దీ కొనసాగుతుండడంతో ప్రసాదాల కౌంటర్లు పెంచాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం 11 లడ్డూ విక్రయ కేంద్రాలు మాత్రమే కనకదుర్గానగర్‌లో ఉన్నాయి. ఇవికాకుండా పలు ప్రాంతాల్లో కేంద్రాల ద్వారా నామమాత్రంగా విక్రయిస్తున్నారు.

దసరా ఉత్సవాల్లో రికార్డు స్థాయిలో లడ్డూ విక్రయాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : విజయవాడ ఇంద్రకీలాద్రిపై నిర్వహించిన దసరా ఉత్సవాల్లో రికార్డు స్థాయిలో సుమారు 25 లక్షల లడ్డూ ప్రసాదాల విక్రయాలు జరిగాయి. మరో రెండు లక్షల లడ్డూ విక్రయాలకు సిద్ధంగా ఉన్నాయి. వేడుకలు ముగిసిన తర్వాత కూడా భవానీ దీక్షాధారుల రద్దీ కొనసాగుతుండటంతో ప్రసాదాలకు డిమాండ్ పెరిగింది. ఈ ఉత్సవాల్లో దాదాపు 15 లక్షల మంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారని దేవస్థానం అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది 15 రోజుల్లో 20 లక్షల లడ్డూ ప్రసాదాలు విక్రయించగా ఈ సారి ఆ సంఖ్య 27 లక్షలకు చేరింది.


కనకదుర్గా నగర్‌లో భక్తుల తాకిడి


అమ్మవారికి నివేదన సమయంలో క్యూలైన్లలో నిరీక్షణ

సిండికేట్లదే హవా!

- కూడబలుక్కొని దరఖాస్తు చేసి దక్కించుకున్నారు
- సరిహద్దు మండలాల్లో తెలంగాణ వ్యాపారులకే అధికం
- లాటరీ దక్కించుకున్న వారితో పలువురు జోరుగా బేరసారాలు
- మహిళలకూ పెద్ద సంఖ్యలో వచ్చిన దుకాణాలు

ఈనాడు, అమరావతి

మద్యం దుకాణాలకు తీసిన డ్రాలో సిండికేట్లదే పైచేయి అయింది. దరఖాస్తుల సమర్పణ నుంచే వీరి హవా కనిపించింది. వీరే ఎక్కువ చోట్ల షాపులు దక్కించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని నోటిఫై చేసిన మద్యం దుకాణాలకు సోమవారం విజయవాడలోని ఎస్‌ఏసీ కల్యాణ మండపంలో డ్రా తీశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం మధ్యాహ్నం వరకు సాగింది. రాష్ట్రంలోనే ఎన్టీఆర్ జిల్లాలోని 113 దుకాణాలకు 5,825 మంది దరఖాస్తు చేశారు. దీంతో రెండు హాల్స్‌లో డ్రా తీశారు. మొదటి హాల్‌లో కలెక్టర్ సృజన, రెండో హాల్‌లో జేసీ నిధి మీనా స్వయంగా డ్రా తీశారు. ఈ హాల్‌లో తెలంగాణ సరిహద్దున ఉన్న ప్రాంతాలు ఉండడం, వాటిలో ఎక్కువ దరఖాస్తులు రావడంతో ప్రక్రియ ఆలస్యమైంది. లక్కీ డిప్‌లో షాపు దక్కించుకున్న దరఖాస్తుదారులు వార్షిక రుసుములో ఆరో వంతు చెల్లించేందుకు వీలుగా ప్రాంగణంలోనే ఎస్‌బీఐ కౌంటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. డ్రాలో అదృష్టం వరించిన వారు ఆనందంతో కేరింతలు కొట్టారు.


దుకాణాల కేటాయింపునకు హాజరైన మహిళలు

షాపు వదిలేస్తే రూ.కోటి

సిండికేట్‌తో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకుని దుకాణాలు దక్కించుకున్నవారి నుంచి చేజిక్కించుకునేందుకు జోరుగా బేరసారాలు సాగాయి. సాక్షాత్తు డ్రా తీసిన కల్యాణ మండపంలోనే వాటిని మొదలుపెట్టారు. ఒక్కరే అంత పెట్టుబడి పెట్టలేరు.. మాకు వదిలేస్తే గుడ్‌విల్ కింద డబ్బులు ఇస్తామని బుజ్జగిస్తున్నారు. ఇప్పటికిప్పుడు షాపుల కోసం ప్రాంగణం చూసుకోవడం, సరకు, పెట్టుబడి, తదితర వాటికి రూ.40లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అంత స్థోమత లేని వారు సిండికేట్ల ఆఫర్లకు తలొగ్గుతున్నారు. షాపు వదిలిస్తే రూ.కోటి నుంచి 1.2 కోట్ల వరకు ముట్టజెబుతామని అటు విజయవాడ నగరం మొదలు గ్రామీణ ప్రాంతాల్లో షాపులు దక్కించుకున్న వారికి ఆశ చూపుతున్నారు. కొందరైతే దరఖాస్తుదారు చెల్లించిన రూ.2లక్షల రుసుముతో పాటు లైసెన్సు ఫీజులో పది శాతాన్ని చెల్లిస్తామని నచ్చజెబుతున్నారు.

రింగ్ అయి.. షాపులు దక్కించుకుని..

★ దుకాణాలు దక్కించుకునేందుకు ఎక్కువ మంది సిండికేట్ అయి దరఖాస్తు చేసుకున్నారు. పెట్టుబడి, వాటాలకు సంబంధించి ముందే అవగాహనకు వచ్చి కూడబలుక్కున్నారు. విజయవాడ నగరంలో 39 దుకాణాలను నోటిఫై చేశారు. వీటిలో దాదాపు 25 షాపులను ఐదు సిండికేట్లు దక్కించుకున్నాయి. వీరిలో ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు, కీలక నేతల అనుచరులే. నగరంలోని ఓ నియోజకవర్గంలోని డివిజన్ స్థాయి ప్రజాప్రతినిధి కొందరిని రింగ్ చేశారు. వీరంతా కలిసి 154 షాపులకు దరఖాస్తు చేసుకోగా, ఐదు వచ్చాయి. మరో నియోజకవర్గంలో డివిజన్ ప్రజాప్రతినిధి ఒకరు కొందరితో కూటమి కట్టి 250 షాపులకు వేయగా 5 దుకాణాలు దక్కాయి. గుంటూరు జిల్లాకు చెందిన భార్యభర్తలు.. నగరానికి చెందిన వారితో కలిసి 480 షాపులకు దరఖాస్తు చేశారు. ఈ సిండికేట్‌కు 9 వచ్చాయి. నగరంలోని మరో కూటమి 300 పైగా షాపులకు దరఖాస్తు చేస్తే 5 దక్కాయి. ఒక్కొక్కరు ఎన్ని షాపులకైనా వేయొచ్చన్న నిబంధన ఉండడంతో ఒక్కో దానికి రూ.2లక్షలు చెల్లించి చాలా దరఖాస్తులు వేశారు. కొందరికి రెండు, మూడు కూడా డ్రాలో దక్కాయి.



మద్యం దుకాణాల లాటరీ తీస్తున్న కలెక్టర్ సృజన

మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరికి.. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే కాకుండా ఇతర రాష్ట్రాల వారు కూడా ఎన్టీఆర్ జిల్లాలోని షాపుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ నగరంలోని ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికి విజయవాడలోని రెండు దుకాణాలు లాటరీలో వచ్చాయి. బెజవాడలోని 14వ దుకాణం.. రాహుల్ శివహరేకు, 18వ దుకాణం.. అర్పిత్ శివహరేలను వరించాయి.

20షాపులు మహిళలవే.. జిల్లాలోని 113 దుకాణాలకు మహిళలు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేశారు. డ్రాలో షాపులు పొందిన వారిలోనూ ఇంతులు గణనీయమైన సంఖ్యలోనే ఉండడం విశేషం. రాష్ట్రంలోకెల్లా ఎన్టీఆర్ జిల్లా 2వ స్థానంలో ఉంది. మొత్తం 20 మందికి లాటరీలో దుకాణాలు వచ్చాయి. 17.7 శాతం మహిళలకే దక్కాయి.


లాటరీ నిర్వహించే హాలుకు లైనులో వెళ్తూ..


విజయవాడ గురునానక్ కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల కేటాయింపు వద్దకు తెలంగాణ రాష్ట్రం వరంగల్ నుంచి నెలల చిన్నారిని వెంట బెట్టుకుని వచ్చిన ఓ కుటుంబం

★ తెలంగాణలోని సూర్యాపేట, నల్గొండ, ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన వారు భారీ సంఖ్యలో దరఖాస్తులు చేశారు. మైలవరం, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి, మైలవరం, తిరువూరు, కంచికచర్ల, గంపలగూడెం, విస్సన్నపేట, తదితర మండలాలకు స్థానికేతరుల హవా కనిపించింది. పెనుగంచిప్రోలులోని ఐదు దుకాణాల్లో మూడు తెలంగాణకు చెందిన వారికే వచ్చాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా వత్సవాయిలోని 96వ దుకాణానికి 132 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో ఖమ్మం జిల్లాకు చెందిన సత్యనారాయణను లాటరీ వరించింది. 97వ దుకాణానికి 120 దరఖాస్తులు రాగా డ్రాలో రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన బండి అనూషా దక్కించుకున్నారు. జిల్లాలో దరఖాస్తుల్లో మూడో స్థానంలో ఉన్న పెనుగంచిప్రోలులోని 81వ దుకాణం కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌కు చెందిన రాజును వరించింది.

తెలంగాణ కంటే ఇక్కడ లాభసాటని..

ఎన్టీఆర్ జిల్లాకు ఆనుకుని ఉన్న సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో ఇప్పటికే మద్యం దుకాణాలు నడుపుతున్న వారు ఎక్కువగా ఆసక్తి చూపించారు. తెలంగాణలో సంబంధిత దుకాణం లైసెన్సు ఫీజుకు పది రెట్లు సరకును ఇస్తారు. ఈ పరిమితి దాటిన తర్వాత ఇచ్చే సరకుపై అక్కడి ప్రభుత్వం పన్ను విధిస్తుంది. రోజుకు రూ.5లక్షలకు వ్యాపారం చేస్తే కానీ గిట్టుబాటు కానీ పరిస్థితి. ఏపీలో ఇలా పరిమితులు లేకపోవడంతో ఇక్కడి షాపులను దక్కించుకునేందుకు ఆసక్తి చూపించారు.

వరదతో విధ్వంసం.. చొరవతో పరిష్కారం



కవులూరు వెళ్లే మార్గ మధ్యలో పెద్ద గండి



రాళ్లు, మట్టితో పూర్తిగా పూడ్చి మార్గం చూపి..

బుడమేరు సృష్టించిన విధ్వంసం వల్ల ఇబ్రహీంపట్నం నుంచి కవులూరు వెళ్లే రోడ్డు కోతకు గురై నెల రోజులు తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రజానీకం నేడు కుదుట పడింది. శాంతినగర్ నుంచి కవులూరు, పైడూరుపాడు, రాయనపాడును కలిపే ప్రధాన రహదారి గండిపడిన చోటుకు అత్యంత సమీపంలోనే ఉంది. వరద ఉద్ధృతికి పలుచోట్ల పెద్దపెద్ద గండ్లు పడి రోడ్డు మొత్తం కోతకు గురైంది. దీంతో ఇబ్రహీంపట్నం వెళ్లాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం వరద వచ్చి నెల రోజులు గడవక ముందే పెద్దపెద్ద గండ్లను రాళ్లు మట్టితో పూడ్చివేసి ప్రజానీకానికి ఇబ్బందులు లేకుండా చేసింది.

-ఈనాడు, అమరావతి



శాంతినగర్ బ్రిడ్జి దిగువన భారీ గండి..



గండిని పూడ్చేసి.. రోడ్డు వేశారిలా..

ఫ్లెక్సీలు తొలగిద్దాం.. స్వచ్ఛ జగ్గయ్యపేటకు సహకరిద్దాం

ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : పర్యావరణానికి, పట్టణ సుందరీకరణకు అవరోధంగా మారిన ఫ్లెక్సీలను ఎవరికి వారు తొలగించి స్వచ్ఛ జగ్గయ్యపేటకు సహకరించాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఇచ్చిన పిలుపును ఆయన స్వాగతిస్తూ జగ్గయ్యపేట పురపాలక సంఘంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగుల తొలగింపును ఆయన సోమవారం ప్రారంభించారు. ముందుగా తన అనుచరులు తన ఫొటోలతో పెట్టిన దాన్ని స్వచ్ఛందంగా తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీధుల అందాన్ని, ప్రశాంతతను భంగపరిచే స్థాయిలో పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, అందుకే ఫ్లెక్సీ ఫ్రీ పట్టణంగా జగ్గయ్యపేటను తీర్చిదిద్దుదామన్నారు. నెల్లూరును పోస్టర్ ఫ్రీగా మారుస్తున్న మంత్రి నారాయణను స్ఫూర్తిగా తీసుకుందామని, అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు, సంఘాలు తమ బ్యానర్లను తొలగించాలని సూచించారు. దశలవారీగా ఫ్లెక్సీలు, బోర్డులు, హోర్డింగులు, పోస్టర్ల తొలగింపు చేపడతామని మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర తెలిపారు. ప్రస్తుతం దీపావళి శుభాకాంక్షల ఫ్లెక్సీలు వరకూ ఉంచి మిగిలినవన్నీ తొలగిస్తామన్నారు. ఏదైనా ప్రకటనల నిమిత్తం బ్యానర్లు ఏర్పాటు చేయలనుకున్నవారు విధిగా పురపాలక సంఘం అనుమతి తీసుకుని, వారు సూచించిన స్థలాల్లో మాత్రమే పెట్టాలని కమిషనర్ రామ్మోహనరావు తెలిపారు.



తన అనుచరులు పెట్టిన ఫ్లెక్సీనే ముందుగా తొలగించమని చెప్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి


ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

చంద్రబాబు హయాంలోనే పారిశ్రామికాభివృద్ధి

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి జరుగుతుందని, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అమేయ ప్రభు అన్నారు. ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఎంఓయూ కుదుర్చుకుంది. దీనికి సంబంధించిన ఒప్పంద పత్రాలను ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో సోమవారం మార్చుకున్నారు. అమేయ ప్రభు మాట్లాడుతూ ఏపీలో ఉత్పత్తయ్యే వస్తువులను ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు. కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు మాట్లాడుతూ దేశంలో పారిశ్రామిక అభివృద్ధి జరగాలంటే ఎంఎస్ఎంఈలను బలోపేతం చేయాలన్నారు. చైనా, జపాన్, అమెరికా వంటి దేశాలు ప్రగతి పథంలో దూసుకెళ్లేందుకు ప్రధాన కారణం ఎంఎస్ఎంఈల సహకారమేనని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులను ఆహ్వానించడమే కాకుండా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి మంచి సహకారం అందిస్తోందని తెలిపారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకయైన ఎంఎస్ఎంఈ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ సింగ్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, కోశాధికారి అక్కయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న భాస్కరరావు, అమేయ ప్రభు. చిత్రంలో సురేష్ ప్రభు, గంగరాజు

సమన్వయంతో దసరా ఉత్సవాలు విజయవంతం

విద్యాధరపురం, న్యూస్‌టుడే : పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, దేవాదాయ శాఖలతో పాటు ఇతర విభాగాల సమన్వయంతో దసరా ఉత్సవాలు విజయవంతం అయ్యాయని నగర పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు అన్నారు. దసరా ఉత్సవాలు ముగింపు నేపథ్యంలో వన్‌టౌన్ పోలీసు స్టేషనులో దుర్గగుడి రుత్వికులు సోమవారం చండీహోమం నిర్వహించారు. అనంతరం చేపట్టిన అన్నప్రసాద వితరణను దుర్గగుడి ఈవో రామారావు, డీసీపీ గౌతమిషాలితో కలిసి సీపీ ప్రారంభించారు. సీపీ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ రానంతగా దేవీ నవరాత్రి ఉత్సవాలకు దాదాపు 15 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. మూలా నక్షత్రం తర్వాత కూడా సాధారణ భక్తులతో పాటు గణనీయంగా భవానీ దీక్షాధారులు రావడంతో పరిస్థితులు అదుపు తప్పకుండా సుమారు ఆరు వేల మంది సిబ్బంది భద్రతా విధులు నిర్వర్తించారని పేర్కొన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు అధికారులను సమన్వయ పరిచామని చెప్పారు. ఏడీసీపీ రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.


పూర్ణాహుతి కార్యక్రమంలో సీపీ రాజశేఖర్ బాబు, దుర్గగుడి ఈవో రామారావు, డీసీపీ గౌతమిషాలి

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.98/-.

జగన్మాత సేవలో రక్షణ శాఖ సలహాదారు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను కేంద్ర రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో రామారావు ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


సతీష్‌రెడ్డికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

ప్రకటన

ది దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్., నెం.హెచ్ 953, విజయవాడ - వారు డిపాజిట్‌దారులకు తెలియజేయునది ఏమనగా రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా వారు ది: 29.07.2022న జారీ చేసిన RBI.DOS(H). No. / S243/12.11.026 /2022-23 నిర్దేశానుసారం (డైరెక్షన్) సదరు డిపాజిట్‌దారుడు బ్యాంకు నందు ఏ రకమైన డిపాజిట్ రూపేణా (పొదుపు ఖాతా, కరెంటు ఖాతా, రికరింగ్ డిపాజిట్ మరియు ఫిక్స్‌డ్ డిపాజిట్) [illegible] రూ.1,50,000/- [illegible] రూ.1,60,000/- [illegible] రూ.1,50,000/- [illegible] రూ.1,50,000/- [illegible]

సం/- స్పెషల్ ఆఫీసర్/CEO(Incharge)
ది దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్., విజయవాడ

వరద బాధితులకు దాతల చేయూత


చంద్రబాబుకు రూ.8 లక్షల చెక్కు అందిస్తున్న రాజధాని రైతులు, మహిళలు

ఈనాడు, అమరావతి, తుళ్లూరు, న్యూస్‌టుడే: వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు దాతలు పెద్దఎత్తున స్పందిస్తున్నారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలో తెదేపా కార్యకర్తలు, వివిధ సంస్థలు సేకరించిన రూ.30.85 లక్షల చెక్కును ఆ నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు, తదితరులు సోమవారం వెలగపూడి సచివాలయంలో చంద్రబాబుకు అందజేశారు. రాజధాని పరిధిలోని తుళ్లూరు గ్రామస్థులు రూ.8 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మేరకు చంద్రబాబును కలిసి చెక్కు అందించారు.

పేరు	విరాళం మొత్తం (రూ..)
విజయ్‌కుమార్	6 లక్షలు
ఆల్ ఇండియా బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్(ఏపీ సర్కిల్)	3.11 లక్షలు
ఎన్నారై టీడీపీ వింగ్ (న్యూజిలాండ్)	2.70 లక్షలు
మల్లవరపు శ్రీనివాసరావు	2.50 లక్షలు
లక్ష్మీ సుభాషిణి	లక్ష
వెలంగ సరంధ	లక్ష
మంచికలపూడి సుబ్బారావు	లక్ష
వెలంగ భాస్కర్	50 వేలు

వీరితోపాటు మరికొందరు విరాళాలు ఇచ్చారు.

In the Court of the VI Addl. Civil Judge (Senior Division) at Vijayawada
E.P.No. 102/2023 In O.S.No. 508/2017.
Between:
Vemula Suresh Alias Suresh Kumar .. Decree Holder
And
1. Mallampati Kondal Rao (Died)
2. Mallampati Ramanamma
3. Mallampati Praveen
4. Mallampati Abhinav Chowdary .. Judgement Debtors

సేల్ ప్రకటన

[illegible] 01-11-2024 [illegible]

A Vacant residential Site in an extent of 211.5 Sq.yards equivalent to 176.84 Sq.mts. in R.S.No. 17/2A, Vidyadharapuram Village area, Vidyadharapuram, Vijayawada Town, within the limits of Vijayawada Municipal Corporation area, Vijayawada, Krishna District, Vijayawada, Sub-Registry and being bounded by: East: 33' width of road, South: Property of Raghavulu Venkata Lakshmi, West: Property of Kundla Malyadri, North: Property of Mallampati Narayanamma.
D.H.R. Value: 20,00,000/-, Market Value: 25,00,000/-, Ameena Value: 25,00,000/-
ఈ ఆస్తి మొత్తము పూర్తిగా వేలం జరుపవలెను. ఇ.సి. దాఖలా అన్యాక్రాంతములు ఏమీ లేవు. యం.సి.వేకెంట్ సైట్ (నిల్)
(ఈ కోర్టు ఉత్తర్వుల మేరకు) వేలం తేది: 01-11-2024
గోలి నరసింహారావు, గోలి రమాదేవి, అడ్వకేట్స్
డో.నెం. 32-13/1-3, అంజయ్య వీధి, శివాలయం దగ్గర, మొగల్రాజపురం, విజయవాడ- 10 ఫోన్: 98482 20034, 97008 46688

రూ.300 కోట్ల విలువైన స్థలాన్ని కాపాడండి

ఎస్సారార్ పూర్వ విద్యార్థుల సంఘం డిమాండ్

మాచవరం, న్యూస్‌టుడే : ఆక్రమణల చెరలో ఉన్న రూ.300 కోట్ల విలువైన 6.67 ఎకరాల స్థలాన్ని కాపాడాలని ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం డిమాండ్ చేసింది. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డు, గులాబీతోటలోని సదరు స్థలాన్ని సంఘం నాయకులు సోమవారం పరిశీలించారు. సంఘ నాయకుడు దోనేపూడి శంకర్ విలేకర్లతో మాట్లాడారు. విలువైన స్థలం కబ్జాకు గురవుతున్నా కళాశాల యాజమాన్యం, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పదేళ్లుగా పోరాడుతున్నా.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని 2009లో కోర్టు ఆదేశించిందన్నారు. ఆ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు ఎలా కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించారు. నగరపాలక సంస్థ ఎలా అనుమతులిస్తుందని నిలదీశారు. దసరా పండగ సందర్భంగా కొందరు ప్రైవేటు వ్యక్తులు శంకుస్థాపనకు సిద్ధమవుతుండగా.. కలెక్టర్ జి.సృజన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆమె స్పందించి, పనులు నిలిపివేయించారని చెప్పారు. 'ఆపరేషన్ బుడమేరు' తరహాలో 'ఆపరేషన్ ఎస్సారార్' చేపట్టాలని కోరారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కళాశాలకు 87 సంవత్సరాల చరిత్ర ఉందని వివరించారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు దోనేపూడి కాశీనాథ్, చెరుకూరి కృష్ణకుమార్ (నాని), అధ్యక్షుడు లంకా జానయ్య, కార్యదర్శి చిగురుపాటి యుగంధర్‌లు మాట్లాడారు. ఎన్టీ రామారావు, చలసాని శ్రీనివాసరావు, చలసాని కాంచనరావు, రావి భీమారావు వంటి అనేక మంది ప్రముఖులు కళాశాలలో చదువుకున్నారని గుర్తు చేశారు. ఒక దశలో.. నగరపాలక సంస్థలో 12 మంది కార్పొరేటర్లుగా ఎన్నికయ్యారని తెలిపారు. రాజకీయ చైతన్యం గల కళాశాల స్థలాన్ని కబ్జా చేస్తే.. ఊరుకునేది లేదని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాలు, ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. జలసూత్రం శ్రీనివాసరావు అనే వ్యక్తి ఆక్రమించిన స్థలంలో మెరక వేసేందుకు వచ్చిన ట్రాక్టర్‌ను నేతలు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆళ్ల వేణుగోపాలరావు, నల్లమోతు వెంకటేశ్వరరావు, కె.వి.నాంచారయ్య, న్యాయవాదులు శ్రీనివాసరావు, రాజశేఖర్, మహబూబ్ ఆజం, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.కార్తిక్, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.


స్థలంలో మెరక వేయడానికి వచ్చిన ట్రాక్టర్‌ను అడ్డుకున్న పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
హోమ్ లోన్ సెంటర్-1 (ఆర్ఎసిపిసి-1)-05252, కె.కె.టవర్స్, మొదటి అంతస్థు, యం.జి.రోడ్డు, విజయవాడ-520 010, యన్‌టిఆర్ జిల్లా.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని 13(2) క్రింద దిగువ వారికి

టు
శ్రీమతి ఇంజమూరి వెంకట సునీత, భర్త: వెంకటేశ్వరరావు మరియు
శ్రీ ఇంజమూరి వెంకటేశ్వరరావు, తండ్రి: భాస్కరరావు, ఫ్లాట్ నెం.501, 5వ అంతస్థు, లక్ష్మీభాయి నిలయం అపార్ట్‌మెంట్, కొత్త వెంకటేశ్వర స్వామి గుడి వీధి, భాష్యం స్కూల్ ఎదురు, సీతారాంపురం, జగ్గయ్యపేట, కృష్ణా జిల్లా-521 175, ఆంధ్రప్రదేశ్.
అకౌంట్ నెం.38003185044-హౌసింగ్ లోన్, 38007408126-యస్‌బిఐ సురక్ష
సార్ / మేడమ్,
మీరు గవర్నర్‌పేట బ్రాంచి-1008, విజయవాడ-520 002, యన్‌టిఆర్ జిల్లా నుండి ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్తిని తనఖా ఉంచి హోమ్ లోన్ సౌకర్యాన్ని పొందియున్నారు. సదరు ఋణము **ది.05-10-2024**వ తేదీ నాటికి మొత్తము బకాయి **రూ.55,19,539/- (అక్షరాల యాభైఐదులక్షల పంతొమ్మిదివేల ఐదువందల ముప్పైతొమ్మిది రూపాయిలు మాత్రమే)** మరియు ఒప్పందపరమైన వడ్డీ తదుపరి కాస్ట్స్, ఛార్జీలు, ఇతరములైన ఖర్చులు మొత్తము బకాయిగా ఉన్నవి.

తనఖాపెట్టిన స్థిరాస్తుల వివరము

షెడ్యూల్ ఏ:- కృష్ణా జిల్లా, విజయవాడ సబ్ రిజిస్ట్రార్, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి, విజయవాడ గ్రామ ఆర్‌యస్ నెం.13/2ఎలోని విస్తీర్ణం 1605 చ॥గ॥లునకు **హద్దులు: తూర్పు:** ఇతరుల ఆస్తి-134.0 చ॥అడుగులు, **దక్షిణం:** శ్రీ దాట్ల విసకోటపు రాజు గారి ఆస్తి-107.9 చ॥అడుగులు, **పడమర:** ఇతరుల ఆస్తి-131.4 చ॥అడుగులు, **ఉత్తరం:** మునిసిపల్ రోడ్డు-110.0 చ॥అడుగులు.
పై నాలుగు హద్దుల మధ్యగల విస్తీర్ణం 1605 చ॥గ॥లు లేక 1341.94 చ॥మీ॥లలోని అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భాగము 59 చ॥గ॥లు లేక 49.33 చ॥మీ॥ల స్థలం.
షెడ్యూల్ బి:- షెడ్యూల్ ఎ లోని నిర్మించబడిన యస్ & వి టవర్స్, నందమూరి నగర్, అజిత్‌సింగ్ నగర్, సమీప డోర్ నెం.43-106/1-58, 4వ అంతస్థు, ఫ్లాట్ నెం.501, ప్లింత్ ఏరియా 1113 చ॥అడుగులు, కామన్ ఏరియా 180 చ॥అడుగులు మరియు కారు పార్కింగ్ 100 చ॥అడుగులు శ్రీమతి ఇంజమూరి వెంకట సునీత, భర్త: ఇంజమూరి వెంకటేశ్వరరావు గారికి చెందిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం.11240/2018, తేది:12-10-2018నకు **హద్దులు: తూర్పు:** ఫ్లాట్ నెం.506, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** మెట్లు.
శ్రీమతి ఇంజమూరి వెంకట సునీత, భర్త: వెంకటేశ్వరరావు మరియు శ్రీ ఇంజమూరి వెంకటేశ్వరరావు, తండ్రి: భాస్కరరావు,మీకు బ్యాంకు వారు మంజూరు చేసిన ఋణసౌకర్యం నిమిత్తం పైన ఉదహరించిన స్థిరాస్తులను తనఖా ఉంచినారు. పైన పేర్కొనబడిన చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద **ది.05-10-2024న తేదీన డిమాండ్ నోటీసును** బ్యాంకుచే మీకు జారీచేయడమైనది. కానీ జారీ చేసిన నోటీసును ఋణగ్రహీత/(లు) స్వీకరించనందున **ఈ పత్రికా ప్రకటన జారీచేయడమైనది.** బ్యాంకు వారు జారీచేసిన షరతులు మరియు నిబంధనలు పాటించుటలో మీరు విఫలమైనందున ఖాతా క్రమము తప్పి ఆర్.బి.ఐ మార్గదర్శకాల ప్రకారం ఎన్.పి.ఎగా (మొండిబకాయి) వర్గీకరించబడినది. సదరు పైన తెలిపిన ఋణమొత్తము మరియు ఒప్పందపరమైన వడ్డీ ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 దినములలో తిరిగి చెల్లించవలసినదిగా మిమ్మల్ని కోరడమైనది. లేనియెడల ఎటువంటి తదుపరి ప్రకటన లేకుండా సెక్షన్ 13(4) క్రింద పైన తెలిపిన సెక్యూరిటీపై SARFAESI చట్టం, 2002 లోని నిబంధనలు అమలు చేసేందుకు, చర్యలు చేపట్టుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అగు దిగువ సంతకందారునకు అధికారం కలదు. ఉద్దేశించబడిన చట్టంలో మరియు లేదా అమలులో ఉన్న ఏ చట్టం క్రింద మాకు లభించే ఏ ఇతర హక్కులకు భంగం కలుగకుండా ఇవి జారీచేయడమైనది.

తేది : 14-10-2024
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

కానిస్టేబుళ్లకు గాయాలు

బందోబస్తుకు వెళ్లొస్తుండగా ప్రమాదం

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జూపూడి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. అజిత్‌సింగ్‌నగర్, పటమట పోలీస్‌స్టేషన్లలో పనిచేసే కోటేశ్వరరావు, కృష్ణలకు వత్సవాయి వద్ద దసరా ఉత్సవాల బందోబస్తు విధులు వేశారు. సోమవారం వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై వత్సవాయి నుంచి విజయవాడకు వస్తున్నారు. జూపూడిలోని సెవంత్ డే స్కూలు వద్దకు రాగానే.. రోడ్డుపై నిలిపి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టారు. వీరిద్దరికీ బలమైన గాయాలయ్యాయి. వెంటనే వీరిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. నగరానికి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న వత్సవాయికి బందోబస్తు నిమిత్తం విజయవాడ నుంచి సిబ్బందిని పంపించడంపై పోలీస్ వర్గాల నుంచి ఒకింత వ్యతిరేకత వ్యక్తమైంది.

'బాధిత రైతులకు రుణమాఫీ చేయాలి'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఈ ఏడాది పంట రుణాలు తీసుకున్న వరద బాధిత రైతులకు రుణమాఫీ చేయాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రైతు సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంద, పసుపు రైతులకు ప్రభుత్వ సహాయం ఎకరానికి రూ.14వేల చొప్పునే అందిందని చెప్పారు. వాస్తవానికి ఖర్చు ఇంకా ఎక్కువైందని పేర్కొన్నారు. భూ యజమానుల సంతకం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. లంక భూములు, ఇతర భూముల్లో పేరుకుపోయిన ఇసుక, బురద, మట్టిని ప్రభుత్వ వ్యయంతోనే తొలగించాలని డిమాండ్ చేశారు. తిరిగి పంటలు వేసుకోవడానికి విత్తనాలు, ఎరువులు, రుణ సదుపాయం కల్పించాలన్నారు. రైతు సంఘం నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ.. కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఈ నెల 29న వ్యవసాయ రంగం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాలో లేపాక్షి నాలెడ్జ్ పార్క్, కడపలో బ్రాహ్మణి స్టీల్, విమానాశ్రయం కోసం రైతుల నుంచి బలవంతంగా భూములు సేకరించారని ఆరోపించారు. బాధితులకు న్యాయం చేయాలని, ప్రభుత్వానికి భూములు అవసరం లేకపోతే రైతులకు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య మాట్లాడుతూ.. ఈ ఏడాది వరద బాధితుల్లో వాస్తవ పంట సాగుదారులైన కౌలు రైతులకు నష్టపరిహారం అందలేదని పేర్కొన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సర్వేలో కౌలు రైతులను నమోదు చేయకుండా.. సాగుచేయని, పెట్టుబడి పెట్టని భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు డి.హరనాథ్, ఎం.వెంకటరెడ్డి, ఎం.హరిబాబు, యు.వీరబాబు, చల్లపల్లి విజయ, మరీదు ప్రసాద్‌బాబు, కోగంటి ప్రసాద్, కోటయ్య, కాసాని గణేష్ బాబు, జి.వి.రంగారెడ్డి, ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు. పక్కన కేశవరావు, ఈశ్వరయ్య, జమలయ్య తదితరులు

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

మిద్దె తోట.. ఆరోగ్య బాట



కరెన్సీనగర్, న్యూస్‌టుడే

ప్రస్తుతం మిద్దె తోటకు ప్రాధాన్యం పెరుగుతోంది. స్థలం కొరత నేపథ్యంలో మిద్దెలపై సేంద్రియ విధానంలో పంటల సాగుకు నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు. ఆ కోవకు చెందినవారే విజయవాడ భారతీనగర్‌కు చెందిన ధవళేశ్వరపు నాగలక్ష్మి. ఆమె సొంతూరు ఆకివీడు. భర్త భాస్కరరావు బ్యాంకు మేనేజరు కావడంతో విజయవాడ వచ్చారు. 1987లో కాలనీలో స్థలం కొని ఇల్లు కట్టించుకున్నారు. కొంత భాగం పెరటిగా వాడారు. 2000లో ఆ స్థలంలో పనివాళ్ల కోసం షెడ్డు వేశారు. దాంతో పెరటి సాగు మిద్దెపైకి చేరింది. తాత నూకరాజు స్ఫూర్తితో సాగుపై దృష్టి పెట్టారు. అబ్బాయి, అమ్మాయి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కావడంతో మొక్కల పెంపకానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు.

డాబాపై అడుగు ఎత్తున ఇనుప చట్రాలు బిగించారు. వాటిపై కుండీలు పెట్టారు. ఇనుప పైపులు పెట్టి వాటికి పందిరిలా తీగలు చుట్టారు. కుండీల్లో మట్టి, ఎండిన ఆకులు, కూరగాయల వ్యర్థాలు పొరలు వేశారు. పది రోజుల తర్వాత వాటిలో మొక్కలు పెట్టి జీవామృతం, పంచగవ్యం, పిడకలు వేసి సరిపడా నీళ్లు పోస్తున్నారు. క్రిమికీటకాలు వాలకుండా, తెగుళ్లు రాకుండా మాగిన పండ్లు, బెల్లం తదితరాలతో తయారు చేసిన ద్రావణం, వేప నూనె, దశపత్ర కషాయాన్ని మొక్కలపై పిచికారీ చేస్తున్నారు. ట్రాప్ విధానంతో పురుగుల ఆకర్షించి చంపుతున్నారు.


మిద్దెపై పందిరి, కింద కుండీల్లో కాయగూరలు

పండించేవి ఇవే..

కాకర, సొర, పొట్ల, బీర, చిక్కుడు, దోస, తీగ బచ్చలి, వంగ, టమాటా, పచ్చిమిర్చి పండిస్తున్నారు. చామంతి, ఆస్టర్, మల్లి, సంపెంగ, ఆడీనియం, మందార, బంతి, గులాబీ, లిల్లీ పూల మొక్కలు వేశారు. కొండపిండాకు, తమలపాకులు, నేల వేము, బిళ్లగన్నేరు, గోంగూర, తోటకూర, పాలకూర, చుక్కకూర, పుదీనా, పొన్నగంటి కూర, బచ్చలి, కొత్తిమీర, కరివేపాకు సాగు చేస్తున్నారు. మామిడి, బత్తాయి, జామ, దానిమ్మ, ద్రాక్ష పండిస్తున్నారు. సేంద్రియ సాగుతో పండించిన కూరగాయలు, ఆకుకూరలతో ఆరోగ్యానికి మేలని ఆమె వివరిస్తున్నారు.

గ్రీన్‌హౌస్ సాగు చేస్తా

టీవీకి, ముచ్చట్లకు బానిస కాకుండా మొక్కలతో జీవనం ఆనందంగా ఉంటుంది. 'వన్ ఎర్త్..వన్ లైఫ్' సంస్థ సహకారం తీసుకుంటున్నా. ఇటీవల 'ఇన్వైట్ యువర్ కమిషనర్' కార్యక్రమానికి ఎంపికయ్యా. కమిషనర్ ఇచ్చిన రూ.పది వేలను ఆ సంస్థకే ఇచ్చేశాను. మిద్దె సాగుతో 1-2 డిగ్రీల ఉష్ణోగ్రత ఇంటిలో తగ్గుతుంది. సొంతంగా అంటుకట్టడం నేర్చుకొని ఒకే మొక్క నుంచి టమాటా, వంగ పండించా. గ్రీన్ హౌస్ సాగు చేయాలని ఉంది. 2011లో 'ఈనాడు-వసుంధర' నిర్వహించిన 'మాతృమూర్తుల...దీవెన' కార్యక్రమంలో ట్రోఫీతో పాటు రూ.15 వేల నగదు పురస్కారం అందుకున్నా. ఈ ఏడాది జనవరిలో విజయవాడ రోజ్ సొసైటీ నిర్వహించిన పోటీల్లో అవార్డు కైవసం చేసుకున్నా.

– నాగలక్ష్మి ధవళేశ్వరాపు





ప్రశ్న: టమాట పంటలో నీటి యాజమాన్యం, పచ్చదోమ నివారణ చర్యలు తెలపండి? – కె.శ్రీనివాసరావు, మల్లంపల్లి

సమాధానం: టమాట పంటను సంవత్సరం పొడవునా అన్ని రుతువుల్లో పండిస్తారు. అధిక దిగుబడికి శీతాకాలం అనువైనది. భూమిలో తేమను బట్టి 7-10 రోజుల వ్యవధిలో నీరు పెట్టాలి. వేసవిలో ప్రతి 5-6 రోజులకు ఒకసారి తడి అవసరం ఉంటుంది. పచ్చదోమ ఆకుల అడుగు భాగం నుంచి రసాన్ని పీల్చడం వలన ఆకుల చివర్లు పసుపు పచ్చగా మారి క్రమేపీ ఆకు ఎర్రబడి చివరగా ముడుచుకుని దోనెలలాగ కనిపిస్తాయి. నివారణకు ఐమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం
– ఘంటసాల, న్యూస్‌టుడే

ఈతల మధ్య అంతరాన్ని తగ్గిస్తే పాడి లాభదాయకం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

ఏడాదికో దూడ లక్ష్యంతో పశుపోషణ లాభదాయకంగా ఉంటుందని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఆ లక్ష్య సాధనకు అనుసరించాల్సిన పద్ధతులను ఇబ్రహీంపట్నం పశు వైద్యశాల వైద్యాధికారి మోహన్‌కృష్ణ వివరించారు.

★ పశుపోషణలో మంచి జాతులను ఎన్నుకోవడం, ఈతల మధ్య అంతరం తగ్గించుకోవడం, శాస్త్రీయ పద్ధతిలో సమీకృత దాణా, మేలైన పశుగ్రాసాలను వాడితే లక్ష్యాన్ని సాధించవచ్చు.

★ పశువు చూడితో ఉన్నప్పుడు ఏడో నెల నుంచి రోజూ రెండు కిలోల సమీకృత దాణా, 50 గ్రాముల మిక్చర్, 20 నుంచి 30 కిలోల సూపర్ నేపియర్ లాంటి మేలైన పశుగ్రాసాన్ని పశువులకు అందించాలి.

★ శుభ్రమైన వాతావరణంలో పెంచితే పశువు ఈనిన తర్వాత 45 రోజుల నుంచి 90 రోజుల వ్యవధిలో మొదటి ఎదకు వస్తుంది. అప్పుడు పొర్లిస్తే చూలు కట్టే అవకాశం 60 నుంచి 70 శాతం వరకు ఉంటుంది.

★ పశువు చూలు కట్టిన తరువాత ఏడెనిమిది నెలల వరకు ఉదయం సాయంత్రం 8 నుంచి 10 లీటర్ల పాలు ఇస్తుంది. ఏడాదికొక దూడ ఉత్పత్తి అవుతూ పశువు జీవితం కాలంలో (సుమారు 15 సంవత్సరాలు) ఎక్కువ పాలు ఉత్పత్తి చేస్తుంది. ఒక ఈతకు సుమారు రెండు వేల లీటర్ల పాల ఇచ్చే అవకాశం ఉంటుంది.

★ ఎక్కువ మంది పశుపోషకులు ఈతల మధ్య అంతరాన్ని ఒకటిన్నర సంవత్సరాల నుంచి రెండున్నర సంవత్సరాలుగా చూస్తున్నారు. ఫలితంగా పాడి నష్టదాయకంగా మారుతోంది. ఈతల మధ్య అంతరాన్ని ఆవుల్లో సంవత్సరానికి, గేదెల్లో 15 నెలలకు తగ్గించుకోవచ్చు. పై సూచనలు, యాజమాన్య పద్ధతులు పాటించి పశుపోషణ చేసుకున్నట్లయితే పాడి లాభదాయకంగా ఉంటుంది.



ఎండీఎస్ 'స్పెషల్ స్ట్రే' ఖాళీలకు ఆప్షన్లు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే : ఈ విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని దంత వైద్య కళాశాలల్లో మొదటి, రెండో, మూడో స్ట్రే వేకెన్సీ కౌన్సెలింగ్‌ల అనంతరం మిగిలిన ఎండీఎస్ కన్వీనర్, యాజమాన్య సీట్ల ప్రవేశానికి ఆప్షన్లు పెట్టుకోవాలని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం ప్రకటన జారీ చేసింది. తగ్గించిన కటాఫ్ మార్కులతో అర్హత కలిగిన అభ్యర్థులు ఈ సోమవారం (14వ తేదీ)రాత్రి 8 గంటల నుంచి 16వ తేదీ రాత్రి 8 గంటల వరకు ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుంది. కన్వీనర్ కోటా కింద మొత్తం 29 సీట్లను అందుబాటులో ఉంచగా, యాజమాన్య కోటా సీట్ల కింద 43 సీట్లను సీట్ మ్యాట్రిక్స్‌లో పొందుపర్చారు. అభ్యర్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలంటే 89787-80501, 79977-10168కు ఫోన్ చేయవచ్చు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 91699 22299.

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్‌కు, షుగర్‌కు. విజయవాడ:- శ్రీ శరణం లాడ్జి, పాత బస్టాండ్ ఎదురుగా, బందర్ రోడ్, ప్రతీ నెల 2, 16 తేదీల్లో మందులు.

REAL ESTATE

PLOT FOR SALE

హరివిల్లు వారి 15వ 50ఎకరాల మెగా హౌసింగ్ ప్రాజెక్ట్ VJA 20 ని॥ దూరంలో న్యూ బైపాస్‌కి 1kmలో ఇంటి నిర్మాణానికి అనువైనది. నెప్పలి కంకిపాడులో. ✆ 95507 63551.

VJA, **రాజధాని** అమరావతి, మంగళగిరి, గన్నవరం, బందరురోడ్డు, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ., సున్న సూజి వీడు రోడ్డు, కంచికచర్లలో DTCP & APCRDA ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 12,900/- సంప్ర: 73372 42575.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

TO LET

COMMERCIAL

Centrally located area of 2000 Sq.Ft in Gannavaram, 100 Mts National Highway, ground floor, besides SBI, suitable for hospitals, showrooms, financial institutions, software, offices, any commercial use. contact:- 9010189888, 8919322073

మచిలీపట్నం Axis Bank ఎదురుగా క్రింది షాపు అద్దెకు కలదు & పైన షాప్స్ అవసరమునుబట్టి ఫ్యామిలీ పోర్షన్‌గా ఉపయోగపడును. ఫోన్: 98665 02268.

JOBS

Need field experienced, Agriculture B.Sc graduate, age below 30, to work in Coconut fields, Near Kanchikacherla. Send resume by WhatsApp to: 9502393999.

Wanted Delivery Staff for Courier @ Vijayawada, Sal: 13K+ Incentives+ Fuel+ PF+ ESI, Full/Part. Ph: 7207218218, 8500011789

విజయవాడ, ఆటోనగర్‌లో ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గం॥ డ్యూటీ, జీతం: 12,000, PF+ESI. ✆ 98664 07345.

విజయవాడ మెట్రోపాలిటిన్ హోటల్ వారికి స్టాఫ్ కావలెను. ఎలక్ట్రీషియన్ ★ డ్రైవర్స్ ★ సెక్యూరిటీ గార్డ్స్ ★ హౌస్ కీపింగ్ బాయ్స్ ★ వెయిటర్స్ ★ ఆకర్షణీయమైన జీతం. సంప్ర. ✆ 72888 85598.

Vasree Boutique మచిలీపట్నం నందు Tailoring Master కావలెను. Contact: 70751 64344

కీర్తిఫైనాన్స్, బావాజీపేట, 1వ లైన్ విజయవాడ నందు పనిచేయుటకు అనుభవం కలిగి, 2 వీలర్ ఉన్న రికవరీ ఎగ్జిక్యూటివ్ కావలెను. ✆ 92469 22778, 91337 32888.

విజయవాడలో కొరియర్ డెలివరీ సిబ్బంది కావాలి. నెలకు 15,000 జీతం+ ఇంధన చార్జీలు. 2 వీలర్ మరియు లైసెన్స్ తప్పనిసరి. ✆ 7981768909, 9246286660.

ప్రముఖ ఆటోఫైనాన్స్ ఆఫీస్ నందు అనుభవం కలిగిన కంప్యూటర్ ఆపరేటర్, టెలీకాలర్ (లేడీ) మరియు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ (మగ) కావలెను. ✆ 99495 58181.

ప్రముఖ బ్యూటీ పార్లర్ నందు వర్క్ చేయుటకు బ్యూటీషియన్స్ మరియు అసిస్టెంట్ బ్యూటీషియన్స్ కావలెను. VMC కాలనీ, బెంజిసర్కిల్, VJA. ✆ 92464 01775, 99660 95915.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మూడు ఆలయాల్లో కానుకల లెక్కింపు

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణంలో మూడు దేవాలయాల్లో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను దేవాదాయ శాఖ అధికారులు సోమవారం లెక్కించారు. ఆరు నెలల కాలానికి సంబంధించి వేంకటాచల స్వామి దేవస్థానానికి రూ.3,00,425, రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రూ.58 వేలు, చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానానికి రూ.41,097 ఆదాయం లభించినట్లు ఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. దేవాదాయ శాఖ గన్నవరం తనిఖీ అధికారిణి కె.అనూరాధ కానుకల లెక్కింపు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి

మైలవరం, న్యూస్‌టుడే: ఎక్సైజ్ మైలవరం సర్కిల్ పరిధిలోని 10 మద్యం దుకాణాలకు సంబంధించిన లాటరీ ప్రక్రియలో దుకాణాల కేటాయింపు పూర్తి చేసినట్లు ఎక్సైజ్ సీఐ జె.శ్రీనివాస్ తెలిపారు. మైలవరంలో నాలుగు దుకాణాలను జి.పి.నాగరాజు, వీరమణి ఏరోలు, ధనేకుల శ్రీకాంత్, చారుగుండ్ల ప్రసాదులు, జి.కొండూరు మండలంలోని నాలుగు దుకాణాలను కె.అంజిరెడ్డి, రావిపూడి శ్రీనివాసరావు, పలగాని సూర్యగౌడ్, అంత్యం సుబ్బరాజులు, రెడ్డిగూడెం మండలంలోని రెండు దుకాణాలను గుర్రాల శ్రీనివాసరెడ్డి, తురక అంకరాజు తదితరులు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. నూతన దుకాణాలను ఈ నెల 16 నుంచి ప్రారంభిస్తామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

? మైలవరం శాంతినగర్ ఏరియాలో పంచాయతీ నీటి సరఫరా జరగక ఇబ్బందిగా ఉంది. పైపులైను మరమ్మతులు చేయాల్సి ఉంది. **- వెంకటేశ్వరరావు, మైలవరం**

✔ ప్రతిపాదనలు పూర్తి చేశాం. త్వరలోనే నూతన పైపు లైను వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
- ఎండీ రఫీ, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, మైలవరం

? కొండపల్లి బ్యాంకు కాలనీ రాయల్ స్టూడియో ఎదురుగా రహదారి ఛిద్రమైంది. దీంతో నిత్యం అనేక మంది ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారు.
- రాంబాబు, స్థానికుడు

✔ సిమెంటుతో దానిని సరి చేయిస్తాం.
- పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ

– న్యూస్‌టుడే, కొండపల్లి

గ్రామాల్లో అభివృద్ధి పండగకు శ్రీకారం



అన్నేరావుపేట గ్రామంలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్, పక్కన నాయకులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రెడ్డిగూడెం మండలంలో 10,098 మీటర్లు పొడవునా రహదారి అభివృద్ధి పనులకు రూ.5 కోట్లు మంజూరైనట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. సోమవారం రెడ్డిగూడెం మండలంలో 'పల్లె పండగ' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పలు గ్రామాల్లో రహదారులు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముచ్చనపల్లి, మద్దులపర్వ, అన్నేరావుపే, రెడ్డిగూడెం, రంగాపురం, నాగులూరు, రుద్రవరం గ్రామాల్లో రహదారులు అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), రెడ్డిగూడెం తెదేపా మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి, నాయకులు కె.విజయబాబు, జె.వేణుగోపాలరెడ్డి, ఆర్.వీరాస్వామి నాయుడు, పి.కిరణ్‌కుమార్‌రెడ్డి, కె.అశోక్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విస్సన్నపేటలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, పక్కన అధికారులు, నాయకులు తదితరులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో గ్రామాలను అభివృద్ధి చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగు పరచడమే లక్ష్యంగా 'పల్లె పండగ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు వెల్లడించారు. మండలంలోని కొండపర్వ, విస్సన్నపేట, తాతకుంట్ల, నరసాపురం, మారెమండ, లంబాడి తండా, చంద్రుపట్ల, తెల్లదేవరపల్లి, కలగర, కొర్లమండ, వేమిరెడ్డిపల్లి, పుట్రేల గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే సిమెంట్ రహదారుల నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. 'పల్లె పండుగ' ద్వారా సీసీ రోడ్లు నిర్మాణానికి ప్రభుత్వం మండలానికి రూ.5 కోట్లు విడుదల చేయగా ప్రాధాన్యతాక్రమంలో గ్రామాలకు కేటాయించామన్నారు. ఎంపీపీ వి.ఎం.వనజాక్షి, ఎంపీడీవో చిన్నరాట్నాలు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

మైలవరం మండలంలో ..

మైలవరం, న్యూస్‌టుడే: 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించే శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొంటారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 8.30 గంటలకు మైలవరం, 9.30 గంటలకు పొందుగల, 10.30 గంటలకు మొర్సుమిల్లి, 11.15 గంటలకు పుల్లూరు, 12 గంటలకు చంద్రగూడెంలో పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నాయి.

గంపలగూడెం మండలంలో..

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని నెమలి, ఉమ్మడిదేవరపల్లి, కొణిజెర్ల, ఊటుకూరు, తునికిపాడు, దుందిరాలపాడు, పెనుగొలను, చింతలనర్వ, మేడూరు, పెదకొమిర గ్రామాల్లో మంగళవారం 'పల్లె పండగ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్డీ డి.బాబూరావు తెలిపారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో మంజూరైన నిధులతో నిర్మించే సిమెంట్ రహదారులకు శంకుస్థాపన చేస్తారన్నారు.

వాహనం కొనుగోలుకు రూ.లక్ష విరాళం



తోసా సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని పోతుల చెరువు వద్ద తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం (తోసా) ఆధ్వర్యంలో నిర్మించిన స్వర్గపురికి భౌతిక కాయం తరలించేందుకు అవసరమైన వాహనం కొనుగోలుకు స్థానికులు దారా వెంకట గురునాధరావు, కస్తూరి, దారా సీతారామ్మూర్తి, సుశీల దంపతుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం అందజేశారు. దాతలు దారా లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, హరిబాబు, రాధాకృష్ణ, జగన్నాథం విరాళాన్ని సోమవారం తోసా సభ్యులకు అందజేశారు. దాతలకు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించండి



ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అధ్యాపకుల నిరసన

తిరువూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కోరుతూ స్థానిక కళాశాల వద్ద సోమవారం అధ్యాపకులు ఆందోళన చేశారు. గత వైకాపా పాలనలో నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జీవో నంబరు 114 ప్రకారం ఒప్పంద అధ్యాపకులను మోసగించారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం తమ వినతిపై సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఆందోళనలో భాగంగా 19వ తేదీ వరకు పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరవుతామని ఏపీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం స్థానిక నాయకులు కె.నగేష్, ఎం.బాబు, కె.రాంబాబు, తిరుపతిరావు తదితరులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌జీఎన్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

బకాయిలు విడుదల చేయాలి

ఎన్టీటీపీఎస్(ఇబ్రహీంపట్నం), న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి విద్యుత్తు కార్మికులు వెట్టి చాకిరీకే పరిమితమయ్యారని ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ సభ్యులు పేర్కొన్నారు. ఎన్టీటీపీఎస్ ప్రధాన ద్వారం ఎదుట పోస్ట్ కార్డు ఉద్యమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18, 19 తేదీల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తూ విధులకు హాజరవుతామని తెలిపారు. 16 నెలల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికులకు ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో షేంషేర్ వలీ, సీహెచ్ చంద్రశేఖర్, కుమార్, నాగేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీటీపీఎస్ ప్రధాన ద్వారం వద్ద వర్కర్స్ యూనియన్ సభ్యుల నిరసన

భక్తిశ్రద్ధలతో బతుకమ్మల నిమజ్జనం



గంపలగూడెం: ఊటుకూరులో బతుకమ్మలను నిమజ్జనానికి తరలిస్తున్న మహిళలు



జి.కొండూరులో అమ్మవారి ఊరేగింపు



కొండపల్లి: బొడ్డురాయి కూడలి వద్ద అన్నదానం



రెడ్డిగూడెంలో బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి వెళ్తున్న మహిళలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి వేడుకలు పురస్కరించుకొని గ్రామాల్లో మహిళలు ఏర్పాటు చేసిన బతుకమ్మలను సోమవారం గ్రామాల్లో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి బతుకమ్మ భక్తిపాటలు ఆలపిస్తూ గ్రామాల ప్రధాన వీధుల్లో ప్రదర్శన చేసి నిమజ్జనం చేశారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దసరా ఉత్సవాలు సందర్భంగా 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజించిన బతుకమ్మలను మహిళలు కోలాట ప్రదర్శనతో భక్తి పాటలతో సమీప వాగుల్లో నిమజ్జనం చేసేందుకు తరలించారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: శరన్నవరాత్రుల సందర్భంగా కొండపల్లి బొడ్డురాయి కూడలిలో అమ్మవారి ప్రసాదం పంపిణీ సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జి.కొండూరు: స్థానిక బీసీ కాలనీలో దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీకనకదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని సోమవారం గ్రామ వీధుల్లో ప్రత్యేక వాహనంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీపై వివాదం

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ మార్పు వివాదాస్పదమైంది. సోమవారం పాఠశాల విద్యా కమిటీ నిర్వాహకులతో పాటు పలువురు నాయకులు పాఠశాలకు వెళ్లి ఏజెన్సీని మార్చాలంటూ ప్రధానోపాధ్యాయురాలిని డిమాండ్ చేయడంతో వివాదం పెరిగింది. వంట ఏజెన్సీకి మద్దతుగా సీపీఎం నాయకులు పాఠశాలకు చేరుకుని నాయకుల తీరును తప్పుపట్టారు. దీర్ఘకాలంగా మైలవరానికి చెందిన మహిళా సంఘం ఆధ్వర్యంలో పథకాన్ని నిర్వహిస్తుండగా, ఇటీవల ఆ ఏజెన్సీని మార్చాలంటూ నూతనంగా ఎంపికైన పాఠశాల విద్యా కమిటీ ద్వారా తీర్మానించారు. అయితే ఏజెన్సీ తప్పుకుంటే తప్ప మార్చే నిబంధనలు లేవని ప్రధానోపాధ్యాయురాలు చెప్పడంతో గత నెలలో చర్చలు వాయిదా పడ్డాయి. సోమవారం ఇదే విషయమై నాయకులు ఉపాధ్యాయుల వద్దకు వెళ్లగా, సమాచారం తెలుసుకుని ప్రస్తుత వంట ఏజెన్సీ నిర్వాహకులకు మద్దతుగా సీపీఎం నాయకులు పాఠశాలకు చేరుకున్నారు. దీంతో ప్రధానోపాధ్యాయురాలు, కొందరు ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖాధికారికి విషయాన్ని తెలియజేశారు. దీర్ఘకాలంగా పాఠశాలల్లో ఏజెన్సీ నిర్వహిస్తున్న వారిని తొలగించాలని వివాదం రేపుతున్నారని, ఏజెన్సీ నిర్వహించే మహిళలకు తాము అండగా ఉంటామని సీపీఎం మండల కార్యదర్శి చాట్ల సుధాకర్ పేర్కొన్నారు. వివాదంపై ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మిని, సంప్రదించగా ఏజెన్సీ మార్పు డిమాండు విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకెళ్లామని, విద్యా కమిటీ తీర్మానంతో మార్పు కుదరదని డీఈవో స్పష్టం చేసినట్లు వెల్లడించారు. అదే విషయాన్ని కమిటీకి తెలుపుతామని వివరించారు.



రామకృష్ణనాయక్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందిస్తున్న నరసింహారావు, వీరాస్వామి

ఎంపీడీవోకు అభినందనలు

ఇటీవల బదిలీపై వచ్చి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన బి.వి.రామకృష్ణ నాయక్‌ను సోమవారం ఆయన కార్యాలయంలో ఎంఈవో-1 వీవీ నరసింహారావు, ఎంఈవో-2 ఎం.వీరాస్వామి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

– న్యూస్‌టుడే, జి.కొండూరు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని నెమలి, కొణిజెర్ల, ఊటుకూరు, ఉమ్మడిదేవరపల్లి, గాదెవారిగూడెం, చింతలనర్వ గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డిస్కం ఏఈ వి.జగదీష్ తెలిపారు.

మధిర శాఖ కాల్వకు 841 క్యూసెక్కుల సాగర్ జలాలు



23వ కి.మీ నియంత్రిక వద్ద ప్రవహిస్తున్న నీరు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పల బంధం నియంత్రిక నుంచి సోమవారం ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు 841 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలయ్యాయని ఏఈ మహేష్ తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 322 క్యూసెక్కులు చేరాయన్నారు. దిగువున మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు 40, పెదకొమిర 20, మధిర 20, నిదానపురం 40 క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఆయకట్టు రైతులు కాల్వలకు సరఫరా చేస్తున్న సాగర్ జలాలను పంటలకు నీటి తడులు అందించేందుకు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



జెండా ఊరేగింపులో ముస్లింలు

ఇబ్రహీంపట్నంలో గ్యార్మీ పండగ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: పశ్చిమ ఇబ్రహీంపట్నంలో గ్యార్మీ పండగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గౌసే అజం చిహ్నమైన జెండాకు ఊరేగింపు నిర్వహించారు. పశ్చిమ ఇబ్రహీంపట్నం మసీదు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముస్తఫా, కరీముల్లా, షేక్ దావూద్, గోరే తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి

మైలవరం, న్యూస్‌టుడే: మానవహక్కుల నేత ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతిపై మైలవరం బార్ అసోసియేషన్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం బార్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పౌరహక్కుల పరిరక్షణకు ఆయన కృషి చేశారని వక్తలు కొనియాడారు. సీనియర్ న్యాయవాదులు పీవీ శేషగిరిరావు, పి.రామకృష్ణ, బార్ నాయకులు ఏడీ ప్రసాద్, వీటీ కిషోర్, రమేష్‌బాబు, సత్యనారాయణరావు, వెంకటరావు, ఆంజనేయులు, శ్రీనివాసరావు, శరత్‌బాబు, తనూజ్ తదితరులు పాల్గొన్నారు.



బార్ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

ఇండియన్ బ్యాంక్

పుట్రేల రోడ్, విస్సన్నపేట శాఖ, ఫోన్: 99122 23844

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింది తెలుపబడిన వ్యక్తులు మా శాఖ నందు బంగారు ఆభరణములు తాకట్టుపెట్టి ఋణము పొంది గడువు తీరిన మీదట నోటీసులు పంపించినప్పటికి సదరు ఋణములు తీర్చనందున మాకు తాకట్టుపెట్టిన ఆభరణములు ది. 28-10-2024 సోమవారం గం॥ 3-00 ని॥లకు బహిరంగంగా మా శాఖ ఆవరణలో వేలం వేయుటకు నిర్ణయించడమైనది. వేలం షరతులు ఇతర వివరముల కొరకు బ్రాంచి మేనేజరు గారిని సంప్రదించవచ్చును. వేలం తేది మార్చుటకు గాని నిలిపివేయుటకు గాని మాకు సర్వాధికారములు కలవు. వేలం తరువాత బాకీ ఇంకను తీరనియెడల వారిపై కోర్టు ద్వారా చర్యలు తీసుకొనబడును.

వ నెం.	బంగారం లోను ఖాతా నెంబరు	బాకీదారుని పేరు మరియు చిరునామా	మొత్తం బంగారం గ్రాముల్లో
1)	7613636814	శ్రీ తుమ్మల బ్రహ్మయ్య, S/o. కోటయ్య, డోర్ నెం.5-19 మెయిన్‌రోడ్, తాతకుంట్ల, విస్సన్నపేట.	197.30
2)	7613834362	శ్రీ తుమ్మల బ్రహ్మయ్య, S/o. కోటయ్య, డోర్ నెం.5-19 మెయిన్‌రోడ్, తాతకుంట్ల, విస్సన్నపేట.	175.40
3)	7614034885	శ్రీమతి తుమ్మల విజయకుమారి, W/o. బ్రహ్మయ్య డోర్ నెం.5-19, మెయిన్‌రోడ్, తాతకుంట్ల, విస్సన్నపేట.	171.40
4)	7326311315	శ్రీమతి తుమ్మల విజయకుమారి, W/o. బ్రహ్మయ్య డోర్ నెం.5-19, మెయిన్‌రోడ్, తాతకుంట్ల, విస్సన్నపేట.	144.40

తేదీ: 14-10-2024 సం/- బ్రాంచి మేనేజరు, విస్సన్నపేట శాఖ

జాతీయ రహదారిపై అంధకారం

జి.కొండూరు, న్యూస్‌టుడే

ఇబ్రహీంపట్నం నుంచి ఛత్తీస్‌గడ్ వెళ్లే నంబరు-30 జాతీయ రహదారిపై క్రాస్‌రోడ్లు ఉన్న చోట్ల వీధిదీపాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా జి.కొండూరు-పినపాక, జి.కొండూరు-ఆత్కూరు, చెవుటూరు క్రాస్ రోడ్ల సమీపంలో వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. దీంతో జాతీయ రహదారి ఏర్పడిన తర్వాత తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా ఈ క్రాస్‌రోడ్ల వద్ద పోలీసులు వేగ నియంత్రణకు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు వీధి దీపాలు లేకపోవడంతో కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.



జి.కొండూరు ఆత్కూరు వద్ద ఇలా..

★ ఆత్కూరు క్రాస్‌రోడ్డు వద్ద గతంలో ఓ ద్విచక్ర వాహనదారుడు పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఢీకొట్టి గాయపడ్డాడు.

★ ఇటీవల చెవుటూరు బైపాస్‌లో గ్రామంలోని నుంచి వచ్చే రోడ్డు కలిసే చోట దీపాలు లేకపోవడంతో అర్ధరాత్రి దాటిన తరువాత ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

★ చిన్న చిన్న ప్రమాదాలు కావడంతో పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు కావడం కూడా తక్కువే. ఇప్పటికైనా జాతీయరహదారి, ర.భ రహదారి అధికారులు సమన్వయంతో ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా నిర్లక్ష్యం



వీధిదీపాలు లేని జాతీయ రహదారి క్రాస్‌రోడ్డు

★ ఈ విషయమై జాతీయ రహదారి సంబంధిత అధికారి లతను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వీధిదీపాలు ఏర్పాటు తమ పరిధి కాదని, ర.భ అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. ర.భ అధికారి వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో రాలేదు.

పట్టభద్రులు ఆలోచనతో ఓటు వేయండి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని పట్టభద్రులు గమనించి ఓటు వేయాలని కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతమ్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన పట్టభద్రుల పరిచయ వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వ పాలనను మూడు నెలలుగా అందరూ చూశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

నాయకత్వ లక్షణాలతో బహుముఖ లాభాలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : మహిళా సాధికారతకు పెద్దపీట వేసే పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ(మెప్మా)కు సారథ్యం వహించే టీఎల్ఎఫ్(పట్టణ సమాఖ్య) ప్రతినిధులకు నాయకత్వ లక్షణాలు ఉండాలని స్టేట్ రిసోర్స్‌పర్సన్ కర్లపాటి శ్రీనివాసరావు సూచించారు.

సంచార జాతులను ఆదుకోవాలి

జగ్గయ్యపేట గ్రామీణం: సంచార జాతుల విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులే కూటమి ప్రభుత్వం కూడా చేస్తుందని సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని చిల్లకల్లులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

హోమ్ లోన్ సెంటర్-1 (ఆర్‌ఏసీపీసీ-1), కె.కె.టవర్స్, మొదటి అంతస్థు, యం.జి.రోడ్డు, విజయవాడ-520 010, యన్‌టీఆర్ జిల్లా.

ఇ-వేలం ద్వారా వాహనముల అమ్మకం

ఈ దిగువ ఉదహరించిన ఖాతాదారు మా బ్యాంకు నుండి వాహనములు కొనుగోలు నిమిత్తం లోను సౌకర్యమును పొందియున్నారు. బ్యాంకుకు చెల్లించవలసిన వాయిదాలను సక్రమంగా చెల్లించనందున బ్యాంకు వారు వాహనములను స్వాధీనం చేసుకొని "యథాతథ స్థితి"లో వేలం ద్వారా దిగువ తెలిపిన తేదీన అమ్ముటకు నిర్ణయించినారు. వాహనముల లోన్ తాలూకు అసలు బకాయిసొమ్ము, వడ్డీ మరియు ఇతర ఖర్చులు రాబట్టుకొనుటకై ఇ-వేలమునకు ఆహ్వానించడమైనది.

వ. నెం.	ఋణగ్రహీత పేరు & ఖాతా నెం. & బ్రాంచి పేరు	వాహన వివరములు, రిజిస్ట్రేషన్ నెం., మోడల్	రిజర్వు ధర & ఇఎమ్‌డి	వేలం సమయం	వాహన వివరములకు సంప్రదించవచ్చు
1	శ్రీ కాట్రగడ్డ శ్రీనివాస్ అకౌంట్ నెం.37914959091 బ్రాంచి: బృందావన్ కాలనీ (18993)	MARUTI SWIFT CIAZ AP16 FF 6249 / 2018 / Petrol / ENGINE NO.K15BN1004050	Rs.5,50,000/- & Rs.55,000/-	10.00 AM to 12.00 NOON	9182971727 Ratnam Sai

ఇ-వేలం తేది మరియు సమయం: 22-10-2024, ఉ॥ 10.00 గం॥ల నుండి మ॥ 12.00 గం॥ల వరకు

బిడ్ పెంపుదల: బిడ్డర్స్ వారి ఆఫర్ ధరలను రూ.1,000/- లతో గుణింపు ఆన్‌లైన్‌లో హెచ్చించవలెను.

నియమనిబంధనలు: (1) రిజర్వు ధర కన్నా తక్కువ ధరకు వాహనము అమ్మబడదు. (2) విజయవంతమైన పాటదారుడు బిడ్ మొత్తం మీద 15% మొత్తము వెంటనే చెల్లించవలెను, మిగిలిన సొమ్మును 7 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసు లేకుండా ఇప్పటివరకు చెల్లించిన మొత్తమును కోల్పోవుదురు. (3) వేలం వాయిదా వేయుటకు రద్దుచేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు. (4) వాహనం రిజిస్ట్రేషన్ బాధ్యత విజయవంతమైన బిడ్డర్‌దే మాత్రమే మరియు రిజిస్ట్రేషన్ పేరు మారిన తరువాత మాత్రమే వాహనం ఇవ్వబడును. (5) వాహనం పార్కింగ్ యార్డు యొక్క అద్దె విజయవంతమైన బిడ్డర్ చెల్లించవలెను. (6) ఇతర వివరములకు అధీకృత అధికారి, SBI, RACPC-1 Branch, విజయవాడ, సెల్: 6302629944 నందు మరియు ఇ-వేలం కొరకు please visit www.ibapi.in నందు సందర్శించగలరు.

గమనిక: వాహనం యొక్క రిజిస్ట్రేషన్ పేరు మార్పునకు మొబైల్ నెం:9182971727ను సంప్రదించగలరు మరియు వాహనం యొక్క రిజిస్ట్రేషన్ ఛార్జీలు విజయవంతమైన బిడ్డర్ చెల్లించవలెను.


తేది: 14-10-2024, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, SBI, RACPC-1, విజయవాడ

(c) eenadu

రండి... ప్రభుత్వం ఏర్పాటు చేయండి

ఒమర్ అబ్దుల్లాకు జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ ఆహ్వానం

శ్రీనగర్: కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) నేత ఒమర్ అబ్దుల్లాను లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆహ్వానించారు. ఈ నెల 16న శ్రీనగర్‌లోని ఎస్‌కేఐసీసీలో ఉదయం 11.30 గంటలకు ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తానని ఒమర్ అబ్దుల్లాకు సోమవారం పంపిన లేఖలో లెఫ్టినెంట్ గవర్నర్ తెలిపారు.



ఎన్సీ శాసనసభాపక్ష నేతగా ఒమర్ ఎన్నికైన అంశాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ఈ నెల 11న తనకు తెలియజేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్, సీపీఎం, ఆప్‌లతో పాటు అయిదుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు పంపిన మద్దతు లేఖలు కూడా అందాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనను కేంద్రం ఆదివారం తొలగించింది. ఆ వెంటనే కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు లెఫ్టినెంట్ గవర్నర్ ఆహ్వానం పంపించారు. మనోజ్ సిన్హా నుంచి లేఖ అందిన విషయాన్ని ఒమర్ అబ్దుల్లా సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా వెల్లడించారు.

14 ఎత్తయిన పర్వతాలను అధిరోహించిన నేపాల్ యువకుడు

- నిమా రింజి షెర్పా ఘనత

కాఠ్‌మాండూ: ప్రపంచంలో అత్యంత ఎత్తయిన 14 పర్వతాలను అధిరోహించిన అతి పిన్న వయస్కుడిగా నేపాల్‌కు చెందిన నిమా రింజి షెర్పా(18) రికార్డు సృష్టించారు. గత వారం ఈ యువకుడు చైనాలోని 8,027 మీటర్ల (26,335 అడుగుల) ఎత్తైన షిషపంగ్మా పర్వతాన్ని అధిరోహించి ప్రపంచంలో 8,000 మీటర్లకు పైగా (26,247 అడుగులకు పైగా) ఎత్తున్న పర్వతాలను అధిరోహించాలన్న కలను నెరవేర్చుకున్నాడు. గతంలో 30 ఏళ్ల వయసున్న ఓ షెర్పా ఈ ఘనత సాధించారు. మరోవైపు, నేపాల్ చేరుకున్న నిమా రింజీకి రాజధాని కాఠ్‌మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ దేశ పర్యాటక శాఖ మంత్రి బద్రీ ప్రసాద్ పాండే సహా పలువురు ఘనంగా స్వాగతం పలికారు.



నిమా రింజిని ఎత్తుకున్న తండ్రి మినిమా షెర్పా

1,000 వీసాలకు 40 వేల దరఖాస్తులు

ఆస్ట్రేలియా వర్కింగ్ హాలిడే మేకర్ వీసా కార్యక్రమానికి భారీ స్పందన




దిల్లీ: ఆస్ట్రేలియా ప్రవేశపెట్టిన వర్కింగ్ హాలిడే మేకర్ వీసా కార్యక్రమం కింద అందుబాటులో ఉంచిన 1,000 స్పాట్‌లకు రెండు వారాల్లోనే 40 వేల మంది భారతీయులు దరఖాస్తు చేసుకున్నారు. ఆస్ట్రేలియా వలసల శాఖ సహాయ మంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ వీసా పొందిన వారు ఆ దేశంలో 12 నెలల పాటు ఉండొచ్చు. ఆ సమయంలో ఉద్యోగం చేయడానికి, చదువుకోవడానికి, లేదా నివాసం ఉండడానికి వారిని అనుమతిస్తారు. 18-30 ఏళ్ల వయసున్న భారతీయులు దరఖాస్తు చేసుకోవచ్చు. వీసా పొందిన వారు వచ్చే ఏడాది ప్రారంభంలో ఆస్ట్రేలియాకు వెళ్లొచ్చు.

ఇజ్రాయెల్‌పై

విరుచుకుపడ్డ హెజ్‌బొల్లా

- బిన్యమిన సైనిక స్థావరంపై దాడి
- నలుగురు ఐడీఎఫ్ సైనికుల మృతి

డెయిర్ అల్-బలా: ఇజ్రాయెల్ వరుస దాడులు తీవ్ర నష్టం కలిగించినా, అధినేత హసన్ నస్రల్లా సహా కీలక కమాండర్లు మరణించినా తాము వెనక్కి తగ్గేది లేదన్న సందేశాన్ని హెజ్‌బొల్లా తీవ్రవాద గ్రూపు పంపింది. ఆది, సోమవారాల్లో భీకర స్థాయిలో ఉత్తర ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. ఒక్క సోమవారమే ఏకంగా 1,200 డ్రోన్లను ప్రయోగించింది. దీంతో ఇజ్రాయెల్ వ్యాప్తంగా 182 ప్రాంతాల్లో సైరన్లు మోగాయి. మూడు క్షిపణులు కూడా లెబనాన్ నుంచి ప్రవేశించాయని వాటిని అడ్డుకున్నామని ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) పేర్కొంది. 221 డ్రోన్లు మాత్రమే ఇజ్రాయెల్‌లో ల్యాండయ్యాయని.. మిగతావాటిని ధ్వంసం చేశామని తెలిపింది. మరోవైపు ఆదివారం రాత్రి హెజ్‌బొల్లా ప్రయోగించిన డ్రోన్లు కలకలం సృష్టించాయి. ఇవి హైఫా నగరం సమీపంలోని బిన్యమిన సైనిక స్థావరాన్ని తాకాయి. ఈ ఘటనలో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు మృతిచెందగా, దాదాపు 67 మంది గాయపడ్డారు. ఇందులో సాధారణ పౌరులూ ఉన్నారు. ఈ దాడిలో ఐడీఫ్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ హెర్జి హలేవి మృతి చెందినట్లు తొలుత ప్రచారం మొదలైంది. కొద్దిసేపటి తర్వాత ఈ ప్రచారం తప్పంటూ జెరూసలెం పోస్టు ఓ కథనం ప్రచురించింది. దాడి జరిగిన ప్రదేశం ఐడీఎఫ్ గోలాన్ బ్రిగేడ్‌కు చెందిన శిక్షణ శిబిరంలోని భోజనశాలగా తెలుస్తోంది. డ్రోన్ల దండు విరుచుకుపడటంతో ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థలు నిర్వీర్యమైపోయినట్లు సమాచారం. సైరన్లూ మోగలేదు. నలుగురు సైనికులే చనిపోయారని ఇజ్రాయెల్ చెబుతుండగా, ఈ సంఖ్య భారీగా ఉండొచ్చని హెజ్‌బొల్లా వర్గాలు పేర్కొంటున్నాయి. లెబనాన్‌తో పోరు ప్రారంభమైన తర్వాత ఈ స్థాయిలో ఇజ్రాయెల్ సైనికులను లక్ష్యంగా చేసుకొని హెజ్‌బొల్లా దాడి చేయడం ఇదే ప్రథమం. ఇప్పటివరకు హెజ్‌బొల్లా పట్టున్న ప్రాంతాలనే లక్ష్యంగా చేసుకున్న ఐడీఎఫ్. . ఆదివారం ఉత్తర లెబనాన్‌లోని ఓ అపార్టుమెంట్‌పై దాడి చేసింది. ఇందులో 21 మంది ప్రాణాలు కోల్పోయారని లెబనాన్ రెడ్‌క్రాస్ తెలిపింది.



హెజ్‌బొల్లా దాడి చేసిన బిన్యమిన సైనిక స్థావరం

- సెంట్రల్ గాజాలోని ఓ పాఠశాలపై ఆదివారం రాత్రి ఐడీఎఫ్ జరిపిన దాడిలో పలువురు చిన్నారులు సహా 20 మంది మృతి చెందారు. డెయిర్ అల్-బలా ప్రాంతంలోని అల్ అక్సా ఆసుపత్రి ప్రాంగణంపై చేసిన దాడిలో నలుగురు పాలస్తీనియన్లు మృతి చెందారు.
- లెబనాన్‌లోని నబాటియాలో హెజ్‌బొల్లా రద్వాన్ దళానికి చెందిన సీనియర్ హెజ్‌బొల్లా నేత మహమ్మద్ కమేల్ నయీమ్‌ను హతమార్చినట్లు ఐడీఎఫ్ పేర్కొంది.
- లెబనాన్‌లో శాంతి పరిరక్షక దళంపై దాడులను ఐరోపా యూనియన్ ఖండించింది. లెబనాన్‌లో తాము జరుపుతున్న సైనిక ఆపరేషన్లను ఐరాస దళాలు అడ్డుకుంటున్నాయంటూ ఇజ్రాయెల్ చేసిన ఆరోపణలను తప్పుపట్టింది.

తైవాన్ చుట్టూ చైనా భారీ సైనిక విన్యాసాలు

బీజింగ్/తైపీ: తైవాన్ స్వతంత్రతను పదేపదే ప్రశ్నిస్తూ హెచ్చరికలకు దిగుతున్న చైనా సోమవారం భారీ సైనిక విన్యాసాలు చేపట్టింది. దీని కోసం ద్వీపదేశమైన తైవాన్ చుట్టూ ఆర్మీ, నేవీ, వాయుసేన, క్షిపణి బలగాలను మోహరించింది. సముద్ర జలాల్లో విమానవాహక నౌకలను రంగంలోకి దించింది. పొరుగు దేశాన్ని దాదాపు అన్నివైపుల నుంచి దిగ్బంధించినట్లుగా రోజంతా కొనసాగించిన యుద్ధ అభ్యాసాలను సాయంత్రానికి ముగించినట్లు చైనా సైన్యం పీఎల్‌ఏ ప్రకటించింది. 'జాయింట్ స్వోర్డ్-2024బి' పేరుతో నిర్వహించిన సమీకృత సంయుక్త విన్యాసాల్లో అన్ని విభాగాల శక్తి సామర్థ్యాలను పరీక్షించినట్లు పీఎల్‌ఏ అధికార ప్రతినిధి, సీనియర్ కెప్టెన్ లీ షీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భారీ విన్యాసాలను తైవాన్‌కు హెచ్చరికగా అభివర్ణించారు. 'తైవాన్ ఏ దేశానికీ అధీనం కాదు' అంటూ నాలుగు రోజుల క్రితం జాతీయ దినోత్సవం సందర్భంగా ఆ దేశ అధ్యక్షుడు లై చింగ్ చేసిన ప్రసంగంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. చైనా భారీ సైనిక విన్యాసాలను తైవాన్ విదేశాంగ మంత్రి ఖండించారు. విన్యాసాల సందర్భంగా తమ గగనతల హద్దులను చైనా అతిక్రమించిందని తైవాన్ సైన్యం ఆరోపించింది. ఒకేరోజు 125 యుద్ధ విమానాలతో విన్యాసాల నిర్వహించడం గతంలో జరగలేదని తెలిపింది.



తైవాన్ జలాల్లో చైనా నౌక

ముంబయి నుంచి బయల్దేరే

మూడు విమానాలకు బాంబు బెదిరింపులు

- న్యూయార్క్ సర్వీసు దిల్లీకి దారి మళ్లింపు
- అన్నీ ఉత్తుత్తివేనని తేల్చిన పోలీసులు

దిల్లీ, ముంబయి: దేశ వాణిజ్య రాజధాని ముంబయి నుంచి వెళ్లే మూడు అంతర్జాతీయ విమాన సర్వీసులకు సోమవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. ముంబయి నుంచి న్యూయార్క్ బయల్దేరిన ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు రావడంతో అత్యవసరంగా దారి మళ్లించి, దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు. ఆ సమయంలో అందులో 239 మంది ప్రయాణికులు, 19 మంది సిబ్బంది ఉన్నారు. సిబ్బంది, ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారని, ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ విమానం మంగళవారం అమెరికా బయలుదేరనుంది. బాంబు బెదిరింపులు వచ్చిన రెండు ఇండిగో విమాన సర్వీసుల్లో ఒకటి మస్కట్, మరొకటి జెడ్డా వెళ్లాల్సి ఉంది. ఈ మూడు విమానాల్లో ఎలాంటి అనుమానిత, పేలుడు పదార్థాలు లభించలేదని పోలీసులు స్పష్టంచేశారు. ఇండిగో విమానాలు రెండూ కొన్ని గంటలు ఆలస్యంగా గమ్యస్థానాలకు బయలుదేరాయి. పరిస్థితిని సమీక్షించడానికి కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ దిల్లీ విమానాశ్రయాన్ని సందర్శించారు.

ఎయిరిండియా కోల్‌కతా సర్వీసులో సాంకేతిక సమస్య

దిల్లీ నుంచి కోల్‌కతా వెళ్లాల్సిన ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఆ విమానం వెనక్కి వచ్చి దేశ రాజధానిలో దిగింది. విమానం గాల్లోకి ఎగిరిన అనంతరం ముందు వైపు చక్రంలో సమస్య తలెత్తిందని, దీంతో విమానాశ్రయంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అనంతరం విమానం సురక్షితంగా దిగిందని వెల్లడించాయి. విమానంలో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారో తెలియరాలేదు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఎయిరిండియా వర్గాలు తెలిపాయి.



పొద్దున లేవగానే ఈ ప్రశ్న వేసుకోండి

నిన్నటికన్నా ఈరోజు నన్ను నేను ఎంత మెరుగుపర్చుకోగలనని ప్రతిఒక్కరూ పొద్దున లేవగానే ప్రశ్నించుకోవాలి. రోజంతా మీరు సానుకూల దృక్పథంతో ఉండటంతోపాటు మీ లక్ష్యాలు, విలువలకు అనుగుణంగా పనిచేయడానికి అవసరమైన ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని ఇది అందిస్తుంది. స్వీయపురోగతి కోసం మీరు చేసే చిన్న చిన్న ప్రయత్నాలే కాలక్రమంలో అర్థవంతమైన మార్పును తీసుకొస్తాయి.

– ల్యూక్ ఆడిస్ట్, మైండ్ గ్రోత్ మెంటార్

థరూర్‌పై మరో 4 వారాలు చర్యలొద్దు: సుప్రీంకోర్టు

దిల్లీ: ప్రధాని మోదీని 'శివలింగంపై తేలు'గా పేర్కొన్న వ్యవహారంలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్‌కు సుప్రీంకోర్టులో మరోసారి ఉపశమనం లభించింది. ఆయనపై నమోదైన పరువునష్టం కేసులో విచారణ కోర్టు చర్యలు తీసుకోకుండా గత నెల 10న తాను విధించిన స్టేను సుప్రీంకోర్టు మరో 4 వారాలపాటు పొడిగించింది. జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్‌ల ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

ట్రంప్ ర్యాలీ వద్ద ఆయుధాలున్న వ్యక్తి అరెస్టు

లాస్ ఏంజెలిస్: కాలిఫోర్నియా దక్షిణ ప్రాంతంలోని కోకెల్లాలో శనివారం జరిగిన అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ర్యాలీ వద్దకు గన్‌లు, నకిలీ పాస్‌పోర్టులతో వచ్చిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. విచారణ అనంతరం 5,000 డాలర్ల పూచీకత్తుతో బెయిలుపై విడుదల చేశారు. నిందితుడిని నెవడాలోని లాస్ వెగాస్‌కు చెందిన 49ఏళ్ల వ్యక్తిగా గుర్తించారు. అతడు రిజిస్టరుకాని నల్ల రంగు ఎస్‌యూవీలో ట్రంప్ ర్యాలీ జరిగే ప్రదేశానికి వచ్చాడు. తనిఖీల సందర్భంగా కారులో షాట్ గన్, లోడెడ్ హ్యాండ్ గన్, పేలుడు సామగ్రి, పలు నకిలీ పాస్‌పోర్టులు లభించాయి. నిందితుడు తనను తాను జర్నలిస్టుగా పేర్కొన్నాడు. అయితే ఆధారాలను చూపలేదు. డ్రైవింగ్ లైసెన్సూ వేరే పేరుతో ఉంది. అతడు ఔటర్ సెక్యూరిటీ చెక్ పాయింట్‌ను దాటుకుని ఇన్నర్ సెక్యూరిటీ పాయింట్ వద్దకు వచ్చాడు. అక్కడ తనిఖీల్లో దొరికాడు. నిందితుడిని అరెస్టు చేసే సమయానికి ఇంకా ర్యాలీ వద్దకు ట్రంప్ రాలేదు. ఈ ఘటన వల్ల ర్యాలీకి ఎటువంటి అంతరాయం కలగలేదని పోలీసులు తెలిపారు. పెన్సిల్వేనియాలో ట్రంప్‌పై హత్యాయత్నం జరిగినప్పటి నుంచి ఆయన ర్యాలీలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

10వ రోజుకు

జూడాల నిరవధిక నిరాహారదీక్ష

- అనారోగ్యం పాలైన మరో ఆందోళనకారుడు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో హత్యాచారానికి గురైన తమ సహచరురాలికి న్యాయం కోరుతూ జూనియర్ వైద్యులు కోల్‌కతాలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష సోమవారానికి 10వ రోజుకు చేరుకుంది. ఆందోళనలో పాల్గొన్న ఎన్‌ఆర్‌ఎస్ వైద్య కళాశాల ఆసుపత్రికి చెందిన పులస్థ ఆచార్యకు ఆదివారం రాత్రి తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో ఆయన్ను ఆసుపత్రిలో చేర్చారు. కోల్‌కతా వైద్య కళాశాలకు చెందిన మరో జూనియర్ వైద్యురాలు తాన్యా పంజా ఆరోగ్యం కూడా సోమవారం మధ్యాహ్నానికి క్షీణించింది. దీంతో నిరశన చేపట్టిన ప్రాంతంలోనే ఆమెను వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. ఆందోళనలో పాల్గొన్న పలువురు జూనియర్ వైద్యుల ఆరోగ్య పరిస్థితి అంతంతమాత్రంగానే ఉందని ఓ నిరశనకారుడు తెలిపారు. ఇప్పటి వరకూ కోల్‌కతా, సిలీగుడీ నగరాల్లో నిరాహారదీక్ష చేస్తున్న మొత్తం ముగ్గురు ఆందోళనకారులు ఆసుపత్రి పాలయ్యారు. ప్రస్తుతం దీక్ష చేస్తున్నవారు ఏడుగురు ఉన్నారు.



సోమవారం రాజ్‌భవన్ వైపు ర్యాలీగా వెళ్తున్న వైద్య సిబ్బంది

పెన్‌డౌన్‌ను నిలిపివేసిన ఎఫ్ఏఐఎంఏ

దిల్లీ: కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారం నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న వైద్యుల నిరసనకు సంఘీభావంగా దేశవ్యాప్తంగా నిరసన చేపడుతున్న ద ఫెడరేషన్ ఆఫ్ ఆల్‌ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఎఫ్ఏఐఎంఏ-ఫైమా) పెన్‌డౌన్‌ను తాత్కాలికంగా నిలిపివేసింది. బెంగాల్ ప్రభుత్వం చర్చలకు పిలుపునివ్వడంతో ఈ చర్య తీసుకున్నట్లు తెలిపింది. కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సేవలు నిలిపివేస్తామని ఫైమా తొలుత ప్రకటించింది. అయితే ఈ విషయంపై బెంగాల్ ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించిన నేపథ్యంలో.. పశ్చిమబెంగాల్ జూనియర్ డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చిస్తామని వెల్లడించింది. అక్కడ సామరస్యపూర్వక పరిష్కారం లభించకపోతే అక్టోబరు 15 నుంచి సమ్మెను తిరిగి కొనసాగిస్తామని తెలిపింది. అయితే రోగులకు అత్యవసర సేవలు మాత్రం అందజేస్తామని స్పష్టం చేసింది. జూనియర్ వైద్యుల డిమాండ్లపై చర్చించేందుకు రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయం స్వాస్థ్ భవన్‌లో జరిగే సమావేశానికి ఫైమా ప్రతినిధులు హాజరుకావాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ ఆహ్వానించారు. జూనియర్ డాక్టర్లు చేస్తున్న నిరాహార దీక్షను విరమించేలా సీనియర్ డాక్టర్లు చర్యలు తీసుకోవాలని కోరారు.

యూపీలోని బహ్‌రాయిచ్‌లో అల్లర్లు

- పలు దుకాణాలకు నిప్పు
- ఆదివారం కాల్పుల ఘటనలో ప్రధాన నిందితుడి అరెస్టు

బహ్‌రాయిచ్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బహ్‌రాయిచ్‌లో దుర్గా దేవి విగ్రహం నిమజ్జనం సందర్భంగా రెండు వర్గాల మధ్య చెలరేగిన గొడవలు సోమవారం మరింత భగ్గుమన్నాయి. ఆదివారం 22 ఏళ్ల యువకుడు మృతి చెందడంతో ఆగ్రహించిన పలువురు కర్రలు, ఇనుప రాడ్లతో వీధుల వెంట తిరుగుతూ పలు దుకాణాలకు నిప్పు పెట్టారు. మన్సూర్ గ్రామం మహరాజ్‌గంజ్‌లో ఆదివారం దుర్గా మాత విగ్రహ ఊరేగింపు సాగుతుండగా ఆ సమూహంపై మరోవర్గానికి చెందిన కొందరు వ్యక్తులు రాళ్లు రువ్వడంతోపాటు తుపాకీతో కాల్పులు జరిపారు. దీంతో సుమారు అరడజను మంది గాయపడ్డారు. తూటా గాయంతో గోపాల్ మిశ్ర అనే వ్యక్తి మరణించారు. ఆగ్రహించిన జనం ఆందోళనకు దిగి నిందితుడిపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. పోలీసులు ప్రధాన నిందితుడిని అరెస్టు చేయడంతోపాటు 30 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.



దుండగుల దాడిలో ధ్వంసమైన ఆసుపత్రి

అమెరికా అధ్యక్ష పీఠం కమలదే!

రాజకీయ శాస్త్రవేత్త జోస్యం • 40 ఏళ్లలో ఒక్కసారీ తప్పు చెప్పని లిచ్‌మన్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌పై కమలా హారిస్ విజయం సాధిస్తారని అమెరికన్ యూనివర్సిటీ ప్రొఫెసర్, రాజకీయ శాస్త్రవేత్త అలన్ లిచ్‌మన్ జోస్యం చెప్పారు. అమెరికా మొదటి మహిళా అధ్యక్షురాలిగా కమల హారిస్ బాధ్యతలు చేపడతారని ఆయన అంచనా వేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలను అంచనా వేయడంలో గత 40 ఏళ్లుగా కచ్చితమైన రికార్డు ఉన్న లిచ్‌మన్ ఓ ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.



13కీ ఫార్ములా

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎవరు విజయం సాధిస్తారో అంచనా వేసేందుకు 13కీ ఫార్ములాను తయారు చేశారు అలన్ లిచ్‌మన్. రష్యన్ జియోఫిజిసిస్టు వ్లాదిమిర్ కీలిస్-బోరోక్‌తో కలిసి 1981లో ఈ ఫార్ములాను రూపొందించారు. దీన్ని 'కీస్ టు ది వైట్‌హౌస్'గా పిలుస్తారు. 13కీలలో ఆరు కంటే ఎక్కువ కీలు అధికారంలో ఉన్న పార్టీకి వ్యతిరేకంగా వస్తే ఆ పార్టీ అభ్యర్థి ఓడిపోతారని అంచనా. అంతకంటే తక్కువ వస్తే అధికార పార్టీ అభ్యర్థి గెలుస్తారని ఈ ఫార్ములా చెబుతుంది. అమెరికన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ అయిన లిచ్‌మన్ 1984 నుంచి అన్ని అమెరికా అధ్యక్ష ఎన్నికలను అంచనా వేస్తూ వస్తున్నారు. అన్ని ఎన్నికల్లోనూ ఆయన అంచనాలు నిజమయ్యాయి.

వ్యతిరేకంగా నాలుగు కీలే

'ప్రస్తుతం అధికారంలో ఉన్న డెమోక్రాట్లకు వ్యతిరేకంగా నాలుగు కీలు మాత్రమే ఉన్నాయి. అనుకూలంగా 9కీలు ఉన్నాయి. అంటే ఈ ఎన్నికల్లో కమలా హారిస్ విజయం సాధిస్తారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌కు తిరిగిరాలేరు. డెమోక్రాట్లు 2022లో యూఎస్ హౌస్ సీట్లు కోల్పోవడంవల్ల 1కీని కోల్పోయారు. సిటింగ్ అధ్యక్షుడు పోటీ నుంచి తప్పుకోవడంవల్ల కీ నంబరు 3ని వదులుకున్నారు. అలా మొత్తంగా నాలుగు కీలు వారికి వ్యతిరేకంగా ఉన్నాయి. అధికార పార్టీ ఓడిపోతుందని చెప్పడానికి ఇంకా రెండు కీలు తక్కువగా ఉన్నాయి. అందుకే అమెరికాకు మొదటి మహిళా అధ్యక్షురాలుగా కమల విజయం సాధిస్తారని కీలు చెబుతున్నాయి' అని అలన్ లిచ్‌మన్ తెలిపారు.

ఆర్థిక మాంద్యం లేదు

ఎన్నికల ఏడాదిలో ఆర్థిక మాంద్యం లేదని, డెమోక్రాట్లకు వ్యతిరేకంగా ప్రచారం చేయడంలో రిపబ్లికన్లు విఫలమయ్యారని లిచ్‌మన్ అభిప్రాయపడ్డారు. డెమోక్రాట్లు కమల హారిస్‌కు అండగా నిలిచారని తెలిపారు. 'అమెరికాలో ఆర్థిక మాంద్యం లేదు. దీంతో ఎకానమీ కీని డెమోక్రటిక్ పార్టీ అధిగమించింది. సామాజిక అశాంతి, కుంభకోణాలు జరగకపోవడంవల్ల ఈ కీలన్నీ ఆ పార్టీకి అనుకూలంగా వచ్చాయి. విదేశాంగ విధానం కీని కూడా పార్టీ గెలిచింది' అని లిచ్‌మన్ అంచనా వేశారు.



ప్రపంచంలోనే తొలిసారి నదీతీర డాల్ఫిన్‌ల లెక్కింపు పూర్తి

'ప్రాజెక్ట్ డాల్ఫిన్' కింద భారత ఉపఖండంలో నిర్వహణ

దిల్లీ: భారత ఉపఖండంలోని గంగా, బ్రహ్మపుత్ర, సింధు నదులలో కనిపించే డాల్ఫిన్‌లను తొలిసారి లెక్కించినట్లు అధికారులు సోమవారం తెలిపారు. ఈ నదుల వెంబడి 8000 కిలోమీటర్ల మేర భారత్, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్ దేశాలలో నిర్వహించిన ఈ లెక్కింపు ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ఇందులో ప్రధానంగా గంగా నదీ తీర డాల్ఫిన్‌లు, సింధు నదీతీర డాల్ఫిన్లను లెక్కించారు. భారతదేశ నదులు, తీర ప్రాంత జలాల్లో డాల్ఫిన్లను పరిరక్షించడానికి 2020లో 'ప్రాజెక్ట్ డాల్ఫిన్'ను ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రపంచంలోనే తొలిసారి నదీతీర డాల్ఫిన్‌ల లెక్కింపును పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నేతృత్వంలో రెండేళ్లపాటు నిర్వహించిన ఈ సర్వే ఫలితాలను, డాల్ఫిన్‌ల గణాంకాల అంచనాలను త్వరలో విడుదల చేస్తామని పేర్కొన్నారు. డాల్ఫిన్‌ల ఉనికి ఆరోగ్యకరమైన నదీ వ్యవస్థను సూచిస్తుంది. అవి జీవించడానికి స్వచ్ఛమైన, ప్రవహించే నీరు అవసరం. తద్వారా శాస్త్రవేత్తలు ఆ నది నీటి స్వచ్ఛతను అంచనా వేయవచ్చు.

గురుడి చందమామ యూరోపా శోధనకు వ్యోమనౌక

కేప్ కెనావెరాల్: గురుగ్రహం చుట్టూ పరిభ్రమిస్తున్న యూరోపా అనే చందమామపై జీవుల మనుగడకు అనువైన పరిస్థితులు ఉన్నాయా అని శోధించేందుకు అమెరికా అంతరిక్ష సంస్థ- నాసా సోమవారం ఒక వ్యోమనౌకను ప్రయోగించింది. ఫ్లోరిడాలోని అంతరిక్ష కేంద్రం నుంచి స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన ఫాల్కన్ హెవీ రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని చేపట్టింది. యూరోపా క్లిపర్ అనే వ్యోమనౌక.. 300 కోట్ల కిలోమీటర్లు ప్రయాణించి గురు గ్రహాన్ని చేరుతుంది. ఇందుకు ఐదున్నర ఏళ్లు పడుతుంది.



గురుగ్రహ కక్ష్యలోకి చేరాక యూరోపా క్లిపర్.. 49 సార్లు యూరోపాకు చేరువగా వచ్చి వెళుతుంది. హిమమయంగా ఉండే ఈ చందమామ ఉపరితలం కింద భారీ సముద్రం ఉండొచ్చని, అక్కడి నీటిలో జీవుల మనుగడకు అవసరమైన వాతావరణం ఉండొచ్చని శాస్త్రవేత్తలు అంచనావేస్తున్నారు. అందువల్ల సౌర కుటుంబంలో జీవాన్వేషణకు ఈ చందమామను అత్యంత అనువైన ప్రదేశంగా పరిగణిస్తుంటారు. అయితే అక్కడ జీవం కోసం యూరోపా క్లిపర్ శోధించబోదని, జీవుల మనుగడకు అవసరమైన అంశాలు ఉన్నాయా అన్నది మాత్రమే పరిశీలిస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. యూరోపా క్లిపర్ బరువు 5,700 కిలోలు. ఈ ప్రాజెక్టు వ్యయం 520 కోట్ల డాలర్లు.


గురు గ్రహం చుట్టూ భారీగా రేడియోధార్మికత ఉంటుంది. యూరోపాకు చేరువగా వచ్చిన ప్రతిసారీ.. ఛాతీ ఎక్స్‌రే కన్నా కొన్ని లక్షల రెట్లు ఎక్కువగా రేడియోధార్మికతను యూరోపా క్లిపర్ ఎదుర్కొంటుంది. అలాంటి పరిస్థితుల్లో ఈ వ్యోమనౌక ట్రాన్సిస్టర్లు దెబ్బతినవచ్చని నాసా చాలా ఆలస్యంగా గుర్తించింది. దీంతో ఈ ప్రాజెక్టుపై మరోసారి సమీక్ష జరిపి, గత నెలలో దీన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసింది. యూరోపా క్లిపర్.. ప్రతి 21 రోజులకోసారి గురు గ్రహాన్ని చుట్టేస్తుంది. ఇది గరిష్ఠంగా యూరోపా ఉపరితలానికి 25 కిలోమీటర్ల దూరం వరకూ వెళుతుంది. వ్యోమనౌకలోని రాడార్... ఆ చందమామపై 24 కిలోమీటర్ల మందంలో ఉన్న మంచు పొర కిందున్న సాగరాన్ని పరిశోధిస్తుంది. 2030లో అది గురుగ్రహాన్ని చేరుతుంది.

అడవులను పెంచకపోతే

హైవేల కూల్చివేతకు ఆదేశాలిస్తాం

తాజ్‌మహల్ పరిరక్షణ జోన్‌పై సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: తాజ్‌మహల్ పరిరక్షణ జోన్‌లో (టీటీజెడ్) అడవులను పెంచకపోతే అక్కడ నిర్మించిన హైవేలను కూల్చివేసి ఆ భూములను యథాతథ స్థితికి తేవాలని ఆదేశాలిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.



టీటీజెడ్‌లో తప్పనిసరిగా అడవులను పెంచాలన్న నిబంధనలను ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ఆక్షేపించింది. టీటీజెడ్‌లోని కీతం, భాండై స్టేషన్ల మధ్య బైపాస్ రైల్వే లైన్ నిర్మించడానికి వీలుగా 5,094 చెట్లను కొట్టేసేందుకు రైల్ వికాస్ నిగం లిమిటెడ్‌కు అనుమతి ఇవ్వడంపై జస్టిస్ అభయ్ ఎస్ ఓక్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం స్టే ఇచ్చింది. 'మేం ప్రతి ఒక్కరికీ స్పష్టం చేయదలుచుకున్నాం. కోర్టు ధిక్కార చర్యలతో పాటు భూములను యథాతథ స్థితికి తెచ్చేందుకు ఆదేశాలిస్తాం. ప్రజా ప్రయోజనాలకు భూములను వినియోగించుకోవాలనుకున్నప్పుడు మేం విధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిందే' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఉత్తర్ ప్రదేశ్‌లోని ఆగ్రా, ఫిరోజాబాద్, మథుర, హాథ్రస్, ఎటాతో పాటు రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లాల్లో టీటీజెడ్ విస్తరించి ఉంది.

దిల్లీలో జనవరి 1 వరకు బాణసంచాపై నిషేధం

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో వాయు కాలుష్యాన్ని నియంత్రించడానికి ఆప్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని రకాల టపాసుల ఉత్పత్తి, నిల్వ, అమ్మకం, కాల్చడంపై సోమవారం నిషేధం విధించింది. ఈ నిషేధం జనవరి 1 వరకు ఉంటుందని, తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఈ మేరకు ఆప్ మంత్రి గోపాల్ రాయ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రకటించారు. "ఈ రోజు గాలి నాణ్యత (ఏక్యూఐ) నాసి రకం కేటగిరీలో నమోదైంది. శీతాకాలం సమీపిస్తున్న తరుణంలో నగరంలో పెరగనున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని బాణసంచాపై నిషేధం విధించాం. దీనిపై మార్గదర్శకాలు విడుదల చేశాం. వాయు కాలుష్యాన్ని నియంత్రించడానికి 21 పాయింట్ల ప్రణాళికపై సర్కారు పనిచేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ప్రజలు సహకరించాలని కోరుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు.

(c) eenadu

వసుంధర

vasundhara@eenadu.in

కంటి నిండా నవ్వేద్దాం



అమ్మాయిలకు నవ్వే అందం అంటారు కదా! అదే ఆరోగ్యం కూడా. నవ్వు... ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు లాంటివి తగ్గిస్తుందని మనకు తెలుసు. అయితే, ఇది కళ్లు పొడిబారే సమస్యనూ తగ్గిస్తుందని బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైంది. తాజాగా చైనా, యూకేకు చెందిన పరిశోధకులు 'డ్రై ఐస్' సమస్య ఉన్న 18-45ఏళ్ల (74శాతం మహిళలు) వయసున్న 283మందిని పరీక్షించారట. అందులో భాగంగా కొంతమందికి చుక్కలమందు, మరికొంతమందికి లాఫింగ్ థెరపీని సూచించారు. చుక్కలమందు రోజుకు నాలుగుసార్లు చొప్పున ఎనిమిది వారాలపాటు వాడమన్నారు. లాఫింగ్‌థెరపీలో భాగంగా 'హ్హ హ్హ హ్హ... హ్హి హ్హి హ్హి ' అంటూ ఐదు నిమిషాల్లో 30సార్లు నవ్వమన్నారు. ముఖ కవళికలనూ, వ్యాయామాలనూ ఫేస్ రికగ్నిషన్ మొబైల్ యాప్ ద్వారా పరిశీలించారు. మందు వాడిన వారిలో, నవ్వడం సాధన చేసిన వారిలో ఇంచుమించు ఒకేలాంటి ఫలితాలు కనిపించాయట. అందుకే, కళ్లు పొడిబారే సమస్య ఉన్నప్పుడు రకరకాల చుక్కల మందులు వాడేకంటే సహజంగా, తక్కువ ఖర్చుతో పూర్తయ్యేలా ఇంట్లోనే లాఫింగ్ ఎక్సర్‌సైజ్ చేయమంటున్నారు నిపుణులు. అంతేకాదు, మెనోపాజ్ తరవాత మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్, థైరాయిడ్, కనురెప్ప వ్యాధులు లాంటివి ఉన్నప్పుడూ, కాంటాక్ట్ లెన్స్ సుదీర్ఘకాలం ఉపయోగించే వాళ్లలోనూ కళ్లు పొడిబారే సమస్య కనిపిస్తుంది. ఇటీవలి కాలంలో మొబైళ్ల వినియోగం పెరిగాకా ఈ సమస్యబారిన పడుతున్నారు. అలాంటి వారికి 'నవ్వే మంచి మందు' అంటున్నారు నిపుణులు.

ఒక్కరోజు... అధికారి!

ఇండియన్ ఫారెన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) సాధించలేదు. ప్రొఫెషనల్స్ అంతకన్నా కాదు... కానీ వీళ్లు బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ అయ్యారు. ఎలాగంటే...

ఓ సినిమాలో హీరో ఒక్కరోజు ముఖ్యమంత్రి అవ్వడం చూశాం కదా! అలాగే ఈ ఏడాది ఆరుగురు అమ్మాయిలు ఒక్కరోజు బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ అయ్యారు. బ్రిటిష్ హైకమిషన్ ఇన్ ఇండియా 2017 నుంచి ఏటా బాలికా దినోత్సవం నాడు 'హైకమిషనర్ ఫర్ ఎ డే' అనే పోటీ నిర్వహిస్తుంది. దౌత్యవేత్తల పని వాతావరణాన్ని తెలుసుకునే అవకాశమివ్వడంతోపాటు భారత్, యూకేల మధ్య సత్సంబంధాలను నేరుగా చూసే వీలు కల్పించడం ఈ కార్యక్రమం ఉద్దేశం. దేశ వ్యాప్తంగా పోటీ ఉంటుంది. ఈ ఏడాది 'డే ఆఫ్ ద గర్ల్' పేరుతో లింగవివక్షకు తావులేకుండా సమాన అవకాశాలుండాలన్న సందేశాన్నీ ఇచ్చారు.



అసోం అమ్మాయి **మోంజితా బారువా** కోల్‌కతాకి బ్రిటిష్ హైకమిషనర్ అయ్యింది. ఎన్ఐటీ- సిలిచార్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ చదువుతోందీమె. 'మా కాలేజీలో 600కుపైగా అబ్బాయిలకు 80 మంది మాత్రమే అమ్మాయిలున్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. బ్రిటిష్ హైకమిషనర్‌గా లింగసమానత్వాన్ని యూకే ప్రోత్సహిస్తున్న తీరుతోపాటు మానవ అక్రమరవాణా అడ్డుకోవడం, వ్యాపార అవకాశాల కల్పన వంటివి తెలుసుకున్నా. పాలసీ టీమ్‌నీ కలుసుకున్నా' అంటోంది 20 ఏళ్ల మోంజిత.



22ఏళ్ల **మీనాక్షి నాయర్** స్వస్థలం కేరళలోని కొచ్చి. సైకాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, సివిల్స్‌కి సన్నద్ధమవుతోంది. కేరళ, కర్ణాటకలకు ఒక్కరోజు దౌత్యవేత్తగా... బ్రిటిష్ హైకమిషన్ సభ్యుల ద్వారా భారత్- యూకే ద్వైపాక్షిక సంబంధాలు, నాయకత్వ స్థానంలో ఉన్న మహిళల అనుభవాలు వంటివెన్నో తెలుసుకుంది. ఏఐ అండ్ రోబోటిక్స్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) గ్యారేజ్ ఇంక్యుబేటరీనీ సందర్శించింది. 'ఈ అవకాశం నాకు... కలిసి పనిచేయడం, వినయం, సేవల గొప్పతనాన్ని తెలుసుకునేలా చేసింది. ప్రజాసేవ కెరియర్ కాదు... అదో బాధ్యత అనీ అర్థమైంది. నాయకురాలికి ఉండాల్సిన లక్షణాలనూ తెలుసుకున్నా' అంటోంది మీనాక్షి.



23ఏళ్ల బీకే **సిందియా**ది తమిళనాడు. చెన్నైలో లా చదువుతోంది. చెన్నై బ్రిటిష్ హైకమిషనర్‌గా సిందియా కూడా ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొంది. బ్రిటిష్ కౌన్సిల్ డిజిటల్ లైబ్రరీ సందర్శన, ఇతర దౌత్యవేత్తలతో కలిసి పని చేయడం, ట్రేడింగ్ అంశాల పరిశీలన వంటివెన్నో చేసింది. 'అంతర్జాతీయ నాయకత్వంలో మహిళల ప్రాధాన్యమేంటో ఈ సందర్భంగా తెలుసుకున్నా. ముఖ్యంగా కలిసి పనిచేయడంలో ఉన్న గొప్పతనం అర్థమైంది. నాకు ఇదో గొప్ప అవకాశం' అంటోందీమె.



దిల్లీ బ్రిటిష్ హైకమిషనర్‌గా వ్యవహరించిన **నిధీ గౌతమ్**ది కర్ణాటక. దిల్లీలో హిస్టరీ అండ్ జాగ్రఫీలో బ్యాచిలర్స్ చేస్తోంది. ఈ 19ఏళ్ల అమ్మాయి... ఒక్కరోజు విధుల్లో భాగంగా ఐఐటీ- దిల్లీలోని నేషనల్ సెంటర్ ఫర్ అసిస్టివ్ హెల్త్ టెక్నాలజీస్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీలను సందర్శించింది. కొత్త సాంకేతికతలు మానవాళికి ఎలా సాయపడుతున్నాయో తెలుసుకుంది. 'వికలాంగులకు, వ్యాక్సిన్ తయారీలో... ఇలా ఎన్నో అంశాల్లో సాంకేతికత మనకు ఎలా సాయపడుతోందో తెలుసుకున్నా. ఎందరో ప్రముఖులను కలుసుకున్నా. ఈ అనుభవం కలలా ఉంది' అంటోంది 19ఏళ్ల నిధి.



ప్రియా సింగ్ టెకీ. ఈమెది వారణాసి. దిల్లీ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ఈ 22ఏళ్ల అమ్మాయి టెక్ మహీంద్రాలో డేటా అనలిస్ట్‌గా పనిచేస్తోంది. 'ప్రిపేర్ విత్ ప్రియా' పేరుతో యూట్యూబ్, సోషల్‌మీడియాలో విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ సన్నద్ధత, ఉద్యోగ ప్రకటనలు, ఇంటర్న్‌షిప్‌లు, రెజ్యూమె తయారీ... వంటి బోలెడు అంశాల్లో సలహాలిస్తోంది. ముంబయికి బ్రిటిష్ హైకమిషనర్‌గా వ్యవహరించిన ఈమె టీకా తయారీ, వైద్యుల శిక్షణల్లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రాధాన్యం, రాజస్థాన్‌లో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మహిళల పాత్ర వంటి ఎన్నో అంశాల గురించి తెలుసుకుంది. 'ఎంతోమంది ప్రముఖులను కలిశా. ప్రతిఒక్కరి నుంచీ నాయకత్వ పాఠాలను నేర్చుకున్నా. ఈ అనుభవం జీవితాంతం నాతోపాటు ఉంటుంది. నన్ను నేను మెరుగుపరచుకోవడంలో కచ్చితంగా సాయపడుతుంది' అంటోంది ప్రియ.

అంతర్ముఖులు కాకుండా..!

ఇంటికి చుట్టాలు, అమ్మానాన్న కోసం స్నేహితులు...వస్తే ఎనిమిదేళ్ల నిధి సిగ్గుతో గది నుంచి బయటకు రాదు. ఇంట్లో అందరితో సాధారణంగా ఉండే పిల్లలు ఇలా ఇతరులెదుట బిడియపడుతుంటే వెంటనే గుర్తించి ఆ లక్షణాన్ని దూరం చేయడానికి ప్రయత్నించాలి. లేదంటే పిల్లల్లో ఇది పెరిగి పెద్దదై, ఇంట్రావర్ట్‌లుగా మార్చే ప్రమాదం ఉంది.



పోలిక వద్దు... : ఇతరులకన్నా తాము తక్కువనే భావన పిల్లల్లో రాకూడదు. తమను ఇతరులతో పోల్చడం, చదువులో లేదా చురుకుదనంలో అవతలి వారికన్నా తక్కువ అన్నట్లు విమర్శించడం వంటివన్నీ పిల్లల్లో ఆత్మన్యూనతను పెంచుతాయి. దీంతో అందరిముందుకీ రావడానికి వాళ్లు బిడియపడతారు. అలాకాకుండా పిల్లలు తమలోని భావోద్వేగాలను గుర్తించడానికి, వాటిని బహిర్గతం చేయడానికి పెద్దవాళ్లు సహాయపడాలి. అలాగే వాళ్ల అభిప్రాయాలు, సమస్యలను చెప్పమనాలి. ఆ తర్వాత పరిష్కరించే మార్గాలను చూపించి వాటిని అధిగమించేలా చేయాలి. దీంతో ఆత్మవిశ్వాసాన్ని పొందడంతోపాటు నలుగురితో కలివిడిగా ఉండటానికి ఆసక్తి చూపిస్తారు.

నైపుణ్యాలు... : వంటింటి సామాన్లు తెచ్చేటప్పుడు లిస్ట్‌ను పిల్లలకే అందించి పర్యవేక్షించమనాలి. స్నేహితులను ఇంటికి ఆహ్వానించడానికి, వాళ్లతో కలిసి ఆడుకోవడానికి ప్రోత్సహించాలి. పుస్తకపఠనం తర్వాత వాళ్లు చదివిన కథను తిరిగి చెప్పమనాలి. ఇవన్నీ వాళ్ల ఆలోచనాశైలిని బహిర్గతం చేస్తాయి. తోటి పిల్లలతో కలిసి తోటపని చేయించాలి. ఈ అవకాశాలన్నీ పిల్లల్లో సామాజికపరమైన నైపుణ్యాలు మెరుగుపడటానికి దోహదపడతాయి. అంతేకాదు, బంధువులకు పిల్లలను గౌరవంగా పరిచయం చేస్తే అది వాళ్ల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఇవన్నీ వాళ్లకు నలుగురితో కలవడమెలాగో నేర్పుతాయి.

నగల్ని మా పుట్టింటి డబ్బుతో విడిపించాలట!

నా పెళ్లికి పాతికలక్షల రూపాయల నగదు, 50 తులాల బంగారు నగలూ కట్నంగా ఇచ్చారు. వివాహమై ఏడాదైనా కాకుండానే నా ప్రమేయం లేకుండా వాటిని బ్యాంకులో తాకట్టు పెట్టారు. అవి మా అమ్మమ్మ నుంచి వారసత్వంగా వచ్చినవి. వచ్చే నెలలో జరిగే మా చెల్లి పెళ్లి సమయానికైనా విడిపించమని బతిమిలాడా... అవి వేసుకోకపోతే ఏమవుతుంది? మీ పుట్టింటి నుంచి డబ్బు తెచ్చి తీసుకో అంటున్నారు. అసలు నా నగల్ని వారికి తీసుకునే హక్కుంటుందా? ఈ బంధంలో ఎక్కువ రోజులు ఉండలేననిపిస్తోంది. నేనేం చేయాలి? - ఓ సోదరి

డియర్... వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

వరకట్న నిషేధచట్టం 1961లో తెచ్చారు. దాని ప్రకారం కట్నం ఇవ్వడం, తీసుకోవడం నేరం. కట్నం అంటే పెళ్లప్పుడు ఇచ్చిన నగలు, డబ్బు, ఆస్తులు అన్నీ వస్తాయి. ఈ చట్టానికి 1986లో కొన్ని మార్పులు చేశారు. కనీస శిక్షను ఐదేళ్ల జైలు, 25 వేల రూపాయల జరిమానాగా పెంచారు. ఈ నేరాన్ని బెయిలు ఇవ్వకూడనిదిగా మార్చారు. ఇన్ని చేసినప్పటికీ కట్నం బాధలు ఎక్కువవుతూనే ఉన్నాయి. ఇందులోని సెక్షన్ 6 ప్రకారం కట్నంగా ఇచ్చిన నగదు, ఆస్తి... పెళ్లికి ముందు లేదా పెళ్లప్పుడు తీసుకున్న వ్యక్తి 3 నెలలు లోపల ఆ వధువు/ స్త్రీ పేరు మీదకు బదిలీ చేయాలి. అలా చేయకపోతే ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అలా వధువుకి చెందిన ఆస్తి ఆమె వారసులకు(చనిపోయాక) చెందుతుంది. ఒకవేళ ఆమెకు వారసులు లేకుండా మరణిస్తే తిరిగి తన తల్లిదండ్రులకే వెళ్తుంది. కట్నం తెమ్మనిగానీ, తేలేదనిగానీ వేధించడం.... పెళ్లయి ఎన్నేళ్లయినా కూడా నేరమే అవుతుంది. మీరు ముందు వరకట్న వేధింపులకింద, గృహహింస చట్టం కింద కేసు పెట్టండి. విడాకులు తీసుకునేట్లయితే మీకు కట్నంగా ఇచ్చిన డబ్బు, నగలు, వస్తువులు అన్నీ తిరిగి ఇమ్మని అడగండి. క్రిమినల్ కేసు పెడితే నేరం చేయలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత వారిదే. ముందుగా ఈ సంసార బంధంలో ఉండాలా? అక్కర్లేదా అనేది నిర్ణయించుకుని తరవాత కేసు విషయమై ముందుకు వెళ్లండి. ఒకవేళ కలిసే ఉండాలనుకుంటే ముందు మధ్యవర్తులతో మాట్లాడించడమే మంచిది.

నలుగురూ నడిచిన దారిలో వెళ్లినవారు గమ్యాన్ని సురక్షితంగా చేరుకుంటారేమో! కానీ, కొత్త పంథాని ఎంచుకున్నవారే సరికొత్త చరిత్రను సృష్టిస్తారు. అందరికీ ఆదర్శంగా నిలుస్తారు. సరిగ్గా ఇలానే రాజస్థాన్‌లోని బెరి గ్రామానికి చెందిన సంతోష్ దేవి ఖేదర్ తన వ్యాపారాన్ని మలుచుకుంది. ఎడారి ప్రాంతంలో ఆపిల్ సేద్యాన్ని లాభాల బాట పట్టిస్తూ... రూ.లక్షల టర్నోవర్ సాధిస్తోంది.

ఎడారిలో...ఆపిల్!



సాధారణంగా ఆపిల్ జమ్మూ, కశ్మీర్ లాంటి చల్లని ప్రాంతాల్లోనే పండుతుందంటారు. అయితే, సంతోష్ దేవి రాజస్థాన్‌లోని తన ఎకరంన్నర పొలంలో వంద ఆపిల్ మొక్కలను నాటింది. అప్పుడు అంతా రిస్క్ తీసుకుందన్నారు. కానీ, ఆర్గానిక్ సేద్యంలో అనుభవం ఉన్న సంతోష్ దేవికి అలా అనిపించలేదు. ఆమెకు ఆత్మవిశ్వాసం ఎక్కువ. వైఫల్యాల నుంచి నేర్చుకున్న పాఠాలే అందుకు కారణం. 2008లో సాగు మొదలుపెట్టిన ప్రారంభంలో భర్త ఉద్యోగానికీ, పిల్లలు స్కూలుకీ వెళ్లాక ఒక్కరే రోజుకి 12-14గంటలు పొలంలో పనిచేసేది. అంతలా శ్రమించడం అలవాటున్న సంతోష్‌దేవికి ఈ పనీ పెద్ద కష్టమనిపించలేదు. ఇందుకోసం హిమాచల్‌ప్రదేశ్‌లోని ఓ రైతు అభివృద్ధి చేసిన ప్రత్యేక ఆపిల్ రకాన్ని ఎంచుకుందీమె. మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి సొంతంగానే ఎరువులు తయారుచేసుకునేది. ఆవుమూత్రం, వేప, ఉమ్మెత్త లాంటివి నీళ్లలో కలిపి ప్రతి పదిహేను రోజులకోసారి చల్లుతుండేది. జీవామృతం, పంచగవ్య లాంటివీ వాడుతుండేది. నీటివృథా, ఆపరేటింగ్ ఖర్చులను తగ్గించడానికి 'డ్రిప్ ఇరిగేషన్' పద్ధతినీ ఉపయోగించేది. మామూలుగా పంట వేసిన నాలుగో ఏడాది నుంచి కాపు ప్రారంభమవుతుందని చెబుతారు. అయితే, తన వినూత్న విధానాల వల్ల పొలంలో రెండో ఏడాది నుంచే కాపు మొదలైంది. అదే ఏడాది ఒక్కోచెట్టుకి 30నుంచి 34 ఆపిల్‌లు పండగా ఆ తరవాతి సంవత్సరం 132, మరుసటి ఏడాది 368కాయలు కాశాయట. సహజంగా పండడం, ఎటువంటి రసాయనాలూ వాడకపోవడంతో మంచి రుచి వచ్చి... కేజీ రూ.150నుంచి 200దాకా పలుకుతున్నాయట. ఇవే కాకుండా... దానిమ్మ, బత్తాయి, నిమ్మ, సపోటాలనూ పండిస్తోందీమె.

నర్సరీతోనే రూ.25లక్షలు...

ఎకరం భూమిలో పండ్లతోట వేసి, మరో అర ఎకరంలో నర్సరీనూ ఏర్పాటుచేసింది సంతోష్‌దేవి. అందులో అనేక రకాల పండ్ల మొక్కలను అభివృద్ధి చేసి, దేశవ్యాప్తంగా సరఫరా చేస్తోంది. ఈ నర్సరీ నుంచే ఏడాదికి దాదాపు రూ.25లక్షల రెవెన్యూ అందుకుంటోంది. భర్త రామ్‌కరణ్ ఖేదర్, కోడలూ, కొడుకూ పొలంలో సాయంగా ఉంటారు. అంతేకాదు, సంతోష్ దేవి కుటుంబ సభ్యులతో కలిసి నర్సింగ్, సేద్యానికి సంబంధించి ఆసక్తి ఉన్న వారికి శిక్షణా ఇస్తోంది. సేంద్రియ వ్యవసాయంలో నూతన విధానాలు అవలంబిస్తూ ప్రోగ్రెసివ్ రైతుగా అవార్డులూ అందుకుంది. ఏడాదికి రూ. 38లక్షల టర్నోవర్‌నూ పొందుతోంది.

మొక్కలు ఎక్కడ పెంచుతున్నారు?

మొక్కలు పెంచడమంటే కేవలం పూలకోసమో, పండ్ల కోసమో కాదు! అంతకు మించి లాభాలుంటాయి. తోటపనిలో భాగంగా చూడటం, వినటం, వాసన చూడటం ఎన్నో ప్రక్రియలు చేస్తాం. వాటితో మానసిక ప్రశాంతత వస్తుంది. అలాగే, మట్టినీ తాకుతాం. దీనివల్ల పర్యావరణంలోని సూక్ష్మక్రిములు శరీరంలోకి వెళ్తాయి. మన జీర్ణ వ్యవస్థకు ఇవెంతో మేలు చేస్తాయి. అయితే, నాటే మొక్కలు, ప్రదేశాన్నిబట్టి తోటపనితో వచ్చే లాభాల్లో మార్పులు ఉంటాయట. పెరట్లోకంటే ఇంటి ముందరి భాగంలో మొక్కల్ని పెంచితే ఎక్కువ లాభమట. కారణం ఏంటంటారా..? మనం ఎక్కువగా తిరగాడేది అక్కడేగా! వాటిని చూస్తూ, ఆ గాలిని పీలుస్తూ ఉంటే బోల్డన్ని ప్రయోజనాలు. అందుకే ఇంటి ముందు ఖాళీ ప్రదేశాన్ని కాంక్రీటుతో నింపకుండా మట్టినే ఉంచండి. అక్కడ పచ్చదనం పెంచండి. అలాగే అన్నీ ఒకేలాంటి మొక్కలు కాకుండా వేర్వేరు ఆకారాలూ, పరిమాణాలూ, రంగులూ ఉన్న మొక్కలు నాటితే... ఇంకా ఎక్కువ లాభాలు ఉంటాయట. వీలైతే మొక్కలు నాటే సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనమంటున్నారు నిపుణులు. నలుగురితో కలిసి ఈ పని చేస్తే మానసిక ఉల్లాసం మరింత పెరుగుతుందట.



కూతురి కోసం.. వయనాడ్ మహిళా క్రికెట్ జట్టు!

అదో హైస్కూల్ ప్రాంగణం.. అమ్మాయిల క్రికెట్ జట్టుకి ఎంపిక జరుగుతోంది. వాళ్లలో చాలామంది అప్పటివరకూ క్రికెట్ ఆడలేదు, కొందరైతే చూడలేదు కూడా! అందుకే హ్యాండ్- ఐ కోఆర్డినేషన్, శరీర సౌష్ఠవం... చూసి 14 మందిని ఎంపికచేశారు. ఆరోజు ఎస్లమ్మ బేబీ ఈ పని ఎందుకు చేశారంటే...



ఎస్లమ్మ.. ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనర్. ఆమె కూతురు అనుమోల్‌కి క్రికెట్ అంటే ఇష్టం. తన స్నేహితురాలితో కలిసి ప్రాక్టీసు చేసేది. టీమిండియాకి ఆడాలని కలలు కనేవారు. కానీ పర్వత ప్రాంతమైన వయనాడ్ జిల్లాలో అమ్మాయిలకో జట్టు లేదు. దాంతో రాష్ట్ర జట్టులో చోటు సంపాదించడం కష్టమయ్యేది. అందుకే వయనాడ్ జట్టుని తయారుచేయాలనుకున్నారు ఎస్లమ్మ. కోళికోడ్ నుంచి ఉద్యోగరీత్యా వయనాడ్‌కు 42 ఏళ్ల కిందట వచ్చారామె. తన కాలేజీ క్రికెట్ జట్టుకి ఆడారు. ఆ అనుభవంతో తనే కోచ్‌గా మారారు. అప్పటికి తాను పనిచేస్తున్న మనంతవాడీ స్కూల్ పిల్లలూ... అనుమోల్, ఆమె స్నేహితురాలితో ఓ జట్టు తయారుచేశారు. తమ పిల్లల్ని క్రికెట్ ఆడించడానికి చాలామంది తల్లిదండ్రులు ఆసక్తి చూపేవారు కాదు. ఆర్థిక ప్రయోజనాలు చెప్పి కష్టపడి ఒప్పించేవారు ఎస్లమ్మ. పర్యటనలకు వెళ్లాలంటే ఖర్చులతోపాటు భద్రత గురించి తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. వారి అభద్రతా భావాన్ని పోగొట్టడానికి జట్టుతోపాటు వెళ్లేవారు ఎస్లమ్మ. అనుమోల్ పాత క్రికెట్ బ్యాట్‌లనే చాలామంది పిల్లలకు ఇచ్చేవారు. ఒక స్థాయిని చేరుకున్నాక పిల్లల్ని అకాడమీల్లో చేర్పించి పూర్తిగా క్రికెట్‌మీద దృష్టి పెట్టేలా చేస్తారు. జిల్లా జట్టు తయారయ్యాక మొదటి మూడేళ్లు అపజయాలు ఎదురయ్యాయి. ఆ తర్వాతే గెలుపు రుచి చూశారు. క్రమంగా అండర్-16, 19, 23 విభాగాల్లో రాష్ట్రస్థాయి టైటిల్స్ గెలిచింది వయనాడ్ జట్టు.

రెండు దశాబ్దాలు... పరిస్థితుల్లో పూర్తి మార్పు వచ్చింది. ప్రస్తుత రాష్ట్ర జట్టులో ఆరుగురు వయనాడ్ అమ్మాయిలు ఉన్నారు. కేరళ నుంచి ముగ్గురు ఇండియాకి ఎంపికైతే వారిలో ఇద్దరు వయనాడ్ నుంచే. వారిలో ఒకరు సజన సజీవన్. ఆ అమ్మాయి అథ్లెటిక్స్ ప్రాక్టీసు చేసేది. క్రికెట్‌కి మారడం గురించి మొదట తల్లిదండ్రులు అనాసక్తత చూపారు. అథ్లెటిక్స్‌తోపాటు క్రికెట్ ఆడొచ్చని చెప్పడంతో అంగీకరించారు. మహిళల ఐపీఎల్‌లో ముంబయి జట్టుకు ఎంపికైన సజన.. క్రికెట్‌ద్వారా వచ్చిన డబ్బుతో ఇల్లు కట్టించుకుంది. ప్రస్తుతం టీమిండియాకూ ఎంపికై.. టీ20 ప్రపంచకప్‌లోనూ అదరగొడుతోంది. వయనాడ్ నుంచి భారతజట్టుకి ఆడిన మరో క్రీడాకారిణి మిన్నూ మణిది కూడా దాదాపు ఇలాంటి కథే! ప్రస్తుతం అనుమోల్.. కేరళ క్రికెట్ అసోషియేషన్‌కి సెలక్టర్. వ్యవసాయ శాఖలో ఉద్యోగం చేస్తూ ఈ బాధ్యతలు చేపడుతున్నారు. 'మా అమ్మాయి ఇండియాకి ఆడాలనేది నా కల. ఆ కలను ఇప్పుడు ఈ అమ్మాయిలందరి రూపంలో నిజం చేసుకుంటున్నా' అని చెప్పే ఎస్లమ్మ ఈ మధ్యనే రిటైరయ్యారు.

చేతికి చమక్కుమనే అందం...

ఫ్యాషన్ ఫ్యాషన్





ఫ్యాషన్ అంటే దుస్తులే కాదు... జ్యుయెలరీ ట్రెండ్ అనుసరించడం కూడా అంటారు ఈతరం అమ్మాయిలు. అందుకే వారి మనసు తెలుసుకున్న తయారీదారులు ఎప్పటికప్పుడు నయా డిజైన్లలో నగలను తీసుకొస్తున్నారు. పాత నగలకి కొత్త హంగులద్ది ఆకట్టుకుంటున్నారు. అలాంటి వాటిల్లో హాత్ఫూల్ నగలు కూడా ఒకటి. ఉత్తరాదిన ఈ డిజైన్లను తాజాపూలతో తయారు చేస్తారు. నవవధువులు మెహందీ, హల్దీ వేడుకల్లో అలంకరించుకుని మెరిసిపోతారు. వీటి స్ఫూర్తిగానే బ్రేస్‌లెట్, ఉంగరం కలుపుతూ బంగారంతో చేసిన హాత్ఫూల్స్ ప్రాచుర్యంలోకి వచ్చాయి. సంప్రదాయంగా ఉండటమే కాదు చేతికి నిండుదనాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఒకప్పుడు సాదాగా కనిపించిన వీటిలో ఇప్పుడు డైమండ్లు, ముత్యాలు, పచ్చలు, పసిడిపూసలు, టెంపుల్ డిజైన్లు చేరి ఆడంబరంగా మెరిసిపోతూ రాచరికపు హంగుల్ని తెచ్చిపెడుతున్నాయి. తాజాగా ఈ ట్రెండ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ కొత్త పెళ్లికూతుళ్లను కట్టి పారేస్తున్నాయి. వాటిని ఓసారి చూడండి మీకూ నచ్చేస్తాయి.





ఏదేమైనా ఇలాగే ఆడతాం


గంభీర్

బెంగళూరు

టెస్టు క్రికెట్లో టీమ్ఇండియా బ్యాటర్ల ప్రస్తుత ఆటతీరును మార్చేది లేదని ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. సాహసోపేత ఆటతీరుతోనే ఎక్కువ ఫలితాలు సాధించవచ్చనే దృక్పథాన్ని కొనసాగిస్తామన్నాడు. ఇటీవల బంగ్లాదేశ్తో చివరి టెస్టులో వర్షంతో రెండున్నర రోజుల ఆట తుడిచిపెట్టుకుపోయినా.. మిగతా ఆటలో దూకుడుగా ఆడిన టీమ్ఇండియా అద్భుత విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు న్యూజిలాండ్తో సిరీస్లోనూ భారత్ ఇదే పంథాలో సాగుతుందని గంభీర్ అంటున్నాడు. "ఆటగాళ్లు సహజంగా ఆడుతూ రోజుకు 400 నుంచి 500 పరుగులు సాధిస్తుంటే వాళ్లను ఎందుకు ఆపాలి? మేం అలాగే ఆడతాం. సాహసోపేత ఆటతీరుతో ఎక్కువ ఫలితాలు వస్తాయి. అలాగే వైఫల్యాలూ ఉంటాయి. మా జట్టు 100 పరుగులకే కుప్పకూలే రోజులు రావొచ్చు. అయినప్పటికీ ఆటగాళ్లకు మద్దతుగా నిలుస్తూ సాహసోపేత క్రికెట్ ఆడతాం. ఈ విధంగానే మ్యాచ్ను ముందుకు తీసుకెళ్లి, ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఫలితం రాబట్టాలనుకుంటున్నాం" అని అతను చెప్పాడు. కివీస్తో సిరీస్ టీమ్ఇండియాకు సవాలేనని గంభీర్ అభిప్రాయపడ్డాడు. "న్యూజిలాండ్ ఉత్తమ జట్టు అని మాకు తెలుసు. అందులో కొంతమంది నాణ్యమైన ఆటగాళ్లున్నారు. వాళ్లు మమ్మల్ని ఇబ్బంది పెడతారు. కాబట్టి ఈ మూడు టెస్టుల సిరీస్ మాకు పెద్ద సవాలే. వాళ్లను గౌరవిస్తాం. కానీ ఎవరికీ భయపడం" అని అతను పేర్కొన్నాడు. భవిష్యత్పై కాకుండా ప్రస్తుత మ్యాచ్పైనే దృష్టి పెడతామని గంభీర్ తెలిపాడు.

కోహ్లి ఆకలితోనే ఉన్నాడు: కోహ్లి పరుగుల ఆకలితోనే ఉన్నాడని.. ప్రతి మ్యాచ్ తర్వాత అతణ్ని అంచనా వేయడం సరికాదని గంభీర్ అన్నాడు. టెస్టుల్లో గత ఎనిమిది ఇన్నింగ్స్ల్లో కోహ్లి ఒక్క అర్ధశతకం మాత్రమే చేశాడు. "విరాట్ పట్ల నా ఆలోచనలు స్పష్టంగా ఉన్నాయి. అతనో ప్రపంచ స్థాయి క్రికెటర్. సుదీర్ఘ కాలంగా మంచి ప్రదర్శన చేస్తున్నాడు. అరంగేట్రంలో ఎలాంటి పరుగుల ఆకలితో కనిపించాడో ఇప్పుడూ అలాగే ఉన్నాడు. ఆ ఆకలే అతణ్ని ప్రపంచ స్థాయి ఆటగాడిగా మార్చింది. ఈ సిరీస్లో పరుగులు చేయాలనే తపనతోనే అతను ఉన్నాడనుకుంటున్నా. ఆ తర్వాత ఆస్ట్రేలియా సిరీస్పై దృష్టి పెడతాడు. ప్రతి మ్యాచ్ తర్వాత ఆటగాళ్లను అంచనా వేయలేం. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు బాగా ఆడలేరు. వైఫల్యాలు ఉంటాయి. మా ఆటగాళ్లకు మేం మద్దతుగా నిలుస్తూనే ఉంటాం. జట్టు నుంచి తప్పించడం కాదు అత్యుత్తమ 11 మందిని ఆడించడమే నా పని" అని గంభీర్ అన్నాడు.

ఛాంపియన్స్

ఎప్పుడో 2013లో చివరిసారి సొంతగడ్డపై టెస్టు సిరీస్ను కోల్పోయింది టీమ్ఇండియా. ఆ తర్వాత ఎదురే లేదు. జైత్రయాత్రను కొనసాగిస్తూ తాజాగా బంగ్లాదేశ్ను కుమ్మేసింది. భారత్కు సొంతగడ్డపై వరుసగా 18వ సిరీస్ విజయమది. రెట్టించిన ఉత్సాహంతో ఇప్పుడు న్యూజిలాండ్తో మూడు టెస్టుల సమరానికి సిద్ధమైంది. మరి పోటీ ఎలా ఉండబోతోంది. రోహిత్సేనను కివీస్ ఆపగలదా?



కివీస్ నిలవగలదా?

ఈనాడు క్రీడావిభాగం

న్యూజిలాండ్తో భారత్ టెస్టు సమరం బుధవారమే మొదలు కాబోతోంది. చరిత్ర చూసినా, ప్రస్తుత ఫామ్ ప్రకారం చూసినా టీమ్ఇండియా తిరుగులేని ఫేవరెట్గా బరిలోకి దిగుతోందనడంలో సందేహం లేదు. అటు బ్యాటుతోనూ ఇటు బంతితోనూ బంగ్లాపై ఆధిపత్యాన్ని ప్రదర్శించిన రోహిత్ బృందానికి ఎలాంటి సమస్యలూ లేవు. శుభ్మన్ గిల్, పునరాగమన హీరో పంత్ శతకాలతో సత్తా చాటారు. యశస్వి జైస్వాల్ మూడు అర్ధశతకాలతో మంచి ఫామ్లో ఉన్నాడు. సీనియర్ ఆటగాళ్లు కోహ్లి, రోహిత్ గొప్పగా రాణించకపోయినా.. విశేష అనుభవం ఉన్న వారికి గాడిన పడడానికి అట్టే సమయం పట్టదు. ఇక బంతితో స్పిన్నర్లు అశ్విన్, జడేజాలతో పాటు పేసర్ బుమ్రా కూడా బంగ్లా బ్యాటర్లను హడలెత్తించి జోరు మీదున్నారు. బ్యాటుతోనూ రాణించిన అశ్విన్ ఓ సెంచరీ సహా బంగ్లాపై 57 సగటుతో పరుగులు చేయడం విశేషం. ఇలా అన్ని విభాగాల్లోనూ దుర్భేద్యంగా కనిపిస్తోన్న భారత్ ఖాతాలో మరో సిరీస్ చేరకుండా నిలువరించడం న్యూజిలాండ్కు పెను సవాలే. భారత్కు పూర్తిగా విరుద్ధమైన ఫామ్ ఆ జట్టుది. ఇటీవల శ్రీలంక పర్యటనలో కివీస్ పరాభవాన్ని మూటగట్టుకుంది. కొన్నేళ్లుగా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న లంక 2-0తో కివీస్కు షాకిచ్చింది. లంక స్పిన్కు తేలిపోయిన ఆ జట్టుకు అత్యంత అనుభవజ్ఞులైన భారత స్పిన్నర్లను భారత్లో ఎదుర్కోవడం చాలా కష్టమవుతుందన్నది ఊహించలేనిదేమీ కాదు. అశ్విన్, జడేజా కలిసి బంగ్లాపై 20 వికెట్లు పడగొట్టారు. బోర్డర్-గావస్కర్ సిరీస్ నేపథ్యంలో బంగ్లాతో సిరీస్కు పేస్ అనుకూల పిచ్లు సిద్ధం చేసుకున్న భారత్.. ఈ సిరీస్కు అలాంటి పిచ్లను కొనసాగించనుండడం కివీస్కు కాస్త ఉపశమనాన్నిచ్చే విషయమే అయినా నాణ్యమైన భారత స్పిన్నర్లతో ఆ జట్టుకు ఎప్పుడూ ముప్పే. కివీస్ బ్యాటర్ల ప్రస్తుత ఫామ్ పేలవం. విలియమ్సన్ సహా ఒక్క బ్యాటర్ కూడా లంకలో శతకం చేయలేకపోయాడు. ఒక్కటి కంటే ఎక్కువ అర్ధశతకాలు చేసిన బ్యాటర్ కూడా లేడు. విలియమ్సన్ కష్టంగా 34.50 సగటుతో 138 పరుగులు చేశాడు. రచిన్ రవీంద్ర 38.25 సగటుతో 153 పరుగులు సాధించాడు. లేథమ్, కాన్వే, మిచెల్ పెద్దగా ఫామ్లో లేరు. పైగా తొలి టెస్టుకు అనుభవజ్ఞుడైన విలియమ్సన్ అందుబాటులో లేకపోవడం కివీస్కు పెద్ద దెబ్బ. మరోవైపు బౌలింగ్లోనూ లంకపై తేలిపోయింది. సిరీస్ మొత్తంలో సౌథీ, శాంట్నర్ కలిపి కేవలం మూడు వికెట్లే పడగొట్టారంటే వాళ్ల ఫామ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చెరో ఎనిమిది వికెట్లు పడగొట్టి ఫర్వాలేదనిపించిన కొత్త పేసర్ ఒరూర్కె, స్పిన్నర్ అజాజ్ పటేల్లపై కివీస్ మరోసారి ఆశలు పెట్టుకుంది. నిజానికి కివీస్ పేలవ ఫామ్ ఇప్పటిది కాదు. అంతకుముందు సొంతగడ్డపై ఆస్ట్రేలియా టెస్టు సిరీస్ను కూడా 0-2తో కోల్పోయింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో భారత్పై న్యూజిలాండ్ రాణిస్తే గొప్ప విషయమే.

ఒక్కసారి కూడా..

భారత్ విశ్వాసాన్ని రెట్టింపు చేసే విషయం ఇంకోటి ఉంది. ఇప్పటివరకు ఆ జట్టు సొంతగడ్డపై న్యూజిలాండ్కు టెస్టు సిరీస్ను కోల్పోలేదు. ఆ మాటకొస్తే కివీస్ ఒక్కసారి టీ20 సిరీస్ను గెలవడం మినహాయిస్తే భారత పర్యటన నుంచి ప్రతిసారీ రిక్త హస్తాలతో వెనుదిరిగింది. చివరగా 2021లో సొంతగడ్డపై కివీస్తో ఆడిన సిరీస్ను టీమ్ఇండియా 1-0తో గెలుచుకుంది. మొత్తంగా ఇప్పటివరకు రెండు జట్లు 62 టెస్టుల్లో తలపడగా భారత్ 22, న్యూజిలాండ్ 13 గెలిచాయి. 27 టెస్టులు డ్రాగా ముగిశాయి.

ముస్తాక్ అలీలో 'ఇంపాక్ట్ ప్లేయర్' ఉండడు

దిల్లీ: వచ్చే సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను రద్దు చేయాలని బీసీసీఐ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర సంఘాలకు సమాచారమిచ్చింది. అయితే ఈ నిబంధనను ఐపీఎల్లో 2027 వరకు కొనసాగించాలని బోర్డు ఇంతకుముందే నిర్ణయించింది. రోహిత్ శర్మ సహా చాలా మంది ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. చాలా ఫ్రాంఛైజీలు దీని వైపు మొగ్గుచూపాయి.

స్టోక్స్ వచ్చేశాడు


స్టోక్స్

నేటి నుంచి ఇంగ్లాండ్-పాక్ రెండో టెస్టు

ముల్తాన్: భారీ స్కోర్లు నమోదైన తొలి టెస్టులో పాకిస్థాన్ను ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో చిత్తు చేసిన ఇంగ్లాండ్.. మంగళవారం ఆరంభమయ్యే రెండో టెస్టులో మరింత ఉత్సాహంతో బరిలో దిగుతోంది. రెగ్యులర్ కెప్టెన్, స్టార్ ఆల్రౌండర్ బెన్ స్టోక్స్ పునరాగమనం చేయడంతో ఆ జట్టు మరింత బలోపేతమైంది. చీలమండ గాయంతో తొలి టెస్టులో స్టోక్స్ ఆడలేకపోవడంతో ఒలీ పోప్ ఇంగ్లాండ్ను నడిపించాడు. స్టోక్స్ నెట్స్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్యాటింగ్తో పాటు బౌలింగ్ చేశాడని ఈసీబీ వర్గాలు తెలిపాయి. పాక్తో రెండో టెస్టుకు ఫాస్ట్ బౌలర్ అట్కిన్సన్ స్థానంలో మరో పేసర్ మాథ్యూ పాట్స్ ఇంగ్లాండ్ జట్టులోకి వచ్చాడు. స్పిన్నర్లు షోయబ్ బషీర్, జాక్ లీచ్ కూడా తుది జట్టులో ఆడనున్నారు. మరోవైపు పాక్ ఇప్పటిదాకా రెండో టెస్టుకు తుది జట్టును ప్రకటించలేదు. ఈ టెస్టుకు బాబర్ అజామ్, షహీన్షా అఫ్రిది, నసీమ్ షాలతో పాటు సర్ఫరాజ్ అహ్మద్లను సెలక్టర్లు తప్పించారు. వరుస వైఫల్యాలతో ఇప్పటికే వెనుకంజలో ఉన్న పాక్ ఈ స్టార్లు లేకుండా రెండో టెస్టులో ఇంగ్లాండ్ను ఎలా ఎదుర్కొంటుందన్నది ఆసక్తికరం.

భారత్తో సిరీస్కు గ్రీన్ దూరం


గ్రీన్

మెల్బోర్న్: ఆస్ట్రేలియా ఆల్రౌండర్ కామెరూన్ గ్రీన్ గాయం వల్ల భారత్తో బోర్డర్-గావస్కర్ ట్రోఫీకి దూరమయ్యాడు. వెన్ను గాయంతో బాధపడుతున్న అతడికి శస్త్రచికిత్స జరగనుంది. ఆ తర్వాత కోలుకోవడానికి అతడికి ఆరు నెలల సమయం పడుతుంది. దీంతో అతడు బోర్డర్-గావస్కర్ ట్రోఫీతో పాటు శ్రీలంక పర్యటన, ఛాంపియన్స్ ట్రోఫీలకు కూడా దూరమవుతాడు. అతడు ఐపీఎల్లో ఆడడం కూడా అనుమానమే. గత నెలలో ఇంగ్లాండ్ పర్యటన సందర్భంగా గ్రీన్కు ఈ సమస్య మొదలైంది.

మళ్లీ నాలుగో స్థానానికి స్మిత్: ఆసీస్ వెటరన్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ టెస్టుల్లో తిరిగి తనకు ఇష్టమైన నాలుగో స్థానంలో బ్యాటింగ్కు రానున్నాడు. ఓపెనర్ డేవిడ్ వార్నర్ రిటైర్మెంట్తో స్మిత్ స్వచ్ఛందంగా ఓపెనింగ్ చేయడానికి ముందుకొచ్చాడు. కొత్త పాత్రలో తన రెండో టెస్టులోనే 91 పరుగులతో అజేయంగా నిలిచినా.. మొత్తంగా ఆ పాత్రలో అతడు విజయవంతం కాలేకపోయాడు. న్యూజిలాండ్తో సిరీస్లో నాలుగు ఇన్నింగ్స్ల్లో 51 పరుగులు మాత్రమే చేశాడు. ఖవాజాకు జతగా భారత్తో సిరీస్లో ఎవరు ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ను ఆరంభిస్తారన్నది ప్రశ్న. బాన్క్రాఫ్ట్, సామ్ కొన్స్టాస్, మార్కస్ హారిస్ పోటీలో ఉన్నారు.

ఆశలు ఆవిరి

- న్యూజిలాండ్ చేతిలో పాక్ చిత్తు
- టీ20 ప్రపంచకప్ నుంచి భారత్ ఔట్

దుబాయ్


ఈడెన్ కార్సన్ 2/7

మహిళల టీ20 ప్రపంచకప్లో భారత్ కథ ముగిసింది. న్యూజిలాండ్పై పాకిస్థాన్ గెలిస్తే సెమీఫైనల్ అవకాశాలు ఉంటాయని ఆశించిన భారత్కు నిరాశే మిగిలింది. గ్రూప్-ఎ ఆఖరి లీగ్ మ్యాచ్లో కివీస్ 54 పరుగుల తేడాతో పాక్ను చిత్తు చేసి నాకౌట్ చేరింది. ఆస్ట్రేలియా ఇప్పటికే ముందంజ వేయడంతో.. భారత్, పాక్ టోర్నీ నుంచి నిష్క్రమించాయి. సోమవారం మొదట న్యూజిలాండ్ను పాక్ బౌలర్లు 110/6కే కట్టడి చేశారు. సుజీ బేట్స్ (28) టాప్ స్కోరర్. నష్రా సంధు (3/18) రాణించింది. ఛేదనలో అమేలియా కెర్ (3/14), ఈడెన్ కార్సన్ (2/7) ధాటికి పాక్ 11.4 ఓవర్లలో 56 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ సనా ఫాతిమా (21) మాత్రమే పోరాడింది.

ఆశలు చిగురించినా..: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కివీస్ ఇన్నింగ్స్ మొదలైన తీరుకి ముగిసిన విధానానికి పొంతనే లేదు. సుజీ బేట్స్, జార్జియా (17) రాణించడంతో కివీస్ 6.2 ఓవర్లలో 41/0తో మెరుగైన స్థితిలో నిలిచింది. కానీ స్పిన్నర్ల రాకతో కివీస్ తడబడింది. జార్జియా, బేట్స్తో పాటు అమేలియా కెర్ (9) వికెట్లను చేజార్చుకుంది. సోఫి డివైన్ (19), బ్రూక్ హాలిడే (22) కాసేపు నిలవడంతో న్యూజిలాండ్ స్కోరు 100 దాటింది. పాక్ బౌలర్లలో నష్రా కాకుండా ఒమైమా (1/14), నిడా దార్ (1/26), సాదియా ఇక్బాల్ (1/23) ప్రత్యర్థిని కట్టడి చేశారు. కివీస్ తక్కువ స్కోరుకే పరిమితం కావడంతో పాక్తో పాటు భారత అభిమానుల్లోనూ ఆశలు చిగురించాయి. కానీ కివీస్ బౌలర్లు ఆరంభం నుంచే విజృంభించి ఈ ఆశలపై నీళ్లు చల్లారు. కార్సన్, రోజ్మేరీ (1/18) ధాటికి పవర్ప్లేలోపే పాక్ సగం వికెట్లను చేజార్చుకుంది. ఆలియా (0), ఇరమ్ జావీద్ (3), సదాఫ్ (2), సిద్రా (0) అలా వచ్చి ఇలా వెళ్లారు. ఫాతిమాతో పాటు ఓపెనర్ మునీబా అలీ (15) నిలిచినా.. ఆ పోరాటం కూడా కాసేపే! అమేలియా కెర్ నియంత్రణతో కూడిన బౌలింగ్తో లోయరార్డర్ పని పట్టడంతో 9.4 ఓవర్లకు 52/5తో ఉన్న పాక్ 4 పరుగుల తేడాతో 5 వికెట్లు కోల్పోయి ఓటమి మూటగట్టుకుంది.

సంక్షిప్త స్కోర్లు... న్యూజిలాండ్: 110/6 (సుజీ బేట్స్ 28 జార్జియా ప్లిమర్ 17, సోఫీ డివైన్ 19, బ్రూక్ హాలిడే 22; నష్రా సంధు 3/18, ఒమైమా 1/14, నిదా దార్ 1/26, సాదియా ఇక్బాల్ 1/23); **పాకిస్థాన్:** 56 ఆలౌట్ (ఫాతిమా సనా 21, ఈడెన్ కార్సన్ 2/7, అమేలియా కెర్ 3/14)

టైటిల్పై సింధు గురి


సింధు

నేటి నుంచే డెన్మార్క్ ఓపెన్

ఒడెన్స్ (డెన్మార్క్): ఈ ఏడాది నిరాశాజనక ప్రదర్శన చేసిన భారత స్టార్ షట్లర్ పి.వి.సింధుకు పరీక్ష! ఫామ్లోకి రావాలనే పట్టుదలతో ఉన్న ఆమె మంగళవారం డెన్మార్క్ ఓపెన్లో టైటిలే లక్ష్యంగా బరిలో దిగుతోంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో పై యూపో (చైనీస్ తైపీ)తో తలపడనుంది. మహిళల సింగిల్స్లో యువ షట్లర్లు మాళవిక బాన్సోడ్, ఆకర్షి కశ్యప్, ఉన్నతి హుడా కూడా బరిలో ఉన్నారు. పురుషుల సింగిల్స్లో లక్ష్యసేన్ కూడా టైటిల్పై కన్నేశాడు. ఈ ఏడాది ఆశించిన ప్రదర్శన చేయలేకపోయిన అతడు ఈ టోర్నీలో సత్తా చాటాలని ఆశిస్తున్నాడు. మహిళల డబుల్స్లో రుతుపర్ణ-శ్వేత పర్ణ పండా జోడీ, మిక్స్డ్ డబుల్స్లో సుమీత్రెడ్డి-సిక్కిరెడ్డి, సతీష్-ఆద్య జంటలు బరిలో ఉన్నాయి.

విజృంభించిన ప్రియజీత్, రింకేశ్

గుజరాత్ చేతిలో హైదరాబాద్ ఓటమి

ఈనాడు, హైదరాబాద్: రంజీ సీజన్ను హైదరాబాద్ ఓటమితో ప్రారంభించింది. ఎలీట్ గ్రూప్-బి పోరులో 126 పరుగుల తేడాతో గుజరాత్ చేతిలో చిత్తయింది. చివరి రోజు 296 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్.. ప్రియజీత్ (3/23), రింకేశ్ వాఘేలా (3/52) విజృంభించడంతో 170 పరుగులకే ఆలౌటైంది. ఛేదనలో ఆరంభం నుంచి హైదరాబాద్ తడబడింది. అభిరత్ రెడ్డి (51), రోహిత్ రాయుడు (26), హిమతేజ (29), చామ మిలింద్ (28) పోరాడినా.. మిగిలిన బ్యాటర్లు విఫలం కావడంతో హైదరాబాద్ 200లోపే ఆలౌటై పరాజయాన్ని మూటగట్టుకుంది. ప్రియజీత్, రింకేశ్తో పాటు సిద్ధార్థ్ దేశాయ్ (2/47), అర్జాన్ (2/28) హైదరాబాద్ను దెబ్బ తీశారు. తొలి ఇన్నింగ్స్లో గుజరాత్ 343.. హైదరాబాద్ 248 చేశాయి. రెండో ఇన్నింగ్స్లో గుజరాత్ 201 చేసింది.

ఆంధ్ర కూడా..: విదర్భతో రంజీ ట్రోఫీ ఎలీట్ గ్రూప్-బి మ్యాచ్లో ఆంధ్ర చేజేతులా ఓడింది. 318 పరుగుల ఛేదనలో చివరిరోజు 239 పరుగులు చేయాల్సిన స్థితిలో ఓవర్నైట్ స్కోరు 79/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 243కే ఆలౌటైంది. ఒక దశలో 177/1తో విజయం దిశగా దూసుకెళ్లిన ఆంధ్ర.. 66 పరుగుల తేడాతో 9 వికెట్లు కోల్పోయి అనూహ్యంగా ఓడిపోయింది. అభిషేక్రెడ్డి (78), షేక్ రషీద్ (74) రాణించినా మిగిలిన బ్యాటర్లు సత్తా చాటలేకపోయారు. ఆదిత్య థాక్రే (4/47), హర్ష్ దూబె (4/69) ఆంధ్ర పతనంలో కీలకమయ్యారు. తొలి ఇన్నింగ్స్లో విదర్భ 118.. ఆంధ్ర 167 పరుగులు చేశాయి. రెండో ఇన్నింగ్స్లో విదర్భ 366 సాధించింది.

ముంబయికి బరోడా షాక్: డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయికి షాక్! సీజన్ తొలి మ్యాచ్లో ఆ జట్టును బరోడా కంగుతినిపించింది. 262 పరుగుల ఛేదనలో ఓవర్నైట్ స్కోరు 42/2తో చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబయి.. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ భార్గవ్ భట్ (6/55) ధాటికి 177కే ఆలౌటైంది. సిద్ధార్థ్ లాడ్ (59) పోరాడాడు. భార్గవ్తో మహేశ్ (2/68) బరోడా గెలుపులో కీలకపాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్లో బరోడా 290.. ముంబయి 214 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్లో బరోడా 185కే ఆలౌటైంది.

పాక్ క్రికెట్కు ఏమైంది?


బాబర్

ఒకప్పుడు.. ప్రపంచ క్రికెట్లో బలీయమైన శక్తి. సొంతగడ్డపైనే కాక విదేశాల్లోనూ ఆధిపత్యం చలాయించిన జట్టది. 1992లో వన్డే, 2009లో టీ20 ప్రపంచకప్ల్లో విజేతగా నిలిచింది.

ఇప్పుడు.. పసికూనల చేతుల్లో పరాభవాలు. అనిశ్చితితో కూడిన ఆటతీరుతో అనూహ్య ఓటములు. ఆటేతర విషయాల్లోనూ వివాదాలు!

ఇదీ.. పాకిస్థాన్ క్రికెట్ జట్టు తాజా దుస్థితి. ఘన ప్రస్థానం నుంచి పతనం వైపు వేగంగా అడుగులేస్తోందా జట్టు.

బాబర్ అజామ్ లాంటి మేటి ఆటగాడిని ఇప్పుడు జట్టు నుంచి పక్కన పెట్టడం పాక్ క్రికెట్ పతనానికి రుజువు.

ఈనాడు క్రీడావిభాగం

ఐర్లాండ్ చేతిలో తొలిసారి టీ20 ఓటమి.. పొట్టి ప్రపంచకప్లో పసికూన అమెరికా చేతిలో పరాజయం.. సొంతగడ్డపై బంగ్లాదేశ్తో టెస్టు సిరీస్లో 0-2తో క్లీన్స్వీప్ పరాభవం.. తాజాగా ఇంగ్లాండ్తో తొలి ఇన్నింగ్స్లో 550కి పైగా పరుగులు చేసినా ఇన్నింగ్స్ తేడాతో ఓటమి.. కొన్నేళ్లుగా పడిపోతున్న పాకిస్థాన్ ఆటతీరుకు మచ్చుతునకలివి! ఒకప్పుడు స్వదేశంలో తిరుగులేని పాక్.. ఇప్పుడు అక్కడా పరాభవాలు ఎదుర్కొంటోంది. 2022 నుంచి స్వదేశంలో ఆడిన 11 టెస్టుల్లో ఒక్కటీ గెలవలేదు. గతేడాది వన్డే ప్రపంచకప్లో, ఈ ఏడాది టీ20 ప్రపంచకప్లో గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. దాదాపు ఆరు దశాబ్దాల్లో తొలిసారి టెస్టు ర్యాంకింగ్స్లో 8వ స్థానానికి పడిపోయింది.

ఎన్నో కారణాలు: గత రెండేళ్లలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు ముగ్గురు ఛైర్మన్లు, జట్టుకు ఏడుగురు కోచ్లు, ముగ్గురు కెప్టెన్లు మారారు. ముఖ్యంగా బోర్డులో రాజకీయ జోక్యం చేటు చేస్తోంది. పీసీబీ ఛైర్మన్ మారిన ప్రతిసారి సెలక్షన్ కమిటీలో, జట్టు నాయకత్వంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం ఛైర్మన్గా ఉన్న మోసిన్ నక్వి.. అక్కడి ప్రభుత్వంలో మంత్రి కూడా. ఆయనపై ఎన్నో విమర్శలున్నాయి. ఇంగ్లాండ్తో తొలి టెస్టు ఓటమికి సెలక్షన్ కమిటీని బాధ్యులను చేస్తూ కొత్తవాళ్లను తీసుకున్నారు. ఆ కమిటీ బాబర్ అజామ్, షహీన్ షా అఫ్రిదిని పక్కనపెట్టడం వివాదస్పదంగా మారడంతో విశ్రాంతి ఇచ్చామని చెబుతున్నారు. సెలక్షన్ కమిటీ, కోచ్లు మారిన ప్రతిసారి జట్టులో మార్పులతో నిలకడన్నదే లేకుండా పోయింది. ఎవరొస్తారో? ఎవరు వెళ్తారో? తెలియని పరిస్థితి. ఆటగాళ్ల మధ్య బంధం లేకపోవడంతో గ్రూప్లుగా విడిపోయారనే వార్తలొస్తున్నాయి. గతేడాది వన్డే ప్రపంచకప్లో జట్టు పేలవ ప్రదర్శనతో మూడు ఫార్మాట్ల సారథ్యం నుంచి బాబర్ తప్పుకోవడంతో టెస్టులకు షాన్ మసూద్ను, టీ20లకు షహీన్ను కెప్టెన్లుగా చేశారు. కానీ పీసీబీ ఛైర్మన్గా మోసిన్ రావడంతోనే కేవలం ఒక్క సిరీస్ తర్వాత షహీన్పై వేటు వేసి మళ్లీ బాబర్కు టీ20, వన్డే కెప్టెన్సీని అప్పగించారు. కానీ ఈ ఏడాది టీ20 ప్రపంచకప్లో వైఫల్యంతో బాబర్ మళ్లీ నాయకత్వాన్ని వద్దనుకున్నాడు.

బాబర్ ప్రదర్శన ఇదీ..

	మ్యాచ్లు	పరుగులు	సగటు	100	50
టెస్టులు	55	3997	43.92	9	26
వన్డేలు	117	5729	56.72	19	32
టీ20లు	123	4145	41.03	3	36

బాబర్కు ఏమైంది?

పాకిస్థాన్లో ప్రతిభకు లోటు లేదు. కానీ ఆ ప్రతిభావంతులను గుర్తించి సానబెట్టే నిర్మాణాత్మక విధానమే కొరవడింది. అంతే కాక మేటి ఆటగాళ్లు ఫామ్తో తంటాలు పడుతుంటే వారికి మద్దతునిచ్చి తిరిగి లయ అందుకునే చేయడంలోనూ పాక్ క్రికెట్ విఫలమవుతోంది. ఇందుకు బాబర్ అజామ్ ఉదంతమే ఉదాహరణ. ఈ తరం మేటి బ్యాటర్లలో ఒకడిగా బాబర్ గుర్తింపు సంపాదించాడు. కానీ ఏడాదిగా అతను నిలకడ తప్పాడు. కొన్నేళ్ల పాటు కెప్టెన్గా వివిధ ఫార్మాట్లలో పాక్ నడిపించిన అతడిపై.. జట్టు వైఫల్యం తీవ్ర ప్రభావమే చూపించింది. కెప్టెన్గా ఈ వైఫల్యానికి బాధ్యత వహించాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఒత్తిడిని ఎదుర్కొన్నాడు. అది బ్యాటింగ్ దెబ్బ తినేలా చేసింది. గత 18 టెస్టు ఇన్నింగ్స్ల్లో ఒక్క అర్ధసెంచరీ చేయలేదు. వన్డేలు, టీ20ల్లోనూ ఫామ్ అంతంతమాత్రమే. వరుస వైఫల్యాలు, జట్టులో అంతర్గత కలహాలతో సతమతం అవుతున్న పాకిస్థాన్ క్రికెట్లో.. ఫామ్ కోల్పోయిన బాబర్ను పట్టించుకునే స్థితిలో ఎవరూ లేరు. కోహ్లి ఫామ్ దెబ్బ తిన్నపుడు అతడికి భారత జట్టు, యాజమాన్యం, బీసీసీఐ అండగా నిలిచినట్లు.. బాబర్కు మద్దతు లభించలేదని.. అందుకే అతడి ఆట మరింత పతనమై ఇప్పుడు జట్టులో చోటు కోల్పోయే స్థితికి చేరుకున్నాడని పాక్ మాజీలు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ప్రపంచ అత్యుత్తమ పేసర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్న షహీన్ షా అఫ్రిది కూడా ఇప్పుడు గొప్పగా లేదు. మోకాలి గాయం తర్వాత 2023 నుంచి 11 ఇన్నింగ్స్లో 17 వికెట్లు మాత్రమే పడగొట్టాడు. బోర్డులో రాజకీయాలు తదితర అంశాలు మైదానంలో వీళ్ల ఆటపై ప్రభావం చూపిస్తున్నాయి. గతేడాది వన్డే ప్రపంచకప్ తర్వాత పాకిస్థాన్ క్రికెట్లో ప్రక్షాళన అవసరమని మాజీలు గొంతెత్తారు. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్లోనూ పేలవ ప్రదర్శన తర్వాత జట్టుకు శస్త్రచికిత్స అవసరమని మోసిన్ చెప్పినా ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ పరిస్థితి పాక్ క్రికెట్కే కాదు ప్రపంచ క్రికెట్కూ చేటు చేసేదే. మరో వెస్టిండీస్, జింబాబ్వేలా మారకముందే పాక్ క్రికెట్ను గాడినపెట్టే చర్యలకు పూనుకుంటారేమో చూడాలి.

ప్రశ్నించిన ఫకార్కు షోకాజ్ నోటీసు


ఫకార్ జమాన్

లాహోర్: ఇంగ్లాండ్తో చివరి రెండు టెస్టుల నుంచి మాజీ కెప్టెన్ బాబర్ అజామ్ను తప్పిస్తారనే వార్తలపై ముందుగానే అసంతృప్తి వ్యక్తం చేసిన ఫకార్ జమాన్కు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) షాకిచ్చింది. బోర్డు విధానాలు, ఎంపికను విమర్శించిన అతను ఆటగాళ్ల ప్రవర్తన నియామవళిని ఉల్లంఘించాడని, ఈ నెల 21 లోపు సమాధానం చెప్పాలని షోకాజ్ నోటీసు జారీ చేసింది. "బాబర్ను తప్పిస్తున్నారనే మాటలు వినడం ఆందోళన కలిగిస్తోంది. 2020 నుంచి 2023 వరకు కోహ్లి ఫామ్ లేమితో ఇబ్బంది పడ్డా అతణ్ని భారత్ బెంచ్పై కూర్చోబెట్టలేదు. అప్పుడు అతను వరుసగా 19.33, 28.21, 26.50 సగటు మాత్రమే నమోదు చేశాడు. ఇప్పుడు ఒకవేళ పాకిస్థాన్ అత్యుత్తమ బ్యాటర్ను పక్కన పెడితే అది జట్టుకు ప్రతికూల సందేశాన్ని పంపినట్లు అవుతుంది. ఆ ఆందోళనను ఆపేందుకు ఇంకా సమయముంది. కీలక ఆటగాళ్లను అణగదొక్కడం కాదు రక్షించడంపై దృష్టి పెట్టాలి" అని ఫకార్ ఎక్స్లో పోస్టు చేశాడు. ఆ తర్వాత ప్రకటించిన పాక్ జట్టులో బాబర్కు చోటు దక్కలేదు. సెంట్రల్ కాంట్రాక్టు ఆటగాడైన ఫకార్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కలకలం రేపింది.

(c) eenadu

ఇంధన కొరతకు టాటా.. హైడ్రోజన్ తూటా!

పర్యావరణ అనుకూల ఇంధనమైన హైడ్రోజన్‌ను భారీగా వినియోగంలోకి తెచ్చేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీటికి ఊతమిచ్చే దిశగా జపాన్‌కు చెందిన వాహన దిగ్గజం 'టయోటా' కీలక ఆవిష్కారం చేసింది. హైడ్రోజన్ ఫ్యూయెల్ సెల్ వాహనాలకు సులువుగా ప్రపంచంలో ఎక్కడైనా ఇంధనాన్ని నింపేందుకు వీలుగా పోర్టబుల్ హైడ్రోజన్ క్యాట్రిడ్జ్‌ను అభివృద్ధి చేసింది. ఇంధనం ఖాళీ అవుతుందనే బెంగ, గ్యాస్ స్టేషన్ల కోసం వెతకాల్సిన అవసరం లేకుండానే నిశ్చింతగా ప్రయాణాలు చేయడానికి ఇది వీలు కల్పిస్తుంది. బ్యాటరీలు మార్చినంత సులువుగా ఈ క్యాట్రిడ్జ్‌ను మార్చేసుకొని ప్రయాణాన్ని కొనసాగించొచ్చు. వాహనాలకే కాకుండా రోజువారీ జీవితంలో అనేక అవసరాలకు ఈ సాధనాన్ని ఉపయోగించొచ్చు.



హైడ్రోజన్ బహుముఖ ప్రయోజనకర ఇంధన వనరు. ఫ్యూయెల్ సెల్స్‌లో విద్యుదుత్పత్తికి ఇది ఉపయోగపడుతుంది. దహనశీల ఇంధనంగానూ అక్కరకొస్తుంది.

ఎందుకీ క్యాట్రిడ్జ్‌లు?

ప్రస్తుత హైడ్రోజన్ వాహనాలకు రీఫ్యూయెలింగ్ కేంద్రాలే ఆధారం. దీనికి తోడు ఇప్పుడు ఉపయోగిస్తున్న హైడ్రోజన్ ట్యాంకులు చాలా పెద్దగా ఉంటున్నాయి. వాటిని రవాణా చేయడం కష్టమవుతోంది. ఈ ఇబ్బందిని దూరం చేయడానికి టయోటాకు చెందిన వాహన సాంకేతిక సంస్థ వోవెన్. . 2022లో హైడ్రోజన్ క్యాట్రిడ్జ్‌లను అభివృద్ధి చేసింది. ఆ తర్వాత క్రమంగా దీన్ని మెరుగుపరుస్తూ వచ్చింది. చిన్నగా, తక్కువ బరువుతో దీన్ని తీర్చిదిద్దింది. ఒక మనిషి సులువుగా దీన్ని చేతులతో మోసుకెళ్లవచ్చు. చూడటానికి ఇది పెద్దసైజు ఏఏ బ్యాటరీని తలపిస్తుంది. వాహనంలో ఇంధనం నిండుకున్నప్పుడు దీన్ని మార్చి, మరో క్యాట్రిడ్జ్ అమర్చుకోవాలి. కొత్త తరం ఫ్యూయెల్ సెల్ ఎలక్ట్రిక్ వాహనాలకు(ఎఫ్‌సీఈవీ) ఇది మెరుగైన ఇంధన ఉపకరణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ వాహనాలకు సంప్రదాయ పద్ధతిలో ఛార్జింగ్ చేయడానికి చాలా సమయం పడుతుంది.



● హైడ్రోజన్ వినియోగం వల్ల కార్బన్‌డైఆక్సైడ్ వంటి హానికర ఉద్గారాలేవీ వెలువడవు. నీరు మాత్రమే వెలువడుతుంది. పవన, సౌర శక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరుల సాయంతోనూ పర్యావరణ అనుకూల పద్ధతుల్లో ఈ వాయువును ఉత్పత్తి చేయవచ్చు.

అనేక అవసరాలకు..

అందరికీ అందుబాటులో ఉండే, సురక్షిత ఇంధన వనరుగా హైడ్రోజన్‌ను మార్చేందుకు ఈ క్యాట్రిడ్జ్‌ను టయోటా అభివృద్ధి చేసింది. వాహనాలకే కాకుండా రోజువారీ జీవితంలో అనేక అవసరాలకు ఇది అక్కరకొస్తుంది.

● అత్యవసర పరిస్థితుల్లో ఈ హైడ్రోజన్ క్యాట్రిడ్జ్‌ను కారు నుంచి తొలగించి, మరేదైనా సాధనానికి శక్తిని అందించడానికి వాడొచ్చు.

● ఖాళీ అయిన క్యాట్రిడ్జ్‌ను గ్యాస్ సిలిండర్ తరహాలో రీఫిల్ చేసి మళ్లీ వాడొచ్చు.

● గ్రిడ్‌కు దూరంగా ఉన్న ప్రదేశాల్లో విద్యుత్ అందించడానికి ఇది ఉపయోగపడుతుంది.

● హైడ్రోజన్‌తో నడిచే స్టవ్‌కూ ఇది ఉపయోగపడుతుంది. రిన్నాయ్ కార్పొరేషన్ సాయంతో ఇలాంటి స్టవ్‌ను టయోటా అభివృద్ధి చేసింది.

● ఈ క్యాట్రిడ్జ్‌లను ఇళ్లకు సరఫరా చేసి, ఖాళీ అయిన వాటిని వెనక్కి తీసుకొని, కొత్త వాటిని అందించే వ్యవస్థకు ఈ ఆవిష్కారం శ్రీకారం చుడుతుందని నిపుణులు భావిస్తున్నారు. ఫలితంగా విస్తృత స్థాయిలో హైడ్రోజన్ పైప్‌లైన్ మౌలిక వసతుల ఏర్పాటు ఆవశ్యకత తప్పుతుంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

పెట్టుబడులు పెట్టండి.. చేయూతనందిస్తాం

- యూఎస్-ఇండియా భాగస్వామ్య సదస్సులో మంత్రి నారా లోకేశ్ పిలుపు
- ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రకటన



దిల్లీలో నిర్వహించిన లీడర్‌షిప్ సమ్మిట్‌లో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్. చిత్రంలో యాపిల్ ఇండియా ఎండీ విరాట్ భాటియా

ఈనాడు, దిల్లీ: 'మిగతా రాష్ట్రాలకంటే మేం వేగంగా పనిచేస్తాం. పెట్టుబడిదారులకు వేగంగా సేవలు అందిస్తున్నాం. ఏపీలో పెట్టుబడిపెట్టడానికి వచ్చినవారందరితో వాట్సప్‌గ్రూప్ ఏర్పాటుచేసి ప్రతి వారం వారికి అప్‌డేట్స్ అందిస్తున్నాం. ఇందుకోసం ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డును పునరుద్ధరించాం. రాష్ట్రంలో బిలియన్ డాలర్లకు మించి పెట్టుబడులు పెట్టే సంస్థ కార్యాలయంలోనే మా ప్రతినిధిని కూర్చోబెట్టి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలుచేసి చూపుతాం' అని ఏపీ విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు. ఆయన సోమవారం దిల్లీలో యూఎస్-ఇండో స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరం నిర్వహించిన లీడర్‌షిప్ సమ్మిట్‌ను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమానికి యాపిల్ ఇండియా ఎండీ విరాట్ భాటియా సంధానకర్తగా వ్యవహరించారు. 'ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో తొలి ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నూతన రాజధాని, పోర్టులు, బిగ్‌డేటా సెంటర్స్, పెట్రో, కెమికల్, ఆక్వా, బయోఫ్యూయల్స్, ఫార్మా, మెడికల్ పరికరాలు, ఐటీరంగాల్లో పెట్టుబడులకు అద్భుత అవకాశాలున్నాయి. దేశంలో మరే రాష్ట్రం చేయని విధంగా చేసి చూపుతాం. మమ్మల్ని నమ్మి ఏపీకి రండి. పెట్టుబడులు పెట్టండి' అని ఆయన విజ్ఞప్తి చేశారు. 'ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్య గణన మొదలుపెట్టాం. గత ఐదేళ్లలో నిద్రావస్థకు చేరిన బ్యూరోక్రసీని మేల్కొలిపి పరుగులు పెట్టిస్తున్నాం. విశాఖపట్నాన్ని బిగ్‌డేటా, ఏఐ, ఎంఎల్ కేంద్రంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. హైదరాబాద్ వై2కే బూమ్‌ను అందిపుచ్చుకుంది. ఇప్పుడు అలాగే విశాఖపట్నం తాజా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటుంది' అని లోకేశ్ వివరించారు.

కాలం కంటే ముందే ఆలోచించే చంద్రబాబు

'ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ కాలం కంటే ముందుగా ఆలోచిస్తూ వచ్చారు. ఆయన నేతృత్వంలో 92% స్ట్రైక్‌రేట్‌తో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రాష్ట్రాభివృద్ధి కోసం అందరూ చాలా ఉత్సాహంతో పనిచేస్తున్నారు. గతంలో ఎన్నడూలేనంత భారీ వరదలను మేం ఇటీవల చవిచూశాం. ఈ సమయంలో అందుబాటులో ఉన్న డ్రోన్లను వాడి వరద బాధితులకు ఆహారం సరఫరాచేశాం' అని ఆయన పేర్కొన్నారు.

ప్రపంచ స్థాయి రాజధాని లక్ష్యం

ప్రపంచంలోని మిగతా దేశాల రాజధానులతో పోటీపడాలన్నది మా లక్ష్యం. 2014లో రాజధాని లేని రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు గ్రీన్‌ఫీల్డ్ రాజధాని నిర్మించే పనిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారు. ప్రపంచ స్థాయి విద్యాసంస్థలను తీసుకురావడం ద్వారా అత్యుత్తమ మానవ వనరులను అభివృద్ధిచేసి రాష్ట్రాన్ని ఒక విజ్ఞాన, ఆర్థిక కేంద్రంగా మార్చే ప్రయత్నం చేస్తున్నాం. రియల్ టైం గవర్నమెంట్‌కు అతీతంగా ఇప్పుడు గవర్నమెంట్ ఆన్ యువర్ ఫోన్ విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నాం. ఇందులో తొలి దశ కింద 100 ప్రభుత్వ సేవలను ఫోన్ ద్వారా అందుబాటులోకి తేబోతున్నాం. దీనికి తోడు కృత్రిమమేధను ఉపయోగించబోతున్నాం. దీనివల్ల అద్భుతఫలితాలు వస్తాయనడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. వచ్చే వందరోజుల్లో పరిపాలనలో ఏఐని వినియోగిస్తాం. ఏ జిల్లాలో ఏఏ పరిశ్రమలు రాబోతున్నాయో చెప్పి వాటిలో పెట్టుబడి పెట్టాలని ప్రపంచస్థాయి సంస్థలను ఆహ్వానిస్తున్నాం' అని నారా లోకేశ్ పేర్కొన్నారు.



గాంధీ వైద్య కళాశాల వద్ద పార్థివదేహానికి నివాళి అర్పిస్తున్న పౌర హక్కుల సంఘం నేతలు, అభిమానులు

ప్రొఫెసర్ సాయిబాబాకు అశ్రునివాళి

భౌతికకాయాన్ని గాంధీ ఆసుపత్రికి అప్పగించిన కుటుంబ సభ్యులు

ఈనాడు, హైదరాబాద్: విద్యావేత్త, మానవహక్కుల కార్యకర్త ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకు ప్రజాసంఘాల ప్రతినిధులు, రాజకీయ నేతలు అశ్రునివాళి అర్పించారు. పార్థివదేహాన్ని నిమ్స్ నుంచి మౌలాలిలోని శ్రీనివాస హైట్స్‌కు సోమవారం తరలించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.50 గంటల వరకు సందర్శనార్థం ఉంచారు. భారాస నేతలు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కాంగ్రెస్ నాయకులు కె.కేశవరావు, మధుయాస్కీ, ఎమ్మెల్సీలు కోదండరాం, దేశపతి శ్రీనివాస్, ప్రొ.హరగోపాల్, విమలక్క, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, ప్రొ.కాశీం, నిర్బంధ వ్యతిరేక వేదిక కోకన్వీనర్ రవిచందర్, విరసం నాయకులు, వందల మంది సన్నిహితులు, అభిమానులు భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం భౌతిక కాయాన్ని గాంధీ ఆసుపత్రికి అప్పగించేందుకు ప్రత్యేక వాహనంలో ర్యాలీగా వెళ్లారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, గాంధీ ఆసుపత్రి వద్ద నివాళులర్పించారు. సాయంత్రం ఐదుగంటల ప్రాంతంలో గాంధీ ఆసుపత్రి వైద్యులు, అధికారులతో మాట్లాడి పార్థివదేహాన్ని అప్పగించారు.

సాయిబాబాది సర్కారు హత్యే: ప్రొఫెసర్ సాయిబాబాది ముమ్మాటికీ సర్కారు హత్యే అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. సాయిబాబా నిర్దోషి అని న్యాయస్థానం తేల్చినప్పుడు ఆయన్ను అకారణంగా పదేళ్ల పాటు జైలులో బంధించిన దోషులు ఎవరో కూడా తేల్చాలన్నారు. సాయిబాబాకు జరిగిన అన్యాయంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సీపీఐ తరఫున రాసిన లేఖను విడుదల చేశారు.

మాజీ ఏఏజీ పొన్నవోలుకు ఎదురుదెబ్బ

భద్రత ఇవ్వాలని ఆదేశించలేమన్న హైకోర్టు

ఈనాడు, అమరావతి: మాజీ అదనపు ఏజీ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఏఏజీ హోదాలో గతంలో తనకు కల్పించిన పోలీసు భద్రతను కొనసాగించేలా ఆదేశాలివ్వాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు సోమవారం కొట్టివేసింది. ఆయనకు ప్రాణహాని లేనందున పోలీసు భద్రత అవసరం లేదనే నిర్ణయానికి రావడానికి వెనుక సెక్యూరిటీ రివ్యూ కమిటీ(ఎస్ఆర్‌సీ)కి దురుద్దేశం ఉందనేందుకు తగిన కారణాలను పిటిషనర్ కోర్టు ముందు ఉంచలేకపోయారని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో భద్రతను కొనసాగించాలని ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది. రెడ్‌బుక్‌లో తన పేరు చేర్చారని మీడియాలో కథనాలు వచ్చాయంటూ పిటిషనర్ కోర్టు ముందు ఉంచిన పత్రికా కథనాలు ధ్రువీకరించినవి కాదని చెప్పింది. ఈ నేపథ్యంలో మాజీ ఏఏజీ పిటిషన్‌ను కొట్టి వేస్తున్నట్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి తీర్పు ఇచ్చారు.

హత్య కేసులో నందిగం సురేష్‌కు బెయిల్ నిరాకరణ

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు బెయిల్ నిరాకరిస్తూ గుంటూరు జిల్లా ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2020 డిసెంబరు 27న తుళ్లూరు మండలం వెలగపూడిలో రెండువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో మరియమ్మపై కొందరు దాడిచేయగా మరుసటి రోజు మృతి చెందారు. సురేష్ ప్రోద్బలంతోనే తన తల్లిపై దాడికి పాల్పడి హతమార్చారని ఆమె కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజకీయ ఒత్తిడి మేరకు ఆయనపై కేసు నమోదు చేయకుండా అప్పటి పోలీసులు సురేష్‌కు అనుకూలంగా వ్యవహరించారు. తెదేపా కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులో గత నెలలో సురేష్‌ను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం మరియమ్మ హత్య కేసులోనూ 78వ నిందితుడిగా తుళ్లూరు పోలీసులు నమోదు చేసి ఆయన్ని అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో సురేష్ బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. గుంటూరు ప్రత్యేక న్యాయస్థానంలో ఆయన తరఫున న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. రాజకీయ కక్షతోనే నాలుగేళ్ల అనంతరం సురేష్‌పై కేసు నమోదు చేశారని న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల తరఫున ప్రాసిక్యూషన్ అదనపు డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ వాదనలు కొనసాగిస్తూ.. హతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదులో సురేష్ పాత్ర గురించి ఉందని, అప్పటి పోలీసులు రాజకీయ ఒత్తిడి మేరకు ఆయన పేరును ఎఫ్.ఐ.ఆర్.లో నమోదు చేయలేదన్నారు. ఆయన ప్రోద్బలంతో జరిగిన దాడిలోనే మరియమ్మ మృతి చెందిందని, కేసు దర్యాప్తు ఇప్పుడే మొదలైందని, బెయిల్ మంజూరు చేస్తే కేసు విచారణకు ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు. బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. ఇరువైపుల వాదనలు పరిశీలించిన న్యాయమూర్తి.. నిందితుడికి బెయిల్ మంజూరు చేయటానికి నిరాకరిస్తూ తీర్పు వెలువరించారు.

రేపు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల, న్యూస్‌టుడే: భారీ వర్షాల నేపథ్యంలో భక్తుల భద్రత దృష్ట్యా ఈ నెల 16న బుధవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తితిదే ఓ ప్రకటనలో తెలిపింది. దీంతో ఈ నెల 15న అదనపు ఈవో కార్యాలయంలో సిఫార్సు లేఖలు స్వీకరించరని పేర్కొంది.

నేడు 12 గంటల దీక్షలు: ఐఎంఏ

ఈనాడు డిజిటల్, అమరావతి: పశ్చిమబెంగాల్‌లో వైద్య వ్యవస్థను పట్టి పీడిస్తున్న లంచగొండితనం, వైద్యులపై దాడులకు నిరసనగా ఆ రాష్ట్ర జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక దీక్షకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలిపింది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలలు, ముఖ్య పట్టణాలలో దీక్షలు చేపడతామని ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయచంద్ర నాయుడు, ఫణిధర్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

యోగి వేమన వర్సిటీ రిజిస్ట్రార్ రాజీనామా

ఈనాడు, కడప: వైఎస్సార్ జిల్లాలోని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ తప్పెట రాంప్రసాద్‌రెడ్డి రాజీనామా చేశారు. దీనిని ఉపకులపతి కృష్ణారెడ్డి సోమవారం ఆమోదించారు. తెలుగు ఆచార్యులుగా ఉన్న ఆయన పది రోజుల క్రితం రిజిస్ట్రార్ బాధ్యతలు చేపట్టగా ఈ నియామకంపై విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తిని రిజిస్ట్రార్‌గా నియమించడంపై అభ్యంతరం తెలిపాయి. మరోవైపు రిజిస్ట్రార్‌గా ఉన్నప్పటికీ బాధ్యతలు అప్పగించకుండా ఉపకులపతి ఇబ్బందులకు గురి చేసినట్లు రాంప్రసాద్‌రెడ్డి గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో పదవి నుంచి తప్పుకోవడమే ఉత్తమమనే నిర్ణయానికి వచ్చి వైదొలిగారు.

రాజధాని ఉద్యమాల అణచివేతలో బిజీగా ఉన్నా

- అందుకే చంద్రబాబు ఇంటిపై దాడి కేసును పట్టించుకోలేదు
- మంగళగిరి పూర్వ డీఎస్పీ వాంగ్మూలం

ఈనాడు, అమరావతి: 'రాజధాని ఉద్యమాలు, రైతుల ఆందోళనలతో నిత్యం బందోబస్తు విధులు ఉండేవి. వాటికే ఎక్కువ సమయం కేటాయించాల్సి వచ్చేది. ఆ ఉద్యమాలు, ఆందోళనలను అణచివేయాలని అప్పటి పాలకుల నుంచి ఆదేశాలు ఉండేవి. అందుకే వాటికి ప్రాధాన్యమిచ్చి, తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఇంటిపై జరిగిన దాడి కేసు విచారణకు అంతగా పట్టించుకోలేదు. ఆ కేసులో కీలకమైన సీడీఆర్, వీడియో ఫుటేజీలను సేకరించలేకపోయాను' అని మంగళగిరి పూర్వపు డీఎస్పీ రాంబాబు వాంగ్మూలంలో చెప్పినట్లు తెలిసింది. సోమవారం మంగళగిరి డీఎస్పీ కార్యాలయంలో ఆయన దర్యాప్తు అధికారి ముందు విచారణకు హాజరయ్యారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఉండవల్లిలోని తెదేపా అధినేత చంద్రబాబు ఇంటిపై నాటి పెడన ఎమ్మెల్యే జోగి రమేష్ ఆధ్వర్యంలో ఆయన అనుచరులు పెద్దఎత్తున తరలివచ్చి దాడి చేసి, నానా బీభత్సం సృష్టించారు. ఆనాడు పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో నిందితుల సంఖ్యను చాలా తక్కువగా చూపారు. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం పూర్వపు డీఎస్పీని అడిగిన ప్రశ్నలు.. వాటికి ఆయన సమాధానాలిలా ఉన్నాయి.

ప్రశ్న: ఏదైనా నేరం జరిగితే నేర ప్రదేశం నుంచి సీసీ కెమెరా ఫుటేజీలు, సీడీఆర్ వంటి కీలక ఆధారాలు సేకరిస్తాం. కానీ చంద్రబాబు ఇంటిపై దాడి జరిగితే ఆధారాలు ఎందుకు సేకరించలేదు?

జవాబు: పని ఒత్తిడి బాగా ఉండేది. నిత్యం రాజధానిలో ఉద్యమాలు, రైతుల ఆందోళనలను పర్యవేక్షించటానికే సమయం ఉండేది కాదు. అందువల్లే ఆధారాలు సేకరించలేదు.

ప్రశ్న: చాలా కీలకమైన కేసు కదా? ఆధారాలు సేకరించకపోతే కేసు దర్యాప్తు ఎలా చేద్దామనుకున్నారు?

జవాబు: నాటి ఉన్నతాధికారులు ఈ కేసు విచారణకు అంతగా ప్రాధాన్యమివ్వలేదు. క్షేత్రస్థాయిలో మేమూ పట్టించుకోలేదు. ఈ కేసు విషయంలో మాపై పాలకుల నుంచి కొంత ఒత్తిడి వచ్చింది.

ప్రశ్న: సీసీ ఫుటేజీలో పెద్ద సంఖ్యలో దాడికి వచ్చినట్లు స్పష్టంగా ఉంది. సుమారు 30 మందికి పైగా ఉంటే ఎఫ్ఐఆర్‌లో 10 మంది పేర్లే పెట్టారు? నిందితుల గుర్తింపునకు మీరేం చేశారు?

జవాబు: నాటి ఎస్సై, సీఐలు నిందితులను గుర్తించారు. వారిచ్చిన సమాచారం ఆధారంగా నిందితుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశాం.

సీఐడీ చేతికి దస్త్రాలు

తెదేపా కేంద్ర కార్యాలయం, చంద్రబాబు ఇంటిపై దాడి కేసులను తాజాగా ప్రభుత్వం సీఐడీకి అప్పగించిన సంగతి విదితమే. వీటికి సంబంధించిన కీలక దస్త్రాలను గుంటూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళగిరి సబ్‌డివిజన్ పోలీసులు సోమవారం సీఐడీ అధికారులకు అందజేశారు. అనంతరం ఈ కేసుల విచారణ పురోగతి.. సుప్రీంకోర్టు, హైకోర్టు, జిల్లా కోర్టుల నుంచి ఎంత మంది ముందస్తు రక్షణ కోరి అరెస్టులు కాకుండా ఉన్నారు తదితర వివరాలను సీఐడీ ఉన్నతాధికారులు. . మంగళగిరి పోలీసులను అడిగి తెలుసుకున్నారు.

పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు

- నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు.. లైసెన్సుల రద్దు
- మొన్నటి వరకు జగన్ ఆధీనంలో మాఫియాలా మద్యం వ్యాపారం
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర. చిత్రంలో ముకేశ్‌కుమార్ మీనా

ఈనాడు, అమరావతి: మొన్నటి వరకు మద్యం తయారీ నుంచి విక్రయాల వరకు అన్నీ జగన్ ఆధీనంలో నడిపించారని.. సరైన బ్రాండు లేకుండా, అధిక ధరలతో దోచుకున్నారని ఎక్సైజ్, గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో ప్రైవేటు భాగస్వామ్యంతో పారదర్శకంగా లాటరీ విధానంలో దుకాణాలు కేటాయించామని తెలిపారు. వీటిలో బుధవారం నుంచి విక్రయాలు మొదలవుతాయన్నారు. సోమవారం విజయవాడలోని ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 3,396 దుకాణాలకు 89,882 దరఖాస్తులు రాగా, ఎక్కడా వివాదాలకు తావు లేకుండా దుకాణాలు కేటాయించినట్లు వెల్లడించారు. 2017-19లో ఒక్కో దుకాణానికి సగటున 18 చొప్పున దరఖాస్తులు వస్తే, ఇప్పుడు సగటున 26. 47 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ) కంటే అధిక ధరలకు విక్రయించినా.. సుంకం చెల్లించని మద్యం, నాటుసారా విక్రయాలు వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినా జరిమానాలు విధిస్తామని, లైసెన్సు రద్దు చేస్తామని మంత్రి హెచ్చరించారు. పర్మిట్‌రూమ్‌లకు అనుమతి లేదని, ఎక్కడా సిండికేట్ వంటివి లేకుండా చూస్తామని తెలిపారు. అంతర్జాతీయ బ్రాండ్ల మద్యం వచ్చే నెలలో అందుబాటులోకి వస్తుందని.. దీనిని టెండరు కమిటీ ఖరారు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. 15 రోజుల్లో కల్లుగీత వృత్తిదారులకు 340 దుకాణాలు కేటాయింపు పూర్తి చేస్తామన్నారు. మద్యం విక్రయాల ద్వారా గత ప్రభుత్వంలో ఏటా రూ.25 వేల కోట్ల రాబడి ఉండగా. . ఇప్పుడు రూ.30 వేల నుంచి రూ.32 వేల కోట్లు రావచ్చని అంచనా వేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

ఇసుకలో రాబడేది జగన్?

తమ ప్రభుత్వ హయాంలో ఇసుక ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందని వైకాపా అధినేత జగన్ ట్వీట్ చేశారని.. జేపీవీఎల్, ప్రతిమ, జీసీకేసీల పేరిట విచ్చలవిడిగా దోచుకొని, ప్రభుత్వానికి పైసా రాబడి లేకుండా చేశారనేది నిజమని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. ఆ సంస్థలు ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లు బకాయిలు పడితే.. ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు జగన్ ఎలా చెబుతారని మండిపడ్డారు.

16 నుంచి రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు, విక్రయాలు

ఈ నెల 16 నుంచి 108 రీచ్‌ల్లో మాన్యువల్‌గా ఇసుక తవ్వకాలు జరిపేలా ఏర్పాట్లు చేశామని, నీరు లేని 40 రీచ్‌ల్లో తొలుత తవ్వకాలు మొదలుకానున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నవారే కాకుండా, నేరుగా రీచ్‌కు వచ్చి ఇసుక తీసుకెళ్లేందుకు వీలు కల్పించినట్లు చెప్పారు. ప్రైవేటు వ్యక్తులు నదుల్లో రీచ్‌లు గుర్తించుకొని వస్తే అనుమతులివ్వడంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఇసుకను నిత్యావసర సరకుగా పరిగణించి, లారీల్లో అదనపు టన్నులు రవాణా చేసేందుకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వ పనుల్లో రోబో శాండ్ (రాక్ శాండ్) వినియోగాన్ని తప్పనిసరి చేయడంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎక్సైజ్, గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా, గనులశాఖ సంచాలకులు ప్రవీణ్‌కుమార్, ఎక్సైజ్‌శాఖ కమిషనర్ నిషాంత్‌కుమార్ పాల్గొన్నారు.

వాటాలిస్తారా? వ్యాపారం వదిలేస్తారా?

- కొన్ని నియోజకవర్గాల్లో మద్యం దుకాణాల లైసెన్సుదారులకు బెదిరింపులు
- 'గుడ్‌విల్ ఇచ్చేస్తాం.. లైసెన్సు ఇచ్చేసి, వెళ్లిపోండి' అంటూ ఒత్తిళ్లు
- లాటరీలో విజేతలుగా నిలిచిన వారితో బేరసారాలు
- తీవ్రంగా పరిగణించిన సీఎం చంద్రబాబు
- బెదిరింపులకు పాల్పడుతున్న వారి సమాచారం తెప్పించుకున్న ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించిన లాటరీలో విజేతలుగా నిలిచి లైసెన్సులు దక్కించుకున్న కొంతమందికి కొన్ని నియోజకవర్గాల్లోని ముఖ్య నాయకులు, మద్యం సిండికేట్ల నుంచి ఒత్తిళ్లు ఎదురవుతున్నాయి. 'మా నియోజకవర్గ పరిధిలో వ్యాపారం చేయాలంటే పెట్టుబడి లేకుండా మాకు 20 శాతం వాటా ఇవ్వండి. లేదంటే ఇక్కడ వ్యాపారం ఎలా చేస్తారో చూస్తాం' అంటూ కొందరు నాయకులు వారి అనుచరులతో బెదిరింపులకు పాల్పడుతున్నారు. 'ఎంతో కొంత గుడ్‌విల్ ఇచ్చేస్తాం. మీ లైసెన్సులు మాకు అప్పగించేసి వెళ్లిపోండి' అంటూ మరికొందరు బేరాలు మొదలుపెట్టారు. ప్రధానంగా పల్నాడు, విశాఖపట్నం, కర్నూలు, అనంతపురం, విజయవాడ, గుంటూరు, శ్రీసత్యసాయి, వైఎస్సార్ జిల్లాల్లో ఇలాంటి పరిస్థితి ఉంది. ఇంకొన్ని చోట్ల.. ప్రతి దుకాణం నుంచి నెల నెలా తాము చెప్పినంత మొత్తంతో పాటు, కొంత వాటా కూడా ఇవ్వాలని ఒత్తిళ్లు చేస్తున్నారు. దానికి అంగీకరిస్తేనే దుకాణాలు తెరుచుకుంటాయని.. లేకపోతే వ్యాపారం చేయలేరంటూ బెదిరిస్తున్నారు. ఈసారి మద్యం సిండికేట్లతో సంబంధం లేకుండా కొంతమంది సొంతంగా దరఖాస్తులు చేసుకుని లాటరీలో లైసెన్సులు దక్కించుకున్నారు. అలాంటి వారిపై సిండికేట్లు గురిపెట్టాయి. 'మీరు మద్యం వ్యాపారం చేయలేరు. గుడ్‌విల్ చెల్లిస్తాం.. లైసెన్సు వదిలేయండి' అంటూ బేరసారాలు సాగించాయి. విజయవాడలో ఒక్కో దుకాణానికి రూ. కోటి చొప్పున, గుంటూరులో రూ.85 లక్షల చొప్పున చెల్లించేందుకు ఆఫర్లు ఇచ్చారు. మరికొన్ని చోట్ల లైసెన్సులు తమకు అప్పగించేస్తే పెట్టుబడి లేకుండా 10 శాతం వాటా ఇస్తామంటూ ఆఫర్లు ఇచ్చారు.

లైసెన్సుదారులను ఇబ్బంది పెడితే సహించేది లేదు: చంద్రబాబు

మద్యం దుకాణాల లైసెన్సులు దక్కించుకున్న వారిని కొందరు నాయకులు వాటాల కోసం బెదిరిస్తున్నారన్న అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఏయే ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు ఈ బెదిరింపులకు పాల్పడుతున్నారనేదానిపై పార్టీ యంత్రాంగం, నిఘా విభాగం, ఎక్సైజ్ శాఖల ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు సమాచారం తెప్పించుకున్నారు. మద్యం దుకాణాల్లో వాటాల కోసం లైసెన్సుదారులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదంటూ ఆయా నేతలకు హెచ్చరికలు పంపించారు. మద్యం, ఇసుక విషయంలో ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి పని చేయాలని, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఎవరైనా వ్యవహరిస్తే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. లైసెన్సులు దక్కించుకున్న వ్యాపారులు స్వేచ్ఛగా, నిబంధనల ప్రకారం వ్యాపారం చేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

లిక్కర్ మాఫియాకు రాష్ట్రాన్ని అడ్డాగా మార్చేశారు

- మీ మద్యం విధానం ప్రజల భవిష్యత్తుకు ప్రమాదకరం
- సీఎం చంద్రబాబుపై జగన్ ట్వీట్

ఈనాడు, అమరావతి: 'మద్యం మాఫియాకు, సిండికేట్లకు ఆంధ్రప్రదేశ్ అడ్డాగా మారిపోయింది. ఈ మాఫియాకు సూత్రధారి, పాత్రధారి మీరు కాదా చంద్రబాబూ?' అని మాజీ సీఎం, వైకాపా అధ్యక్షుడు జగన్ ప్రశ్నించారు. 'అత్యంత పారదర్శకంగా నడుస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసి, వాటిని ప్రైవేటుకు, మీవాళ్లకు అప్పగించాలన్న నిర్ణయం అవినీతి కోసం వేసిన స్కెచ్ కాదా? ఫక్తు లిక్కర్ వ్యాపారిలా ఆలోచిస్తున్నారు. మీ మనుషులతో సిండికేట్ ఏర్పాటు చేసి దుకాణాలను కొట్టేయడం నిజం కాదంటారా? రానున్న ఐదేళ్లలో ఎమ్మార్పీ కంటే అధిక రేట్లతో అమ్మి, మీరు అనుమతిచ్చిన డిస్టిలరీల ద్వారా అమ్మకాలు భారీ స్థాయిలో పెంచేసి వేల కోట్ల రూపాయల అక్రమ రాబడికి ద్వారాలు తెరిచిన మాట వాస్తవం కాదా' అని సోమవారం ఆయన ఎక్స్‌లో విమర్శించారు. 'మీరు తెచ్చిన మద్యం విధానం గొప్పదే అయితే రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు మీ కనుసన్నల్లో ఎందుకు బెదిరింపులకు దిగారు? నీకింత నాకింత అని కమీషన్ల వాటాలు వేసుకున్న మాట వాస్తవం కాదా? మీరు అమలు చేస్తున్న మద్యం విధానం రాష్ట్రానికి, ప్రజల భవిష్యత్తుకు ప్రమాదకరం. మీ చర్యలను వెంటనే సరిదిద్దుకోకపోతే ప్రజల తరఫున ఉద్యమిస్తాం' అని వెల్లడించారు.

అసలు మద్యం మాఫియా మీరే

జగన్‌పై మంత్రి నారా లోకేశ్ ధ్వజం

ఈనాడు, అమరావతి: 'మద్యనిషేధం' అని చెప్పి కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీసింది మీరు కాదా జగన్? అని మాజీ ముఖ్యమంత్రిపై మంత్రి లోకేశ్ ధ్వజమెత్తారు. ధరలు పెంచుతూ పోతే తాగేవాళ్లు తగ్గుతారని, జీవన ప్రమాణాలు పెరుగుతాయని చెప్పి.. మద్యం అమ్మకాల్ని ఆయన 72 శాతం పెంచారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ లిక్కర్ పాలసీ కారణంగా మద్యం తాగే వారి సంఖ్య 2019-2020 మధ్య సగటున 5.55 నుంచి 6.23 శాతానికి పెరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'లిక్కర్ మాఫియా, సిండికేట్లకు ఆంధ్రప్రదేశ్ అడ్డాగా మారింది' అంటూ ఎక్స్ వేదికగా జగన్ చేసిన విమర్శల్ని లోకేశ్ తిప్పికొట్టారు. 2019కి ముందు అమల్లో ఉన్న మద్యం విధానాన్ని గత వైకాపా ప్రభుత్వం మార్చడం వల్ల ప్రభుత్వానికి సుమారు రూ.30 వేల కోట్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. నేడు నూతన మద్య విధానం వల్ల ప్రభుత్వానికి రూ. 1,800 కోట్లు ఆదాయం సమకూరిందని వెల్లడించారు. ఈ సందర్భంగా జగన్‌కు పలు ప్రశ్నలు సంధించారు.

● మీరు అధికారంలోకి రాగానే డిస్టిలరీలు, సరఫరా మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి చేతుల్లోకి వెళ్లింది? వారి వెనక ఉన్నది మీరు కాదా?

● మీ హయాంలో 74 శాతం మద్యాన్ని 16 కంపెనీల నుంచే ఎందుకు కొన్నారు.. అవి మీ బినామీలవి కాదా?

● మద్యం అమ్మకాలపై స్పెషల్ డ్యూటీ పేరుతో వసూలు చేసిన సొమ్ము ఎక్కడికి పోయింది?

(c) eenadu

2025 నవంబరు నాటికి 'పోలవరం' డయాఫ్రం వాల్ పూర్తి

- 2027 జులై నాటికి ప్రధాన డ్యాం
- ఇదీ జలవనరులశాఖ ప్రణాళిక
- జలవనరుల మంత్రి, అధికారుల సమగ్ర చర్చ



పోలవరం పనులపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టులో కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు ఈ ఏడాది డిసెంబరులో ప్రారంభించి 2025 నవంబరు నాటికి పూర్తి చేయాలని జలవనరులశాఖ ప్రణాళిక రూపొందించింది. అవసరమైన పరిశోధనలు, పరీక్షలు పూర్తి చేసుకుని డిజైన్లు రూపొందించుకుని ప్రధాన డ్యాం నిర్మాణం మొత్తం 2025 నవంబరులో ప్రారంభించి 2027 జులై నాటికి పూర్తి రూపం ఇవ్వాలని ప్రతిపాదించారు. పోలవరం అధికారులు, నిర్మాణ ఏజెన్సీ తదితరులు కలిసి ప్రాథమికంగా ఈ షెడ్యూలును రూపొందించారు. విదేశీ నిపుణుల బృందం, కేంద్ర జలసంఘం, డ్యాం డిజైన్ రివ్యూ ప్యానెల్ నిపుణులు, పోలవరం అధికారులతో నవంబరు మొదటి వారంలో వర్క్‌షాపు (కార్యశాల) నిర్వహిస్తున్నారు. డిజైన్ల నుంచి నిర్మాణం వరకు అందులో సమగ్రంగా చర్చిస్తారు. అక్కడే ఈ నిర్మాణ షెడ్యూలుకు స్పష్టమైన రూపం రానుంది. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావులు సోమవారం రాత్రి పోలవరం అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. మేఘా ఇంజినీరింగ్ తరఫున సుబ్బయ్య ఈ సమావేశంలో పాల్గొన్నారు. చీఫ్ ఇంజినీరు నరసింహమూర్తి నిర్మాణ ప్రక్రియకు సంబంధించిన ప్రణాళికను సమర్పించారు.

డయాఫ్రంవాల్ డిజైన్లు 16నాటికి

డయాఫ్రంవాల్ డిజైన్లను అఫ్రి డిజైన్ కన్సల్టెన్సీ అక్టోబరు 16 నాటికి పూర్తి చేసి పోలవరం ప్రాజెక్టు అథారిటీకి సమర్పించనుంది. ఈ డిజైన్లపై నవంబరు మొదటివారంలో జరిగే వర్క్‌షాపులో చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. కేంద్ర జలసంఘం, విదేశీ నిపుణుల బృందం ఈ డిజైన్లను నవంబరు 15వ తేదీలోపు ఆమోదించాల్సి ఉంటుంది. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణంలో మెటీరియల్‌ను ఎలా సమ్మిళితం చేయాలన్నదానిపై తిరుపతి ఐఐటీ నిపుణులు ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. వర్క్‌షాపులో వాటిని సమర్పించి చర్చిస్తారు. డయాఫ్రం వాల్ కట్టడంలో ప్యానెల్ నిర్మాణానికి కట్టర్‌ను ఏర్పాటు చేసేలా ప్లాట్‌ఫాం డిసెంబరు ప్రారంభానికి సిద్ధమవుతుంది. మిగిలిన కట్టర్ల ఏర్పాటుకు అవసరమైన ప్లాట్‌ఫాం నిర్మాణం డిసెంబరు నెలలోనే పూర్తి చేయాల్సి ఉంటుంది. మూడు ట్రెంచి కట్టర్లను రప్పిస్తున్నారు. తొలి కట్టర్ డిసెంబర్ 1వ తేదీ నాటికి పోలవరం చేరుతుంది.

వచ్చే నెల నుంచి ప్రాజెక్టులకు మరమ్మతులు

ఈనాడు, అమరావతి: వచ్చే నెల నుంచి ప్రాధాన్యక్రమంలో అన్ని ప్రాజెక్టులకు మరమ్మతులు చేపడతామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలపై ఇందు కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆయన వివరించారు.

అబ్బే.. వారెవరో మాకు తెలియదు!

- అప్పిరెడ్డి, రఘురాం, అవినాష్ డొంక తిరుగుడు సమాధానం
- తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో విచారణ



మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో విచారణకు వెళ్తున్న దేవినేని అవినాష్ ★ లేళ్ల అప్పిరెడ్డి★ తలశిల రఘురాం

ఈనాడు, అమరావతి: 'అబ్బే.. వారెవరో మాకు తెలియదు. ముఖపరిచయమూ లేదు. మీరు ఫొటోలు, వీడియోలు చూపించేదాకా వారు మాతో ఫొటోలు దిగారన్న విషయం కూడా తెలీదు. ఫొటోలు ఎప్పుడు దిగారో ఆశ్చర్యపోతున్నాం..' ఇదీ వైకాపా ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, విజయవాడ తూర్పు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్‌ల సమాధానాలు. తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నిందితులుగా ఉన్న వీరిని సోమవారం మంగళగిరి పోలీసులు విచారణకు పిలిచారు. ఈ సందర్భంగా అప్పట్లో దాడిలో పాల్గొన్న కొంతమంది అనుచరుల వివరాలు, వారితో దిగిన ఫొటోలను ముందుపెట్టిన పోలీసులు.. వారిని గుర్తించాలని, పేర్లు, వివరాలు చెప్పాలని ప్రశ్నించారు. ముగ్గురు నిందితులు అప్పిరెడ్డి, రఘురాం, అవినాష్‌లు డొంక తిరుగుడు సమాధానాలిచ్చారు. 'మేం ప్రజాప్రతినిధులం. పార్టీలో ముఖ్య నేతలం. మా వద్దకు అనేకమంది వచ్చిపోతుంటారు. ఆ క్రమంలో ముచ్చటపడి సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటుంటారు. అంతమాత్రాన మా అనుచరులవుతారా? వారెవరో చెప్పాలని మమ్మల్ని ఎలా అడుగుతారంటూ దర్యాప్తు అధికారులనే ఉల్టా ప్రశ్నించారు. దాడి నాటి ఫుటేజీలు, దాడిలో పాల్గొన్నవారు ఆయా నేతలతో దిగిన అనేక ఫొటోలను ఆ ముగ్గురి ముందు పెట్టి పదేపదే ప్రశ్నించినా సరైన సమాధానాలు రాలేదు. ఏం అడిగినా, 'మాకు తెలియదు. గుర్తు లేదు' అని దాటవేశారు. ఏ ప్రశ్నకూ సూటిగా స్పందించలేదని పోలీసులు తెలిపారు.

ఫోన్లు ఇచ్చేందుకు నిరాకరించారు

–వై.శ్రీనివాసరావు, దర్యాప్తు అధికారి

తెదేపా కార్యాలయంపై దాడి కేసులో నిందితులు అప్పిరెడ్డి, రఘురాం, దేవినేని అవినాష్‌ను విచారణ కోసం సోమవారం చివరిసారిగా పిలిచామని, వారెవరూ సహకరించలేదని దర్యాప్తు అధికారి వై.శ్రీనివాసరావు చెప్పారు. విచారణ ముగిశాక ఆయన విలేకరులతో మాట్లాడారు. 'గతంలో విచారించినప్పుడు వారు చెప్పిన సమాధానాలు, సహచర నిందితుల నుంచి రాబట్టిన వివరాల ఆధారంగా దాడిలో పాల్గొన్న మరికొందరి వీడియో ఫుటేజీలను ఆ ముగ్గురు ముందుంచి వివరాలు అడిగాం. వారందరూ ఆయా నేతలతో సన్నిహితంగా తిరిగినవారే. అయినా తమకు తెలియదని, అసలు గుర్తు పట్టలేమని అంటున్నారు. మీతో ఫొటోలు అనేకమున్నాయి కదా, వారు నిర్వహించిన కార్యక్రమాలకు హాజరయ్యారు కదా అని ప్రశ్నించినా ఏ ఒక్క దానికీ వారి నోట సరైన జవాబు రాలేదు. కోర్టు ఆదేశిస్తే ఫోన్లు అప్పగిస్తామంటూ, వాటిని ఇవ్వడానికి నిరాకరించారు.' అని శ్రీనివాసరావు వివరించారు.



పశ్చాత్తాపం కన్నా ప్రయత్నించి ఓడటం మేలు

చాలా మంది తమకు ఆసక్తి ఉన్న పనిని మొదలుపెట్టాలన్న కోరిక ఉన్నప్పటికీ, ఓటమి భయంతో సవాళ్లను స్వీకరించడానికి ఇష్టపడరు. దీంతో తమకు సౌకర్యవంతమైన చోటే అనాసక్తిగా పనిచేస్తూ ఉండిపోతారు. దీనివల్ల తమ కలలను సాకారం చేసుకోలేకపోవడమే కాదు, పని చేసిన రంగంలోనూ ఉన్నత స్థాయికి వెళ్లలేరు. దీంతో జీవిత చరమాంకంలో పశ్చాత్తాపానికి గురవుతుంటారు. చేయిదాటిపోయిన తర్వాత పశ్చాత్తాపం చెందేకన్నా ఓటమి ఎదురైనా సరే ప్రయత్నించడంలోనే సంతృప్తి ఉంటుందని గుర్తుంచుకోండి.

– డేవిడ్ లవ్‌జాయ్, పాడ్‌కాస్టర్

ఆహార తనిఖీకి తల్లులతో కమిటీ

- విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులూ భోజనం చేయాల్సిందే
- ఆహారం, తాగునీటి నాణ్యతపై ఏటా రెండుసార్లు తనిఖీ
- వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో పాటించాల్సిన విధానాలపై ప్రభుత్వం ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ఆహార నాణ్యతను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొన్నేళ్లుగా వసతి గృహాలు, గురుకులాల్లో చోటు చేసుకుంటున్న ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు చెక్ పెట్టేలా మార్గదర్శకాలు రూపొందించింది. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల పరిధిలోని వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో వంటగదులు, స్టోర్ రూంలు, పరిసరాల్లో పాటించాల్సిన పరిశుభ్రత చర్యలపై ప్రామాణిక నిర్వహణ విధానాన్ని (ఎస్‌వోపీ) విడుదల చేసింది. నిర్దేశిత మెనూ ప్రకారం పిల్లలకు వడ్డించే ప్రతి ఆహార పదార్థాన్ని వారి తల్లులు రుచి చూసి తనిఖీ చేసేలా ముగ్గురు తల్లులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించింది. 'తల్లిదండ్రులు వారానికోసారి తనిఖీ చేసి, పరిశీలించిన వివరాలను రికార్డులో నమోదు చేయాలి. రోజూ ఒక ఉపాధ్యాయుడు లేదా బోధనేతర సిబ్బంది తప్పనిసరిగా విద్యార్థులతో కలిసి భోజనం చేసేలా చూడాలి. వారు కూడా విద్యార్థులకు పెట్టే భోజనాన్నే తినాలి. ఇందులో ఏ ఉపాధ్యాయుడికీ మినహాయింపు ఉండదు. విద్యార్థులకు ఆహారాన్ని వడ్డించే ముందు వాటి ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వార్డెన్లు, ప్రిన్సిపల్స్ వాటిని రుచి చూశాకే పిల్లలకు వడ్డించాలి. ఈ ఆహార పదార్థాలు, తాగునీటిని ఏటా ఆగస్టు, ఫిబ్రవరి నెలల్లో సమీపంలోని ఎన్‌ఏబీఎల్ లేదా ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలోని ల్యాబ్‌లకు పంపి పరీక్షించాలి' అని పేర్కొంది. నిర్దేశిత విధానాలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఎప్పటికప్పుడు తాజా భోజనమే

'విద్యార్థులకు ఆహారాన్ని వండే ముందు అన్ని రకాల పరిశుభ్రత చర్యలు తీసుకోవాలి. పగలు వండిన ఆహారాన్ని వేడి చేసి రాత్రికి, ఆ మరుసటి రోజు ఎట్టి పరిస్థితుల్లోనూ పెట్టకూడదు. ఏ ఆహార పదార్థాన్నీ వేగంగా, హడావిడిగా వండొద్దు. నిర్దేశిత ఉష్ణోగ్రత వద్ద, నిర్దేశిత సమయంలోనే వండాలి. వంట పూర్తయ్యాక పాత్రలు, స్టవ్‌ను శుభ్రం చేయాలి. కూరగాయలు తరిగే చాకులు, వంట పాత్రలు, గరిటెలు, ఇతర వస్తువులను క్రమం తప్పకుండా కడగాలి. కుళ్లిపోయిన, పాడైపోయిన కూరగాయలు, గుడ్లు వంటకు వినియోగించొద్దు. ఆకు కూరలను బాగా కడిగిన తర్వాతే వండాలి. విద్యార్థుల్లో ఇమ్యూనిటీ లెవల్స్ పెరిగేందుకు రోజూ నిర్దేశిత సమయంలో నీళ్లు తాగేలా చూడాలి. తరగతి గదులకు సమీపంలో తాగునీటిని అందుబాటులో ఉంచాలి' అని స్పష్టం చేసింది. 'భోజనానికి ముందు, తర్వాత విద్యార్థులు చేతులు కడుక్కునేలా పర్యవేక్షించాలి. వంట గది, చేతులు కడిగే ప్రాంతం, కుళాయిలు, పైపులు ఎల్లప్పుడు శుభ్రంగా ఉండాలి. బయటి ఆహారాన్ని, చిరుతిండ్లను విద్యార్థులు తీసుకోకుండా వార్డెన్లు పర్యవేక్షించాలి. విద్యార్థుల తల్లిదండ్రులు తెచ్చే పండ్లు, బిస్కట్లను అనుమతించవచ్చు'ని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది.

మరిన్ని వివరాలు https://epaper.eenadu.net

ఆర్టీసీ బస్సు బోల్తా.. వృద్ధురాలి మృతి

- మరో 17 మందికి గాయాలు



బోల్తాపడిన ఆర్టీసీ బస్సు

చింతలపూడి, న్యూస్‌టుడే: వారంతా తెల్లవారుజామున ఆర్టీసీ బస్సులో గాఢ నిద్రలో ఉన్నారు. ప్రయాణంలో బస్సు ఒక్కసారిగా కుదుపునకు గురైంది. దాంతో ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడి, ఊపిరాడక విలవిల్లాడారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ప్రైవేట్ బస్సులోని ప్రయాణికుల సాయంతో కొందరు ప్రమాదం నుంచి బయటపడగా.. ఓ వృద్ధురాలు మృతి చెందారు. ఈ ఘటన ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. హైదరాబాద్‌లోని జీడిమెట్ల నుంచి ఆదివారం రాత్రి 36 మంది ప్రయాణికులతో ఏలూరు డిపోనకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఏలూరు బయలుదేరింది. సోమవారం ఉదయం 4:30 గంటల సమయంలో పోతునూరు వద్దకు రాగానే ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఆ ప్రాంతంలో మలుపు కూడా లేదు. దాంతో నిద్రలో ఉన్న ప్రయాణికులంతా ఒకరిపై ఒకరు పడిపోవడంతో హాహాకారాలు మిన్నంటాయి. ఆ సమయంలో అటు వైపు వచ్చిన ఓ ప్రైవేట్ బస్సు డ్రైవర్.. ప్రమాదాన్ని గమనించి బస్సు ఆపాడు. అందులోని వారు బోల్తాపడిన ఆర్టీసీ బస్సు వెనుక అద్దం పగులగొట్టి ఒక్కొక్కరిని అతికష్టం మీద బయటకు తీశారు. వీరిలో ఏలూరుకు చెందిన పి.విమలాబాయ్(74) చెయ్యి విరిగి కింద పడిపోయారు. ఆమెతో పాటు గాయపడిన మరో 17 మంది ప్రయాణికులను చింతలపూడి ఏరియా ఆసుపత్రికి తీసుకెళుతుండగా.. విమలాబాయ్ మార్గంమధ్యలో చనిపోయారు. క్షతగాత్రుల్లో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం ఏలూరుకు తరలించారు. ప్రమాద ఘటన గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ క్షతగాత్రులను పరామర్శించారు.

కుమార్తెను చూసి వస్తూ..: నాలుగో కుమార్తెను చూసొద్దామని విమలాబాయ్ ఆమె ముగ్గురు కుమార్తెలతో కలిసి ఇటీవల హైదరాబాద్ వెళ్లి తిరిగి ఏలూరు వస్తుండగా మృతిచెందారు. కళ్ల ముందే చెయ్యి విరిగి తీవ్ర రక్తస్రావం, నొప్పితో విలవిల్లాడుతూ చనిపోయిన తల్లిని చూసి ముగ్గురు కుమార్తెలు బోరున విలపించారు.



EENADU Vol: 51, Iss: 65 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

(c) eenadu

హిట్ లిస్ట్‌లో సిద్దిఖీ కుమారుడు!

బాబా సిద్దిఖీ హత్య కేసులో విచారణతో వెలుగులోకి.. • మూడో నిందితుడికి రిమాండ్



జీషన్ సిద్దిఖీ

ముంబయి: మహారాష్ట్రలో ఎన్సీపీ నేత బాబా సిద్దిఖీ హత్య కేసును విచారిస్తున్న పోలీసులకు మరో కీలక విషయం తెలిసినట్లు సమాచారం. ఆయన కుమారుడు, ఎమ్మెల్యే జీషన్ సిద్దిఖీ కూడా బిష్ణోయ్ గ్యాంగ్ హిట్‌లిస్ట్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. తండ్రీ కుమారులను చంపేందుకు కాంట్రాక్టు ఇచ్చినట్లు షూటర్లు విచారణలో పేర్కొన్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. హత్య జరిగిన ప్రాంతంలో సిద్దిఖీ, ఆయన కుమారుడు ఉంటారని తమకు ఆదేశాలు ఇచ్చిన వ్యక్తులు చెప్పారని షూటర్లు వెల్లడించారు. ఇద్దరిపైనా దాడి చేసే వీలులేకపోతే.. ఎవరు దొరికితే వారిని హత్య చేయాలని చెప్పినట్లు దర్యాప్తులో వెల్లడైంది. జీషన్ సిద్దిఖీ కాంగ్రెస్ టికెట్‌పై బాంద్రా ఈస్ట్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. లెజిస్లేటివ్ కౌన్సిల్ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలతో పార్టీ ఆయనను బహిష్కరించింది.

ఆ నిందితుడిపై 9 క్రిమినల్ కేసులు

బాబా సిద్దిఖీ హత్య కేసులో నిందితుడిగా అనుమానిస్తున్న యాసిన్ అఖ్తర్‌పై 9 క్రిమినల్ కేసులున్నాయని పంజాబ్ పోలీసులు తెలిపారు. ఇందులో హత్య, హత్యాయత్నం కేసులున్నాయని సోమవారం వారు వెల్లడించారు. 21 ఏళ్ల అఖ్తర్.. జలంధర్ జిల్లాలోని శంకర్ గ్రామానికి చెందినవాడు. 2022 జూన్‌లో అరెస్టు చేసి జైలుకు పంపగా ఈ ఏడాది జూన్‌లో విడుదలయ్యాడు. అతడికి గ్యాంగ్‌స్టర్ విక్రం బ్రార్‌తో సంబంధాలున్నాయి.

ధర్మరాజ్ కాశ్యప్ మైనర్ కాదు

బాబా సిద్దిఖీ హత్య కేసులో నిందితుడైన ధర్మరాజ్ కాశ్యప్ మైనర్ కాదని తేలింది. న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతున్న సమయంలో తాను మైనర్‌నని ముంబయి కోర్టుకు అతడు తెలిపాడు. నిందితుడి వద్ద సరైన జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో అతడు చెప్పేది నిజమో.. కాదో తెలుసుకోవడానికి బోన్ ఆసిఫికేషన్ టెస్టు చేయాలని న్యాయస్థానం పోలీసులకు సూచించింది. ఆ టెస్టు రిపోర్టుల్లో అతడు మైనర్ కాదని తేలడంతో నిందితుడిని కస్టడీకి తరలించారు. అతడితోపాటు మిగిలిన నిందితులకు ఈ నెల 21 వరకు జ్యుడిషియల్ కస్టడీని కోర్టు విధించింది.

మధ్యప్రదేశ్‌లో గాలింపు

బాబా హత్య కేసు నిందితుల కోసం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని, ఖాండ్వాల్లో ముంబయి పోలీసులు గాలిస్తున్నారు. శివ కుమార్ అక్కడికి పారిపోయి ఉంటాడని భావించి ఈ గాలింపు చేపట్టారు. ఈ కేసులో ఇప్పటికే హరియాణాకు చెందిన గుర్మైల్ బల్జీత్ సింగ్, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ధర్మరాజ్ కాశ్యప్, మహారాష్ట్రకు చెందిన ప్రవీణ్ లోంకర్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

మహారాష్ట్రలో అండర్ వరల్డ్ డాన్ల ప్రభావం పెరుగుతోంది

• సంజయ్ రౌత్ వ్యాఖ్య

ముంబయి: మహాయుతి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో గ్యాంగ్‌వార్‌లు, అండర్ వరల్డ్ డాన్ల ప్రభావం పెరుగుతోందని శివసేన (ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ విమర్శించారు. కుట్రలన్నీ గుజరాత్‌లో జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. ఇటీవల గుజరాత్‌లో రూ.5,000 కోట్ల విలువైన డ్రగ్స్ లభ్యమైన విషయం గురించి ప్రస్తావిస్తూ.. అంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టుబడ్డాయంటే ఇంకా దేశంలో ఏ స్థాయిలో డ్రగ్స్ పంపిణీ అయ్యుంటాయో అని అనుమానం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వానికి గుజరాత్‌కు చెందిన అండర్ వరల్డ్ డాన్ల మద్దతు ఉందని సంజయ్ రౌత్ ఆరోపించారు. నిజంగా రాష్ట్రంలో ఎటువంటి సంబంధాలు లేకపోతే సిద్దిఖీ హత్యకు కుట్ర పన్నిన వారికి శిక్ష విధించాలని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేకు సవాలు విసిరారు. 'బద్లాపూర్ లైంగిక వేధింపుల కేసులో చర్య తీసుకున్న తర్వాత శిందే తనను తాను సింహమని ప్రకటించుకున్నారు. అదే నిజమైతే, ఆయనకు ధైర్యముంటే సిద్దిఖీ హత్యకు కుట్ర పన్నిన వారిని వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలి' అని రౌత్ డిమాండు చేశారు.

ఎవరీ లారెన్స్ బిష్ణోయ్?

ప్రియురాలి హత్యతో నేరమార్గం • పలువురి ప్రాణాలు తీసే కుట్ర



ఇంటర్నెట్ డెస్క్: మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దిఖీ హత్యతో గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ పేరు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ 31 ఏళ్ల పంజాబీ గ్యాంగ్‌స్టర్ జైల్లో ఉన్నా.. అతడి సోదరుడు, అనుచరుడు కెనడా నుంచి గ్యాంగ్‌ను నడిపించడం ఆందోళనకరంగా మారింది.

కాలేజీలోనే నేరాలకు నాంది..

లారెన్స్‌ది పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ జిల్లా ధత్తరన్‌వాలీ గ్రామంలోని సంపన్న కుటుంబం. బిష్ణోయ్ వర్గానికి చెందిన వ్యక్తి. వీరు రాజస్థాన్, హరియాణా, పంజాబ్‌లలో ఎక్కువగా ఉంటారు. లారెన్స్ ఇంటర్మీడియేట్ పూర్తి చేశాక పంజాబ్ విశ్వవిద్యాలయ పరిధిలోని డీఏవీ కాలేజీలో చేరాడు. అతడు జాతీయ స్థాయి అథ్లెట్. పంజాబ్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుడిగానూ పని చేశాడు. న్యాయ విద్యను పూర్తి చేశాడు. ఆ తర్వాత విద్యార్థి రాజకీయాల్లో గోల్డీబ్రార్‌తో పరిచయం ఏర్పడింది. కొన్నాళ్లకు మెల్లగా అసాంఘిక కార్యకలాపాలు మొదలుపెట్టాడు. విద్యార్థి రాజకీయాలు దీనికి ముసుగుగా మారాయి. డీఏవీ కాలేజీ గ్యాంగ్‌వార్‌లో అతడి ప్రియురాలిని ప్రత్యర్థి వర్గం సజీవ దహనం చేసింది. దీంతో అతడు పూర్తిగా నేరాలవైపు మళ్లినట్లు చెబుతుంటారు.

2018లో తన అనుచరుడు సంపత్ నెహ్రాతో కలిసి సినీ స్టార్ సల్మాన్‌ఖాన్ హత్యకు కుట్ర పన్నడంతో జాతీయ స్థాయిలో వార్తల్లోకెక్కాడు. ప్రస్తుతం బిష్ణోయ్ గ్యాంగ్‌లో పలువురు ప్రొఫెషనల్ షూటర్లున్నారు. వీరి నెట్‌వర్క్ పంజాబ్, హరియాణా, రాజస్థాన్, దిల్లీ, హిమాచల్ ప్రదేశ్‌లలో విస్తరించింది. లారెన్స్‌ను చంపేందుకు ఇప్పటికీ దిల్లీలోని గ్యాంగ్‌స్టర్లు కాచుకు కూర్చోవడంతో.. అతడిని వివిధ కేసుల్లో న్యాయస్థానాలకు తరలించడం పోలీసులకు కత్తిమీద సాముగా మారింది.

జైల్లో నుంచే గ్యాంగ్ ఎలా నడుపుతున్నాడు?

లారెన్స్ బిష్ణోయ్ కొన్నేళ్లుగా జైల్లోనే ఉంటున్నాడు. కానీ బ్యారక్‌లలోకి అక్రమంగా వచ్చే సెల్‌ఫోన్ల ద్వారా అనుచరులతో నిరంతరం టచ్‌లో ఉంటాడని పేరుంది. సమాజంలో పెద్ద పేరు కలిగిన వారిని లక్ష్యంగా చేసుకుని హత్యలు చేయడంతో తమ గ్యాంగ్ పేరు బాగా ప్రచారమవుతుందని లారెన్స్ యోచన. సిద్ధూ మూసేవాలా, బాబా సిద్దిఖీపై దాడులు ఈ కోవలోకే వస్తాయి. దీంతో ఉత్తర భారత దేశంలోనే అత్యంత భయానక గ్యాంగ్‌గా పేరు తెచ్చుకొంది లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్. దీంతోపాటు సంపన్న వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకుల నుంచి భారీగా సొమ్ములు వసూలు చేస్తాడని అతడికి పేరుంది. దిల్లీలోని అఫ్గాన్ జాతీయుడు నాదిర్ షా నుంచి భారీగా డబ్బులు డిమాండు చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. తాజాగా ముంబయిలో ఖాళీగా ఉన్న మాఫియా రాజ్యాన్ని ఆక్రమించడానికి ఇతడు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

అతడు సబర్మతి జైల్లో ఉన్నా తన గ్యాంగ్‌ను మాత్రం నిరాటంకంగా నిర్వహిస్తున్నాడు. అతడి సోదరుడు అన్మోల్, మిత్రుడు గోల్డీబ్రార్‌లు ఈ వ్యవహారాలు చూసుకుంటున్నారు.

గ్యాంగ్‌వార్‌లు.. స్మగ్లింగ్..!

గ్యాంగ్‌ల మధ్య ఆధిపత్య పోరులో పలువురు ప్రాణాలు కోల్పోయారు. లారెన్స్ సన్నిహితుడు జస్విందర్‌ను గ్యాంగ్‌స్టర్ జైపాల్ భుల్లర్ హత్య చేశాడు. వాస్తవానికి బిష్ణోయ్ గ్యాంగ్ భరత్‌పుర్‌లో విస్తరించడానికి జస్విందర్ పని చేశాడు. సిద్ధూ మూసేవాలా హత్యకు కూడా ఈ గ్యాంగ్ వార్‌లే కారణం. విక్కీ మిదుఖేడా మరణానికి ప్రతీకారంగా ఈ పంజాబీ గాయకుడిని లారెన్స్ అనుచరులు కాల్చి చంపారు. బిష్ణోయ్ గ్యాంగ్ సీమాంతర ఆయుధ స్మగ్లింగ్, మాదక ద్రవ్యాల రవాణాకు పాల్పడుతోందని గుజరాత్ ఏటీఎస్ పేర్కొంది.

సల్మాన్‌కు బెదిరింపులు..

బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ 1998లో కృష్ణ జింకలను వేటాడారు. దానికి సంబంధించి ఆయనపై కేసు నడుస్తోంది. కృష్ణ జింకలను బిష్ణోయ్ వర్గంవారు పవిత్రంగా పరిగణిస్తారు. వీటిని వేటాడటం అదే వర్గానికి చెందిన లారెన్స్‌కు ఎంత మాత్రం నచ్చలేదు. దీంతో 2018 నుంచి సల్మాన్ ఖాన్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ గ్యాంగ్ పని చేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో బాలీవుడ్ స్టార్ ఇంటిపై కాల్పులు జరిపింది. అంతకు ముందు అతడి ఫామ్‌హౌస్‌వద్ద రెక్కీలు నిర్వహించింది. దాదాపు పాతిక మందిని సల్మాన్‌పై దాడికి సిద్ధం చేసినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి.

నేడు దిల్లీలో భేటీ కానున్న మైతేయ్, కుకీ, నాగా ఎమ్మెల్యేలు

ఇంఫాల్: మణిపుర్‌లో గతేడాది జాతుల ఘర్షణ మొదలైన తరవాత ఆ రాష్ట్రానికి చెందిన మైతేయ్, కుకీ, నాగా వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు తొలిసారిగా మంగళవారం దిల్లీలో భేటీ అవుతున్నారు. కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతోంది. ముగ్గురు నాగా శాసనసభ్యులు భేటీకి హాజరవుతారని తెలగా.. మైతేయ్, కుకీ వర్గ ఎమ్మెల్యేల సంఖ్యపై స్పష్టత రాలేదని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులను చల్లార్చేందుకు కేంద్రం చేపట్టిన చర్యల్లో భాగంగా తాజా చర్చలు జరుగుతున్నాయి. మణిపుర్‌లో చెలరేగిన అల్లర్ల కారణంగా సుమారు 200 మంది మరణించారు

'నదుల్లో ఆక్రమణలు తొలగించాలి'

దిల్లీ: దేశంలో అన్ని నదులు, ఉపనదుల ఆయకట్టు ప్రాంతాలు, నదీ గర్భాలు, నదుల వరద నీటి మైదానాలలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను కూల్చేయాలంటూ మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ అశోక్ కుమార్ రాఘవ్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వంతో పాటు సంబంధిత సంస్థలు తమ స్పందనను మూడు వారాల్లో తెలపాలని సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు చేపట్టింది.

చిరాగ్‌కు జడ్ కేటగిరి భద్రత

దిల్లీ: కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రాంవిలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాస్వాన్‌కు జడ్ కేటగిరి భద్రత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) పారామిలిటరీ దళం ప్రస్తుతం ఆయనకు భద్రత కల్పిస్తోంది. దీనిని జడ్ కేటగిరీకి పెంచాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించి, ఆ మేరకు కేంద్ర రిజర్వు పోలీసు దళానికి ఆదేశాలిచ్చింది. దేశంలో ఆయన ఎక్కడికి వెళ్లినా ఇకపై సీఆర్‌పీఎఫ్ భద్రత లభిస్తుంది.

ఆసుపత్రిలో చేరిన ఉద్ధవ్‌ఠాక్రే

ముంబయి : శివసేన(యూబీటీ) అధ్యక్షుడు, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే అస్వస్థతకు గురయ్యారు. దాంతో ఆయన్ను ముంబయిలోని రిలయన్స్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆయనకు గుండె సంబంధిత సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. దాంతో ఆయనకు యాంజియోప్లాస్టీ నిర్వహించే అవకాశాలున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.



దక్షిణ కొరియా సరిహద్దులో ఉత్తరకొరియా నిర్మించిన కంచె, గార్డు పోస్ట్

దక్షిణ కొరియాతో అనుసంధానించే రోడ్లు, రైలుమార్గాల ధ్వంసం!

• ఉత్తర కొరియా కీలక నిర్ణయం

సియోల్: ఉత్తర కొరియా, దక్షిణ కొరియాల మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ మరింత పెరుగుతున్నాయి! దక్షిణ కొరియాతో తమ దేశాన్ని అనుసంధానించే రోడ్లు, రైలు మార్గాలను ధ్వంసం చేసేందుకు ఉత్తర కొరియా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. యుద్ధం వేళ సియోల్ దళాలు తమ దేశంలోకి చొచ్చుకురాకుండా నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే రోడ్ల ధ్వంసం ప్రక్రియను ప్యాంగ్‌యాంగ్ ప్రారంభించిందని సియోల్ సైన్యం చెబుతుండటం గమనార్హం. మరోవైపు- దక్షిణ కొరియా డ్రోన్లు తమ గగనతలంలోకి చొరబడినా, కరపత్రాలు జారవిడిచినా ఆ దేశంపై దాడి చేస్తామని ఉత్తర కొరియా హెచ్చరించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. శతఘ్ని దళం సహా ఇతర కీలక యూనిట్లను ఇప్పటికే సరిహద్దుల్లోకి పంపినట్లు అందులో పేర్కొంది. ఉత్తర కొరియా తమ దేశంలోకి ఇటీవల పంపిన చెత్త బెలూన్లకు జీపీఎస్ పరికరాలు అమర్చి ఉన్నట్లు దక్షిణ కొరియా దళాలు తాజాగా గుర్తించాయి.

సుప్రీంకోర్టు విస్తరణ పనులకు భూమిపూజ

• అత్యాధునిక వసతులతో కొత్త నిర్మాణాలు చేపట్టనున్నట్లు సీజేఐ వెల్లడి



సుప్రీంకోర్టు భవనం విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్. చిత్రంలో కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న

దిల్లీ: సుప్రీంకోర్టు ప్రాంగణాన్ని విస్తరించడమంటే కేవలం అదనపు స్థలాన్ని జోడించడం కాదని.. సకాలంలో, గౌరవప్రదంగా న్యాయాన్ని అందించే సామర్థ్యాలను పెంచుకోవడమని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అన్నారు. సుప్రీంకోర్టు ప్రాంగణ విస్తరణ పనులకు సోమవారం భూమిపూజ చేసిన అనంతరం ఆయన ప్రసంగించారు. భవిష్యత్తులో పెరిగే కేసుల భారాన్ని దృష్టిలో పెట్టుకొని, కొత్త ధర్మాసనాల ఏర్పాటుకు వీలుగా తాజా విస్తరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. న్యాయమూర్తులతోపాటు న్యాయవాదులు, పౌరుల అవసరాలకూ ఇందులో ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న సుప్రీంకోర్టు భవనాన్ని అలాగే ఉంచి.. అత్యాధునిక వసతులతో కొత్త నిర్మాణాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కొత్త నిర్మాణం 86,500 చదరపు మీటర్ల మేర బిల్టప్ ఏరియాతో విస్తరించి ఉంటుందన్నారు. దాన్ని రెండు దశల్లో నిర్మిస్తారని, తొలి దశ పనులకు ప్రస్తుతం భూమిపూజ జరిగిందని వివరించారు. 29 నెలల్లో తొలి దశ నిర్మాణం పూర్తవుతుందని పేర్కొన్నారు. అది 5 అంతస్తులతో 38,250 చదరపు మీటర్ల బిల్టప్ ఏరియాను కలిగి ఉంటుందని తెలిపారు. రెండో దశ కూడా పూర్తయితే అదనంగా 29 కోర్టు గదులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బి.ఆర్.గవాయ్ కూడా ప్రసంగించారు. సుప్రీంకోర్టు విస్తరణ ప్రాజెక్టు కోసం రూ.800 కోట్లు మంజూరు చేసినందుకు ప్రధాని మోదీకి జస్టిస్ బి.ఆర్.గవాయ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆ వాహనాలకు మహారాష్ట్రలో టోల్ మినహాయింపు

• నేటి నుంచి అమల్లోకి: శిందే

ముంబయి: శాసనసభ ఎన్నికలకు ముందు మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముంబయి నగరంలోకి ప్రవేశించే తేలికపాటి మోటారు వాహనాలకు టోల్ ప్లాజాల వద్ద ఇకపై టోల్ రుసుం వసూలు చేయకూడదని నిర్ణయించింది. మంగళవారం నుంచి ఇది అమల్లోకి రానుందని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే విలేకరుల సమావేశంలో వెల్లడించారు. టోల్‌ప్లాజాల వద్ద నెలకొంటున్న రద్దీ దృష్ట్యా ఎల్ఎంవీలకు రుసుం రద్దు చేయాలన్న డిమాండ్ ప్రజల నుంచి వచ్చిందని, దానిపై సోమవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కార్లు, జీపులు, వ్యాన్లు, ఆటోలు, ట్యాక్సీలు, చిన్న ట్రక్కులు, డెలివరీ వ్యాన్లు వంటివన్నీ ఎల్ఎంవీల కిందికి వస్తాయి. ఇవి రూ.45-75 మధ్య టోల్ చెల్లించాల్సి వచ్చేది. తాజా నిర్ణయంతో రోజుకు 2.8 లక్షల వాహనాలు లబ్ధి పొందనున్నాయి. శిందే గతంలో చాలాసార్లు టోల్ వసూళ్లకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విపక్షాలు పెదవి విరిచాయి. ఎన్నికలకు ముందు ఇదొక రాజకీయ ఎత్తుగడగా విమర్శించాయి.

దేశం గర్వించదగ్గ పారిశ్రామికవేత్త రతన్ టాటా

• డాలస్ మహాత్మాగాంధీ మెమోరియల్ కార్యదర్శి రావు కల్వాల
• ప్రవాస భారతీయుల ఘన నివాళి



డాలస్: రతన్ టాటా దేశం గర్వించదగ్గ పారిశ్రామికవేత్త అని, ఆయన మరణం తీరనిలోటని అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం డాలస్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ కార్యదర్శి రావు కల్వాల అన్నారు. ఈ మేరకు మహాత్మాగాంధీ మెమోరియల్ వద్ద రతన్ టాటాకు ప్రవాస భారతీయులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అబీదలీ నీముచ్‌వాలా మాట్లాడుతూ.. రతన్ టాటాకున్న దూరదృష్టి, ఉద్యోగులతో కలిసి పనిచేసిన తీరు, హాస్యపూర్వక సంభాషణలు, టాటా కంపెనీని అభివృద్ధి పథంలో నడిపిన తీరు తదితర విషయాలను వివరించారు. టీసీఎస్‌లో పనిచేసిన ఆయన ఆ తర్వాత విప్రో సంస్థలో చేరి సీఈవో స్థాయికి ఎదిగారు. మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ.. భారతీయ కంపెనీగా ఉన్న టాటా కంపెనీని రతన్‌టాటా అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. కంపెనీ లాభాలను 50 రెట్లు పెంచిన విధానం, లాభాల్లో 60 శాతానికి పైగా సమాజాభివృద్ధికి వెచ్చించిన సామాజిక స్పృహ అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. మహాత్మాగాంధీ మెమోరియల్ బోర్డ్ సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు మురళీ వెన్నం, రాంకీ చేబ్రోలు, తిరుమల్ రెడ్డి.కె, సతీష్ బండారు, చినసత్యం వీర్నపు, సుబ్రహ్మణ్యం జొన్నలగడ్డ, లెనిన్ వేముల, విజయ్ బొర్రా, వాసు గూడవల్లి, రాజేశ్వరి ఉదయగిరి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పాక్ ప్రధాని విందుకు జైశంకర్

దిల్లీ: భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ పాకిస్థాన్ పర్యటనకు సిద్ధమయ్యారు. రెండు రోజుల పాటు జరగనున్న షాంఘై సహకార సంస్థ వార్షిక సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఈ క్రమంలో పాక్ ప్రధాని ఇచ్చే విందులో జైశంకర్ పాల్గొనే అవకాశాలున్నట్లు తెలిసింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న తరుణంలో జైశంకర్ పాక్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మేరకు మంగళవారం ఆయన ఇస్లామాబాద్‌కు వెళ్లనున్నారు. అనంతరం సభ్యదేశాల ప్రతినిధులకు పాక్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ ఇచ్చే విందులో జైశంకర్ పాల్గొనే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

వక్ఫ్ కమిటీ సమావేశాన్ని బహిష్కరించిన ప్రతిపక్షాలు

దిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ సమావేశాన్ని పలువురు ప్రతిపక్ష ఎంపీలు సోమవారం బహిష్కరించారు. నిబంధనలకు అనుగుణంగా కమిటీ పనిచేయడం లేదని, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వక్ఫ్ భూముల కుంభకోణంలో ఉన్నారని అధికార పక్ష సభ్యుల ఆరోపణలకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నారు. సోమవారం నాటి సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రతిపక్ష సభ్యుల అభ్యంతరాలను పార్లమెంటరీ కమిటీ ఛైర్‌పర్సన్ జగదాంబికా పాల్ పట్టించుకోకుండా అధికార పక్ష సభ్యుల వాదనలను కొనసాగించారు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చారు. ముస్లింల భూములకు సంబంధించిన బిల్లుపై అభిప్రాయాల కోసం హిందూ సంస్థలను ఆహ్వానించడాన్ని వారు తప్పుబట్టారు. సమావేశాన్ని బహిష్కరించిన వారిలో గౌరవ్ గొగొయ్, ఇమ్రాన్ మసూద్ (కాంగ్రెస్), ఎ.రాజా (డీఎంకే), అరవింద్ సావంత్ (శివసేన-ఉద్ధవ్), అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం), మొహిబ్బుల్లా (సమాజ్‌వాదీ), సంజయ్ సింగ్ (ఆప్) ఉన్నారు. ఆ తర్వాత వీరంతా సమావేశమై తదుపరి కార్యాచరణపై చర్చించారు. కమిటీ పనితీరుపై లోక్‌సభ స్పీకర్‌కు మంగళవారం వారు ఫిర్యాదు చేసే అవకాశముంది.



రష్యాతో యుద్ధం కొనసాగుతున్న వేళ జపోరిజియా రీజియన్‌లో మానవరహిత పోర్టబుల్ గ్రెనేడ్ లాంచర్ పని తీరును పరిశీలిస్తున్న ఉక్రెయిన్ సైనికుడు

ఉక్రెయిన్‌లోని లెవాద్నె గ్రామంలో మళ్లీ రష్యా బలగాల పాగా

కీవ్: ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా బలగాలు మరో కీలక ముందడుగు వేశాయి. దక్షిణ ఉక్రెయిన్‌లోని జపోరిజియా ప్రాంతంలో కీలక లెవాద్నె గ్రామాన్ని తిరిగి తమ వశం చేసుకున్నాయి. లెవాద్నె పూర్తిగా తమ నియంత్రణలోకి వచ్చినట్లు రష్యా రక్షణ శాఖ సోమవారం ప్రకటించింది. వాస్తవానికి యుద్ధం ఆరంభంలోనే మాస్కో ఈ గ్రామంలో పాగా వేసింది. ఉక్రెయిన్ సైన్యం భీకర ఎదురుదాడులతో నిరుడు వేసవిలో దాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంది. తాజాగా ఆ గ్రామాన్ని మళ్లీ కోల్పోవడం కీవ్ దళాల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసే పరిణామమే. మరోవైపు- ఆదివారం రాత్రి తమ దేశంపై షాహిద్ డ్రోన్లతో దాడులేవీ జరగలేదని ఉక్రెయిన్ వర్గాలు తెలిపాయి. గత ఆరు వారాల్లో ఆ డ్రోన్లను మాస్కో తమ దేశంపైకి పంపకపోవడం ఇదే తొలిసారి అని పేర్కొన్నాయి. రష్యాలోని క్రాస్నోదార్ ప్రాంతంలో దాదాపు 400 షాహిద్ డ్రోన్లను నిల్వ ఉంచిన కేంద్రంపై తాము దాడి చేసినట్లు కీవ్ గత వారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

'డిజిటల్' కేటుగాళ్ల అరెస్టు

అహ్మదాబాద్: డిజిటల్ అరెస్టు పేరిట ప్రజలను మోసగించి డబ్బు గుంజుతున్న నలుగురు తైవాన్ కేటుగాళ్లను, 13 మంది భారతీయులను అహ్మదాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల ఈ ముఠా ఒక వృద్ధుడిని 10 రోజులపాటు డిజిటల్ నిర్బంధంలో ఉంచింది. రిజర్వు బ్యాంకు ముందు వ్యవహారం పరిష్కారమయ్యే వరకూ రూ.79.34 లక్షల రిఫండబుల్ డిపాజిట్ చేయాలని కోరింది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గుజరాత్, దిల్లీ, రాజస్థాన్, కర్ణాటక, మహారాష్ట్రల్లో దాడులు జరిపి మొత్తం 17 మంది మోసగాళ్లను అరెస్టు చేశారు. ఇంతవరకూ 1,000 మంది పౌరులు వీరి బారిన పడి ఉంటారని అంచనా. అరెస్టయిన వారిలో నలుగురు తైవాన్ జాతీయులున్నారు. వీరు గత సంవత్సర కాలంగా భారత్‌ను సందర్శిస్తూ ఇక్కడి భారతీయ తోడు దొంగలకు ఒక ఖాతా నుంచి మరో ఖాతాకు డబ్బు బదిలీ చేయడానికి మొబైల్ యాప్స్, సిమ్ కార్డులు, ఇతర సాంకేతిక సహాయాన్ని అందిస్తున్నారు. పోలీసులు ఈ ముఠా నుంచి రూ.12.75 లక్షల నగదు, 761 సిమ్ కార్డులు, 120 మొబైల్ ఫోన్లు, 92 డెబిట్, క్రెడిట్ కార్డులు, 42 బ్యాంకు ఖాతా పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు.

బుల్డోజర్ న్యాయంపై త్వరలో తీర్పు

• ఈ దశలో మరో పిటిషన్ స్వీకరించలేం: సుప్రీంకోర్టు

దిల్లీ: నేరాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో పలు రాష్ట్రాల్లో నిందితుల ఆస్తులను కూల్చివేస్తున్న ఘటనలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై విచారణ పూర్తయి, తీర్పు వెలువరించబోతున్నందున అదే అంశంపై మరో పిటిషన్‌ను స్వీకరించలేమని సుప్రీంకోర్టు స్పష్టీకరించింది. జమియత్ ఉలేమా ఇ హింద్ తదితరులు దాఖలు చేసిన తాజా పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి సోమవారం కోర్టు అనుమతించింది. తొమ్మిది రాష్ట్రాల్లో కూల్చివేతల వల్ల లక్షల మంది ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. రహదారుల మధ్యలో నిర్మించిన ప్రార్థనా మందిరాలు... ఆలయమైనా, దర్గా అయినా, గురుద్వారా అయినా సరే తొలగించాల్సిందేననీ, ప్రజాహితం కోసం ఇది తప్పదని ఈ నెల 1న సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రహదారులు, ఫుట్‌పాత్‌లు, ప్రభుత్వ స్థలాలు, అడవులు, నదులు, జలాశయాల్లో అక్రమ నిర్మాణాలను సమర్థించలేమని పేర్కొంది. నిందితులు లేదా నేరస్థులైనంత మాత్రాన వారి ఆస్తులను ధ్వంసం చేయడానికి వీల్లేదని ఉద్ఘాటించింది. ముందస్తు నోటీసు ఇచ్చి, చట్ట ప్రకారం నడుచుకోవాల్సిందేనని తెలిపింది.

స్టే తొలగింపునకు ఝార్ఖండ్ హైకోర్టునే ఆశ్రయించండి

• మధు కోడాపై కేసులో ఈడీకి సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: ఝార్ఖండ్ మాజీ సీఎం మధు కోడాపై నమోదైన నగదు అక్రమ చలామణి కేసు విచారణపై ఆ రాష్ట్ర హైకోర్టు విధించిన స్టేను ఎత్తివేసేందుకు సుప్రీంకోర్టు ప్రస్తుతానికి నిరాకరించింది. స్టే తొలగింపునకు ఝార్ఖండ్ హైకోర్టునే ఆశ్రయించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ను సోమవారం ఆదేశించింది. ఈ కేసు విచారణను నిలిపివేయాలని హైకోర్టు నిరుడు నవంబరు 8న ఆదేశించిన సంగతి గమనార్హం. మొత్తం 77 మంది సాక్షులకుగాను 25 మంది వాంగ్మూలం నమోదు పూర్తయిందని, ఈ దశలో ఉన్నత న్యాయస్థానం విచారణను ఆపడం సరికాదని సుప్రీంకోర్టు ధర్మాసనానికి ఈడీ తరఫు న్యాయవాది, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు నివేదించారు. అయితే కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున తొలుత అక్కడికే వెళ్లాలని ధర్మాసనం సూచించింది. తమ వద్ద దాఖలైన ప్రస్తుత పిటిషన్‌పై విచారణను నవంబరు 25కు వాయిదా వేసింది.

కొవిడ్ టీకాలతో దుష్ప్రభావాలంటూ పిల్

• కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం

దిల్లీ: కొవిడ్ టీకాలతో రక్తం గడ్డకట్టడం వంటి దుష్ప్రభావాలు తలెత్తుతున్నాయని ఆరోపిస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. "ఈ పిల్‌తో ప్రయోజనం ఏముంది? కొవిడ్ టీకాలు వేసుకోకపోతే ఎలాంటి దుష్ప్రభావాలు ఎదురవుతాయో కూడా దయచేసి అర్థం చేసుకోండి. ఈ అంశంపై మేం విచారణ చేపట్టదలుచుకోలేదు. కేవలం సంచలనం సృష్టించే ప్రయత్నంలో భాగంగానే పిల్‌ను దాఖలు చేశారు" అని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఎమ్మెల్యేలను నామినేట్ చేసే ఎల్జీ అధికారంపై పిటిషన్ తిరస్కృతి

దిల్లీ: శాసనసభకు ఐదుగురు ఎమ్మెల్యేలను నామినేట్ చేసే జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) అధికారాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సోమవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ విషయంలో హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు ధర్మాసనం సూచించింది. ఇటీవల ముగిసిన జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో 90 సభ్యుల శాసనసభలో నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి 48 సీట్లు నెగ్గింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. నామినేట్ చేసే గవర్నర్ అధికారం ఎన్నికల తీర్పును అడ్డుకోగలదని, ఇది రాజ్యాంగ మౌలిక స్వరూపానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. "మిగతా వాళ్లకు 42 సీట్లు వచ్చాయి. ఐదుగురు సభ్యులను గవర్నర్ నామినేట్ చేస్తే.. 47 అవుతాయి. మావి 48 సీట్లు. ఓ వ్యక్తిని లాక్కుంటే ఎన్నికల తీర్పే మారిపోతుంది" అని సింఘ్వీ తెలిపారు. నామినేట్ చేసే అధికారాన్ని ఎల్జీ ప్రస్తుతం వినియోగించలేదని జస్టిస్ ఖన్నా పేర్కొన్నారు. పిటిషనర్ హైకోర్టుకు వెళ్లొచ్చని సూచించారు.

ఝార్ఖండ్‌లో ఈడీ సోదాలు

రాంచీ: కేంద్ర ప్రభుత్వ పథకం 'జల్ జీవన్ మిషన్' అమలుకు సంబంధించి ఝార్ఖండ్‌లో నిధుల దుర్వినియోగం, అవినీతి, మనీలాండరింగ్ ఆరోపణల వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టింది. సీనియర్ ఐఏఎస్ అధికారి మనీశ్ రంజన్, రాష్ట్ర తాగునీటి, పారిశుద్ధ్య శాఖ మంత్రి మిథిలేశ్ కుమార్ ఠాకుర్ వ్యక్తిగత సహాయకుడు హరేంద్ర సింగ్, మంత్రి సోదరుడు వినయ్ ఠాకుర్, మరికొందరు ప్రభుత్వ అధికారులు, గుత్తేదార్లు, వ్యాపారుల నివాసాల్లో సోదాలు జరిగాయి. రాజధాని రాంచీతో పాటు పశ్చిమ సింగ్‌భుమ్ జిల్లా చాయ్‌బాసాలోని మొత్తం 23 ప్రాంగణాల్లో తనిఖీలు చేసినట్లు దర్యాప్తు సంస్థ అధికారులు తెలిపారు. జల్ జీవన్ మిషన్ పనుల కేటాయింపుల్లో 10శాతం మేర కమీషన్లు చేతులు మారాయని, రాజకీయ నాయకులు, అధికారులకు ఆ డబ్బు చేరిందని ఈడీ ఆరోపిస్తోంది. తాజా పరిణామాలపై ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ స్పందిస్తూ...అసెంబ్లీ ఎన్నికల ముంగిట ఈడీ సోదాలు జరుగుతాయని తాము ముందే ఊహించామని తెలిపారు. వీటి వెనుక భాజపా నేతల ఒత్తిడి ఉందని ఆరోపించారు.

(c) eenadu

హెచ్‌సీఎల్ టెక్ లాభం రూ.4,235 కోట్లు

మధ్యంతర డివిడెండ్ రూ.12

దిల్లీ: హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ అంచనాలను మించి రాణించింది. సెప్టెంబరు త్రైమాసికానికి రూ.4,235 కోట్ల నికరలాభాన్ని ప్రకటించింది. 2023-24 ఇదే కాల లాభం రూ.3,832 కోట్లతో పోలిస్తే, ఇది 10.51% అధికం. ఇదే సమయంలో ఆదాయం రూ.26,672 కోట్ల నుంచి 8.21% పెరిగి రూ.28,862 కోట్లకు చేరింది. ఎబిటా మార్జిన్ 149 బేసిస్ పాయింట్లు పెరిగి 18.6% అయ్యింది. జూన్ త్రైమాసికంలో 1.96 బిలియన్ డాలర్ల ఆర్డర్లు లభించగా, జులై-సెప్టెంబరులో 2.21 బి.డా. ఆర్డర్లను సంపాదించింది.



ఆదాయ వృద్ధి అంచనా పెంపు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆదాయ వృద్ధి అంచనాను 50 బేసిస్ పాయింట్ల మేర కంపెనీ పెంచింది. స్థిర కరెన్సీ వద్ద 3.5%-5.0% ఆదాయ వృద్ధి లభిస్తుందని అంచనా వేస్తోంది.

ప్రాంగణ ఎంపికలు కొనసాగుతున్నాయ్: సమీక్షా త్రైమాసికంలో నికరంగా 780 మంది తగ్గడంతో, మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,18,621కి పరిమితమైనట్లు సంస్థ వెల్లడించింది. వలసల రేటు 12.9 శాతంగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 4,000 మంది (సమీక్షా త్రైమాసికంలో 2,932 మంది) ఫ్రెషర్లు కంపెనీలో చేరారు. జూన్ త్రైమాసికంలో 8,080 మంది ఉద్యోగులు తగ్గడం గమనార్హం. ప్రత్యేక నైపుణ్యాలు, అనుభవం కలిగిన వారి కోసం చూస్తున్నట్లు చీఫ్ పీపుల్ ఆఫీసర్ రామచంద్రన్ తెలిపారు. ప్రాంగణ ఎంపికలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఉద్యోగులకు వేతనాలు సగటున 7% మేర ఈనెల నుంచి పెంచుతున్నట్లు వెల్లడించారు.

ఆర్డర్లు బాగున్నాయ్: సీఈఓ సి.విజయకుమార్

హెచ్‌సీఎల్ టెక్‌కు ప్రాజెక్టులు బాగా ఉన్నాయి. డేటా, కృత్రిమమేధ (ఏఐ), డిజిటల్ ఇంజినీరింగ్, ఎస్‌ఏపీ, సామర్థ్య పెంపు వంటి విభాగాలు సహా మరికొన్ని ప్రాజెక్టులు వచ్చాయి. జెన్ ఏఐకి చెందిన ఏఐ ఫోర్స్, ఏఐ ఫౌండ్రీ వంటివి మా ఖాతాదార్లను ఆకర్షిస్తున్నాయి. జూన్ త్రైమాసికంతో పోలిస్తే, స్థిర కరెన్సీ వద్ద ఆదాయ వృద్ధి 1.6 శాతంగా ఉంది.

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.12 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని బోర్డు ప్రతిపాదించింది.

రిలయన్స్ లాభం రూ.16,563 కోట్లు

- ఓ2సీ వ్యాపార బలహీనతల వల్ల 5% క్షీణత
- మొత్తం ఆదాయం రూ.2.4 లక్షల కోట్లకు
- స్థిర వృద్ధితో టెలికాం, రిటైల్ వ్యాపారాలు



దిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ నికర లాభంలో 5% క్షీణతను చవిచూసింది. చమురు రిఫైనింగ్, పెట్రో రసాయనాల వ్యాపారాలు (ఓ2సీ) బలహీనంగా ఉండటం ఇందుకు నేపథ్యం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరులో కంపెనీ ఏకీకృత నికర లాభం రూ.16,563 కోట్లు (ఒక్కో షేరుకు రూ.24.48)గా నమోదైంది. 2023-24 ఇదే కాల లాభం రూ.17,394 కోట్ల (ఒక్కో షేరుకు రూ.25.71)తో పోలిస్తే ఇది 5% తక్కువ. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.2.38 లక్షల కోట్ల నుంచి రూ.2.4 లక్షల కోట్లకు పెరిగింది. రిటైల్, టెలికాం విభాగాలు రాణించినా, అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా మార్జిన్లు తగ్గడంతో ఓ2సీ గణాంకాలు బలహీనంగా నమోదయ్యాయి. అధిక రుణాల వల్ల, ఆర్థిక వ్యయాలు 5% పెరిగి రూ.6017 కోట్లకు చేరడమూ ప్రభావం చూపింది. చమురు-గ్యాస్ ఉత్పత్తి వ్యాపారం మాత్రం రాణించింది.

✦ కంపెనీ రుణాలు రూ.2.95 లక్షల కోట్ల నుంచి రూ.3.36 లక్షల కోట్లకు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికం నాటి రూ.3.04 లక్షల కోట్లతో పోల్చినా ఇవి ఎక్కువే. నగదు నిల్వలను పరిగణనలోకి తీసుకుంటే నికర రుణాలు రూ.1.16 లక్షల కోట్లకు చేరాయి. 2023 సెప్టెంబరు ఆఖరుకు నికర రుణాలు రూ.1.17 లక్షల కోట్లుగా ఉన్నాయి.

జియో లాభంలో 23% వృద్ధి: జియో ప్లాట్‌ఫామ్స్ ఏకీకృత నికర లాభం కిందటేడాది రెండో త్రైమాసికంతో పోలిస్తే 23.4% వృద్ధితో రూ.6,539 కోట్లకు చేరుకుంది. సగటున ఒక్కో వినియోగదారుపై వచ్చిన నెలవారీ ఆదాయం (ఆర్పు) రూ.181.7 నుంచి రూ.195.1కు పెరగడం ఇందుకు ఉపకరించింది. ఈ ఏడాది జూన్‌లో పెంచిన టెలికాం ఛార్జీల ప్రభావం వచ్చే 2-3 త్రైమాసికాల్లో కనిపిస్తుందని కంపెనీ వివరించింది. ఆదాయాలు 18% వృద్ధితో రూ.31,709 కోట్లకు చేరాయి. మొత్తం వినియోగదార్ల సంఖ్య 4.2% పెరిగి 47.88 కోట్లకు చేరింది. ఇందులో 5జీ వినియోగదార్ల సంఖ్య 14.8 కోట్లుగా ఉంది. 'ప్రపంచంలోనే అత్యుత్తమ ఏఐ వ్యవస్థను మన దేశంలో ఏర్పాటు చేయడానికి జియో కట్టుబడి ఉంద'ని ఫలితాల సందర్భంగా జియో ఇన్ఫోకామ్ ఛైర్మన్ ఆకాశ్ అంబానీ పేర్కొన్నారు.

రిలయన్స్ రిటైల్ కొత్త స్టోర్లు 464: రిలయన్స్ రిటైల్ వెంచర్స్ నిర్వహణ ఆదాయాలు 3.53% తగ్గి రూ.66,502 కోట్లకు చేరాయి. పన్ను అనంతర లాభం మాత్రం 1.28% పెరిగి రూ.2836 కోట్లుగా నమోదైంది. ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ గిరాకీ బలహీనపడడంతో పాటు కార్యకలాపాల విస్తరణ వల్ల వృద్ధిపై ప్రభావం పడింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో కంపెనీ 464 కొత్త స్టోర్లను తెరవడంతో, మొత్తం స్టోర్ల సంఖ్య 18,946కు చేరింది. మొత్తం ఆదాయంలో డిజిటల్ కామర్స్, న్యూ కామర్స్ విభాగం వాటా 17 శాతంగా ఉంది.

> "రిలయన్స్ మరోసారి తన వ్యాపార వైవిధ్యీకరణలోని బలాన్ని ప్రదర్శించింది. డిజిటల్ సేవలు, చమురు ఉత్పత్తి వ్యాపారాల్లో మంచి వృద్ధి నమోదు చేశాం. దీనివల్ల ఓ2సీ వ్యాపార బలహీనతలను పాక్షికంగా తగ్గించగలిగాం. అంతర్జాతీయ గిరాకీ-సరఫరాల్లోని అంతరాల వల్ల ఈ విభాగంలో మార్జిన్లు తగ్గాయి. రిటైల్ విభాగంలో వినియోగదార్లకు మరింత దగ్గరగా వెళ్లడానికి ప్రయత్నించాం. దేశీయ, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాన్ని కొనసాగిస్తాం."
>
> - రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ

ఏడాది చివరకు సోలార్ పీవీ మాడ్యూళ్ల ఉత్పత్తి

కొత్త గిగా ఫ్యాక్టరీల ఏర్పాటు ప్రక్రియ ప్రణాళిక ప్రకారమే కొనసాగుతోందని రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. ఈ ఏడాది చివరికల్లా సోలార్ పీవీ మాడ్యూళ్ల ఉత్పత్తిని ప్రారంభిస్తామని అన్నారు. సౌర, ఇంధన నిల్వ వ్యవస్థలు, హరిత హైడ్రోజన్, బయో ఇంధనం, పవన విద్యుత్, కొత్త ఇంధన వ్యాపారాలతో కూడిన పునరుత్పాదక సొల్యూషన్ల విస్తృత శ్రేణితో అంతర్జాతీయ స్వచ్ఛ ఇంధన మార్పునకు తమ వంతు సహకారం అందిస్తామని ఆయన తెలిపారు.

ఈనాడు బిజినెస్

2025 జూన్ కల్లా బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలు

టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

దిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ 2025 జూన్ నుంచి 5జీ సేవలకు విస్తరిస్తుందని కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సోమవారం వెల్లడించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ సాంకేతికతను వచ్చే ఏడాది మే కల్లా లక్ష బేస్ స్టేషన్ల ద్వారా విస్తృతం చేస్తామన్నారు. ఆ తర్వాత జూన్ నెల నుంచి 5జీ నెట్‌వర్క్‌కు మారేందుకు సన్నాహాలు చేస్తామన్నారు. యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. '4జీలో భారత్ ప్రపంచాన్ని అనుసరించింది. 5జీ సేవల విషయంలో కలిసి నడిచింది. 6జీ సాంకేతికతలో ప్రపంచానికే దారి చూపుతుంద'ని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్-మే నాటికి లక్ష కోర్ అండ్ రేడియో యాక్సెస్ నెట్‌వర్క్ సైట్లను తీసుకొచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, ఇందులో 38,300 సైట్లను ఆదివారం ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వ రంగ సీ-డాట్, దేశీయ ఐటీ కంపెనీ టీసీఎస్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన 4జీ సాంకేతికతను బీఎస్ఎన్ఎల్ వినియోగిస్తోంది. 5జీ సేవలు అందించడంలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా భారత్ అడుగులు వేసిందని, 22 నెలల్లోనే 4.5 లక్షల టవర్లను ఇన్‌స్టాల్ చేయడం ద్వారా, దేశ జనాభాలో 80 శాతం మందిని నెట్‌వర్క్ కవరేజీలోకి తీసుకొచ్చినట్లు వివరించారు. పదేళ్ల క్రితం బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు 6 కోట్లు ఉండగా, ప్రస్తుతం 94 కోట్లకు చేరాయని తెలిపారు.

ధరలు మండుతున్నాయ్



దిల్లీ: కూరగాయలు ప్రియం కావడంతో సెప్టెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 5.49 శాతానికి పెరిగింది. ఇది తొమ్మిది నెలల గరిష్ఠం. 2023 డిసెంబరులో నమోదైన 5.69% తర్వాత ఇదే అధికం. వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా రిటైల్ ద్రవ్యోల్బణాన్ని లెక్కిస్తారు. ఈ ఏడాది ఆగస్టులో ఇది 3.65% కాగా.. కిందటేడాది సెప్టెంబరులో 5.02 శాతంగా ఉంది. ఏడాది వ్యవధిలో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 6.62 నుంచి 9.24 శాతానికి పెరిగింది. ఈ ఏడాది ఆగస్టులో ఇది 5.66 శాతంగా ఉంది.

✦ సెప్టెంబరులో టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) 1.84 శాతానికి పెరిగింది. ఆగస్టులో ఇది 1.31% కాగా.. కిందటేడాది సెప్టెంబరులో -0.07 శాతంగా ఉంది. ఆహార పదార్థాల టోకు ద్రవ్యోల్బణం 3.11% నుంచి గణనీయంగా పెరిగి 11.53 శాతానికి చేరింది. కూరగాయల ద్రవ్యోల్బణం రేటు -10.01% నుంచి 48.73 శాతంగా నమోదైంది. బంగాళాదుంపలు, ఉల్లిపాయల ధరల్లోనూ వరుసగా 78.13%, 78.82% పెరుగుదల ఉంది. ఇంధనం, విద్యుత్ రంగంలో ప్రతిద్రవ్యోల్బణ స్థితి (-4.05%) కొనసాగింది.

కోడి గుడ్లు

15న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	525
గోదావరి	525
విశాఖపట్నం	525
చిత్తూరు	538

హ్యుందాయ్ ఐపీఓ నేటి నుంచే

రూ.10 ముఖవిలువ కలిగిన షేరుకు ధరల శ్రేణి రూ.1,865–1,960	కనీస దరఖాస్తు ఒక లాట్ 7 షేర్లు అంటే రూ. 13,720
రిటైల్ మదుపర్లు దరఖాస్తు చేసుకునేందుకు వీలు 14 లాట్లు: రూ. 1,92,080	దరఖాస్తు సమయం: ఈనెల 15, 16, 17 తేదీల్లో

దిల్లీ: హ్యుందాయ్ మోటార్ ఇండియా (హెచ్‌ఎంఐఎల్)లో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపేణ, కొరియాకు చెందిన మాతృసంస్థ హ్యుందాయ్ 14,21,94,700 ఈక్విటీ షేర్లను ఈ ఐపీఓ ద్వారా విక్రయిస్తోంది.

యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి హెచ్‌ఎంఐఎల్, సోమవారం రూ.8,315 కోట్లు సమీకరించింది. ఎస్‌బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, జేపీ మోర్గాన్ ఫండ్స్, గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ వంటి 225 సంస్థలు ఈ నిధులు అందించాయి. వీరికి 4.24 కోట్ల షేర్లను (ఒక్కోటి రూ.1,960 చొప్పున) కేటాయించారు.

- దీర్ఘకాల దృక్పథంతోనే ఈ ఐపీఓకు దరఖాస్తు చేసుకోవచ్చని ఐసీఐసీఐ సెక్యూరిటీస్ తెలిపింది

బాణాసంచా ప్రమాదాలకు రూ.9తో రూ.25వేల బీమా: ఫోన్‌పే


ఈనాడు, హైదరాబాద్: దీపావళి బాణాసంచా కాలుస్తూ ఎవరైనా గాయపడితే, చికిత్స కోసం రూ.25వేల వరకు బీమా రక్షణ అందించేలా పాలసీని డిజిటల్ చెల్లింపుల సేవా సంస్థ ఫోన్‌పే తీసుకొచ్చింది. ఇందుకోసం ప్రీమియంగా రూ.9 (జీఎస్‌టీ కలిపి) చెల్లిస్తే సరిపోతుంది. 10 రోజుల వ్యవధికి ఈ బీమా పాలసీ వర్తిస్తుంది. ఈనెల 25 నుంచి ఇది అందుబాటులోకి వస్తుంది. ఫోన్‌పే యాప్‌లోనే ఈ పాలసీ తీసుకోవచ్చు. నలుగురు కుటుంబ సభ్యులు కలిసి ఒకే పాలసీ తీసుకునే అవకాశమూ ఉంది. పండగలను అందరూ సురక్షితంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షిస్తున్నామని, ఒకవేళ అనుకోని ఘటన జరిగితే, ఆర్థిక ఇబ్బంది రాకుండా ఈ బీమా కాపాడుతుందని ఫోన్‌పే ఇన్సూరెన్స్ బ్రోకింగ్ సర్వీసెస్ సీఈఓ విశాల్ గుప్తా అన్నారు.

ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ ఎంబీఏకు ఎఫ్‌టీ జాబితాలో 40వ ర్యాంకు

ఈనాడు, హైదరాబాద్: ఫైనాన్షియల్ టైమ్స్ (ఎఫ్‌టీ) ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ర్యాంకింగ్, 2024లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ప్రపంచ స్థాయిలో 40వ ర్యాంకు సాధించింది. ఈసారి మనదేశం నుంచి ఈ జాబితాలో చోటు లభించిన విద్యా సంస్థ ఐఎస్‌బీ ఒక్కటే. విద్యా ప్రమాణాల్లో, పరిశోధనలతో కూడిన బోధనతో పాటు, విద్యార్థులకు అన్ని రకాలుగా ప్రయోజనాలు చేకూర్చే పద్ధతులను అనుసరించడం ద్వారా ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ.. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు సాధిస్తున్నట్లు ఐఎస్‌బీ డిప్యూటీ డీన్ దీపా మణి పేర్కొన్నారు. ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రాంలో చేరాలనుకునే వారికి 10 సంవత్సరాలకు పైగా వ్యాపార అనుభవం, వ్యాపార సంస్థల యజమానులు కావడం, పేరున్న వ్యాపార సంస్థల్లో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయడం లేదా వృత్తి నిపుణులు అయి ఉండాలి. ఎఫ్‌టీ ర్యాంకింగ్ కోసం ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ 2020 బ్యాచ్ విద్యార్థులను సర్వే చేసి, తుది జాబితా రూపొందించారు.

సీమాంతర లావాదేవీల వ్యయాలు, సమయం తగ్గాలి

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



దిల్లీ: ప్రవాసులు భారత్‌కు పంపే నగదు లావాదేవీల వ్యయాలు, సమయం తగ్గాల్సిన అవసరం ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అభిప్రాయపడ్డారు. భారత్ సహా అభివృద్ధి చెందుతున్న అన్ని దేశాలకు ఇది చాలా ముఖ్యమైన అంశమని ఆర్‌బీఐ ఆధ్వర్యంలో సోమవారమిక్కడ జరిగిన 'సెంట్రల్ బ్యాంకింగ్ అట్ క్రాస్ రోడ్స్' సదస్సులో దాస్ పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఓఎమ్) విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గతేడాది భారత్‌లోని విదేశాల నుంచి 111 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9.32 లక్షల కోట్ల) మేర నగదు బదిలీ అయ్యింది. 2027 కల్లా అంతర్జాతీయంగా మొత్తం సీమాంతర చెల్లింపుల విలువ 250 లక్షల కోట్ల డాలర్లకు చేరొచ్చన్నది బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ అంచనా.

ఇతర కరెన్సీల్లోనూ ఆర్‌టీజీఎస్: 'డాలర్, యూరో, పౌండ్ వంటి ప్రధాన వాణిజ్య కరెన్సీల్లోనూ రియల్ టైం గ్రాస్ సెటిల్‌మెంట్ (ఆర్‌టీజీఎస్) లావాదేవీల సెటిల్‌మెంట్‌ను ద్వైపాక్షిక, బహుళ పాక్షిక ఒప్పందాల ద్వారా విస్తరించే అవకాశాలను పరిశీలించాలి. భారత్, కొన్ని ఇతర దేశాలు ఇప్పటికే సీమాంతర చెల్లింపులకు వేగవంతమైన వ్యవస్థల అనుసంధానం దిశగా చర్యలు చేపట్టాయ'ని పేర్కొన్నారు. ఇందులో నాలుగు ఆసియాన్ దేశాల (మలేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్)తో చేపట్టిన ప్రాజెక్ట్ నెక్సస్ కూడా ఉంది.

ఏఐ దుర్వినియోగంతో సైబర్ దాడులు: 'కృత్రిమ మేధ(ఏఐ), మెషీన్ లెర్నింగ్‌పై బ్యాంకింగ్ రంగం ఎక్కువగా ఆధారపడడం ఆందోళన కలిగిస్తోంది. వ్యాపారం, లాభాల విస్తరణకు ఈ సాంకేతికత కొత్త దారులు తెరిచిన మాట వాస్తవమే అయినా.. ఆర్థిక స్థిరత్వానికి ఇబ్బంది కలిగించే అవకాశమూ ఉంది. మొత్తం ఆర్థిక రంగంపైనే ఆ ప్రభావం పడొచ్చు. ఏఐను దుర్వినియోగం చేయడం ద్వారా సైబర్ దాడులు జరుగుతుండడం ఆందోళనకరం. సరైన నష్టనివారణ వ్యవస్థలను బ్యాంకులు ఏర్పాటు చేసుకోవాలి' అని తెలిపారు.

కార్ల విక్రయాలు 3-5% పెరగొచ్చు: సియామ్

దిల్లీ: దేశంలో ప్రయాణికుల వాహన (కార్లు, ఎస్‌యూవీలు, వ్యాన్లు) టోకు విక్రయాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో 3-5% పెరగొచ్చని వాహన తయారీదార్ల సమాఖ్య సియామ్ అంచనా వేసింది. 2023-24తో పోలిస్తే, ఈసారి టోకు అమ్మకాలు 5-8% పెరగొచ్చని గత ఏప్రిల్‌లో వేసిన అంచనాను సియామ్ సవరించుకుంది. గతేడాది ఏప్రిల్-సెప్టెంబరుతో పోలిస్తే, ఈ ఏడాది ఇదే సమయంలో వాహన టోకు విక్రయాల్లో వృద్ధి అత్యంత స్వల్పంగా ఉంది. రెండో అర్ధ భాగంలో పండుగల సీజన్‌పై పరిశ్రమ ఆశాభావంతో ఉంది. కార్ల టోకు అమ్మకాలు ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబరులో 20,81,143 కాగా, గతేడాది 20,70,960గా ఉన్నాయి. అక్టోబరు-మార్చిలో పండుగల సీజన్, శుభకార్యాల నేపథ్యంలో.. విక్రయాల్లో వృద్ధిని అంచనా వేస్తున్నామని సియామ్ అధ్యక్షుడు శైలేష్ చంద్ర వెల్లడించారు. అక్టోబరు తొలి 12 రోజుల్లో రిటైల్ విక్రయాలు సెప్టెంబరుతో పోలిస్తే 25% పెరగడం ఆశావహంగా ఉందని పేర్కొన్నారు.

సెప్టెంబరులో కంపెనీల నుంచి వాహన సరఫరాలు

	2024	2023
కార్లు	3,56,752	3,61,717
ద్విచక్ర వాహనాలు	20,25,993	17,49,794
త్రిచక్ర వాహనాలు	79,683	74,671

✦ 2024-25 రెండో త్రైమాసికం (జులై-సెప్టెంబరు)లో కార్ల అమ్మకాలు ఏడాది క్రితంతో పోలిస్తే 2% తగ్గాయని సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ మేనన్ తెలిపారు. అయితే రెండో త్రైమాసికంలో 10 లక్షల వాహన విక్రయాలను అధిగమించడం ఇది మూడోసారి అని పేర్కొన్నారు. జులై-సెప్టెంబరు మధ్య 10.6 లక్షల వాహనాలు విక్రయమయ్యాయి.

రూ.4,121 కోట్ల పెట్టుబడులు.. 47,851 ఉద్యోగాలు

- మన్నికైన వినియోగ ఉత్పత్తుల పీఎల్ఐ పథకం
- మూడో విడతలో వోల్టాస్, బ్లూస్టార్ సహా 38 కంపెనీల దరఖాస్తు




దిల్లీ: ఏసీలు, ఎల్‌ఈడీ లైట్లు వంటి మన్నికైన వినియోగ ఉత్పత్తుల తయారీ కోసం మూడో విడత ప్రకటించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద రూ.4,121 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. డైకిన్, వోల్టాస్, బ్లూ స్టార్ సహా 38 కంపెనీలు ఈ విడతలో దరఖాస్తు చేసుకున్నట్లు పరిశ్రమ ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య విభాగం (డీపీఐఐటీ) సంయుక్త కార్యదర్శి సంజీవ్ వెల్లడించారు. ఏసీలు, ఎల్‌ఈడీ లైట్ల కోసం ప్రభుత్వం ప్రకటించిన రూ.6,238 కోట్ల పీఎల్ఐ పథకంలో చేరేందుకు చాలా కంపెనీలు తమ ఆసక్తి తెలియజేయడంతో, దరఖాస్తు ప్రక్రియను జులైలో పునఃప్రారంభించింది. దరఖాస్తు చేసుకున్న 38 కంపెనీల్లో 21 దరఖాస్తులు ఏసీ విడిభాగాల తయారీ సంస్థల నుంచి వచ్చాయి. ఇవి రూ.3,679 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపాయి. 18 దరఖాస్తులు ఎల్‌ఈడీ లైట్ల విడిభాగాల తయారీ సంస్థల నుంచి రాగా, అవి రూ.442 కోట్ల పెట్టుబడులు పెడతామని పేర్కొన్నాయి.

✦ వచ్చే మూడేళ్లలో (2028-29 వరకు) ఈ 38 కంపెనీలు సుమారు రూ.55,877 కోట్ల విలువైన ఉత్పత్తులు తయారు చేస్తాయని సంజీవ్ అంచనా వేశారు. 47,851 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తాయని అంచనా వేశారు. 2022-23లో ఒడిశా, జమ్మూ-కశ్మీర్‌తో పాటు 18 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ విభాగ పీఎల్ఐ పథకం కింద రూ.80 కోట్లను లబ్ధిదారు కంపెనీలకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

విద్యుత్ సరఫరా పరికరాలకూ పీఎల్ఐ!: దేశంలో విద్యుత్ సరఫరా పరికరాల మౌలిక వసతులను ప్రోత్సహించేందుకు పీఎల్ఐ పథకంతో పాటు వివిధ అవకాశాలను పరిశీలిస్తున్నట్లు విద్యుత్ కార్యదర్శి పంకజ్ అగర్వాల్ వెల్లడించారు. కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ (సీఈఏ), ఫిక్కీ సంయుక్తంగా నిర్వహించిన 'బ్రెయిన్‌స్టార్మింగ్ కాంక్లేవ్ ఆన్ ఇండియన్ పవర్ సెక్టార్ సినారియో బై 2047' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 'ట్రాన్స్‌మిషన్ పరికరాల సరఫరా వ్యవస్థను స్థానికీకరణ చేసేందుకు ఉన్న అవకాశాలను ఆలోచించాల'ని పరిశ్రమ వాటాదార్లను కోరారు.

రతన్ లాంటి వ్యక్తి ఎవరూ ఉండరు



టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్

దిల్లీ: టాటా గ్రూప్ కంపెనీల్లోని ఉద్యోగులతో పాటు, వారి కుటుంబాల శ్రేయస్సునూ రతన్ టాటా పట్టించుకునేవారని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తెలిపారు. గ్రూప్‌లో ఎంతో మంది లీడర్లను ఆయన తయారు చేశారన్నారు. అసలు రతన్‌లా ఎవరూ ఉండరని లింక్డ్‌ఇన్ పోస్టులో వివరించారు. రతన్ టాటా(86) ఈనెల 9న పరమపదించిన విషయం తెలిసిందే. రతన్‌తో తనకున్న అనుబంధాన్ని, ఆయనతో అనుభవాలను చంద్రశేఖరన్ ఇలా పంచుకున్నారు..

కలిస్తే ఒక జ్ఞాపకమే: టాటాను కలిసిన వారెవ్వరికైనా సరే.. ఒక జ్ఞాపకం ఉండిపోతుంది. అది ఆయన మానవతా దృక్పథం - సహృదయత కావొచ్చు. అలాంటి వ్యక్తి ఉండడం అరుదు. టాటాతో నాకు సంవత్సరాల అనుబంధం ఉంది. తొలుత వ్యాపారం రీత్యా మొదలైనా, క్రమంగా మా బంధం వ్యక్తిగత అనుబంధంగా మారింది. కార్ల నుంచి హోటళ్ల వరకు అన్ని అంశాలపై మాట్లాడుకునేవారం. రోజువారీ అంశాలపైకి చర్చ మళ్లినపుడు, తన అపార అనుభవంతో తెలుసుకున్న అంశాలను విడమరచి చెప్పేవారు.

వివాదాల పరిష్కారంలో మేటి: నేను ఛైర్మన్‌గా మారాక, టాటా మోటార్స్‌లో ఉద్యోగుల సంఘానికి, కంపెనీకి మధ్య వివాదం తలెత్తింది. ఆ సమయంలో యూనియన్ నేతలను నేను, రతన్ కలిశాం. సమస్యను పరిష్కరించడంలో ఆలస్యమైనందుకు ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇరు పక్షాలు కలిసి, 15 రోజుల్లో వివాదం పరిష్కరించాలని నిర్ణయం తీసుకున్నాం. ఉద్యోగులు, వారి కుటుంబాలూ బాగుండాలని ఆయన కోరుకునేవారు.



బాంబే హౌస్ నవీకరణ సమయంలో: టాటా మోటార్స్‌లో వివాదం ఉన్నప్పుడే, మా ప్రధాన కార్యాలయం 'బాంబే హౌస్'ను నవీకరించాలని నేను అనుకున్నాను. 1924 నుంచి అందులో ఎటువంటి మార్పులూ చేయలేదు. రతన్‌కు అది దేవాలయం లాంటిదని, అందువల్ల మార్పులు చేయొద్దంటూ చాలా మంది వారించారు. ఈ విషయమైన నేను రతన్ ముందు గొంతు విప్పాను. 'నవీకరిస్తారా? లేదా ఖాళీ చేస్తారా' అని అడిగారు. ఉద్యోగులు అందరినీ సమీపంలోని ఆఫీసుకే తరలిస్తామని చెప్పాను. రిసెప్షన్ దగ్గర ఉండే కుక్కలను ఎక్కడికి తరలించబోతున్నారు అని అడిగారు. వాటికి ప్రత్యేకంగా ఒక కెనెల్ నిర్మించబోతున్నట్లు తెలిపాకే, అంగీకరించారు. బాంబే హౌస్ నవీకరించాక.. ఆయన తొలుత సందర్శించింది ఆ కెనెల్‌నే. పెద్ద ప్రాజెక్టులకు సమానంగా వాటికీ ఆయన ప్రాధాన్యమిచ్చేవారు.

ఒక్కసారి చూస్తే చాలు: ఆయన ఒక్కసారి ఎక్కడికైనా వెళితే, అక్కడి ఫర్నీచర్, లైటింగ్, రంగులు.. ఇలా ఏదీ మరచిపోరు. ఆయనది ఫొటోగ్రాఫిక్ మెమొరీ. పుస్తకాలు, మ్యాగజైన్ల కవర్లు, వాటిలోని అంశాలను ఏళ్ల తర్వాత కూడా కచ్చితంగా చెప్పేవారు. పెద్ద ఆలోచనల నుంచి చాలా చిన్న అంశాల వరకూ ఆయన అన్నిటినీ గమనిస్తారు, గుర్తుంచుకుంటారు.

నిఫ్టీ మళ్లీ 25,000కు



ఐటీ, బ్యాంకింగ్ షేర్ల రాణింపు

సెన్సెక్స్ ▲592 **81973** | **నిఫ్టీ** ▲164 **25128**

సమీక్ష

అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో దేశీయ సూచీలు లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్, ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించగా, నిఫ్టీ తిరిగి 25,000 పాయింట్ల ఎగువన ముగిసింది. కార్పొరేట్ సంస్థల జులై-సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు స్తబ్దుగా ఉండొచ్చనే అంచనాలు, చమురు ధరలు తగ్గడం లాంటి వాటిని ఇప్పటికే మార్కెట్ పరిగణనలోకి తీసుకున్నట్లు కనిపిస్తోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 5 పైసలు పెరిగి 84.05 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 1.01% నష్టంతో 78.03 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లలో జపాన్, చైనా, దక్షిణ కొరియా సూచీలు లాభాలతో ముగియగా.. హాంకాంగ్ సూచీ నష్టపోయింది. ఐరోపా మార్కెట్లు మిశ్రమంగా కదలాడాయి.

ఆద్యంతం లాభాల్లోనే...: క్రితం రోజు ముగింపు 81,381.36 పాయింట్లతో పోలిస్తే, సోమవారం ఉదయం 196 పాయింట్ల లాభంతో సెన్సెక్స్ 81,576.93 వద్ద ట్రేడింగ్ ఆరంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగిస్తూ, 82,072.17 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదుచేసింది. చివరకు 592 పాయింట్ల లాభంతో 81,973.05 వద్ద ముగిసింది. నిఫ్టీ 163.70 పాయింట్లు పెరిగి 25,127.95 వద్ద స్థిరపడింది.

21 కంపెనీల షేర్లు పైకి..: సెన్సెక్స్ 30 షేర్లలో 9 కంపెనీల షేర్లు నష్టాల్లో ముగియగా.. మిగిలినవి లాభపడ్డాయి. మారుతీ సుజుకీ 1.85%, టాటా స్టీల్ 1.49%, బజాజ్ ఫైనాన్స్ 1.23%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.97%, యాక్సిస్ బ్యాంక్ 0.68%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.51%, నెస్లే ఇండియా 0.38%, టీసీఎస్ 0.34 షేర్లు నష్టపోయిన వాటిల్లో ఉన్నాయి. టెక్ మహీంద్రా 2.86%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.32%, ఎల్‌అండ్‌టీ 2.02%, ఐటీసీ 1.72%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.7%; కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.47% రాణించాయి.

✦ వాటాదార్లకు వారి వద్ద ఉన్న ప్రతి షేరుకు మరో షేరును బోనస్‌గా (1:1నిష్పత్తిలో) ఇచ్చే ప్రతిపాదనకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపిందని ఈజీ ట్రిప్ ప్లానర్స్ తెలిపింది.

నేటి బోర్డు సమావేశాలు: హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పీవీఆర్ ఐనాక్స్, ర్యాలీస్ ఇండియా, కేఈఐ ఇండస్ట్రీస్, డీబీ కార్ప్

డి-మార్ట్ షేర్లు డీలా

అక్టోబరు- డిసెంబరు త్రైమాసికానికి డి-మార్ట్ మాతృ సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ ప్రకటించిన ఫలితాలు మదుపర్లను నిరాశపర్చడంతో కంపెనీ షేర్లు డీలాపడ్డాయి. బీఎస్ఈలో 8.48% క్షీణించి రూ.4,184.45 వద్ద ముగిసింది.


కృత్రిమ మేధలో సరికొత్త ఆవిష్కరణల కోసం పోటీ

దిల్లీ: చిన్న, మధ్య తరహా వ్యాపారాలు (ఎస్ఎంబీ) ఇ-కామర్స్ రంగంలో రాణించేందుకు అవసరమైన కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఆవిష్కరణల కోసం అమెజాన్ ఇండియా ప్రత్యేక పోటీ నిర్వహించనుంది. సంభవ్ హ్యాకథాన్ 2024 పేరుతో దీన్ని ప్రారంభించినట్లు సోమవారం వెల్లడించింది. అయిదో విడత నిర్వహిస్తున్న ఈ హ్యాకథాన్ కోసం స్టార్టప్ ఇండియా, డీపీఐఐటీ (డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్), నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) ఇండియా, ఎన్ఐఎఫ్ ఇంక్యుబేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కౌన్సిల్ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. ఇందులో పాల్గొనేందుకు నవంబరు 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన స్టార్టప్‌లను నవంబరు 18న ప్రకటిస్తారు. నవంబరు 24 లోపు ప్రోటోటైప్‌లు సమర్పించి, డిసెంబరు 5-6 తేదీల్లో వర్చువల్ డెమో ఇవ్వాల్సి ఉంటుంది. తుది విజేతలను డిసెంబరు 10న నిర్వహించే అమెజాన్ సంభవ్ 2024న వెల్లడిస్తామని తెలిపింది.

(c) eenadu

ఈనాడు సినిమా

పండగకు ముందే...!


వెంకటేశ్

'సంక్రాంతికి వస్తున్నాం' అంటూ ఊరిస్తున్నారు వెంకటేశ్. పేరు అదే ఖరారవుతుందా? సినిమా సంక్రాంతికే వస్తుందా అనే విషయాలపై ఇంకా స్పష్టత లేదు. కానీ చిత్రీకరణ మాత్రం వడివడిగా సాగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. 'ఎఫ్2', 'ఎఫ్ 3' తర్వాత వెంకటేశ్- అనిల్ రావిపూడి కలయికలో రూపొందుతున్న చిత్రమిది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీశ్ నిర్మిస్తున్నారు. దిల్‌రాజు సమర్పకులు. దీపావళి పండగకు ముందే ఈ సినిమా లుక్‌ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సినిమా పేరు, విడుదల తేదీపైనా స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. క్రైమ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో వెంకీ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ నటిస్తున్నారు. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: సమీర్‌రెడ్డి.

యాక్షన్ కథతో 45వ చిత్రం


సూర్య

సూర్య త్వరలోనే 'కంగువా' చిత్రంతో సందడి చేయనున్నారు. ఆయన 44వ సినిమా కూడా ఇప్పటికే చిత్రీకరణని పూర్తి చేసుకుంది. తాజాగా 45వ చిత్రం మొదలైంది. ఆర్.జె.బాలాజీ దర్శకత్వం వహిస్తున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్.ఆర్.ప్రకాశ్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నవంబరు నుంచి సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ సినిమా యాక్షన్ అడ్వెంచర్ కథతో రూపొందనున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. ఎ.ఆర్.రెహమాన్ స్వరాలు సమకూరుస్తున్నారు. 2025 ద్వితీయార్ధంలో ఈ చిత్రం విడుదల కానుంది.

ఇడ్లీ కొట్టుతో కొత్త ప్రయాణం


నిత్యామేనన్

ఎంచుకునే ప్రతి పాత్రలోనూ తన సహజమైన నటనతో సినీప్రియుల్ని మెప్పిస్తుంటుంది అందాల తార నిత్యామేనన్. ఇటీవలే ఉత్తమ నటిగా జాతీయ అవార్డును సొంతం చేసుకున్న ఈమె.. తమిళ కథానాయకుడు ధనుష్‌తో కలిసి 'ఇడ్లీ కడై'(ఇడ్లీ కొట్టు) అనే చిత్రంలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. "కొత్త ప్రకటన. . కొత్త ప్రయాణం... 'ఇడ్లీకడై'' అనే వ్యాఖ్యతో సామాజిక మాధ్యమాల వేదికగా ఓ ఫొటోను పంచుకుంది నిత్య. ఇప్పటికే చిత్రీకరణ ప్రారంభమైనట్లు చిత్రవర్గాలు తెలిపాయి. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ధనుష్ తెరకెక్కిస్తున్నారు. డాన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రకాశ్‌రాజ్, షాలినీ పాండే తదితరులు నటిస్తున్నారు. 'తిరు' చిత్రంలో స్నేహితులుగా కనిపించి అభిమానుల్ని అలరించిన ధనుష్, నిత్య.. మరి ఈసారి తెరపై ఎలాంటి మ్యాజిక్ సృష్టిస్తారో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

ఆ నమ్మకంతోనే దీపావళికి వస్తున్నాం


తన్వీరామ్, కిరణ్ అబ్బవరం

"కథపై నమ్మకం కలిగితేనే ప్రేక్షకులు థియేటర్లకి వెళుతున్నారు. బలమైన కథకి దీటైన వాణిజ్యాంశాల్ని మేళవించి రూపొందించిన చిత్రమే 'క. మా అందరికీ సినిమాపై ఉన్న నమ్మకంతోనే దీపావళికి విడుదల చేస్తున్నాం'' అన్నారు కిరణ్ అబ్బవరం. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'క'. నయన్ సారిక, తన్వీరామ్ కథానాయికలు. సుజీత్, సందీప్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ నెల 31న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. కథానాయకుడు మాట్లాడుతూ "దీపావళికి థియేటర్ల దగ్గర గట్టి పోటీ ఉంది. అయినా సరే, మా పంపిణీదారుడు వంశీ నందిపాటి సినిమాపై నమ్మకంతో 31న విడుదల చేయాలని నిర్ణయించారు. 70 దశకం నేపథ్యంలో సాగే కథ ఇది. యువతరంతోపాటు, కుటుంబ ప్రేక్షకుల్ని అలరిస్తుంది. మంచి ప్రాజెక్ట్‌కి అన్నీ బాగా కుదురుతుంటాయి. అన్ని భాషల్లోనూ ఈ చిత్రం ఒకే రోజు విడుదలవుతుంది. 'క' సినిమా ప్రారంభమైన తొలి రోజే మా సెట్‌కి అల్లు అర్జున్ వచ్చి 'ఈ సినిమాతో హిట్ కొట్టాలి' అంటూ అభినందనలు తెలిపారు. దుల్కర్ సల్మాన్ మా సినిమాని చూసి మలయాళంలో విడుదల చేస్తున్నారు. ఆయన 'లక్కీ భాస్కర్' కూడా 31నే వస్తోంది'' అన్నారు. దర్శకులు మాట్లాడుతూ "ఆ కాలంలో అభినవ్ వాసుదేవ్ అనే ఓ పోస్ట్‌మేన్ చుట్టూ సాగే కథ ఇది. ఒక ప్రత్యేకమైన హాబీ ఉన్న ఆ పోస్ట్‌మేన్ ఏం చేశాడు? ఓ ఊరికి ఎందుకు వెళ్లాడు? అక్కడ అతను ఎదుర్కొన్న సంఘటనలు ఎలాంటివన్నది ఈ కథలో కీలకం. స్క్రీన్‌ప్లే ప్రధానంగా సాగే కథ ఇది. థియేటర్లలో పాత్రలే కనిపిస్తాయి. అంతగా ఈ కథ ప్రేక్షకుల్ని లీనం చేస్తుంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో సహ నిర్మాత చింతా రాజశేఖర్ రెడ్డి, ఇతర చిత్రబృందం పాల్గొంది.


నాగబంధం ప్రారంభం

'పెద కాపు' చిత్రంతో పరిచయమైన విరాట్‌కర్ణ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్'. నభా నటేశ్ కథానాయిక. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్, తారక్ సినిమాస్ సంస్థలతో కలిసి ఎన్.ఐ.కె.స్టూడియోస్ పతాకంపై కిశోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పకులు. ఈ సినిమా ప్రారంభోత్సవం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. అగ్ర కథానాయకుడు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై ముహూర్తపు సన్నివేశానికి క్లాప్‌నిచ్చారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు అజయ్ భూపతి గౌరవ దర్శకత్వం వహించారు. ఏషియన్ సునీల్ చిత్రబృందానికి స్క్రిప్ట్‌ని అందజేశారు. "తిరువనంతపురంలోని పద్మనాభ స్వామి ఆలయంలో నిధి, పూరి జగన్నాథ ఆలయంలో రత్న భాండాగారాన్ని తెరిచిన తర్వాత గుప్తనిధుల అంశం చర్చనీయాంశంగా మారింది. నాగబంధం రక్షణలో ఉన్న అలాంటి 108 దేవాలయాలతో ముడిపడిన కథ ఇది. భక్తి, సాహసాలు, అంతుచిక్కని రహస్యాలతో ఓ శక్తిమంతమైన కథని తయారు చేశారు అభిషేక్ నామా. ఈ నెల 23 నుంచే రెగ్యులర్ చిత్రీకరణని ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది తెలుగుతోపాటు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల చేస్తామ''ని సినీ వర్గాలు తెలిపాయి. కథానాయకుడు విరాట్ కర్ణ మాట్లాడుతూ "ఈ సినిమా చాలా బాగుంటుంది. చిరంజీవి చేతులమీదుగా ప్రారంభం కావడం ఆనందంగా ఉంది'' అన్నారు. ఐశ్వర్య మేనన్, జగపతిబాబు, జయప్రకాశ్, మురళీశర్మ, బి.ఎస్.అవినాశ్ తదితరులు నటిస్తున్నారు.


నభా, విరాట్ కర్ణ, ఐశ్వర్య, చిరంజీవి

ఓరగా చూడగా... సన్నగా నవ్వగా

'ఓరగా చూడగా... కాక రేగదా ప్రతివాడికీ... సన్నగా నవ్వగా... మంటలే కదా మగజాతికీ...' అంటూ కవ్వింపులతో సందడి షురూ చేసింది సోఫియా. ఆమె కథేమిటో తెలియాలంటే వచ్చే నెల 14న విడుదల కానున్న 'మట్కా' చూడాల్సిందే. వరుణ్‌తేజ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రమిది. నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి కథానాయికలు. కరుణ కుమార్ దర్శకుడు. విజేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఈ చిత్రంలోని 'లే లే రాజా... లేత లేత రోజా... ఖోలో ఖోలో ఆజా అందాలా దర్వాజా...' అంటూ సాగే పాటని విడుదల చేశారు. జి.వి.ప్రకాష్ కుమార్ స్వరకల్పనలోని ఈ పాటకి భాస్కరభట్ల సాహిత్యం అందించగా, నీతి మోహన్ ఆలపించారు. నోరా ఫతేహి, వరుణ్ తేజ్‌లపై తెరకెక్కించిన పాట ఇది. 1970, 80 దశకాల్ని గుర్తుకు తెచ్చే ఈ పాటలో నోరా ఫతేహి... సోఫియా అనే గ్లామర్ క్వీన్ పాత్రలో సందడి చేయనున్నారు. వరుణ్‌తేజ్ భిన్న గెటప్‌ల్లో కనిపిస్తారు. నవీన్ చంద్ర, అజయ్ ఘోష్, కన్నడ కిశోర్, రవీంద్ర విజయ్, పి.రవిశంకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఎ.కిశోర్‌కుమార్.


నోరా ఫతేహి

థ్రిల్ పంచే వీక్షణం


మనోజ్, సమర్థ్

"ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచే కామెడీ మిస్టరీ థ్రిల్లర్ కథతో రూపొందిన చిత్రమే మా 'వీక్షణం'. భయపెడుతూ నవ్వించే సినిమాల్లాగే తెరపై థ్రిల్లింగ్ సన్నివేశాలు సాగుతున్నప్పుడు కూడా ప్రేక్షకుల్ని నవ్వించడమే ఈ సినిమా ప్రత్యేకత'' అన్నారు మనోజ్ పల్లేటి. ఆయన దర్శకత్వంలో రామ్ కార్తీక్, కశ్వి జంటగా తెరకెక్కిన చిత్రం 'వీక్షణం'. పి.పద్మనాభరెడ్డి, అశోక్‌రెడ్డి నిర్మాతలు. ఈ నెల 18న ఈ చిత్రం రానుంది. ఈ సందర్భంగా సోమవారం దర్శకుడు మనోజ్ పల్లేటి, సంగీత దర్శకుడు సమర్థ్ గొల్లపూడి విలేకర్లతో ముచ్చటించారు. దర్శకుడు మాట్లాడుతూ 'వాస్తవ సంఘటనలకి కల్పితాలు జోడించి కథని రాశా. కుటుంబ ప్రేక్షకులు కూడా ఆస్వాదించేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు. సంగీత దర్శకుడు సమర్థ్ గొల్లపూడి మాట్లాడుతూ "కామెడీ, సస్పెన్స్, మిస్టరీ, థ్రిల్ తదితర అంశాలన్నీ మేళవించిన కథ ఇది. సంగీతానికి ప్రాధాన్యమున్న ఇలాంటి కథలంటే నాకు చాలా ఇష్టమ''న్నారు.

వాస్తవ ఘటనలతో.. డియర్ కృష్ణ


మమితా బైజు

అక్షయ్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'డియర్ కృష్ణ'. 'ప్రేమలు' ఫేమ్ మమితా బైజుతోపాటు, ఐశ్వర్య కథానాయికలుగా నటిస్తున్నారు. దినేశ్ బాబు దర్శకత్వం వహిస్తున్నారు. పీఎన్ బలరామ్ నిర్మాత. ఆయనే కథని అందించారు. దసరా సందర్భంగా ఇటీవల ఈ సినిమా పోస్టర్‌ని విడుదల చేసింది చిత్రబృందం. ఈ సందర్భంగా నిర్మాత, కథా రచయిత మాట్లాడుతూ "వాస్తవంగా జరిగిన కొన్ని సంఘటనల ప్రేరణతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఎవరూ ఊహించని కథనం ఈ చిత్రానికి ప్రధానబలం'' అన్నారు. "స్ఫూర్తిదాయకమైన ఈ కథని, యువతరాన్ని అలరించే వాణిజ్య హంగులతో తెరపైకి తీసుకొచ్చాం. త్వరలోనే ఈ సినిమా గురించి మరిన్ని వివరాల్ని వెల్లడిస్తాం'' అన్నారు దర్శకుడు. అవినాశ్, సమీర్, లోహిత్, రక్ష తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: దినేశ్‌బాబు, సంగీతం: హరి ప్రసాద్.

ఓ మెడికల్ విద్యార్థి కథ


నిఖిల్

"చిన్న సినిమా బాగుంటేనే పరిశ్రమ బాగుంటుంది. అందుకే కథాబలం ఉన్న చిన్న చిత్రాలకి విడుదల పరంగానూ, ప్రచారం పరంగానూ సహకారం అందించే ప్రయత్నం చేస్తున్నాం'' అన్నారు నిర్మాత ఎస్.కె.ఎన్. ఆయన... ప్రముఖ దర్శకుడు మారుతితో కలిసి 'ఘటికాచలం' సినిమాని విడుదల చేస్తున్నారు. నిఖిల్ దేవాదుల కథానాయకుడిగా అమర్ కామేపల్లి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. ఎం.సి.రాజు నిర్మాత. సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా టీజర్ విడుదల కార్యక్రమం జరిగింది. దర్శకుడు మాట్లాడుతూ "19 ఏళ్ల మెడికల్ స్టూడెంట్ కథ ఇది. అమెరికాలో ఉండే నా స్నేహితుడు రాజు వాళ్లకు తెలిసినవాళ్ల ఇంట్లో జరిగిన కొన్ని సంఘటనల్ని చెప్పాడు. ఆసక్తికరంగా అనిపించిన ఆ సంఘటనల ఆధారంగానే రాజు ఈ కథని తయారు చేసి, తనే సినిమాని నిర్మించడానికి ముందుకొచ్చాడు'' అన్నారు. కథానాయకుడు మాట్లాడుతూ "ఎన్నో మలుపులున్న కథ ఇది. బాల నటుడిగా 70 సినిమాలు చేశా. కథానాయకుడిగా నేను చేసిన తొలి చిత్రమిది. నాణ్యమైన ఈ కథని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లేందుకు ముందుకొచ్చిన మారుతి, ఎస్.కె.ఎన్‌లకు మా కృతజ్ఞతలు'' అన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత డార్లింగ్ స్వామి, దర్శకుడు మల్లికార్జున్, ధీరజ్ మొగిలినేని, ఆర్విකా గుప్తా, దేవి, రంగదామ్, రచయిత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఆటలో ప్రతి నిజానికీ ఓ రహస్యం.. ముప్పు


కాజోల్, కృతి సనన్

'ద్వేషం కారణంగా అన్నదమ్ముల మధ్య జరిగిన అతిపెద్ద యుద్ధమే మహాభారతం. అలాగే ఈ అక్కాచెల్లెళ్ల మధ్య ద్వేషమే ఈ మిస్టరీకి కారణం'' అంటూ 'దో పత్తీ' ప్రపంచాన్ని పరిచయం చేసింది చిత్రబృందం. మరి ఆ సోదరీమణుల కథేంటో తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే అంటున్నాయి చిత్రవర్గాలు. బాలీవుడ్ కథానాయిక కృతి సనన్ నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రమిది. కాజోల్ కీలక పాత్ర పోషించింది. ఈ మిస్టరీ థ్రిల్లర్‌ను శంశాంక చతుర్వేది తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "దో పత్తీ' ఆటలో నిజం, సాక్ష్యం ఒకేలా కనిపించవు. ఈ ఆటలో ప్రతి నిజానికి ఓ రహస్యం, ముప్పు ఉంద''ని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో సౌమ్య, శైలీ అనే ఇద్దరు కవల సోదరీమణుల పాత్రల్లో కృతి, ఈ ఇద్దరీ అక్కాచెల్లెళ్ల కేసును ఛేదించే పోలీసు అధికారిణిగా కాజోల్ కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. రహస్యాలు, మలుపులతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతోందీ ట్రైలర్. షాహీర్ షేక్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది.

జీవితమే ఓ రేసు..


అనుపమ్ ఖేర్

అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదనే కథాంశం ఆధారంగా రూపొందిన చిత్రం 'విజయ్ 69'. బాలీవుడ్ విలక్షణ నటుడు అనుపమ్ ఖేర్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. జీవితంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ.. 69ఏళ్ల వ్యక్తి ట్రయాథ్లాన్ కోసం శిక్షణ తీసుకోవడం చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. అక్షయ్ రాయ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని మనీశ్ శర్మ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నవంబరు 6న విడుదల కాబోతుందని తెలుపుతూ.. 'జీవితమే ఓ రేసు' అనే వ్యాఖ్యతో ఓ వీడియోను పంచుకుంది చిత్రబృందం. ఈ సందర్భంగా అనుపమ్ ఖేర్ మాట్లాడుతూ.. "విజయ్ 69' కేవలం సినిమా మాత్రమే కాదు. పట్టుదల, స్ఫూర్తికి నిదర్శనం. జీవితంలోని ప్రతి అధ్యాయం కొత్త ప్రారంభానికి అవకాశాన్ని అందిస్తుందని తెలియజేస్తుంది. ఈ చిత్రంలో మన కలలను సాకారం చేసుకోవడానికి వయసు ఎప్పుడూ అడ్డంకి కాదనే విషయాన్ని సందేశాత్మకంగా చూపించనున్నాం'' అని అన్నారు.


పటేల్ హంగామా


అజయ్


'పొట్టేల్' చిత్రం కోసం పటేల్‌గా మారిపోయారు నటుడు అజయ్. ఆయన ఇదివరకెప్పుడూ చేయని ఓ కొత్త రకమైన, అత్యంత శక్తిమంతమైన పాత్ర ఇదని చిత్రబృందం చెబుతోంది. యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రధారులుగా... సాహిత్ మోత్కురి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేశ్ సడిగె నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 25న రానుంది. ఈ సందర్భంగా సోమవారం ఈ చిత్రంలోని అజయ్ లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. పటేల్ పాత్రలో అజయ్ కనిపించే విధానం, ఆయన నటనలో గాఢత ప్రేక్షకుల్ని కట్టి పడేస్తుందని... కథ, కథనాలు మరింతగా అలరిస్తాయని సినీ వర్గాలు తెలిపాయి.

(c) eenadu

పేగు-మెదడు అనుబంధం!



మన శరీరానికి హెడ్మాస్టర్ మెదడే. అన్ని అవయవాలూ ఇది చెప్పినట్టు నడుచుకుంటాయి. కానీ దీన్ని సైతం మన పొట్టలోని పేగులు ఆదేశిస్తాయని తెలుసా? వీటిలోని ప్రత్యేక నాడీ వ్యవస్థను రెండో మెదడు అనీ పిలుచుకుంటారు. మెదడు-పేగులు ఒకదాంతో మరోటి అనుసంధానమై సమన్వయంతో పనిచేస్తాయి. మెదడు పేగులకు, పేగులు మెదడుకు నిరంతరం సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకుంటాయి. వీటి మధ్య సంబంధం అస్తవ్యస్తమైతే సమస్యలూ తలెత్తుతాయి.



డా॥ రాకేశ్ కలపాల
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్
థెరప్యూటిక్ ఎండోస్కోపిస్ట్
ఏఐజీ హాస్పిటల్స్
హైదరాబాద్

పేగులు-మెదడు మధ్య అనుబంధం (గట్-బ్రెయిన్ యాక్సిస్) శారీరకంగానే కాదు.. జీవరసాయనాల పరంగానూ సాగుతుంది. ఇవి రకరకాల మార్గాల్లో అనుసంధానమై పనిచేస్తాయి. ఒకదాని మీద మరోటి ప్రభావం చూపుతాయి. ఏదైనా ఆందోళన కలిగించే విషయం విన్నప్పుడు కడుపులో 'భయం' పుట్టటం, విరేచనాలు అవ్వటం గమనించే ఉంటారు. అలాగే రుచికరమైన భోజనం, మిఠాయిలు తిన్నప్పుడు ఆనందం కలగటం సహజమే. ఇవన్నీ మెదడు, పేగుల మధ్య సంబంధానికి చిహ్నాలే. వీటి మధ్య లక్షలాది నాడులు, నాడీ కణాలు అటూఇటూ సమాచారాన్ని ప్రసరింపజేస్తూ ఉంటాయి. పేగుల్లో పుట్టుకొచ్చే నాడీ సమాచార వాహికలు (న్యూరోట్రాన్స్‌మిటర్స్), ఇతర రసాయనాలు మెదడును కూడా ప్రభావితం చేస్తాయి. ఒకవైపు పేగులు ఆరోగ్యంగా ఉండటానికి మెదడు తోడ్పడుతుంటే.. మరోవైపు మెదడు ఆరోగ్యానికి పేగులు దోహదం చేస్తుంటాయి. అంటే ఒకటి అనారోగ్యానికి గురైతే మరోటీ ప్రభావితం అవుతుందన్నమాట. ఆందోళన (ఆంగ్జయిటీ), మానసిక ఒత్తిడి (స్ట్రెస్), కుంగుబాటు (డిప్రెషన్) వంటి సమస్యలను మానసికమైనవిగానే పరిగణిస్తుంటాం. కానీ జీర్ణాశయం, పేగులు అస్తవ్యస్తమైనా ఇలాంటి సమస్యలు తలెత్తొచ్చు.

పేగు బ్యాక్టీరియా కీలకం

మన పేగుల్లోని సూక్ష్మక్రిములు ఆహారాన్ని జీర్ణం చేయటం ద్వారా శక్తిని, పోషకాలను అందించటమే కాదు.. నాడీ సమాచార వాహికలు, వీటి ముందస్తు రూపాలనూ ఉత్పత్తి చేస్తాయి. ఇవి మెదడుకు సంకేతాలను చేరవేసే రసాయనాలుగా ఉపయోగపడతాయి. ఈ సంకేతాలను మెదడు విడమరచుకొని నాడీ వ్యవస్థ, వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్), ఇతర శరీర ప్రక్రియల నిర్వహణకు అవసరమైన రసాయన సందేశాలను పంపుతుంది.

ప్రభావం ఇలా..

వేగస్ నాడీ: మన శరీరం ఎలా పనిచేయాలో మెదడు, కేంద్ర నాడీ వ్యవస్థలో ఉండే నాడీకణాలు (న్యూరాన్స్) నిర్దేశిస్తాయి. మెదడులో సుమారు 10వేల కోట్ల నాడీకణాలుంటాయి. ఆశ్చర్యకరంగా పేగుల్లోనూ 50కోట్ల నాడీ కణాలు ఉంటాయి. ఇవి నాడీ వ్యవస్థ ద్వారా మెదడుతో అనుసంధానమవుతాయి. వేగస్ నాడీ అటు మెదడు ఇటు పేగుల మధ్య సంధానకర్తగా వ్యవహరిస్తుంది. ఉదాహరణకు- వేగస్ నాడీ ద్వారా ప్రసారమయ్యే సంకేతాలను మానసిక ఒత్తిడి అడ్డుకుంటున్నట్టు, జీర్ణకోశ సమస్యలకు కారణమవుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. పేగుపూత (ఐబీఎస్), క్రాన్స్ జబ్బు గలవారిలో వేగస్ నాడీ సామర్థ్యం తగ్గుతున్నట్టూ బయటపడింది. మెదడు-పేగు అనుబంధంలో వేగస్ నాడీ కీలక పాత్ర పోషిస్తున్నట్టు ఇది తెలియజేస్తోంది.

నాడీ సమాచార వాహకాలు: మన భావనలు, భావోద్వేగాలను మెదడులో ఉత్పత్తయ్యే నాడీ సమాచార వాహకాలు (న్యూరోట్రాన్స్‌మిటర్స్) నియంత్రిస్తుంటాయి. సెరటోనిన్ అనే సమాచార వాహకం సంతోషం, ఆనందం కలగటానికి తోడ్పడుతుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే- మన శరీరంలో మొత్తం సెరటోనిన్‌లో 90% పేగుల్లోని సూక్ష్మక్రిములే ఉత్పత్తి చేయటం! ఈ సెరటోనిన్ మన భావోద్వేగాలు, మానసిక స్థితి, జీర్ణక్రియ, ఆకలి, నిద్ర, లైంగిక ధోరణి, శరీర ఉష్ణోగ్రత నియంత్రణ, నొప్పి భావన, రక్తం గడ్డకట్టటం, ఎముకల ఆరోగ్యం వంటి వాటికీ తోడ్పడుతుంది. తిన్న ఆహారం సరిగా జీర్ణం కాకపోయినా, శరీరం దాన్ని సరిగా శోషించుకోకపోయినా సెరటోనిన్ ఏర్పడే సామర్థ్యం తగ్గుతుంది. సెరటోనిన్ మోతాదులు తగ్గితే కుంగుబాటు, ఇతర మూడ్ సమస్యలు, ఆందోళన, నిద్రలేమి, అజీర్ణం వంటి సమస్యలకూ దారితీస్తుంది. అంతేకాదు, ఆత్మహత్య ప్రవర్తనకూ కారణం కావొచ్చు.

- భయం, ఆందోళనను నియంత్రించే గామా-అమైనోబ్యూటీరిక్ యాసిడ్ (గాబా) అనే నాడీ సమాచార వాహకమూ పేగుల్లోంచి విడుదలవుతుంది.
- పేగు బ్యాక్టీరియా ఉత్పత్తి చేసే ఇతర రసాయనాలూ మెదడు మీద ప్రభావం చూపుతాయి. పీచు పదార్థాన్ని జీర్ణం చేసే క్రమంలో బ్యూటిరేట్, ప్రొపయోనేట్, అసిటేట్ వంటి షార్ట్‌చెయిన్ కొవ్వు ఆమ్లాలు (ఎస్‌సీఎఫ్ఏ) పుట్టుకొస్తాయి. ఇవి ఆకలిని తగ్గించటం వంటి రకరకాల మార్గాల్లో మెదడు మీద ప్రభావం చూపుతాయి.

వాపు ప్రక్రియ: రోగనిరోధక వ్యవస్థ ద్వారానూ పేగు-మెదడు అనుసంధానమవుతాయి. శరీరంలోకి వేటిని అనుమతించాలి? వేటిని విసర్జించాలి? అనే ప్రక్రియను నియంత్రించటం ద్వారా పేగులు, పేగుల్లోని బ్యాక్టీరియా మన రోగనిరోధక వ్యవస్థ, వాపు ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తుంది. హానికారక క్రిముల సంఖ్య పెరగటంతో పాటు సూక్ష్మక్రిముల రకాల మధ్య సమతుల్యత లోపిస్తే (డిస్‌బయోసిస్) పేగుల్లో వాపు ప్రక్రియ ప్రేరేపితమవుతుంది. ఇది చివరికి పేగు లోపలి గోడ దెబ్బతినేలా చేస్తుంది. ఫలితంగా విషతుల్యాలు, బ్యాక్టీరియా, వైరస్‌ల వంటివి రక్తంలోకి ప్రవేశించి శరీరం మొత్తం వాపు ప్రక్రియ తలెత్తొచ్చు. ఇది మానసిక సమస్యలకూ దారితీయొచ్చు.

ఎలా కాపాడుకోవాలి?

పేగు బ్యాక్టీరియాను మార్చుకోగలిగితే మెదడు ఆరోగ్యాన్నీ కాపాడుకోవచ్చు. ఇందుకు మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేసే ప్రొబయాటిక్స్ బాగా మేలు చేస్తాయి. పేగు బ్యాక్టీరియా పులియబెట్టే పీచు పదార్థాలు (ప్రిబయాటిక్స్) కూడా మంచివే. కాబట్టి ఆహారం విషయంలో కాస్త జాగ్రత్త వహిస్తే పేగు-మెదడు అనుబంధాన్ని మెరుగుపరచుకోవచ్చు.

- చేపలు, గింజపప్పుల్లో దండిగా ఉండే ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి తోడ్పడతాయి. మెదడు సమస్యల ముప్పు తగ్గటానికి దోహదం చేస్తాయి.
- పెరుగు, మజ్జిగ వంటి వాటిల్లోని మేలు చేసే బ్యాక్టీరియా మెదడు పనితీరు మెరుగు పడటంలో సాయం చేస్తుంది.
- నిండు గింజ ధాన్యాలు, విత్తనాలు, పండ్లు, కూరగాయల్లోని పీచు బ్యాక్టీరియాకు మంచి ఆహారంగా ఉపయోగపడతాయి.
- గుడ్లు, చికెన్, చీజ్ వంటి వాటిల్లో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది సెరటోనిన్ అనే నాడీ సమాచార వాహకంగా మారుతుంది.
- చిప్స్ వంటి ఆహార ఉత్పత్తులు, తీపి పదార్థాలు తగ్గించుకోవాలి.
- నెమ్మదిగా, ప్రశాంతంగా రుచిని ఆస్వాదిస్తూ, ఆనందిస్తూ భోజనం చేయాలి.
- శరీరానికి పడని ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి.
- తగినంత నీరు తాగాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
- ధ్యానం, యోగా, ప్రాణాయామం వంటి పద్ధతులతో ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నించాలి. ఎందుకంటే మానసిక ఒత్తిడి, కుంగుబాటు మూలంగా పేగు బ్యాక్టీరియా రకాలు మారిపోయే ప్రమాదముంది.
- పొగ, మద్యం తాగటం మానెయ్యాలి.

భార్యతో కలవచ్చా?



డాక్టర్ సలహా

సమస్య: నాకు హెపటైటిస్ బి ఉంది. నా భార్యకు పరీక్ష చేస్తే హెపటైటిస్ బి నెగెటివ్‌గా వచ్చింది. అనంతరం ఆమెకు మూడు డోసుల టీకా ఇప్పించాను. టీకా తీసుకునే సమయంలో శృంగారానికి దూరంగా ఉన్నాం. ఇప్పుడు నేను కండోమ్ లేకుండా భార్యతో కలవచ్చా?

– రాజా

సలహా: హెపటైటిస్ బి వైరస్ రక్తం, లాలాజలం వంటి శరీర స్రావాలతో పాటు శృంగారం ద్వారానూ ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. దంపతుల్లో ఒకరికి వైరస్ సోకి, రెండోవారికి నెగెటివ్‌గా ఉన్నప్పుడు దీన్ని నివారించుకోవటానికి టీకాలు ఉపయోగపడతాయి. వీటిని మూడు దఫాలుగా ఆరు నెలల పాటు తీసుకోవాలి. మొదటి డోసు ఇచ్చిన నెల తర్వాత రెండో డోసు వేయించుకోవాలి. ఆ తర్వాత ఐదు నెలలకు మూడో డోసు తీసుకోవాలి. మీరు ముందు జాగ్రత్తగా మీ భార్యకు హెపటైటిస్ బి పరీక్ష చేయించటం, ఫలితాలు నెగెటివ్‌గా రావటంతో టీకాలు వేయించటం మంచి విషయం. టీకాలు వేసే సమయంలో శృంగారానికి దూరంగా ఉన్నారనీ తెలిపారు. అందువల్ల మీ నుంచి మీ భార్యకు వైరస్ సోకలేదనే అనుకోవచ్చు. ఆమెకు మూడు డోసులు టీకా ఇప్పించారు కాబట్టి రెండు నెలల వరకూ కండోమ్ ధరించి శృంగారంలో పాల్గొనొచ్చు. రెండు నెలల తర్వాత మామూలుగా సెక్స్‌లో పాల్గొనొచ్చు. టీకా రక్షణ లభించాక హెపటైటిస్ బి వైరస్ సోకే అవకాశం చాలా అరుదు. టీకా రక్షణ లభించిందా? లేదా? అనేది తెలుసుకోవటానికి యాంటీ హెచ్‌బీఎస్ యాంటీబాడీ పరీక్ష తోడ్పడుతుంది. అయితే ఇదేమీ తప్పనిసరి కాదు. ఎందుకంటే టీకాలతో దాదాపు పూర్తిగా రక్షణ లభిస్తుంది. ఒకవేళ అనుమానముంటే యాంటీబాడీ పరీక్ష చేయించుకోవచ్చు.



- డా॥ కె.జగన్మోహన్ రావు,
సీనియర్ గ్యాస్ట్రోఎంటెరాలజిస్ట్

మీ ఆరోగ్య సమస్యలను, సందేహాలను
sukhi@eenadu.in కు పంపొచ్చు.

పళ్లు జివ్వుమంటుంటే..

పళ్లు జివ్వుమనటానికి పై పింగాణీ పొర క్షీణించి లోపలున్న డెంటిన్ బయటపడటం, పుచ్చిపోవటం, మరీ బలంగా లేదా కఠిన పోచల బ్రష్‌తో తోమటం, చిగుళ్ల వాపు వంటి జబ్బులు, పుల్లటి పండ్ల వంటి ఆమ్ల పదార్థాలు తినటం లాంటి కారణాలు చాలానే ఉన్నాయి. కొన్ని జాగ్రత్తలతో దీన్ని తగ్గించుకోవచ్చు. మెత్తటి బ్రష్‌తో, సరైన పద్ధతిలో తోముకోవటం.. డీసెన్సిటైజింగ్ టూత్‌పేస్ట్ వాడటం.. పుల్లటి పదార్థాలు, పానీయాలకు దూరంగా ఉండటం, ఫ్లోరైడ్ ద్రావణంతో పుక్కిలించటం వంటివి మేలు చేస్తాయి.



తోటపనితో నడుం నొప్పా?

తోటపని వంటివి చేయటం ఆరోగ్యానికి మంచిదే. దీంతో గంటకు సుమారు 330 కేలరీలు ఖర్చవుతాయని అంచనా. ఇది సైకిల్ తొక్కడం, నడవడం, తేలికైన బరువులు ఎత్తడం వల్ల ఖర్చయ్యే కేలరీలతో పోలిస్తే ఎక్కువే. అయితే తోటపని శ్రమతో కూడుకున్నది. లేవడం, వంగడం, మోకాళ్ల మీద కూర్చోవడం, బరువులు ఎత్తడం వంటి పనులు చేస్తున్నప్పుడు కండరాలు, కీళ్ల మీద ఎంతో భారం పడుతుంది. చాలా మంది శరీరం ఇలాంటి పనులకు సిద్ధంగా ఉండదు. ఇప్పటి ఉద్యోగాలు, జీవనశైలి అలవాట్లు చాలావరకూ ఎక్కువగా కదలకుండా చేసేవే. ఫలితంగా నొప్పులు.. ముఖ్యంగా నడుంనొప్పి బారిన పడుతుంటారు. దీన్ని తప్పించుకోవటమెలా?



- జిమ్‌లో వ్యాయామాలు చేస్తున్నప్పుడే కాదు. తోటపనికి ముందూ కండరాలను సాగదీయడం వంటి సన్నద్ధ వ్యాయామాలు చేయాలి. బిగుసుకుపోయిన కండరాలు వదులయ్యేలా, రక్తం సరఫరా అయ్యేలా చూసుకుంటే చాలు. తర్వాత కాస్త కఠినమైన పనులు చేసినా అంత ఇబ్బంది ఉండదు.
- మట్టి, రాళ్లు, ఆకుల వంటివి ఎత్తేటప్పుడు శరీర భంగిమ సరిగా ఉండేలా చూసుకోవడమూ ముఖ్యమే. ముందుకు వంగినప్పుడు వెన్నెముక సహజ వంపులు చదునుగా అవుతాయి. ఏదో ఒక భాగంలోని డిస్కుల మీద ఎక్కువ భారం పడుతుంది. సాధారణంగా కింది భాగం వద్ద నడుం నొప్పి తలెత్తుతుంది. కాబట్టి కదలికలు సాఫీగా సాగేలా చూసుకోవాలి. హఠాత్తుగా పక్కలకు తిరగడం వంటివి చేయొద్దు.
- ఒకే రకం పనిని ఎక్కువసేపు చేయకుండా మధ్య మధ్యలో మార్చుకోవాలి. ఉదాహరణకు- కలుపు తీస్తున్నారనుకోండి. అదే పనిని విరామం లేకుండా చేయడం కన్నా 20 నిమిషాలు చేసి, వేరే పనికి మళ్లాలి. ఇలా ఒకే భంగిమలో ఉండడం వల్ల తలెత్తే నొప్పులను నివారించుకోవచ్చు.
- మరీ ఎక్కువసేపు పని చేయాల్సి ఉన్నట్టయితే నడుం పట్టీ వంటి రక్షణ సాధనాలు వాడుకోవచ్చు. ఇవి భంగిమ దెబ్బతినకుండా కాపాడతాయి. నడుం మీద మరీ ఎక్కువగా భారం పడకుండా చూస్తాయి.

తీవ్ర గురకతో క్యాన్సర్!

గురకే కదాని తీసి పారేయకండి. మునుపు ఊహించిన దాని కన్నా దీని పర్యవసానాలు అతి తీవ్రంగా ఉంటున్నట్టు తాజా అధ్యయనం సూచిస్తోంది. ఇది కొన్నిరకాల క్యాన్సర్లకూ దారితీస్తోందని హెచ్చరిస్తోంది. నిద్ర పోతున్నప్పుడు కొందరికి గొంతు వెనకాల భాగం వదులై పాక్షికంగానో, పూర్తిగానో శ్వాస మార్గానికి అడ్డుపడుతుంది. దీంతో ఊపిరాడక ఉన్నట్టుండి శ్వాస తీసుకుంటూ గట్టిగా గురక పెడతారు. దీన్నే అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా అంటారు. అంటే నిద్రలో కాసేపు శ్వాస నిలిచి పోతుందన్నమాట. దీంతో తాత్కాలికంగా రక్తంలో ఆక్సిజన్ మోతాదులు తగ్గుతాయి. ఇదే పెద్ద ప్రమాదాన్ని తెచ్చి పెడుతుంది. స్లీప్ అప్నియాకూ గుండెజబ్బు, రక్తనాళాల సమస్యలు, నాడీ జబ్బుల వంటి వాటికీ సంబంధం ఉంటున్నట్టు ఇప్పటికే తెలుసు. జీర్ణకోశ, కిడ్నీ, రొమ్ము క్యాన్సర్ల ముప్పు పెరుగుతున్నట్టూ ఇప్పుడు బయటపడింది. ఈ అధ్యయనంలో స్లీప్ అప్నియా గల 1,990 మందిని 13 ఏళ్ల పాటు పరిశీలించారు. వీరిలో 181 మంది (సుమారు 9%) క్యాన్సర్ల బారినపడ్డట్టు గుర్తించారు. నమూనా సంఖ్య పరంగా చూస్తే ఇది చాలా ఎక్కువని పరిశోధకులు చెబుతున్నారు. మామూలు వారితో పోలిస్తే స్లీప్ అప్నియా గలవారిలో క్యాన్సర్ కేసులు 26% ఎక్కువగా ఉంటున్నట్టు గత అధ్యయనంలో తేలింది. ఈ సమస్య ఎంత తీవ్రంగా ఉంటే అంత ఎక్కువగా క్యాన్సర్ల ముప్పు పొంచి ఉంటున్నట్టు తాజా అధ్యయనం చెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 కోట్ల మంది గురకతో బాధపడుతున్నారని అంచనా. అయినా దీన్ని పెద్దగా పట్టించుకోరు. చికిత్స తీసుకోవటం అటుంచి అసలు సమస్య నిర్ధరణ కానివారే ఎక్కువ. స్లీప్ అప్నియా గల ప్రతి 10 మందిలో 9 మందికి అసలు ఆ విషయమే తెలియకపోవటమే ఇందుకు నిదర్శనం.




ఎలా కారణమవుతుంది?

గురక మూలంగా శ్వాస సాఫీగా తీసుకోకపోవటం లేదా మొత్తానికే ఆగటం వల్ల రక్తంలో ఆక్సిజన్ మోతాదులు తగ్గుతాయి. దీంతో డీఎన్ఏను దెబ్బతీసే కారకాలు పుట్టుకొస్తాయి. ఇవి డీఎన్ఏలో హానికర మార్పులకు కారణమవుతాయి. ఫలితంగా క్యాన్సర్ల ముప్పు పెరుగుతుంది. నిద్ర పోతున్నప్పుడు తరచూ రక్తంలో ఆక్సిజన్ మోతాదులు తగ్గుతూ వస్తుంటే విశృంఖల కణాలు (ఫ్రీరాడికల్స్), వీటి పని పట్టే యాంటీఆక్సిడెంట్ల మధ్య సమతుల్యత లోపిస్తుంది (ఆక్సిడేటివ్ స్ట్రెస్). విశృంఖల కణాలు అస్థిరంగా ఉంటాయి. ఇవి కణాల పైపొరలు, ప్రొటీన్లు, డీఎన్ఏను దెబ్బతీస్తాయి. అంతర్గత వాపు (ఇన్‌ఫ్లమేషన్)ను ప్రేరేపిస్తాయి. వాపు నుంచి కాపాడుకోవటానికి శరీరం సైటోకైన్లనే ప్రొటీన్లను ఉత్పత్తి చేస్తుంది. వీటిల్లో కణాలను కలిపే అణువులు (క్యామ్స్) ఉంటాయి. ముఖ్యంగా వీసీఏఎం-1 అనే అణువులు క్యాన్సర్లు తలెత్తటంలో గణనీయమైన పాత్ర పోషిస్తాయి. ఇవి కణితి కణాలను రక్తనాళాల లోపలి పైపొర కణాలకు అంటుకునేలా, రక్తనాళాల గోడలను దాటుకొని వెళ్లేలా చేస్తాయి. ఇలా కణితి వృద్ధి చెందటానికి, ఇతర భాగాలకు క్యాన్సర్ విస్తరించటానికి కారణమవుతాయి.

కరోనాతో గుండెపోటు!

గుండెపోటు, పక్షవాతం ముప్పు కారకాలనగానే మధుమేహం, అధిక రక్తపోటు వంటివే గుర్తుకొస్తాయి. కొవిడ్-19 కూడా ఈ జాబితాలో చేరుతుందా? యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా, లాస్ ఏంజెలిస్ తాజా పరిశోధన ఇదే సూచిస్తోంది. మధుమేహం వంటి వాటితో సమానంగా తీవ్ర కొవిడ్ జబ్బు గుండెపోటు, పక్షవాతానికి ప్రధాన ముప్పు కారకం కావొచ్చని చెబుతోంది. తొలిసారి కొవిడ్-19 విజృంభించిన సమయంలో దీని బారినపడ్డవారికి మూడేళ్ల వరకూ గుండెపోటు ముప్పు, పక్షవాతం, ఏ కారణంతోనైనా మరణించే ముప్పు రెట్టింపవుతున్నట్టు బయటపడింది. తీవ్ర కొవిడ్‌తో ఆసుపత్రిలో చేరినవారికైతే నాలుగు రెట్లు ఎక్కువ ప్రమాదం పొంచి ఉంటోంది. అప్పటికే గుండెజబ్బు ఉండి, కొవిడ్ ఇన్‌ఫెక్షన్ సోకని వారితో పోలిస్తే- గుండెజబ్బు, మధుమేహం లేని, తీవ్ర కొవిడ్ బారినపడ్డవారికి గుండెపోటు, పక్షవాతం, మరణం ముప్పులు 21% అధికంగా ఉంటున్నాయి. ముఖ్యంగా 'ఒ' గ్రూపు రక్తం గలవారికివి మరింత ఎక్కువగా ఉంటున్నాయి. గుండెపోటు, పక్షవాతం ముప్పు పెరగటంలో కొవిడ్ వైరస్‌కు జన్యువుల మధ్య పరస్పర చర్య జరుగుతోందనటానికి ఇదో తొలి ఉదాహరణ అని పరిశోధకులు చెబుతున్నారు. టీకా విస్తృతంగా అందుబాటులోకి వచ్చిన తర్వాత కొవిడ్ బారినపడ్డవారిని ఇందులో పరిగణనలోకి తీసుకోలేక పోవటం గమనించదగ్గ విషయం. కొవిడ్‌తో గుండెజబ్బులు వచ్చే అవకాశం ఎక్కువని ముందు నుంచీ తెలిసిన విషయమే. కానీ అవి ఉద్ధృత (అక్యూట్) దశలోనే సంభవిస్తున్నాయని అనుకునేవారు. కానీ ఆ తర్వాత మూడేళ్ల వరకూ గుండెపోటు ముప్పు పొంచి ఉంటున్నట్టు తాజా అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి.



ఒక్క గుండె కోసమే కాదు

గుండెకు మేలు చేసే ఆహారం తింటున్నారా? అయితే మెదడుకూ మేలు చేస్తున్నట్టే. గుండెజబ్బుకు దారితీసే అంశాలే అల్జీమర్స్, డిమెన్షియా వంటి జబ్బులకూ కారణమవుతున్నాయని పరిశోధనలు గట్టిగా చెబుతున్నాయి. అంటే గుండెను కాపాడుకోవటానికి తోడ్పడే ఆహారం మెదడునూ రక్షిస్తుందన్నమాట. మరి ఆలస్యమెందుకు?

గర్భంలో ఉన్నప్పటి నుంచే


మెదడు మీద పోషణ ప్రభావాలు తల్లి కడుపులో ఉండగానే మొదలవుతాయి. గర్భం ధరించినప్పుడు మహిళలు ఏం తింటున్నారు? ఏం తినటం లేదు? అనేవి బిడ్డ మెదడు ఎదుగుదలను ప్రభావితం చేస్తాయి మరి. ఉదాహరణకు- ఫోలేట్ (విటమిన్ బి9) పిండం మెదడు ఎదగటంలో కీలక పాత్ర పోషిస్తుంది. దీన్ని గర్భిణులు తగినంత తీసుకోకపోతే పిల్లలు పుట్టుకతో తలెత్తే లోపాలు, మెదడు లోపాలతో పుట్టే అవకాశముంది. అందుకే గర్భిణులకు ఇచ్చే విటమిన్లలో దీన్ని కూడా చేర్చారు. ఆహారం విషయానికి వస్తే- ఆకుకూరలు, బఠానీలు, చిక్కుళ్లు, పండ్లు, గింజపప్పులు, సముద్ర చేపలు, గుడ్లు, పాలు, పెరుగు, మజ్జిగ, మాంసం, కోడికూర, ధాన్యాలతో ఇది లభిస్తుంది. గర్భిణులు తినే ఆహారం పిల్లల మానసిక ఆరోగ్యం మీదా ప్రభావం చూపుతుంది. అధిక కొవ్వు ఆహారం తినే గర్భిణులకు పుట్టే పిల్లలకు ఆందోళన, కుంగుబాటు, ఏకాగ్రత లోపించటం, ఆటిజమ్ వంటి ప్రవర్తన సమస్యలు వచ్చే అవకాశమున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు తల్లి కడుపులో ఉన్నప్పుడూ మెదడు ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. ఇవి సాల్మన్, సార్‌డైన్ వంటి చేపల్లో దండిగా ఉంటాయి. ఒకవేళ ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలతో కూడిన ఆహారం తగినంతగా తీసుకోలేకపోతే మాత్రలు వాడుకోవటం మంచిది. తల్లి తినే ఆహార ప్రయోజనాలు పిండంతోనే ఆగటం లేదు. జీవితాంతం కొనసాగుతూ వస్తాయి. చదువుల్లో రాణించటానికి, పెద్దయ్యాక విషయ గ్రహణ నైపుణ్యాలు మెరుగు పడటానికి, వయసు మీద పడుతున్నకొద్దీ డిమెన్షియా బారినపడకుండా ఉండటానికీ తోడ్పడుతుంది.

శైశవ, బాల, కౌమార దశల్లో..

ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలతో మెదడుకు కలిగే ప్రయోజనాలు పుట్టిన తర్వాత కొన్ని నెలల వరకూ కొనసాగుతూ వస్తాయి. ఈ కొవ్వులను కలిపిన అదనపు ఆహారాన్ని తిన్న శిశువులు 9 నెలల వయసులో ఇతరుల కన్నా మరింత బాగా సమస్యలను పరిష్కరిస్తున్నట్టు కొన్ని అధ్యయనాలు వివరిస్తున్నాయి. తొలి రెండేళ్ల వయసులో మెదడు వృద్ధి చెందటంలో పిల్లలు తినే ఆహారం గణనీయమైన పాత్ర పోషిస్తుంది. ఈ వయసులోనే మెదడు కణాలు వేగంగా వృద్ధి చెందుతుంటాయి. నాడీ కణాల మీద కొవ్వులు, ప్రొటీన్లతో కూడిన మైలిన్ అనే రక్షణ పొర ఏర్పడుతూ ఉంటుంది. పిల్లల మెదడు ఎదుగుతున్నకొద్దీ నాడీ కణాలు అనుసంధానాలు ఏర్పరచుకుంటాయి. ఇందుకు అవసరమైన శక్తి పిల్లలు తినే ఆహారం నుంచే లభిస్తుంది. మంచి పోషకాహారం తీసుకోకపోతే నాడీ అనుసంధానాలు ఏర్పడటం కొరవడుతుంది. బాల, కౌమార దశల్లో పోషణ లేమి పిల్లల మెదడు ఎదగటం, విషయ గ్రహణ సామర్థ్యాలకు గండి కొడుతుంది. చదువుల్లో వెనకబడే ప్రమాదముంది. తేలికైన పిండి పదార్థాలు, చెడు కొవ్వులకు బదులు సంక్లిష్ట పిండి పదార్థాలు, మంచి కొవ్వులు ఇస్తే పిల్లల్లో తక్షణ జ్ఞాపకశక్తి మెరుగవుతున్నట్టు పరిశోధనలు సూచిస్తున్నాయి. చేపలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తినేవారు చదువుల్లో బాగా రాణిస్తున్నట్టూ వెల్లడైంది. బాల్యంలో కొవ్వు పదార్థాలు, తీపి పానీయాలు ఎక్కువగా తీసుకున్నవారు కార్యనిర్వహణలో చిక్కులు ఎదుర్కొంటుండటం గమనార్హం. కొత్త పరిస్థితులకు అనుగుణంగా మారటానికి ఈ కార్య నిర్వహణ సామర్థ్యం చాలా చాలా ముఖ్యం.

పెద్ద వయసులో

ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు తగినంత తీసుకోనివారికి మూడ్ సమస్యలు, విషయగ్రహణ లోపం తలెత్తే అవకాశముంది. అంటే ఈ ఆమ్లాలను పెద్ద మొత్తంలో తీసుకుంటే నేర్చుకోవటం, జ్ఞాపకశక్తి, విషయ గ్రహణ సామర్థ్యాలను పెంచుకునే వీలుందన్నమాట. మెదడుకు రక్త ప్రసరణా పుంజుకుంటుంది. మధ్య వయసులో ఆహారంతో మెదడు ఆకృతి, పరిమాణంతోనూ సంబంధం ఉండటం గమనార్హం. మనం తినే ఆహారం నేరుగా మెదడును ప్రభావితం చేస్తోంది కాబట్టి సరైన ఆహారం తీసుకోకపోతే మెదడు ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఇతర సమస్యలకు దారితీసే ప్రమాదముందని నిపుణులు భావిస్తున్నారు. చెడు కొవ్వు, ప్రాసెస్డ్ పదార్థాలు, చక్కెర వంటి అనారోగ్యకర ఆహారం మూలంగా అధిక బరువు, అధిక కొలెస్ట్రాల్ ముప్పులు పెరుగుతాయి. ఇవి ఇన్సులిన్ నిరోధకత (కణాలు ఇన్సులిన్‌కు స్పందించకపోవటం), మధుమేహం, గుండెజబ్బులు వచ్చే అవకాశాన్నీ ఎక్కువ చేస్తాయి. ఇవన్నీ చివరికి మెదడు ఆరోగ్యం దెబ్బ తినటానికీ కారణమవుతాయి. అదే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే ఇలాంటి సమస్యలను చాలావరకు తప్పించు కోవచ్చు.



మైండ్ డైట్ తీరిదీ

మెడిటేరియన్, డ్యాష్ డైట్ రెండింటి కలబోతే మైండ్ డైట్. ఇందులో ప్రధానంగా ఉండేవి ఇవీ..

- **తాజా ఆకు కూరలు, కూరగాయలు.** ఆకు కూరలను వారానికి ఆరు, అంతకన్నా ఎక్కువసార్లు తినాలి. ఆకు కూరలతో పాటు రోజూ ఏదో ఒక కూరగాయ తీసుకోవాలి. పిండి పదార్థం లేని కూరగాయలైతే మేలు.
- స్ట్రాబెర్రీ, బ్లూ బెర్రీ వంటి **బెర్రీ పండ్లు.** వీటిని కనీసం వారానికి ఒకసారైనా తినాలి.
- బాదం, పిస్తా, అక్రోట్ల వంటి **గింజ పప్పులు.** వీటిని వారానికి కనీసం ఐదు, అంతకన్నా ఎక్కువ సార్లు తినాలి.
- **ఆలివ్ నూనె.** దీన్ని ప్రధాన నూనెగా వాడుకోవాలి.
- **పొట్టుతీయని ధాన్యాలు.** వీటిని రోజుకు మూడు సార్లయినా తీసుకోవాలి.
- **చేపలు.** వారానికి కనీసం ఒక సారైనా తినాలి. సాల్మన్, సార్‌డైన్, టూనా, మాకెరెల్ వంటి చేపలైతే మరీ మేలు.
- **చిక్కుళ్లు, పప్పులు.** వారానికి కనీసం నాలుగు సార్లు తినాలి.
- **చికెన్.** మాంసాహారులైతే వారానికి కనీసం ఒకసారి కోడికూర తీసుకోవాలి. అలాగని వేయించటం మంచిది కాదు.
- **మితంగా వైన్.** రెడ్ వైన్‌లోని రెస్వెరటాల్ మేలు చేస్తున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

మేలు చేసే ఆహారమంటే?

ఆహారం ద్వారా మెదడు ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవాలనుకుంటే సమతులాహారం మీద దృష్టి పెట్టటం మంచిది. ఆరోగ్యకరమైన ఆహారం తింటే డిమెన్షియా ముప్పు తగ్గుతున్నట్టు చాలా అధ్యయనాలు పేర్కొంటున్నాయి. పాశ్చాత్య ఆహారం దగ్గరి నుంచి మెడిటేరియన్ డైట్, అధిక రక్తపోటు నివారణకు తోడ్పడే డ్యాష్ డైట్.. ఈ రెండింటి కలబోత అయిన మైండ్ డైట్ వరకూ రకరకాల ఆహార పద్ధతుల మీద అధ్యయనాలు జరిగాయి. మైండ్ డైట్‌ను పాటించినవారిలో విషయగ్రహణ సామర్థ్యం బలంగా ఉంటున్నట్టు వెల్లడైంది. మెదడు దెబ్బతిన్నా కూడా విషయ గ్రహణ పనితీరు స్థిరంగా కొనసాగుతుండటం విశేషం. ఈ ఆహార పద్ధతితో నాడీకణాలు క్షీణించటం, డిమెన్షియా ముప్పులు తక్కువనీ కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. అందువల్ల ప్రాసెస్డ్ పదార్థాలు, చెడు కొవ్వులు, చక్కెర ఎక్కువగా గల పాశ్చాత్య ఆహార పద్ధతికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. మొత్తమ్మీద మెదడు ఆరోగ్యంలో ఏదో ఒక్క సూపర్ ఫుడ్డో, చెడ్డ ఆహారమో ఉందనుకోవటానికి లేదు. అన్నింటి కలబోతగా దీన్ని చూడాల్సి ఉంటుంది. కూరగాయలు, పండ్లు, పలుచటి మాంసం, చేపల వంటివన్నీ కలిపి తీసుకుంటే తగినన్ని పోషకాలు, మంచి కొవ్వులు, ప్రొటీన్లు లభిస్తాయి. మెదడుకు మేలు చేస్తాయి. అదే ప్రాసెస్డ్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్, మిఠాయిలు, చెడు కొవ్వులతో కూడిన పదార్థాలు హాని చేస్తాయి.


రక్తపోటు పరీక్ష సరిగా

రక్తపోటు పరీక్ష చేయించుకునేటప్పుడు పట్టీని చుట్టిన చేయి సరిగా ఉందో లేదో మరోసారి చూసుకోండి. లేకపోతే బీపీ రీడింగులు తప్పుగా రావొచ్చు. బీపీ పరికరంతో రక్తపోటును కొలుచుకునేప్పుడు చేయి గుండెకు సమానమైన ఎత్తులో ఉండేలా చూసుకోవటం ముఖ్యం. చేయిని ఒడిలో పెట్టుకోవటం, చేతి కింద దన్ను లేకపోవటం, చేయిని కిందికి వేలాడ దీయటం వంటి పొరపాట్లు చేస్తే బీపీ రీడింగుల్లో సగటున 6.5 పాయింట్లు ఎక్కువగా కనిపిస్తున్నాయని జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ అధ్యయనంలో బయటపడింది. కాబట్టి జాగ్రత్త అవసరం.

- బీపీ పరికరం పట్టీ చేయికి తగిన సైజులో ఉండాలి.
- వీపును కుర్చీకి వెనకాల ఆనించాలి. పాదాలను నేలకు తాకించాలి. కాలు మీద కాలు వేసుకోకూడదు.
- చేయిని గుండెకు సమాన ఎత్తులో, తిన్నగా చాచాలి. డెస్క్ లేదా టేబుల్ మీద పెట్టి ఉంచాలి.
- పరీక్షకు ముందు కనీసం 5 నిమిషాలైనా విశ్రాంతిగా కూర్చోవాలి.

(c) eenadu

కరెంట్ అఫైర్స్



■ ఇరాన్ నూతన అధ్యక్షుడిగా ఇటీవల ఎవరు ఎన్నికయ్యారు? (2024, మే 19న హెలికాప్టర్ ప్రమాదంలో అప్పటి ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మరణించిన తర్వాత దేశంలో అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత ఈ ఎన్నికల్లోనే అత్యల్పంగా 39.92 శాతం ఓటింగ్ జరిగింది.)
జ: మసౌద్ పెజెష్కియాన్

మాదిరి ప్రశ్నలు

■ ఏ రాష్ట్రంలోని మైకా గనులను 'నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సీపీసీఆర్)' ఇటీవల 'బాల కార్మిక రహితం'గా ప్రకటించింది? (14 ఏళ్లలోపు పనిచేసే పిల్లలను దేశంలో బాల కార్మికులుగా గుర్తించారు. ఎన్‌సీపీసీఆర్‌ను 2007, మార్చి 5న స్థాపించారు. దీని ప్రస్తుత ఛైర్‌పర్సన్ ప్రియాంక్ కనూంగో.)
జ: ఝార్ఖండ్

■ మూడో ప్రపంచ కిస్వాహిలి భాషా దినోత్సవాన్ని ఇటీవల ఏ రోజున నిర్వహించారు? ('కిస్వాహిలి: ఎడ్యుకేషన్ అండ్ కల్చర్ ఆఫ్ పీస్' అనే థీమ్‌తో ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. స్వాహిలి అని కూడా పిలిచే 'కిస్వాహిలి భాష'ను ఆఫ్రికాలో విస్తృతంగా ఉపయోగిస్తారు. 230 మిలియన్లకు పైగా ప్రజలు మాట్లాడే ఈ భాష ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా మాట్లాడే టాప్ 10 భాషల్లో ఒకటిగా నిలిచింది.)
జ: జులై 7

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

సైన్స్ చదివేటప్పుడు చిత్రాలు, ప్రయోగాలు, సంఖ్యాపరమైన సమస్యలపై ప్రధానంగా దృష్టిపెట్టాలి. శాస్త్రీయ అంశాలకు సంబంధించిన దృగ్విషయాలను పూర్తిగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి.

డీఎస్సీ - 2024 సైకాలజీ కంటెంట్

పదోతరగతి — తెలుగు

సంఘటనల మధ్య సంబంధాల కళాత్మక చిత్రం!



బతుకు గంప

4 మార్కులు

1) బతుకు గంప పాఠ్యాంశ ప్రక్రియ గురించి రాయండి లేదా కథానిక ప్రక్రియ గురించి రాయండి.

జ: తెలుగు సాహిత్యంలో నేడు కథ, కథానిక అనేవి పర్యాయ పదాలుగా ఉన్నాయి.

- ★ కథానిక అనేది వచన ప్రక్రియ.
- ★ ఇది వ్యక్తి జీవితంలో ఒక ముఖ్య సన్నివేశాన్ని లేదా సంఘటనల మధ్య సంబంధాన్ని కళాత్మకంగా చిత్రిస్తుంది.
- ★ క్లుప్తత దీని ప్రధాన లక్షణం.
- ★ కథలో కథనానికి ప్రాధాన్యం ఉండాలి.
- ★ ముగింపు పాఠకుల ఊహకు అందకుండా ఉండాలి.

ప్రశ్నలు జవాబులు

8 మార్కులు

1) బతుకు గంప పాఠం ఆధారంగా ఎల్లమ్మ, రచయిత్రిల మధ్య చర్చను సంభాషణ రూపంలో రాయండి.

జ: రచయిత్రి: ఎవరు తలుపు తడుతుంటా?
ఎల్లమ్మ: నేనమ్మా! ఎల్లమ్మని.
రచయిత్రి: (తలుపు తీసి) ఎన్నాళ్లయిందో! నిన్ను చూసి, ఏమయ్యావు? ఎల్లమ్మ: ఏం చెప్పమంటారమ్మా? నా భర్తకు యాక్సిడెంట్ అయ్యింది.
రచయిత్రి: అయ్యో అయ్యో! ఇప్పుడెలా ఉన్నాడు.
ఎల్లమ్మ: పర్వాలేదమ్మా! ప్రాణ భయంలేదు.
రచయిత్రి: డబ్బులేమైనా కావాలా?
ఎల్లమ్మ: వద్దమ్మా! నేను దాచుకున్న డబ్బులున్నాయి. అవి తీసుకెళదామని వచ్చాను.
రచయిత్రి: పోనీలే! కష్టాలు కలకాలం ఉండవు. ఎల్లమ్మ: మీ మంచి పలకరింపే నాకు బలం. అందుకే వచ్చాను.
రచయిత్రి: జాగ్రత్త! నీకు చిన్నప్పటి నుంచి కష్టాలే కదా!
ఎల్లమ్మ: అయినా నాకు కష్టాలు అలవాటైపోయాయమ్మా! వెళ్లొస్తా.
రచయిత్రి: జాగ్రత్త! అంతా మంచే జరుగుతుందిలే! వెళ్లు!

ముఖ్యమైనవి మరికొన్ని..

1) కష్టాలకు కుంగిపోకుండా ధైర్యంగా మెలగాలని తెలియజేస్తూ మీ మిత్రుడికి లేఖ రాయండి. **8 మార్కులు**

జవాబుల కోసం

\- చెరుకూరి వేంకట సూర్యనారాయణ శర్మ

SUBSCRIBE CHANNEL

నీళ్లు కలిపితే తగ్గిన పాల ధర!

జనరల్ స్టడీస్ అరిథ్‌మెటిక్

కనీసాలు, సగటు...

హైడ్రోజన్, ఆక్సిజన్‌లను కలిపితే నీరు ఏర్పడుతుంది. ఉప్పును నీటిలో కలిపితే ఉప్పునీరు అవుతుంది. బంగారాన్ని ఇతర లోహాలతో కలిపితే ఆభరణాలు తయారవుతాయి. ఇవన్నీ మిశ్రమాలు. రెండు లేదా అంతకంటే ఎక్కువ పదార్థాలను కలిపి కొత్త పదార్థాన్ని ఏర్పరచడాన్ని మిశ్రమం అంటారు. వాటిని ఏయే భాగాల్లో కలపాలి, ఎంత ధరకు విక్రయిస్తే లాభం అనే అంశాలతో అంకగణిత ప్రమేయం మొదలవుతుంది. మిశ్రమాల్లో అనుపాతాలను కనుక్కోగలిగిన, పరిమాణాలను వ్యక్తీకరించగలిగిన సామర్థ్యాలను అభ్యర్థుల్లో పరీక్షించడానికి దాదాపు ప్రతి పోటీ పరీక్షలో వీటిపై ప్రశ్నలు అడుగుతున్నారు. శాతాలు, నిష్పత్తులు తదితర గణిత పరిక్రియలపై పట్టు పెంచుకుంటే సులభంగా సమాధానాలను గుర్తించవచ్చు.



మిశ్రమం: రెండు లేదా అంతకంటే ఎక్కువ పరిమాణాలు కలపడం వల్ల మిశ్రమం ఏర్పడుతుంది. మిశ్రమ పరిమాణాలను శాతం లేదా నిష్పత్తిగా తెలుపవచ్చు.

మిశ్రమం నియమం (తీసివేతలో):

మిశ్రమం 55 లీటర్లు → మిశ్రమం 33 లీటర్లు (−22 లీ.)

పాలు : నీళ్లు = 8 : 3 → పాలు : నీళ్లు = 8 : 3

∴ పాలు = 40, నీళ్లు = 15 → పాలు = 24, నీళ్లు = 9

8 : 3 (పాలు : నీళ్లు) → 16 లీటర్లు, 6 లీటర్లు

Concentration

పాలు $= \frac{8}{11} \times 100 = 72.7\%$

నీళ్లు $= \frac{3}{11} \times 11 = 27.27\%$

మిశ్రమం నియమం (కూడికలో):

మిశ్రమం 60 లీటర్లు + 40 లీటర్లు కలిపితే

పాలు : నీళ్లు = 2 : 1 ∴ పాలు : నీళ్లు = 2 : 3

40 లీ. : 20 లీ.

పాలు 40 లీటర్లు

నీళ్లు 60 లీటర్లు

కలగొలుపు సూత్రం:

తక్కువ ధర (L), అధిక ధర (H)

సగటు ధర (M)

H – M, M – L

తక్కువ ధర : అధిక ధర

(H – M) : (M – L)

కలగొలుపు మిశ్రమం: కలగొలుపు అనేది మిశ్రమం, దాని సమగ్రతకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ఉపయోగించే నియమం.

మిశ్రమ నియమం:

బియ్యం

1 కేజీ + 1 కేజీ = 2 కేజీ

రూ.100 + రూ.50 = రూ.150

∴ 1 కేజీ = రూ.75

ఎక్కువ ధర 100, తక్కువ ధర 50

75

25, 25

∴ 1 : 1 (సమాన నిష్పత్తి)

సగటు ధర (Mean Price): మిశ్రమం యూనిట్ పరిమాణం యొక్క ధరను "సగటు ధర" అంటారు.

గమనిక: ఒక పాత్రలో ఉన్న x యూనిట్ల ద్రవం నుంచి y యూనిట్లకు తొలగించి, దాంతో సమాన పరిమాణం నీళ్లు కలిపామనుకుంటే ఈ ప్రక్రియ 'n' సార్లు జరిగితే మిశ్రమంలోని శుద్ధ ద్రవం $\left[x\left(1-\frac{y}{x}\right)^n\right]$ యూనిట్లు.



మాదిరి ప్రశ్నలు

1) దుకాణదారుడు కేజీ రూ.15, రూ.20 చొప్పున రెండు రకాల పప్పులను కొని, వాటిని ఏ నిష్పత్తిలో కలిపితే, మిశ్రమం ఖరీదు కేజీ రూ.16.50 అవుతుంది?

1) 3:7 2) 5:7 3) 7:3 4) 7:5

సంక్షిప్త వివరణ:

రూ.15, రూ.20

రూ.16.50

రూ.3.5, రూ.1.5

∴ కావాల్సిన నిష్పత్తి 3.5 : 1.5 = 7 : 3 జ: 3

2) కేజీ రూ.7.20, రూ.5.70 చొప్పున రెండు రకాల బియ్యం కొని, వాటిని ఏ నిష్పత్తిలో కలిపితే మిశ్రమం ఖరీదు కేజీకి రూ.6.30 అవుతుంది?

1) 3:4 2) 1:3 3) 2:3 4) 4:5

సంక్షిప్త వివరణ:

రూ.7.20, రూ.5.70

రూ.6.30

రూ.0.60, రూ.0.90

∴ కావాల్సిన నిష్పత్తి 2 : 3 జ: 3

3) లీటరు రూ.12 చొప్పున కొన్న పాలలో ఏ నిష్పత్తిలో నీళ్లు కలిపితే వచ్చే మిశ్రమం ఖరీదు రూ.8 అవుతుంది?

1) 1:2 2) 2:1 3) 2:3 4) 3:2

సంక్షిప్త వివరణ:

నీళ్లు 0, పాలు 12

రూ.8

4, 8

∴ కావాల్సిన నిష్పత్తి 1 : 2 జ: 1

4) కేజీ 1వ రకం రూ.15, 2వ రకం రూ.20 చొప్పున రెండు రకాల బియ్యాన్ని 2 : 3 నిష్పత్తిలో కలపగా వచ్చే మిశ్రమం ఒక కేజీ ఖరీదు ఎంత?

1) రూ.18 2) రూ.18.50
3) రూ.19 4) రూ.19.50

సంక్షిప్త వివరణ:

రూ.15, రూ.20

x

2 : 3

$\frac{20-x}{x-15} = \frac{2}{3}$

$60 - 3x = 2x - 30$

$5x = 90 \Rightarrow x = 18$ జ: 1

5) దుకాణదారుడు కేజీ రూ.60, రూ.65 వంతున రెండు రకాల టీ పొడులను కొని మిశ్రమాన్ని కేజీ రూ.68.20 చొప్పున అమ్మగా 10% లాభం వచ్చింది. రెండు రకాల టీ పొడులను ఏ నిష్పత్తిలో కలిపాడు?

1) 3:2 2) 3:4 3) 3:5 4) 4:5

సంక్షిప్త వివరణ: 10% లాభం వచ్చింది

కాబట్టి 110% ⟶ 68.20

కొన్నవెల 100% ⟶ ?

$\frac{100}{110} \times 68.20 = \frac{6820}{110} = 62$

60, 65

62

3, 2

∴ కావాల్సిన నిష్పత్తి = 3 : 2 జ: 1

6) ఒక వ్యాపారి కేజీ రూ.9 లకు కొన్న ఎన్ని కేజీల చక్కెరతో కేజీ రూ.7లకు చొప్పున కొన్న 27 కేజీల చక్కెర కలిపితే, ఏర్పడిన మిశ్రమాన్ని రూ.9.24కు అమ్మి 10% లాభం పొందుతాడు?

1) 30 కేజీలు 2) 42 కేజీలు
3) 54 కేజీలు 4) 63 కేజీలు

సంక్షిప్త వివరణ: 10% లాభంతో రూ.9.24 లకు అమ్మినా

110% ⟶ 9.24, 100% ⟶ ?

$\frac{100}{110} \times 9.24 = \frac{924}{110} = 8.40$

9, 7

8.40

1.4, 0.6

14 : 6

7 : 3

3 → 27 కేజీలు

7 → 63 కేజీలు జ: 4




రచయిత: కంచుమర్తి దొర

సఫారీలకు అనుకూలం సవన్నాలు!

ప్రపంచ, భారత భూగోళ శాస్త్రం

భూమికి సంబంధించిన విజ్ఞానమే భూగోళ శాస్త్రం. భూమి నిర్మాణం మొదలు భూభౌతిక స్వరూపాలు, వాటి పరిణామక్రమం, ఖండాలు, దేశాలు, సముద్రాలు, నదులు, పర్వతాలు, మైదానాలు, పీఠభూముల ఉనికి తదితర సమాచారాన్ని అది తెలియజేస్తుంది. సౌరకుటుంబంలో భూమికి ఉన్న ప్రత్యేకతలు, భూభ్రమణం, పరిభ్రమణాల ప్రభావంతో జరిగే మార్పులు, భూమిపై జనాభా, జంతుజాలం, అడవుల విస్తరణ తీరుతెన్నుల వివరణ అంతా ఇందులో భాగమే. విస్తృత పరిధి ఉన్న ఈ శాస్త్రంలోని మౌలికాంశాలు, భారతదేశం, ఇతర దేశాలకు సంబంధించిన భౌతిక, నైసర్గిక స్వరూపాలపై పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ప్రాంతాల వారీగా ప్రత్యేకతలు, వనరులు, భూవాతావరణ ఆవరణాల్లోని పవనాలు, భూమిపై విభిన్న ప్రవాహాల పర్యవసానాలతో పాటు రకరకాల శిలలు, నేలలు, ఇంధన వనరుల గురించి పరిజ్ఞానం పెంచుకోవాలి.



డీఎస్సీ-2024 ప్రపంచ భూగోళ శాస్త్రం

1. రుతువులు ఏ విధంగా ఏర్పడుతున్నాయి?
   1) భూభ్రమణం
   2) భూపరిభ్రమణం లేదా అక్షనీతి
   3) 1, 2
   4) ఏదీకాదు
2. 0° రేఖాంశం ఏ పట్టణం మీదుగా పోతుంది?
   1) లండన్ 2) న్యూయార్క్
   3) పారిస్ 4) అలహాబాద్
3. తూర్పు, పశ్చిమ రేఖాంశంగా ఏ రేఖాంశాన్ని గుర్తించారు.
   1) 170° రేఖాంశం 2) 175° రేఖాంశం
   3) 180° రేఖాంశం 4) 185° రేఖాంశం
4. నక్షత్రాలు తూర్పు నుంచి పడమరకు కదులుతున్నట్లు కనిపిస్తాయి. ఎందుకు?
   1) విశ్వమంతా తూర్పు నుంచి పడమరకు కదులుతుండటంతో
   2) భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతుండటంతో
   3) భూమి తూర్పు నుంచి పడమరకు భ్రమించడంతో
   4) భూమి పడమర నుంచి తూర్పునకు భ్రమించడంతో
5. కిందివాటిలో ఏ జీవావరణ వ్యవస్థ భూమి ఉపరితలంలో అత్యధిక భాగాన్ని ఆవరించింది?
   1) ఎడారి జీవావరణ వ్యవస్థ
   2) తృణభూమి జీవావరణ వ్యవస్థ
   3) పర్వత జీవావరణ వ్యవస్థ
   4) సముద్ర జీవావరణ వ్యవస్థ
6. ఉత్తరార్ధ గోళంలో అతితక్కువ పగటి రోజు?
   1) జూన్ 21 2) డిసెంబరు 22
   3) డిసెంబరు 21 4) మే 21
7. ప్రపంచంలోని 50 శాతం జనాభా ఏ అక్షాంశాల మధ్య ఉంది?
   1) 5°N – 20°N 2) 20°N – 40°N
   3) 40°N – 60°N 4) 20°S – 40°S
8. భూమి ఉపరితలం నుంచి పైకి ఉన్న వాతావరణంలోని విభిన్నపొరల సరైన క్రమం?
   1) ట్రోపోస్ఫియర్, స్ట్రాటోస్ఫియర్, ఐనోస్ఫియర్, మీసోస్ఫియర్
   2) స్ట్రాటోస్ఫియర్, ట్రోపోస్ఫియర్, ఐనోస్ఫియర్, మీసోస్ఫియర్
   3) ట్రోపోస్ఫియర్, స్ట్రాటోస్ఫియర్, మీసోస్ఫియర్, ఐనోస్ఫియర్
   4) స్ట్రాటోస్ఫియర్, ట్రోపోస్ఫియర్, మీసోస్ఫియర్, ఐనోస్ఫియర్
9. ప్రపంచంలో అతిపెద్ద నది?
   1) అమెజాన్ 2) నైలు
   3) యాంగట్జి 4) కాంగో
10. 'మార్నింగ్ సన్' అని పిలిచే దేశం?
    1) కెనడా 2) కొరియా
    3) నార్వే 4) థాయిలాండ్
11. 'ది బిగ్ గేమ్ కంట్రీ' లేదా 'ఎ లాండ్ ఆఫ్ సఫారీ' అని పిలిచే సహజ ప్రాంతం ఏది?
    1) ఉష్ణమండల ఎడారులు
    2) భూమధ్య రేఖీయ ప్రాంతాలు
    3) సమశీతోష్ణ తృణభూమి ప్రాంతం
    4) సవన్నా లేదా ఉష్ణమండల గడ్డిమైదాన ప్రాంతాలు
12. కింది సింధుశాఖల్లో అత్యంత పెద్దది.
    1) మెక్సికో సింధురేఖ 2) కాలిఫోర్నియా సింధుశాఖ
    3) అరేబియా సింధుశాఖ 4) హడ్సన్ సింధుశాఖ
13. కిందివాటిలో భారతదేశపు శీతోష్ణస్థితి?
    1) ఉష్ణమండల రుతుపవన శీతోష్ణస్థితి
    2) ఆర్ద్రమండల శీతోష్ణస్థితి
    3) అత్యుష్ణమండల శీతోష్ణస్థితి
    4) ఖండాంతర శీతోష్ణస్థితి
14. 'పుస్టాస్' (PUSZTAS) అంటే?
    1) పవన నిక్షేపాలు 2) గడ్డిమైదానాలు
    3) హిమానీనదీకృత స్వరూపాలు
    4) స్థానిక పవనాలు
15. నది బాల్యదశలో ఏర్పడే భూస్వరూపం.
    1) ఆక్స్‌బౌ సరస్సులు 2) డెల్టా
    3) గార్జ్ 4) నదీ వక్రం
16. 'కాక్‌పిట్ ఆఫ్ యూరప్' అని ఏ దేశానికి మారుపేరు?
    1) డెన్మార్క్ 2) బెల్జియం
    3) నార్వే 4) స్వీడన్
17. భూగోళం మొత్తం వైశాల్యంలో భూభాగం ఎంత శాతం ఉంటుంది?
    1) 25% 2) 27% 3) 28% 4) 29%
18. గాలి, నీటి ప్రభావం వల్ల ఏర్పడే శిలలు?
    1) అగ్నిశిలలు 2) అగ్నిపర్వత శిలలు
    3) రూపాంతర శిలలు 4) అవక్షేప శిలలు
19. 'మాన్సూన్' అనే పదం 'మాసిమ్' అనే పదం నుంచి పుట్టింది. ఇది ఏ భాష నుంచి వచ్చింది?
    1) లాటిన్ 2) ఫ్రెంచ్ 3) అరబిక్ 4) గ్రీక్
20. గోతుల్లో నీరు చేరి సరస్సులుగా ఏర్పడే మైదానాలను ఏమంటారు?
    1) తీరమైదానాలు 2) నిక్షేపిత మైదానాలు
    3) కార్స్ట్ మైదానాలు 4) ఏదీకాదు
21. 'డెల్టా' అనేది ఏ భాష అక్షరాన్ని పోలి ఉంటుంది?
    1) లాటిన్ 2) గ్రీకు
    3) ఫ్రెంచ్ 4) అరబిక్
22. కిందివాటిలో ఉష్ణ ప్రవాహానికి ఉదాహరణ?
    1) గల్ఫ్‌స్ట్రీమ్ 2) లాబ్రడార్
    3) ఉత్తర, దక్షిణ భూమధ్య రేఖాప్రవాహం
    4) పెరూ ప్రవాహం
23. సౌరశక్తిలో ఎంతశాతం భూమిని చేరుతుంది?
    1) 35% 2) 14%
    3) 65% 4) 51%
24. సముద్రాల లోతును ఏ యూనిట్లలో కొలుస్తారు?
    1) నాటికల్ మైళ్లు 2) ఫాథమ్స్
    3) కాంతి సంవత్సరాలు 4) కిలోమీటర్లు
25. ప్రపంచంలో అతిచల్లటి ప్రాంతం?
    1) క్యూరోసీవ్ 2) సైబీరియా
    3) ఒఖోయాస్క్ 4) గినియా
26. గీసర్ అంటే?
    1) చిన్న నది 2) ఎడారి భూస్వరూపం
    3) గ్రానైట్ రాయి 4) వేడినీటి బుగ్గ
27. యురేషియాలోని గడ్డిభూములకు పేరు?
    1) ప్రయరీలు 2) పంపాలు
    3) వెల్డులు 4) స్టెప్పీలు
28. ప్రపంచంలో ఎత్తయిన పీఠభూమి?
    1) టిబెట్ 2) బులివియా
    3) మంగోలియా 4) కొలరాడో
29. పెట్రాలజీ అంటే?
    1) నేలల అధ్యయనం
    2) శిలల అధ్యయనం
    3) గ్రహాల అధ్యయనం
    4) శిలాజాల అధ్యయనం
30. 'ప్లాస్టర్ ఆఫ్ పారిస్' తయారీలో ఉపయోగపడే ఖనిజం?
    1) రాగి 2) బాక్సైట్
    3) జిప్సమ్ 4) క్రోమైట్
31. కిందివాటిలో మైదానమే లేని ప్రాంతం?
    1) అంటార్కిటికా 2) ఆర్కిటిక్
    3) ఆస్ట్రేలియా 4) ఆఫ్రికా
32. అంతర్జాతీయ నదిగా పేరుగాంచిన నది?
    1) డాన్యూబ్ 2) పో
    3) నైలు 4) అమెజాన్
33. అత్యంత వేగం కలిగి ఉండే తరంగాలు?
    1) S తరంగాలు 2) L తరంగాలు
    3) రేలే తరంగాలు 4) P తరంగాలు
34. సముద్ర భూస్వరూపం–
    1) గ్రానైట్ స్వభావం
    2) బసాల్టిక్ స్వభావం
    3) సైలేషియస్ స్వభావం
    4) పెలసిక్ స్వభావం
35. పెట్రోలియం సాధారణంగా ఏ రకానికి చెందిన శిలల్లో లభిస్తుంది?
    1) అవక్షేప 2) గ్రానైట్
    3) రూపాంతర 4) ఏదీకాదు
36. కిందివాటిలో ఆర్మీనియా పీఠభూమి ఉన్న ప్రాంతం?
    1) ఆఫ్రికా 2) రష్యా
    3) టిబెట్ 4) ఆస్ట్రేలియా
37. నేలలన్నింటిలో అతిసారవంతమైన నేల?
    1) డెల్టా 2) నల్లరేగడి
    3) లాటరైట్ 4) ఎర్ర నేలలు
38. 'బ్లూ నైట్' అని ఏ గ్రహానికి పేరు?
    1) అంగారకుడు 2) భూమి
    3) ప్లూటో 4) శని
39. సిల్ ఒక...?
    1) లాటరైట్ శిల 2) అగ్ని శిల
    3) రూపాంతర శిల 4) అవక్షేప శిల
40. సెల్వాలు అంటే?
    1) సతత హరితారణ్యాలు
    2) సవన్నా గడ్డిభూములు
    3) ఉష్ణమండల అడవులు
    4) సమశీతోష్ణ మండల అడవులు
41. ఎడారి నేలలు ఏ రంగులో ఉంటాయి?
    1) ఎర్రరంగు 2) బూడిద రంగు
    3) నల్లరంగు 4) పసుపు రంగు
42. రుతుపవన మండలంలోని ప్రజల ముఖ్యవృత్తి?
    1) వ్యవసాయం 2) పశుపోషణ
    3) వేట 4) అటవీసంపద
43. భూమి బయటిపొర ఏ ఖనిజాలతో ఏర్పడింది?
    1) మెగ్నీషియం - సిలికా
    2) మెగ్నీషియం - ఫాస్ఫరస్
    3) సిలికా - ఫాస్ఫరస్
    4) ఫెల్డ్‌స్పార్ - సిలికా
44. సూర్యుడి ఉపరితల ఉష్ణోగ్రత దాదాపు?
    1) 1687 °C 2) 6000 °C
    3) 1,00,000 °C 4) 14.800 °C
45. భూమి తిరిగే దిశ?
    1) తూర్పు నుంచి పశ్చిమానికి
    2) పశ్చిమం నుంచి తూర్పునకు
    3) ఉత్తరం నుంచి దక్షిణానికి
    4) దక్షిణం నుంచి ఉత్తరానికి
46. ఐసోహైల్ అంటే?
    1) సమపీడనం 2) సమాన వర్షపాతం
    3) సమాన సూర్యకాంతి 4) సమాన ఎత్తు
47. గ్రేబన్ అంటే?
    1) పగులులోయ 2) పగులు
    3) మైదానం 4) లోయ
48. ఖండాల అత్యధిక ఎత్తు?
    1) 8,848 మీ. 2) 8,748 మీ.
    3) 8,948 మీ. 4) 8,878 మీ.
49. రాతి ఉప్పు దేనికి ఉదాహరణ?
    1) అవక్షేప శిలలు 2) ఖనిజాలు
    3) బొగ్గు 4) సున్నపురాయి
50. ఖిరోబ్స్ జాతి ప్రజలు నివసించే రాష్ట్రం?
    1) మధ్యప్రదేశ్ 2) గుజరాత్
    3) అస్సాం 4) నాగాలాండ్

సమాధానాలు

1-2, 2-1, 3-3, 4-4, 5-4, 6-2, 7-2, 8-3, 9-1, 10-2, 11-4, 12-1, 13-1, 14-2, 15-3, 16-2, 17-4, 18-4, 19-3, 20-3, 21-2, 22-1, 23-4, 24-2 25-3, 26-4, 27-4, 28-1, 29-2, 30-3, 31-1, 32-1, 33-4, 34-2, 35-1, 36-3, 37-1, 38-2, 39-2, 40-1, 41-2, 42-1, 43-4, 44-2, 45-2, 46-3, 47-1, 48-1, 49-1, 50-1.

(c) eenadu

వ్యర్థ నిర్వహణ - తాజా అంశాలు

భారతదేశంలో మురుగు నీటి నిర్వహణ

మన దేశంలో ప్రతి రోజూ సుమారు 33 వేల మిలియన్ లీటర్ల మురుగునీరు విడుదలవుతోంది. ఈ మురుగు నీటిలో కొంత శాతమే శుద్ధి చేస్తున్నారు. దీనికి కారణం, భారతదేశ పట్టణాలు, నగరాల మురుగునీటి నిర్వహణ సామర్థ్యం 18.6% మాత్రమే.

❐ భారతదేశం మురుగునీటి నిర్వహణను (sewage management) ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తోంది. ఈ విధి విధానాల్లో ముఖ్యమైనవి:

☛ భారతదేశ రాజ్యాంగంలో నీటిని రాష్ట్ర జాబితాలో ఏడో షెడ్యూల్‌లో పొందుపరిచారు. పరిశుభ్రమైన నదీవ్యవస్థ నిర్వహణ, శుభ్రమైన నీటిని అందించాల్సిన బాధ్యత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో ఉంది.

☛ 1993లో 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం పట్టణ స్థానిక సంస్థలు నీటి సప్లై, పారిశుధ్య సేవల వికేంద్రీకరణ చేపట్టాలని పేర్కొన్నారు.


☛ 1986 పర్యావరణ పరిరక్షణ చట్టం, 1974 కాలుష్య నియంత్రణ చట్టం ప్రకారం పారిశ్రామిక యూనిట్ల నుంచి వెలువడే కాలుష్య కారకాలను సమర్థవంతంగా నిర్వహించడానికి ఆయా స్థానిక సంస్థలు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నెలకొల్పాలని సూచించారు.

☛ అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్ (AMRUT), స్మార్ట్ సిటీస్ మిషన్, నమామి గంగే కార్యక్రమం, నదీ పరిరక్షణ ప్రణాళికా కార్యక్రమాలు మొదలైనవి మురుగునీటి నిర్వహణకు ప్రాధాన్యం ఇచ్చాయి.

❐ దేశంలో వివిధ ప్రభుత్వ స్థాయుల్లో మురుగునీటి నిర్వహణకు కావాల్సిన ప్రణాళికలను రూపొందించారు. అయితే, ఆయా ప్రాంతాల్లో ఉండే పట్టణ స్థానిక సంస్థల్లో మురుగునీటి నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల సామర్థ్యం తగినంతగా లేదు. కేంద్ర, రాష్ట్ర స్థాయుల్లో నిధుల కొరతతో మురుగునీటి నిర్వహణ ప్లాంట్లకు కావలసిన సమగ్రమైన ప్రణాళికలు సమర్థవంతంగా అమలు కావడం లేదు. దీంతో భారతదేశంలో మురుగు నీటి నిర్వహణ పలు సమస్యలకు దారితీస్తోంది.

❐ మురుగు నీటి ప్లాంట్లను నెలకొల్పడానికి అవసరమైన భూమి అందుబాటులో లేనప్పుడు చైనాలో అవలంబిస్తున్న మాదిరిగా భూగర్భ మురుగునీటి నిర్వహణ ప్లాంట్లను నెలకొల్పే అవకాశాన్ని పరిశీలించడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం కనుక్కోవచ్చు.

❐ మురుగునీటిని ఉద్యానవన పంటలకు, తాగునీటి కోసం కాకుండా ఇతర అవసరాలకు మళ్లించినప్పుడు మురుగునీటి నిర్వహణకు సరైన పరిష్కారం దొరుకుతుంది.





ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా జనాభా రోజురోజుకూ పెరిగిపోతుంటే మరోవైపు భూమిపై పలురకాల వ్యర్థపదార్థాలు పేరుకుపోతున్నాయి. అత్యంత వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణ కారణంగా కాలుష్యం అధికమవుతోంది. అంతర్జాతీయ స్థాయిలో వ్యర్థ నిర్వహణ కోసం అనేక కార్యక్రమాలను రూపొందించి, అమలు చేస్తున్నా విడుదలవుతున్న వ్యర్థాలతో పోలిస్తే వాటి నిర్వహణ అంతంతే. వ్యర్థాల నిర్వహణ కోసం భారత్ అమలు చేస్తున్న కార్యక్రమాలు, రూపొందించిన చట్టాలు మొదలైన అంశాలపై పోటీ పరీక్షల అభ్యర్థులకు అవగాహన అవసరం.

ఏపీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

సైన్స్ అండ్ టెక్నాలజీ

సమర్థ ప్రణాళికలతోనే... సురక్షిత పర్యావరణం!

భారతదేశంలో ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ

◆ ప్లాస్టిక్ వేస్ట్ మార్కర్స్ ఇండెక్స్ 2019 నివేదిక ఆధారంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తిలో భారత్ మూడోస్థానంలో ఉంది.

◆ సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, 2020-21 వార్షిక గణాంకాల ప్రకారం భారతదేశంలో వార్షికంగా 4.12 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పన్నమవుతున్నాయి.

◆ మన దేశంలో ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ కోసం వివిధ కార్యక్రమాలు అమలవుతున్నాయి. స్వచ్ఛభారత్ మిషన్, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు మొదలైనవి ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

◆ దేశంలో ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణకు రూపొందించిన ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ కావలసిన కార్యాచరణను పేర్కొన్నాయి.

◆ 2021 ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ, సవరణ నియమాల ప్రకారం భారతదేశంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను 2022 జులై 1 నుంచి నిషేధించారు. ఇదే కాకుండా ప్లాస్టిక్ ప్యాకేజింగ్‌పై ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ నియమాలను కఠినతరం చేశారు.

◆ 2024లో 1986 ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్‌కి అనుగుణంగా ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నియమాలను సవరించారు. వీటిలో ముఖ్యమైనవి:

☛ రానున్న అయిదేళ్లలో ఆయా ప్రాంతాల్లో ఉత్పత్తయ్యే ప్లాస్టిక్ వ్యర్థాలను అంచనా వేసే బాధ్యతను ఆయా స్థానిక సంస్థలకు అప్పగించారు.

☛ కంపోస్టబుల్ ప్లాస్టిక్ లేదా బయోడిగ్రేడబుల్ ప్లాస్టిక్ ఉత్పత్తిదారులకు, దిగుమతిదారులకు, బ్రాండ్ ఓనర్లకు, కమోడిటీ తయారీదారుల రిజిస్ట్రేషన్లకు కేంద్రీకృత పోర్టల్‌ను ప్రారంభించారు.



☛ ఆయా స్థానిక సంస్థలు వాటి పరిధిలో ఉన్న ప్రాంతాల్లో నిషేధిత సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిల్వలను, పంపిణీని, అమ్మకాన్ని, వినియోగాన్ని నియంత్రించడానికి అవసరమైన విధివిధానాల అమలుకు సంబంధించి వార్షిక నివేదికను సమర్పించాలి.

☛ ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ పరిధిని విస్తరిస్తూ ప్లాస్టిక్ ప్యాకేజింగ్ ఉత్పత్తిదారులు, దిగుమతిదారులు, బ్రాండ్ ఓనర్లు మొదలైనవారు ఆయా ప్లాస్టిక్ ప్యాకింగ్‌లను తిరిగి సేకరించాలి. ఇవే నియమాలను కంపోస్టబుల్, బయోడిగ్రేడబుల్ ప్లాస్టిక్‌లకు కూడా అమలు చేయాల్సి ఉంటుంది.

☛ స్థానిక సంస్థలు అందించిన వార్షిక నివేదికలను స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు, అక్కడి నుంచి సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు, కేంద్ర ప్రభుత్వానికి ఆన్‌లైన్ ద్వారా పంపిస్తారు.

భారత్‌లో ఇ-వేస్ట్ మేనేజ్‌మెంట్

◆ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలు అంటే ఇ-వ్యర్థాలను తిరిగి వినియోగించడానికి లేదా వేరొక వస్తువులు తయారు చేయడానికి రిఫర్బిష్‌మెంట్ లేదా రిపేరింగ్ ప్రక్రియలకు వినియోగించని వ్యర్థాలను ఇ-వేస్ట్‌గా పరిగణిస్తారు.

◆ గ్లోబల్ ఇ-వేస్ట్ మానిటర్ 2024 ప్రకారం భారతదేశం మూడో అతిపెద్ద ఇ-వేస్ట్ ఉత్పత్తిదారుగా నిలిచింది. చైనా, అమెరికా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

◆ 2021 - 22 గణాంకాల ప్రకారం భారతదేశంలో మొత్తం 16.01 లక్షల టన్నుల ఇ-వేస్ట్ ఉత్పన్నమైంది. ◆ భారతదేశంలో ప్రస్తుతం 567 ఇ-వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లు ఉన్నాయి. వీటి ద్వారా వార్షికంగా 17.23 లక్షల టన్నుల ఇ-వేస్ట్ నిర్వహణ జరుగుతోంది.

ఇ-వేస్ట్ వ్యర్థాల నిర్వహణకు కార్యాచరణ

◆ మనదేశంలో మొట్టమొదటిసారిగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లో హానికర పదార్థాలు ఉన్నాయని గుర్తించి, ఇ-వ్యర్థాలను Hazardous Wastes Management and Handling Amendment Rules, 2003 పరిధిలోకి తీసుకువచ్చారు.

◆ **2011:** ఇ-వేస్ట్ మేనేజ్‌మెంట్, హ్యాండ్లింగ్ నియమాల ప్రకారం ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీని ప్రతిపాదించారు.

◆ **2016:** ఇ-వేస్ట్ మేనేజ్‌మెంట్ నియమాల ప్రకారం ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్‌ను ఏర్పాటు చేశారు.

◆ **2022:** ఇ-వేస్ట్ మేనేజ్‌మెంట్ నియమాలు, 2023, 2024 ఇ-వేస్ట్ నిర్వహణ నియమావళికి చేసిన సవరణల ద్వారా (EPR) ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీని క్రమబద్ధీకరించారు.

◆ **బేసల్ కన్వెన్షన్:** ప్రపంచ దేశాల మధ్య హానికర వ్యర్థాలు, ఇ-వ్యర్థాల సరఫరా నియంత్రణ గురించి ఈ సదస్సులో తీర్మానించారు.

◆ **ద గ్లోబల్ ఇ-వేస్ట్ స్టాటిస్టిక్స్ పార్ట్‌నర్‌షిప్ (GESP):** ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయం, ఇంటర్నేషనల్ టెలీ కమ్యూనికేషన్ భాగస్వామ్యంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణకు ప్రపంచవ్యాప్తంగా అమలు చేయాల్సిన కార్యాచరణ కోసం దీన్ని ఏర్పాటుచేశారు.

◆ **E-WASTE ఛాలెంజ్:** వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించడానికి దీన్ని ఏర్పాటు చేశారు.

◆ **E-Waste Coalition 2018:** ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఏడు సంస్థలు కలిసి సంయుక్తంగా ఇ-వేస్ట్ నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన భాగస్వామ్య సదస్సు. ◆ ఇవే కాకుండా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఉత్పత్తి చేసే పారిశ్రామిక క్లస్టర్లకు ఇ-వేస్ట్ నిర్వహణ ప్లాంట్లను అనుసంధానించి, నిర్వహించినప్పుడు ఇ-వేస్ట్ రీసైక్లింగ్ కార్యక్రమాలు వేగవంతమవుతాయి. ◆ భారతదేశంలోని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ స్వదేశీ సాంకేతికత సహకారంతో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నుంచి విలువైన ఖనిజాలు, ప్లాస్టిక్ పదార్థాలను వెలికితీస్తోంది.

వేస్ట్ టూ వెల్త్

◆ వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించినప్పుడు వాటి నుంచి కూడా సంపదను సృష్టించవచ్చు. మన దేశంలో వేస్ట్ టూ వెల్త్ మిషన్ ద్వారా PM-STIAC (Prime Minister's Science, Technology and Innovation Advisory Council) ను ఏర్పాటు చేసి, దీని ద్వారా వ్యర్థ నిర్వహణ కార్యక్రమాలను భారతీయ చట్టాలకు అనుగుణంగా, మన దేశాన్ని జీరో వేస్ట్ నేషన్‌గా మార్చడానికి అవసరమైన కార్యాచరణను రూపొందించారు.

◆ 2023-24 బడ్జెట్‌లో గోబర్ధన్ కార్యక్రమం ద్వారా కొత్తగా 500 వేస్ట్ టూ వెల్త్ ప్లాంట్లను నెలకొల్పారు.



రచయిత

రేమల్లి సౌజన్య

విషయ నిపుణులు

బ్యాటరీ వేస్ట్ మేనేజ్‌మెంట్ (అమెండ్‌మెంట్) రూల్స్, 2024

❖ పెరుగుతున్న ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి వనరుల ద్వారా వినియోగిస్తున్న బ్యాటరీల నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలు ఈ కోవకు చెందుతాయి. ఈ తరహా బ్యాటరీల్లో పర్యావరణంతో పాటు మానవ ఆరోగ్యానికి హానికారక పదార్థాలైన లెడ్, కాడ్మియం మొదలైనవి ఉంటాయి.

❖ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ 1986 ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్‌కు అనుగుణంగా, బ్యాటరీ వేస్ట్ మేనేజ్‌మెంట్ 2022 నియమాలను రూపొందించింది. వీటికి 2024లో సవరణలు ప్రతిపాదించారు.

❖ మొదటిసారిగా 2001లో బ్యాటరీ మేనేజ్‌మెంట్, హ్యాండ్లింగ్ రూల్స్‌ను ప్రతిపాదించారు.

కేంద్రీకృత ఆన్‌లైన్ పోర్టల్

☛ ఇటీవలి సవరణల ప్రకారం, బ్యాటరీ వ్యర్థ నిర్వహణకు ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీని అమలు చేయాల్సి ఉంటుంది.

☛ ఈపీఆర్ సర్టిఫికెట్లను ప్రొడ్యూసర్స్‌కు, రీసైక్లర్స్‌కు అందించడానికి కేంద్రీకృత ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటు చేస్తారు.

☛ వ్యర్థ బ్యాటరీల నుంచి కూడా కొన్ని ఉపయోగకర పదార్థాలను రికవరీ చేయాల్సి ఉంటుంది.

☛ ఈపీఆర్ లక్ష్యాలకు అనుగుణంగా లేని వ్యర్థ నిర్వహణ కంపెనీలు, పొల్యూటర్ పేస్ ప్రిన్సిపల్ (Polluter Pays Principle) ప్రకారం పర్యావరణ హానికి గాను నష్టపరిహారాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

☛ ఇటీవల 2024లో చేసిన సవరణల ప్రకారం సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మాత్రమే బ్యాటరీ వ్యర్థాలకు సంబంధించిన ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ సర్టిఫికెట్లు, ఇ-వ్యర్థాల నిర్వహణకు అవసరమైన మార్గదర్శకాలను పర్యావరణ అటవీ వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ ఆదేశాలకు అనుగుణంగా రూపొందిస్తుంది.

☛ ఇటీవల వినియోగంలో ఉన్న లిథియం అయాన్ బ్యాటరీల వ్యర్థ నిర్వహణ కూడా దీని పరిధిలోకే వస్తుంది.

ఘన, ప్లాస్టిక్, బ్యాటరీ, ఇ-వ్యర్థాలు, మురుగు నీటి నిర్వహణ మొదలైనవన్నీ సమగ్ర ప్రణాళికలతో చేపట్టినప్పుడు దేశంలో వ్యర్థ నిర్వహణ నియంత్రణ సులభతరమై పర్యావరణాన్ని పరిరక్షించవచ్చు.

440 Word of the Day

Naivete

Telugu meaning: అమాయకత్వం, వెర్రితనం

English meaning: The word 'naivete' is a noun that describes a lack of experience, wisdom, or judgment, often due to innocence or simplicity.

Synonyms: Innocence, Simplicity

Antonyms: Sophistication, Experience

Usage: 1. Her naivete led her to trust people who didn't have her best interests at heart.

2. Despite his naivete, he managed to navigate the complex business world with surprising success.

Latest Updates

UCEED 2025

Admissions to the Bachelor of Design (BDes) programmes at IIT Bombay, IIT Delhi, IIT Guwahati, IIT Hyderabad, IIT Roorkee and IIITDM Jabalpur are done through the Undergraduate Common Entrance Exam for Design (UCEED). The last date for online registration is on 31 October 2024.

Graduate/Diploma Apprentice Posts

Konkan Railway Corporation Limited (KRCL), Navi Mumbai, invites applications from eligible candidates for Apprenticeship Training. There are 190 posts. The application fee is Rs.100. Eligible candidates can apply online before 2 November 2024.

Did You Apply..?

Today (October 15) is the last date for the following Posts/ Apprentice vacancies/

☛ Group C posts in National Institute of Technical Teachers Training and Research (NITTTR), Chennai.

☛ *Qualification:* 10th, Intermediate post followed by ITI, Degree with work experience.

☛ Apprentice posts in National Insurance Company Limited (NICL), Kolkata.

☛ *Qualification:* Any degree.

For more information and other notifications - scan QR code

EENADU Epratibha

విపత్తు నిర్వహణ

సిలబస్ విశ్లేషణ

సహజంగా లేదా మానవకారక చర్యల ఫలితంగా సంభవించి, తీవ్రమైన నష్టాన్ని కలిగించే ఘటనను విపత్తు అంటారు. దీనివల్ల ప్రధానంగా ప్రాణ, ఆస్తి, పర్యావరణ నష్టాలు కలుగుతాయి. భూమి ఏర్పడినప్పటి నుంచి విపత్తులు సంభవిస్తూనే ఉన్నాయి.

ఈ వీడియోలో డిజాస్టర్‌కు ఆ పేరు ఎందుకు వచ్చింది, విపత్తులను నమోదు చేసే ప్రక్రియ ఎప్పటి నుంచి ప్రారంభించారు, ఇప్పటి వరకు నమోదైన విపత్తుల్లో అత్యంత భయంకరమైనవి ఏవి, అత్యధిక విపత్తులు ఎక్కడ చోటుచేసుకుంటున్నాయి, భారత్‌లో ఎలాంటి విపత్తులు సంభవిస్తున్నాయి - వాటికి గల కారణాలు ఏమిటి మొదలైన అంశాలను వివరించారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వీడియో పాఠం చూడండి.. మరిన్ని వీడియోల కోసం ఈప్రతిభ యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రైబ్ చేయండి!

Current Affairs

The Norwegian Nobel Committee has awarded the 2024 Nobel Peace Prize to Nihon Hidankyo on 11 October 2024. It is a Japanese organisation representing survivors of the atomic bombings of Hiroshima and Nagasaki. It got this award "for its efforts to achieve a world free of nuclear weapons and for demonstrating through witness testimony that nuclear weapons must never be used again."

☛ The Nobel Peace Prize 2023 was awarded to Iranian activist Narges Mohammadi.



Spain's tennis legend Rafael Nadal (38) has announced his retirement from professional tennis on 10 October 2024. Nadal's final tournament will be the Davis Cup finals this November in Malaga.

☛ He is a 22-time Grand Slam singles champion. He won the French Open singles title a record 14 times. He is also a four-time US Open champion and won both the Australian Open and Wimbledon twice.

World Mental Health Day is observed every year on October 10 to raise awareness, promoting mental health education, and advocating against the stigma surrounding mental health. This day was first observed in 1992. ☛ *2024 theme:* 'Mental Health at Work'.

The Indian men's team won the bronze medal at the Asian Table Tennis Championships 2024 in Astana, Kazakhstan on 10 October 2024. They lost in the semi-final clash against Chinese Taipei by a 3-0 margin.

For more Current Affairs: Scan QR code

Number System

1. Two-third of the first number is equal to the cube of the second number. If the second number is equal to twelve percent of 50, what is the sum of the first and the second numbers?

1) 330 2) 360 3) 390
4) 372 5) None of these

2. Two numbers are such that the sum of twice the first number and thrice the second number is 36 and the sum of thrice the first number and twice the second number is 39. Which is the smaller number?

1) 9 2) 5 3) 7
4) 3 5) None of these

3. If 27 is subtracted from a number then it is reduced to 40% of its original. The 1/3rd of the number is?

1) 15 2) 30 3) 60
4) 75 5) None of these

4. In an exam Ritiz scored 52 percent marks, Sunil scored 64 percent marks and Ravi scored 74 percent of marks. The maximum marks of the exam are 750. What are the average marks scored by all the three boys together?

1) 475 2) 485
3) 450 4) 490
5) None of these

Bank Exams

Quantitative Aptitude

5. Rajesh was asked to calculate average of ten, two digit number. By mistake he replaced digits of a number therefore the obtained average will decrease by 3.6. Find difference of digits of this number?

1) 8 2) 3 3) 10
4) 4 5) None of these

6. There are three positive numbers, 1/3rd of average of all the three numbers is 8 less than the value of the highest number. Average of the lowest and the second lowest number is 8. Which is the highest number?

1) 11 2) 14 3) 10
4) 9 5) 13

7. The number obtained by interchanging the two digits of a two digit number is lesser than the original number by 54. If the sum of the two digits of the number is 12, then what is the original number?

1) 28 2) 39 3) 82
4) Can't be determined
5) None of these

8. The sum of digits of a two digit number is 7. If unit place of the number is multiplied by 8 and added with 6 times of 10th place digit, then the number reverses. The difference between the squares of the digits of the number will be

1) 40 2) 21 3) 12
4) 3 5) None of these

9. In a two-digit number, the digit at unit place is 1 more than twice of the digit at tens place. If the digit at unit and at tens place be interchanged, then the difference between the new number and original number is less than the original number by 1. What is the original number?

1) 52 2) 73 3) 25
4) 49 5) 37

10. Arun ordered 15 chapattis, 4 plates of rice, 6 plates of mixed vegetables and 5 ice-cream cups. The cost of one chapatti is Rs. 5, one plate of rice is Rs. 50, one plate of mixed vegetables is Rs.75 and one ice-cream cup is Rs. 20. How much amount did Arun pay to the cashier?

1) Rs. 850 2) Rs. 795 3) Rs. 825
4) Rs. 750 5) None of these

11. Harshita bought 20 pens, 8 packets of wax colours, 6 calculators and 7 pencil boxes. The price of one pen is Rs.7, one packet of wax colour is Rs.22, one calculator is Rs.175 and one pencil box is Rs.14 more than the combined price of one pen and one packet of wax colours. How much amount did Harshita pay to the shopkeeper?

1) Rs.1,381 2) Rs.1,815
3) Rs.1,667 4) Rs.1,572
5) None of these

12. The cost of 5 kg of apples is Rs.450. The cost of 12 dozen mangoes is Rs. 4320 and the cost of 4 kg of oranges is Rs.240. What is the total cost of 8 kg of apples, 8 dozens of mangoes and 8 kg of oranges?

1) Rs.4,020 2) Rs.4,080
3) Rs.4,000 4) Rs.4,050
5) None of these

13. In a fort there was sufficient food for 200 soldiers for 31 days. After 27 days 120 soldiers left the fort. For how many extra days will the rest of the food last for the remaining soldiers?

1) 12 2) 10
3) 8 4) 6
5) None of these

Scan QR code for Key

These model questions were prepared by subject experts of RACE Institute, Hyderabad

ఉచిత కోర్సులు.. ఎంతవరకు?

విద్యార్థులు నేటి పరిస్థితుల్లో ఆన్‌లైన్ కోర్సులు చేయడం చాలా సాధారణ విషయం. నేరుగా నేర్చుకునే వీలు లేని ఎన్నో విషయాలను అంతర్జాలంలో వివిధ మాధ్యమాల ద్వారా అభ్యాసం చేస్తున్నారు. ఈ పద్ధతి వివిధ పరీక్షల్లో వారికి మెరుగైన ఫలితాలు ఇచ్చేలా ప్రోత్సహిస్తున్న ఉదాహరణలు కూడా చూస్తున్నాం.

అయితే వివిధ అంశాలు కొత్తగా నేర్చుకునే క్రమంలో.. ఉచితంగా లభించే ప్రాథమిక కోర్సులు, ఫీజు కట్టి నేర్చుకునే అడ్వాన్స్‌డ్ కోర్సులు.. ఇలా రెండూ వేటికవే కొన్ని ప్రత్యేకమైన ప్రయోజనాలు కలిగి ఉంటాయని చెబుతున్నారు నిపుణులు. మరి ఏవి ఎలా ఉంటాయో పరిశీలిస్తే..

ఉచిత కోర్సులు మొదటిసారిగా ఆన్‌లైన్‌లో చదువుతున్నప్పుడు ఆ ప్రక్రియకు అలవాటు పడేందుకు సహకరిస్తాయి. ఖర్చు లేకుండా ప్రాథమిక అంశాల గురించి తెలుసుకునే వీలుంటుంది.

● యూట్యూబ్ వీడియోలు, బ్లాగ్స్, ఇతర ఉచిత వనరులు చాలావరకూ సబ్జెక్టును అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. అయితే పెయిడ్ కోర్సులతో పోలిస్తే వీటికి సమయం ఎక్కువ వెచ్చించాలి. అనేక రిసోర్సులు చూడటం, ఏది బాగుందో పరిశీలించడం, కంటెంట్‌ను అంచనా వేసేందుకు సమయం కేటాయించడం వల్ల అనుకున్న అంశాన్ని నేర్చుకునే ప్రక్రియ నెమ్మదిస్తుంది.



● పూర్తిస్థాయిలో ఫీజు చెల్లించే కోర్సులకు స్థిరమైన స్ట్రక్చర్‌తో కరిక్యులమ్ ఉంటుంది. అన్ని అంశాలూ కవర్ అయ్యే విధంగా సిలబస్‌ను తయారుచేస్తారు. మెటీరియల్ ద్వారా ఒక పద్ధతి ప్రకారం నేర్చుకునే వీలుంటుంది. ఉచిత కోర్సుల్లో ఇది ఉండకపోవచ్చు.

● ఫీజు చెల్లించే వాటికి నిరంతరం అధ్యాపకుల మద్దతు ఉంటుంది. వారిని ప్రశ్నలు అడగడం, సందేహాలు నివృత్తి చేసుకోవడం, ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం, అసైన్‌మెంట్లు చూపించడం, పర్సనలైజ్డ్ గైడెన్స్ తీసుకోవడం.. ఇలా అనేక విధాలుగా వారి సహకారం తీసుకునేందుకు వీలవుతుంది.

● అలాగే వీటిలో కమ్యూనిటీ ఫోరమ్స్, లైవ్ సెషన్లు, గ్రూప్ ప్రాజెక్టులు వంటి వాటి ద్వారా.. కమ్యూనిటీ - నెట్‌వర్కింగ్ మీద పట్టు ఏర్పడుతుంది. ఒకేలాంటి అభ్యాస లక్ష్యాలు ఉన్న వారిని కలవడం, వారితో మాట్లాడటం వంటి వాటి ద్వారా ప్రొఫెషనల్ నెట్‌వర్క్స్ పెంచుకునే వీలుంది.

● ఇలా ఫీజు చెల్లించి నేర్చుకున్న అనంతరం చాలావరకూ కోర్సులకు సర్టిఫికేషన్, గుర్తింపు లభిస్తుంది. ఇది రెజ్యూమెలో రాసుకునేందుకు పనికొస్తుంది. ఉచిత కోర్సులతో నైపుణ్యాలు ఉన్నప్పటికీ రెజ్యూమెలో చూపించుకునేందుకు అవసరమైన సర్టిఫికేషన్ ఉండే పరిస్థితి లేకపోవచ్చు

● ఆన్‌లైన్ కోర్సులను సాధారణంగా సంబంధిత విభాగంలో ఉన్న నిపుణులు తయారుచేస్తుంటారు. నాణ్యమైన కంటెంట్ ఇవ్వడంతోపాటు సమాచారాత్మకంగానూ, ఆసక్తికరంగానూ ఉండేలా వీటిని రూపొందిస్తుంటారు. కోర్సు కంటెంట్‌ను తరచూ అప్‌డేట్ చేయడంతోపాటు విపణిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మారుస్తూ ఉంటారు. ఇలా కాకుండా ఉచిత రిసోర్సుల్లో ఉండే కంటెంట్ అంత అప్‌డేటెడ్‌గా ఉండే అవకాశం లేకపోవచ్చు. నాణ్యతలో లోపాలు ఉండే అవకాశమూ లేకపోలేదు.

● పెయిడ్ లేదా ఫ్రీ కోర్సు ఏది ఎంచుకున్నా.. మనం ఆలోచించాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి. ముందుగా వ్యక్తిగత అవసరాలు, లక్ష్యాలను దృష్టిలో పెట్టుకోవాలి. సమయం ఉంది, పర్వాలేదు అనుకుంటే ఒకలా.. తక్కువ టైమ్‌లో ఎక్కువ విషయాలు నేర్చుకోవాల్సి వచ్చినప్పుడు మరోలా నిర్ణయం తీసుకోవాలి.

● ప్రముఖ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో నేర్చుకునే ఉచిత కోర్సులు కూడా నాణ్యతతో కూడి ఉంటాయనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి.

ఐఐటీ దిల్లీ నుంచి డిజైన్ థింకింగ్

ఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) దిల్లీ ఆధ్వర్యంలో డిజైన్ థింకింగ్, ఇన్నోవేషన్ అనే అంశంపై సరికొత్త సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టారు.

● ఇందులో నూతన నమూనాలను ఆలోచించడం, ప్రోటోటైప్ చేయడం, దాన్ని పరీక్షించడం, జెనరేటివ్ ఏఐ సాయాన్ని ఉపయోగించుకోవడం, హ్యూమన్ సెంటర్డ్ డిజైన్, సస్టైనబిలిటీ, డేటా ఆధారిత ఇన్నోవేషన్.. వంటి అనేక అంశాల మీద విద్యార్థులకు తర్ఫీదు ఇస్తారు.

● ఇది మొత్తం 5 నెలల ఆన్‌లైన్ కోర్సు. ఈ ఏడాది డిసెంబరు 20వ తేదీన తరగతులు మొదలుకానున్నాయి. కొత్తగా సంబంధిత కెరియర్లలోకి వెళ్లేవారు, వివిధ స్థాయుల్లో ఉన్నవారికి నూతన నైపుణ్యాలు పెంపొందించేలా ఈ ప్రోగ్రామ్‌ను రూపొందించారు. దీన్ని మేనేజర్, ప్రొడక్ట్ డెవలపర్, ఆంత్రప్రెన్యూర్, బిజినెస్ కన్సల్టెంట్, సీనియర్ ఎగ్జిక్యూటివ్.. ఇలాంటి ఉద్యోగ మార్గాల్లోకి ప్రవేశించాలనుకునే విద్యార్థులు నేర్చుకోవడం ఉపయోగకరం. కోర్సు పూర్తిచేసిన అనంతరం సర్టిఫికేషన్ లభిస్తుంది.

● ఇందులో విద్యార్థులకు వీడియో లెక్చర్లు, అసైన్‌మెంట్లు, క్విజ్‌లు ఉంటాయి.

● కేప్‌స్టోన్ అడ్వెంచర్ ప్రాజెక్టు ఒకటి ఉంటుంది. విద్యార్థులు వాస్తవిక సమస్యాత్మక అంశాల గురించి ఇందులో విపులంగా నేర్చుకుంటారు.

● ఏఐ ఆధారిత ఇన్నోవేషన్, వినియోగం, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్.. ఇలా అన్నీ నేర్పిస్తారు

మరిన్ని వివరాలకు వెబ్‌సైట్: www.iitd.ac.in

ఐటీబీపీ ఆహ్వానిస్తోంది!

545 కానిస్టేబుల్ (డ్రైవర్) కొలువులు

ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ) 545 కానిస్టేబుల్ (డ్రైవర్) గ్రూప్-సి నాన్-గెజిటెడ్ (నాన్ మినిస్టీరియల్) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. పురుషులు మాత్రమే దరఖాస్తు చేయాలి. తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగంలోకి తీసుకున్నప్పటికీ శాశ్వత విధుల్లోకి మార్చవచ్చు.



మొత్తం ఖాళీల్లో.. అన్‌రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 209, ఎస్సీలకు 77, ఎస్టీలకు 40, ఓబీసీలకు 164, ఈడబ్ల్యూఎస్‌లకు 55 కేటాయించారు.

అర్హతలు: మెట్రిక్యులేషన్ లేదా పదోతరగతి పాసై.. హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. ఉద్యోగానుభవం ఉంటే సర్టిఫికెట్‌ను జతచేయాలి.

వయసు: 21 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, మాజీ సైనికోద్యోగులకు మూడు నుంచి ఎనిమిదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు రుసుము: అన్‌రిజర్వ్‌డ్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.100. ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.

ఎంపిక ఎలా?

మొదటి దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ (పీఈటీ), ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ), రెండో దశలో రాత పరీక్ష, మూడో దశలో ధ్రువపత్రాల పరిశీలన, ప్రాక్టికల్/ స్కిల్ టెస్ట్, వైద్య పరీక్షలు ఉంటాయి.

■ ఎఫిషియన్సీ టెస్ట్ (పీఈటీ)లో భాగంగా 1.6 కి.మీ. పరుగును ఏడున్నర నిమిషాల్లో పూర్తిచేయాలి. 11 అడుగుల లాంగ్‌జంప్‌కు, మూడున్నర అడుగుల హైజంప్‌కు మూడు అవకాశాలు ఇస్తారు. దీంట్లో అర్హత సాధించినవాళ్లను ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ)కు ఎంపిక చేస్తారు.

ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ): అభ్యర్థుల ఎత్తు 170 సెం.మీ., ఛాతీ 80-85 సెం.మీ. ఉండాలి. ఎస్టీ అభ్యర్థుల ఎత్తు 162.5 సెం.మీ., ఛాతీ 76-81 ఉంటే సరిపోతుంది. వయసు, ఎత్తుకు తగిన బరువు ఉండాలి. దీంట్లో అర్హత సాధించిన వాళ్లను రాత పరీక్షకు ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష: ఓఎంఆర్/కంప్యూటర్ బేస్ట్ విధానంలో ఉంటుంది. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు 100 మార్కులకు ఉంటాయి.

■ ప్రశ్నపత్రం పదోతరగతి స్థాయిలో ఉంటుంది. జనరల్ నాలెడ్జ్ 10 ప్రశ్నలకు 10 మార్కులు. జనరల్ హిందీ/ జనరల్ ఇంగ్లిష్ 20 ప్రశ్నలకు 20 మార్కులు, మ్యాథమెటిక్స్ 10 ప్రశ్నలకు 10 మార్కులు, ట్రేడ్ (మోటార్ ట్రాన్స్‌పోర్ట్ థియరీ) 60 ప్రశ్నలకు 60 మార్కులు.

■ ఈ పరీక్షలో జనరల్, ఈడబ్ల్యూఎస్, మాజీ సైనికోద్యోగులు 35 శాతం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ (ఎన్‌సీఎల్) అభ్యర్థులు 33 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.

■ దీంట్లో అర్హత సాధించినవారి ధ్రువపత్రాలను పరిశీలించి ప్రాక్టికల్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. దీన్ని 50 మార్కులకు నిర్వహిస్తారు. ఈ పరీక్షలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ పరిజ్ఞానానికి సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు.

■ దీంట్లో అర్హత సాధించినవారికి వైద్య పరీక్షలు నిర్వహించి కేటగిరీలవారీగా తుది ఎంపిక చేస్తారు.

సన్నద్ధత: ప్రశ్నపత్రం పదోతరగతి స్థాయిలోనే ఉంటుంది. కాబట్టి పదో తరగతి సబ్జెక్టుల్లోని ముఖ్యాంశాలపై పట్టు సాధించాలి.

■ ఎలక్ట్రికల్ సిగ్నలింగ్, ప్రికాషన్స్, సేఫ్టీ, గేర్స్ ఛేంజింగ్, రోడ్ సైన్స్, మోటార్ మెకానిజం.. మొదలైన అంశాలపైన పరిజ్ఞానం పెంచుకోవాలి. దీంతో స్కిల్ టెస్టులో ఎక్కువ మార్కులు సంపాదించే అవకాశం ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: 06.11.2024

వెబ్‌సైట్: https://recruitment.itbpolice.nic.in

తాజా ఇంటర్న్‌షిప్‌లు

హైదరాబాద్‌లో

మార్కెటింగ్

సంస్థ: మొసాచి
నైపుణ్యాలు: కంటెంట్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, లింక్డ్ ఇన్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 28
☛ internshala.com/i/cefdb8

మోషన్ గ్రాఫిక్స్

సంస్థ: ఐడియల్ డిజైన్స్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫ్లాష్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, యానిమేషన్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.8,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 26
☛ internshala.com/i/d3cc33

టెక్‌డోమ్ సొల్యూషన్స్ ప్రై.లి.లో

1. రిక్రూట్‌మెంట్

నైపుణ్యం: రిక్రూట్‌మెంట్
స్టైపెండ్: రూ.8,000-12,000
☛ internshala.com/i/eb64a0

2. హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్

నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-పవర్‌పాయింట్, ఎంఎస్-వర్డ్,
స్టైపెండ్: రూ.8,000-12,000
☛ internshala.com/i/d714af

దరఖాస్తు గడువు: అక్టోబరు 30

ఈ-కామర్స్

సంస్థ: సోషియమ్
నైపుణ్యాలు: డిజిటల్ మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ (ఎస్ఈఓ)
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 31
☛ internshala.com/i/240905

విజయవాడలో

మార్కెటింగ్

సంస్థ: రెంచ్‌వైజ్ ప్రో సర్వీసెస్ ప్రై.లి.
నైపుణ్యాలు: డిజిటల్ మార్కెటింగ్, హిందీ మాట్లాడటం, సేల్స్ పిచ్
స్టైపెండ్: రూ.3,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 30
☛ internshala.com/i/6f9959

ప్రొడక్ట్ ఫొటోగ్రఫీ


సంస్థ: గోల్డెన్ గ్రూప్
నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, ఫొటోషాప్ లైట్‌రూమ్ సీసీ, ఫొటోగ్రఫీ
స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/5a8508

ఫీల్డ్ సేల్స్

సంస్థ: రుపీక్
ప్రదేశాలు: విజయవాడ, విశాఖపట్నం
నైపుణ్యం: ఫీల్డ్ సేల్స్
స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/9ff674

దరఖాస్తు గడువు: అక్టోబరు 31

మెథడాలజీ చిక్కుముడి...



ఎమ్మెస్సీ (మ్యాథ్స్), బీఈడీ (మ్యాథ్స్, ఫిజిక్స్) చేశాను. అటవీశాఖలో ఉద్యోగం వచ్చింది. దూరవిద్యలో ఎంఏ (ఇంగ్లిష్) చేశాను. గురుకులాల్లో పీజీటీ, టీజీటీ కోసం, విద్యాశాఖలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పోస్ట్ కోసం బీఈడీలో ఇంగ్లిష్ మెథడాలజీ ఉండాలనే నిబంధన ఉంది. కానీ నాకు బీఈడీలో మ్యాథ్స్, ఫిజిక్స్ మాత్రమే మెథడాలజీగా ఉన్నాయి. ఇప్పుడు నేను బీఈడీలో థర్డ్ మెథడాలజీగా ఇంగ్లిష్ చేయవచ్చా? ఈ కోర్సు ఏ యూనివర్సిటీలో ఉంది? – డి.రాధ

■ ప్రస్తుతం బీఈడీలో థర్డ్ మెథడాలజీ చదివే వెసులుబాటు కొన్నేళ్లుగా అందుబాటులో లేదు. గతంలో బీఈడీ చేసి, ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నవారికి అదనపు విద్యార్హతలు ఉన్న సబ్జెక్టులో థర్డ్ మెథడాలజీ దూరవిద్య ద్వారా చదివే అవకాశం ఉండేది. దూరవిద్యలో నాణ్యత పెంచడానికి యూజీసీ చాలా సంస్కరణలు తీసుకువచ్చింది. ప్రస్తుతం ఏదైనా యూనివర్సిటీ దూరవిద్య ద్వారా ప్రోగ్రాం అందించాలంటే యూజీసీ అనుమతి తప్పనిసరి. బీఈడీ ప్రోగ్రాం వ్యవధి రెండు సంవత్సరాలకు పెరగడం, చాలా రాష్ట్ర ప్రభుత్వాలు బీఈడీలో థర్డ్ మెథడాలజీని నియామకాల్లో, పదోన్నతుల్లో పరిగణనలోకి తీసుకోకపోవడం లాంటి కారణాల వల్ల అన్ని యూనివర్సిటీలూ ఈ వెసులుబాటును నిలిపివేశాయి. మీరు ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ అవ్వాలంటే ఎంఏ ఇంగ్లిష్ విద్యార్హతను ఆధారం చేసుకొని, ఇంగ్లిష్ మెథడాలజీతో మరో బీఈడీ చేయడం ఒక్కటే పరిష్కారం.

మీరు ప్రస్తుతం అటవీ శాఖలో ఉద్యోగం చేస్తున్నారు కాబట్టి ఆ ఉద్యోగానికి రెండేళ్లు సెలవు పెట్టి బీఈడీ చేయవలసి ఉంటుంది. మీకు బోధన వృత్తిపై ఆసక్తి ఉంటే ఎంఏ ఇంగ్లిష్ విద్యార్హతతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆంగ్ల అధ్యాపక ఉద్యోగాలకు ప్రయత్నించవచ్చు. ఇంగ్లిష్‌లో నెట్/సెట్ ఉత్తీర్ణత సాధించి, డిగ్రీ కళాశాలల్లో ఇంగ్లిష్ అధ్యాపక ఉద్యోగాలకు పోటీ పడవచ్చు. మీ వయసు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేయడానికి అనువుగా ఉంటే మ్యాథ్స్/ఫిజిక్స్‌ల్లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం కూడా ప్రయత్నించవచ్చు. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుని తీసుకొని సరైన నిర్ణయం తీసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

బెల్‌లో అసిస్టెంట్ మేనేజర్లు

బెంగళూరులోని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్).. శాశ్వత ప్రాతిపదికన 8 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
◗ అసిస్టెంట్ మేనేజర్: 03 ◗ ప్రొబేషనరీ ఆఫీసర్: 03 ◗ సీనియర్ అసిస్టెంట్ ఆఫీసర్: 02
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ (ఎల్ఎల్‌బీ/ బీఎల్)తో పాటు పని అనుభవం. **వయసు:** ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులకు 25 ఏళ్లు; అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 32 ఏళ్లు; సీనియర్ అసిస్టెంట్ ఆఫీసర్ పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు.
వేతనం: సీనియర్ అసిస్టెంట్ ఆఫీసర్‌లకు నెలకు రూ.30,000- రూ.1,20,000; ప్రొబేషనరీ ఆఫీసర్‌లకు రూ.40,000- రూ.1,40,000; అసిస్టెంట్ మేనేజర్‌లకు రూ.50,000-రూ.1,60,000. **దరఖాస్తు ఫీజు:** రూ.600; ఎస్సీ/ఎస్టీ/ పీడబ్ల్యూబీడీలకు ఫీజు మినహాయింపు ఉంటుంది. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30-10-2024.
వెబ్‌సైట్: https://bel-india.in/

బెంగళూరులో మేనేజీరియల్ ఖాళీలు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్).. ఒప్పంద ప్రాతిపదికన 40 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
■ మేనేజర్: 10 ■ జనరల్ మేనేజర్: 02 ■ అసిస్టెంట్ మేనేజర్: 10
■ డిప్యూటీ జనరల్ మేనేజర్: 12 ■ అసిస్టెంట్ జనరల్ మేనేజర్: 02
■ చీఫ్ జనరల్ మేనేజర్: 03 ■ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్: 01
విభాగాలు: రైల్ అండ్ మెట్రో డివిజన్, రోలింగ్ స్టాక్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రొడక్షన్ ప్లానింగ్, క్వాలిటీ, రిసెర్చ్ అండ్ డిజైన్, టెస్టింగ్, స్టోర్స్, మెయింటెనెన్స్, ఫైనాన్స్, హెచ్‌ఆర్ తదితరాలు. **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, సీఏ/సీఎంఏ, డిగ్రీ, ఇంజినీరింగ్ డిగ్రీ, ఎంబీఏ, పీజీతో పాటు పని అనుభవం.
వయసు: 30 నుంచి 54 ఏళ్ల మధ్య ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.500; ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది. **ఎంపిక:** ధ్రుపపత్రాల పరిశీలన, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25-10-2024. **వెబ్‌సైట్:** www.bemlindia.in/

వాక్ ఇన్

రైట్స్ లిమిటెడ్‌లో ఇంజినీర్లు

ప్రభుత్వ రంగ సంస్థ.. గుడ్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ (రైట్స్) లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 19 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
▲ సైట్ ఇంజినీర్: 10 ▲ డిజైన్ ఇంజినీర్: 02 ▲ సైట్ సర్వేయర్: 05
▲ సెక్షన్ ఇంజినీర్: 02
విభాగాలు: ట్రాక్, సివిల్, ఎలక్ట్రికల్, పవర్, ఎస్టిమేటర్, డిజైనర్ తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీతో పాటు పని అనుభవం. **వయసు:** 55 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా. **ఇంటర్వ్యూ తేదీలు:** అక్టోబరు 23, 25.
వేదిక: గురుగ్రామ్, అహ్మదాబాద్, నవీ ముంబయిలోని రైట్స్ లిమిటెడ్ కేంద్రాల్లో ఇంటర్వ్యూలు జరుగుతాయి. **వెబ్‌సైట్:** https://www.rites.com/

నేషనల్ ఫెర్టిలైజర్స్‌లో నాన్-ఎగ్జిక్యూటివ్‌లు

నోయిడాలోని నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్) 336 నాన్-ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైనవారిని దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఎన్ఎఫ్ఎల్ యూనిట్లు, కార్యాలయాల్లో నియమిస్తారు.



మొత్తం 25 రకాల పోస్టులు ఉన్నప్పటికీ.. ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న పోస్టుల వివరాలు తెలుసుకుందాం. జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2 (ప్రొడక్షన్)-108, జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2 (ఇన్‌స్ట్రుమెంటేషన్)-33, జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2 (ఎలక్ట్రికల్)-14, జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2 (కెమికల్ ల్యాబ్)-10, స్టోర్ అసిస్టెంట్-19, నర్స్-10, ఫార్మసిస్ట్-10, అకౌంట్స్ అసిస్టెంట్-10, అటెండెంట్ గ్రేడ్-1 (మెకానికల్)- ఫిట్టర్-40 పోస్టులు ఉన్నాయి.

1. **జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్–2 (ప్రొడక్షన్)–108:** బీఎస్సీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్) లేదా కెమికల్ ఇంజినీరింగ్/ కెమికల్ ఇంజినీరింగ్ (పెట్రో కెమికల్)/ కెమికల్ టెక్నాలజీలో మూడేళ్ల రెగ్యులర్ డిప్లొమా ఉండాలి.
2. **జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్–2 (ఇన్‌స్ట్రుమెంటేషన్)–33:** ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్/ఇండస్ట్రియల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ లేదా ప్రాసెస్ కంట్రోల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ డిప్లొమా పూర్తిచేయాలి.
3. **జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్–2 (ఎలక్ట్రికల్)–14:** ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిప్లొమా పాసవ్వాలి.
4. **జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్–2 (కెమికల్ ల్యాబ్)–10:** కెమిస్ట్రీ ఒక సబ్జెక్టుగా బీఎస్సీ పూర్తిచేయాలి.
5. **స్టోర్ అసిస్టెంట్–19:** ఏదైనా డిగ్రీ పాసవ్వాలి.
6. **నర్స్–10:** 10+2 (సైన్స్), జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ డిప్లొమా లేదా బీఎస్సీ నర్సింగ్ (ఆనర్స్)/ బీఎస్సీ నర్సింగ్/ బీఎస్సీ నర్సింగ్ (పోస్ట్ బేసిక్) పూర్తిచేయాలి. రాష్ట్ర/కేంద్ర ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకోవాలి.
7. **ఫార్మసిస్ట్–10:** 10+2 (సైన్స్), ఫార్మసీ డిప్లొమా పూర్తిచేయాలి. రాష్ట్ర/ కేంద్ర ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో నమోదు కావాలి.
8. **అకౌంట్స్ అసిస్టెంట్–10:** బీకామ్ ఉత్తీర్ణత.
9. **అటెండెంట్ గ్రేడ్–1 (మెకానికల్)- ఫిట్టర్–40:** మెట్రిక్ + ఐటీఐ ఫిట్టర్ పాసవ్వాలి.

▲ విద్యార్హతలకు సంబంధించిన డిగ్రీ/ డిప్లొమాను జనరల్ అభ్యర్థులు 50 శాతం మార్కులతో పాసవ్వాలి. ఎస్సీ/ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులకు 45 శాతం సరిపోతుంది.

వయసు: 30.09.2024 నాటికి 18 నుంచి 30 సంవత్సరాలు ఉండాలి. గరిష్ఠ వయసులో.. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలు, మాజీ సైనికోద్యోగులకు మూడేళ్లు, దివ్యాంగులకు కేటగిరీని బట్టి పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు రుసుము: రూ. 200. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ.
దరఖాస్తుకు చివరి తేదీ: 08.11.2024
దరఖాస్తు సవరణ తేదీలు: 10.11.2024-11.11.2024
వెబ్‌సైట్: www.nationalfertilizers.com

ఎంపిక ఎలా?

రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు. రాత పరీక్ష ఆఫ్‌లైన్ ఓఎంఆర్ విధానంలో జరుగుతుంది. పరీక్ష తేదీ, సమయం, చిరునామాను అడ్మిట్ కార్డ్‌లో తెలియజేస్తారు. దీన్ని వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.

▲ టెస్టులో రెండు భాగాలు ఉంటాయి. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్‌లలో ఉంటుంది. వ్యవధి రెండు గంటలు. 150 ప్రశ్నల్లో.. 100 ప్రశ్నలను విద్యార్హతలకు సంబంధించిన సబ్జెక్టుల నుంచి అడుగుతారు. జనరల్ ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అండ్ జనరల్ నాలెడ్జ్/ అవేర్‌నెస్‌కు సంబంధించిన 50 ప్రశ్నలు ఇస్తారు. నెగెటివ్ మార్కులు లేవు.

▲ రాత పరీక్షలో 50 శాతం కనీసార్హత మార్కులు సంపాదించాలి. దీంట్లో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపికచేస్తారు. ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు నిర్వహించి తుది ఎంపిక చేస్తారు.

ఉన్నతవిద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానాలు, ఊగిసలాట సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా?

చదువు

మీ ప్రశ్నలను మాకు పంపండి. అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు
ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ -501 512
edc@eenadu.in

(c) eenadu

తండ్రి బాటలో ట్రూడో!

● భారత్‌పై ద్వేషం ● ఖలిస్థాన్ ఉగ్రవాదానికి ఊతం



కనిష్క... 1985లో కెనడాలోని టొరంటో నుంచి యునైటెడ్ కింగ్‌డమ్‌కు ప్రయాణించిన ఎయిర్ ఇండియా విమానం పేరిది! అదే ఏడాది జూన్ 23న టొరంటో నుంచి 329 మంది ప్రయాణికులతో బయల్దేరిన ఆ విమానాన్ని ఖలిస్థాన్ ఉగ్రవాదులు సూట్‌కేసు బాంబులతో గాల్లోనే పేల్చేశారు. దీనికి ప్రధాన సూత్రధారిగా కెనడాలో తలదాచుకున్న ఖలిస్థాన్ ఉగ్రవాది తల్వీందర్ సింగ్ పర్మార్! ఆనాటి కెనడా ప్రధాని పిరె ట్రూడో (ప్రస్తుత ప్రధాని జస్టిన్ ట్రూడో తండ్రి) పర్మార్‌ను వెనకేసుకువచ్చారు. పర్మార్‌ను అప్పగించాలన్న నాటి భారత ప్రభుత్వ అభ్యర్థనను ఆయన తోసిపుచ్చారు. కనిష్క పేలుడుకు కారణమైన పర్మార్ సహా ఇతరులనూ కెనడా ప్రభుత్వం అరెస్టు చేసింది. కానీ ఒక్కరికి (ఇందర్‌జిత్‌సింగ్) మాత్రమే 15 ఏళ్ల జైలు శిక్ష విధించి అందరినీ వదిలేసింది. ఈ విమాన ప్రమాదం జరగటానికి ముందే... భారత నిఘావర్గాలు... ఉగ్రవాదులు విమానదాడులకు పాల్పడే అవకాశం ఉందని కెనడా ప్రభుత్వానికి ఉప్పందించాయి. కానీ... పిరె ట్రూడో ప్రభుత్వం వాటన్నింటినీ పెడచెవిన పెట్టింది. అంతేగాకుండా విమాన ప్రమాదం గురించి తర్వాత లభించిన కొన్ని కీలక ఆధారాలను సైతం కెనడా అధికారులు దాచేశారని అంటారు. ఈ ప్రమాదాన్ని విచారించిన జస్టిస్ జాన్ మేజర్ కమిషన్ కూడా కెనడా నిఘావిభాగాన్ని, పోలీసులను, అధికారులను తీవ్రంగా తప్పుపట్టింది. అంతేగాకుండా తమ విచారణకు అడ్డుతగిలినట్లు ఆరోపించింది. ఈ ప్రమాదం గురించి కెనడా అధికారులకు ముందే తెలుసని ఆక్షేపించింది.

జస్టిన్ ట్రూడో కారణంగా మళ్లీ భారత్, కెనడా దౌత్య సంబంధాలు క్షీణించాయి. చరిత్రలో ఎన్నడూ లేనంతగా దిగజారాయి. భారత్‌తో ఇలా వ్యవహరించటం జస్టిన్ ట్రూడోకు తండ్రి నుంచి అబ్బింది. ఈ ట్రూడో తండ్రి పిరె ఇలియట్ ట్రూడో కూడా గతంలో కెనడా ప్రధానిగా ఖలిస్థాన్ ఉగ్రవాదులకు ఊతమిచ్చారు. 300కుపైగా భారతీయ ప్రయాణికులతో కూడిన కనిష్క విమానాన్ని పేల్చటానికి ఉగ్రవాదులకు పరోక్షంగా దోహదం చేశారు. భారత్‌తో ఘర్షణాత్మక వైఖరి ప్రదర్శించారు.

రాణిని అధినేతగా అంగీకరించలేదని...

ప్రపంచ యుద్ధాల్లో భారత సైనికులు బ్రిటన్ తరఫున పాల్గొనటం కారణంగా... స్వాతంత్ర్యానికి ముందు నుంచే పంజాబ్ నుంచి అనేక మంది సిక్కులు వెళ్లి కెనడాలో స్థిరపడ్డారు. 1970ల్లో కెనడా ఇమ్మిగ్రేషన్ చట్టాలు సులభతరం కావటంతో భారత్ నుంచి భారీస్థాయిలో వలసలు పెరిగాయి. అదే సమయంలో పంజాబ్‌లో ఖలిస్థాన్‌వాదం పెరగటం... వారిపై భారత ప్రభుత్వం ఉక్కుపాదం మోపటంతో ఈ ఉగ్రవాదులకూ కెనడా సురక్షిత స్థావరమైంది. అలా పంజాబ్‌లో ఇద్దరు పోలీసులను కాల్చి కెనడాకు పారిపోయినవాడే తల్వీందర్‌సింగ్ పర్మార్! ఖలిస్థాన్ ఉగ్రవాదులకు కెనడా ఆశ్రయమివ్వటం... వారు అక్కడి నుంచి భారత్‌లో రాజకీయ నాయకులను బెదిరించటంపై అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ అనేకసార్లు పిరె ట్రూడోతో ప్రస్తావించారని... ఆయన పెద్దగా పట్టించుకునేవారు కాదని... ఖలిస్థాన్‌వాదంపై పుస్తకం రాసిన కెనడాకు చెందిన సీబీసీ సీనియర్ పాత్రికేయుడు టెరీ మిలెవ్‌స్కీ వెల్లడించారు. పర్మార్‌ను తమకు అప్పగించాలని 1982లోనే కెనడా ప్రభుత్వానికి భారత్ విజ్ఞప్తి చేసింది. కానీ ట్రూడో ప్రభుత్వం అందుకు నిరాకరించింది. అందుకు కెనడా అధికారులు చూపిన సాకు... ఎలిజబెత్ రాణి హోదా! భారత్ ఎలిజబెత్ రాణిని కామన్వెల్త్ అధినేతగానే గుర్తిస్తోంది తప్ప... తమ దేశ అధినేతగా గుర్తించటం లేదు కాబట్టి... భారత్, కెనడాల మధ్య కామన్వెల్త్ దేశాలకు వర్తించే నేరగాళ్ల అప్పగింత ఒప్పందం లేదని కెనడా దౌత్యవేత్తలు స్పష్టం చేశారు. అలా ఉగ్రవాది పర్మార్‌ను వెనకేసుకు వచ్చింది ఆనాటి పిరె ట్రూడో ప్రభుత్వం! అప్పుడు తప్పించుకున్నా... పాకిస్థాన్ నుంచి భారత్‌లోకి దొంగతనంగా అడుగుపెట్టిన పర్మార్... 1992లో పంజాబ్ పోలీసుల చేతిలో హతమయ్యాడు. తన తండ్రి హయాంలో జరిగిన కనిష్క విమాన ప్రమాదం కేసులో శిక్ష పడ్డ ఏకైక నిందితుడు ఇందర్‌జీత్‌సింగ్‌ను... ప్రస్తుత ప్రధాని జస్టిన్ ట్రూడో అధికారంలోకి రాగానే 2016లో విడుదల చేయటం గమనార్హం.

అక్కడో నీతి....

భారత్‌లో వేర్పాటువాదాన్ని కోరుకునే ఖలిస్థాన్ ఉగ్రవాదులకు మద్దతిచ్చిన పిరె ట్రూడో... తమ దేశంలో ఇలాంటి ప్రత్యేక క్యూబెక్ ఉద్యమాన్ని అణచి వేయటం గమనార్హం! ఫ్రెంచ్ మాట్లాడే ప్రజల రాష్ట్రమైన క్యూబెక్ కెనడా నుంచి విడిపోతామంటూ కోరుకుంది. సైన్యాన్ని రంగంలోకి దించి... పౌరహక్కులను రద్దు చేసి... అత్యంత దారుణంగా అణచివేశారు పిరె ట్రూడో!

- ఈనాడు ప్రత్యేక విభాగం

వసతి గృహాలు, గురుకులాల్లో
ఆహార నాణ్యతకు ప్రభుత్వ మార్గదర్శకాలు

ఈనాడు, అమరావతి: వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ఆహార నాణ్యతను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం మార్గదర్శకాలు రూపొందించింది. అందులో పేర్కొన్న వివరాలు ఇలా..

- నిత్యావసరాలను, సామగ్రిని నిల్వ ఉంచే స్టోర్ రూముల్లో రెండు సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు వాటిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానించాలి.
- నిల్వ గదుల్లోకి ఎలుకలు, బొద్దింకలు, బల్లులు, చీమలు రాకుండా చూడాలి. కిటికీలు, తలుపులు, వెంటిలేటర్లకు మెష్‌లను అమర్చాలి.
- పారిశుద్ధ్య పనులకు వాడే వస్తువులు, ప్రమాదకర పదార్థాలను ఆహార సరకులతో పాటు నిల్వ ఉంచొద్దు.
- పురుగులు, కీటకాలు పట్టకుండా బియ్యాన్ని గన్నీ బ్యాగుల్లో కాకుండా డబ్బాల్లో నిల్వ ఉంచాలి. బెల్లం, చక్కెర, చిక్కీలు తదితర తీపి పదార్థాలను టిన్ బాక్సుల్లో ఉంచాలి.
- పాలు, గుడ్లు, చికెన్ నాణ్యతపై రాజీపడొద్దు.
- స్టోర్ రూం, వంట గదుల్లో టైల్స్, గ్రానైట్స్‌ను పరచాలి.
- వంట సరకుల్లో ముందు కొన్నవాటిని ముందు వాడాలి. సరకులు కొనేటప్పుడు ఎక్స్‌పైరీ తేదీని గమనించి, ఆ గడువు లోపు వాడగల్గినవే కొనాలి.
- వంట సామగ్రి సరఫరా, నిర్వహణ తేదీలను వంట గది గోడలపై నమోదు చేయాలి. సామగ్రి 15 రోజులకు మించి పని చేయనట్లైతే, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.
- బల్బులు, ఫ్యాన్లు, వాష్ బేసిన్ తదితరాలన్నీ శుభ్రంగా ఉండాలి.
- ఎలక్ట్రికల్ వైర్లు వేలాడకుండా చర్యలు తీసుకోవాలి.
- గ్యాస్ సిలిండర్లను వంట గదుల్లో ఉంచకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి
- డోర్ మ్యాట్స్, క్లీనింగ్ క్లాత్‌లను వారానికోసారి ఉతకాలి.
- వంట సిబ్బంది చేతులకు గ్లౌజ్ ధరించాలి. వారు పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేలా పర్యవేక్షించాలి.
- వంట చేసేటప్పుడు సిబ్బంది మద్యం, ధూమపానం చేయకుండా నిషేధించాలి.
- వంటల తయారీతో పాటు పరిశుభ్రతపై సిబ్బందికి ఆరు నెలలకోసారి హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలతో శిక్షణ ఇప్పించాలి.

108, 104 సిబ్బందికి వేతనాలేవి?

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 108 (అత్యవసర సేవలు), 104 (సంచార వైద్యశాల) తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (బాలింతలను ఇళ్లకు తరలించే వాహనాలు) పథకాల కింద పనిచేసే ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాల చెల్లింపులు ఆగిపోయాయి. దసరా పండుగ సందర్భంగా కూడా జీతాలు ఇవ్వకపోవడంపై సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వెంటనే తమకు వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మద్యం సిండికేట్లను అరికట్టడంలో సీఎం విఫలం: షర్మిల

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రభుత్వ పనుల్లో రాజకీయ జోక్యం వద్దని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. మద్యం సిండికేట్లను అరికట్టడంలో రాజకీయ చోద్యం చూస్తున్నారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. మద్యం దుకాణాల టెండర్లు సాధారణ ప్రజలకు దక్కకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులు లేకుండా అందినంత దోచుకుందని 'ఎక్స్' వేదికగా సోమవారం ఆమె ధ్వజమెత్తారు.


కేంద్రం ఉత్తర్వులను రద్దు చేయండి

● కేటాయింపులపై మరోసారి క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్‌లు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర పునర్విభజన సందర్భంగా జరిగిన కేటాయింపుల ప్రకారం ఆయా రాష్ట్రాలకు వెళ్లాలంటూ ఈ నెల 9న కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, కె.ఆమ్రపాలి, ఎ.వాణీప్రసాద్, డి.రొనాల్డ్ రాస్, జి.సృజనలు మరోసారి కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్(క్యాట్)ను ఆశ్రయించారు. వీరు సోమవారం అత్యవసరంగా పిటిషన్‌లు దాఖలు చేయగా, మంగళవారం విచారణ చేపడతామని ధర్మాసనం తెలిపింది. కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్న వాకాటి కరుణ, ఆమ్రపాలి, వాణీప్రసాద్, రొనాల్డ్‌రాస్‌లు ఏపీకి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ఏపీలో పనిచేస్తున్న సృజన తెలంగాణకు రావాల్సి ఉంది. ప్రస్తుతం తాము పనిచేస్తున్న రాష్ట్రంలోనే కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, కేంద్రం జారీ చేసిన కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు.

ట్రాక్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ బృందాల సహాయంతో ట్రాక్ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని, భద్రతపై అప్రమత్తమైన విధానాన్ని అనుసరించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటీవల అవాంఛనీయ ఘటనల నేపథ్యంలో ఆయన సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులు పాల్గొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ తదితర ఆరు డివిజన్లకు చెందిన డివిజనల్ రైల్వే మేనేజర్లు(డీఆర్‌ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.



ధైర్యం లేకపోతే మీ ప్రతిభ వృథా

ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన కఠోర సత్యం ఏంటంటే.. మీకు ఎంతో ప్రతిభ ఉన్నా, ఎన్ని తెలివితేటలున్నా, వాటిని ప్రదర్శించే ధైర్యం లేకపోతే అవన్నీ వృథానే. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మీ ప్రత్యేకత చాటుకోవాలన్నా, ఉన్నత స్థానాలకు చేరాలన్నా చొరవ అత్యంత కీలకం. సంశయాలు వీడి మీరు ముందడుగు వేయడానికి ధైర్యం ఎంత అవసరమో, మీ ప్రయాణాన్ని నిర్విఘ్నంగా కొనసాగించడానికి నిబద్ధత అంతే అవసరం.

– డేవిడ్ జాన్, మోటివేషనల్ కంటెంట్ క్రియేటర్

'నరేగా' సోషల్ ఆడిట్ డైరెక్టర్ నియామకానికి సెర్చ్ కమిటీ

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) సోషల్ ఆడిట్ విభాగం డైరెక్టర్ నియామకానికి ప్రభుత్వం సోమవారం సెర్చ్ కమిటీని నియమించింది. కమిటీ ఛైర్మన్‌గా భూ పరిపాలన వ్యవహారాల చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మిని సీఎస్ నామినేట్ చేశారు. ప్రిన్సిపల్ ఎకౌంటెంట్ జనరల్/స్థానిక సంస్థల్లో ఆడిట్ వ్యవహారాలు చూసే ఎకౌంటెంట్ జనరల్ ఇన్‌ఛార్జి, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఏఎంజీ డైరెక్టర్ అరుణ్‌కుమార్ కాంతి మొహంతి, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ అశిష్ గుప్తా కమిటీ సభ్యులుగా ఉంటారని ప్రభుత్వం పేర్కొంది.

ప్రాజెక్టులను కృష్ణాబోర్డుకు అప్పగించాలన్న కేసు విచారణ 4కి వాయిదా

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను అనుసరించి శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యాంల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను కృష్ణానదీ యాజమాన్య మండలికి అప్పగించాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన కేసు విచారణ వచ్చే నెల 4వ తేదీకి వాయిదాపడింది. సోమవారం దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ అభయ్ ఎస్.ఓక నేతృత్వంలోని ధర్మాసనం అంతర్‌రాష్ట్ర నది, నదీలోయలకు అర్థమేంటి? రిజర్వాయర్లు అంతర్‌రాష్ట్ర నదుల పరిధిలోకి వస్తాయా అంటూ అడిగిన ప్రశ్నలకు మ్యాప్‌లతో సహా సమాధానం ఇవ్వడానికి తమకు సమయం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ చేసిన విజ్ఞప్తి మేరకు ధర్మాసనం కేసు విచారణను వాయిదా వేసింది.

అచ్యుతాపురం సెజ్‌లో అతిపెద్ద ఫెర్రో ఎల్లాయిస్ మూత

రోడ్డునపడ్డ 3 వేల మంది కార్మికులు • జగన్ బాదుడుతో కుదేలైన ఫెర్రో రంగం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఆర్థిక మండలిలోని అతి పెద్ద ఫెర్రో పరిశ్రమ మూతపడింది. జగన్ పాలనలో ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్తు ఛార్జీల బాదుడు, ట్రూ అప్ ఛార్జీల మోత, భారీగా కరెంటు కోతలకు తోడు ఫెర్రో ఉత్పత్తులకు అంతర్జాతీయంగా ధరలు పతనం కావడంతో సెజ్‌లోని అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమను సోమవారం మూసివేశారు. ఈ పరిశ్రమ 8 కొలిమిలతో రోజుకు 800 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఫెర్రో ఉత్పత్తులు తయారుచేసేది. తెదేపా హయాంలో ఫెర్రో పరిశ్రమలకు యూనిట్ విద్యుత్ రూ.4.25కు ఇచ్చేది. జగన్ ప్రభుత్వం దాన్ని ఏకంగా రూ.6.05కు పెంచింది. అప్పటి నుంచి ఈ పరిశ్రమ తేరుకోలేకపోయింది. అంతర్జాతీయంగా ఫెర్రో ఉత్పత్తుల ధర రూ.1.55 లక్షల నుంచి రూ.70 వేలకు పడిపోవడంతో కంపెనీకి తాళాలు వేశారు. ఫెర్రో మాంగనీస్ టన్ను తయారీకి రూ. 80 వేల నుంచి రూ. 90 వేల మధ్య ఖర్చు అవుతుండగా అంతర్జాతీయంగా దీని ధర రూ.70 వేల లోపే ఉండడంతో నడపలేక యాజమాన్యం చేతులెత్తేసింది.



కంపెనీ ఎదుట కార్మికుల ఆందోళన

ముడిసరకు విద్యుత్తే!

సెజ్‌లోని మిగిలిన పరిశ్రమలు అత్యవసర సమయంలో జనరేటర్లు ఉపయోగించి ఉత్పత్తులు కొనసాగిస్తుంటాయి. ఫెర్రో కంపెనీలకు ఆ అవకాశం లేదు. పరిశ్రమలో కొలిమి ఒక్కసారి ఆపితే దాన్ని మళ్లీ తిరిగి మండించడానికి 48 గంటలకు పైగా సమయం పడుతుంది. విద్యుత్తే వీటికి ముడిసరకు కావడంతో కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఫెర్రో కంపెనీలకు రాయితీపై విద్యుత్తు ఇస్తున్నాయి. జగన్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి రాయితీ ఇవ్వకపోగా, విద్యుత్తు ఛార్జీలు పెంచడం పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపింది. అభిజిత్ ఫెర్రో కంపెనీలో 3 వేల మంది వరకు కార్మికులు, ఉద్యోగులు పని చేస్తున్నారు. కంపెనీని అర్ధంతరంగా మూసివేయడంతో వీరంతా రోడ్డున పడ్డారు. కంపెనీ ప్రధాన ద్వారం వద్ద సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ఆందోళనకు దిగారు.

4 కొత్త కళాశాలల్లోని.. నాన్ క్లినికల్ వైద్యులకు సర్దుబాటు

ఈనాడు, అమరావతి: కొత్తగా ఏర్పడిన 4 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు నిలిపి వేసినందున, అక్కడి నాన్ క్లినికల్ వైద్యులను ఇతర చోట్ల సర్దుబాటు చేసే ప్రక్రియ మొదలైంది. పాడేరు, మదనపల్లె, ఆదోని, మార్కాపురం, పులివెందులలోని కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మెడికల్ సీట్ల భర్తీకి అనుగుణంగా భవన నిర్మాణాలు, వైద్యుల నియామకాలు జరగలేదు. చివరికి 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాడేరు వైద్య కళాశాలలో మాత్రమే ప్రవేశాలు కొనసాగుతున్నాయి. మిగిలిన 4 కళాశాలల్లో ప్రవేశాలకు వీల్లేనందున, అక్కడి వైద్యుల్లో కొందరికి సరిపడా పని లేకుండా పోయింది. ముఖ్యంగా నాన్ క్లినికల్ వైద్యులు ఖాళీగా కూర్చుంటున్నారు. క్లినికల్, నాన్ క్లినికల్ విభాగాలు, ట్యూటర్లు కలిపి ఒక్కో కళాశాలలో సుమారు 80 మందిని నియమించారు. నాన్ క్లినికల్ విభాగాల్లో అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్, పాథాలజీ, ఎస్పీఎం వైద్యులు కలిపి 34 మంది ఉన్నారు. వీరిని తొలుత కిందటేడాది ప్రారంభమైన ఐదు వైద్య కళాశాలల్లో, అవసరాన్ని బట్టి ఇతర బోధనాసుపత్రుల్లోనూ నియమించబోతున్నారు. అలాగే 350 పడకలకు సరిపడా క్లినికల్ (జనరల్ ఫిజిషియన్, గైనిక్, పీడియాట్రిక్, ఆర్థో, ఇతర) వైద్యులను మాత్రమే కొనసాగిస్తూ, మిగిలిన వారిని వెనక్కి తీసుకురావాలని భావిస్తున్నారు. ఈ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్స్ (అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ హోదా)ను కూడా ప్రస్తుత, కొత్త వైద్య కళాశాలలకు మారుస్తారు. అనంతరం మిగిలే ఏడీఎంఈ పోస్టులను ఇప్పటికే ప్రకటించిన సీనియార్టీ జాబితాలోని వారితో ప్రాధాన్య క్రమంలో భర్తీచేస్తారు.

రూ.4,500 కోట్ల పనుల్ని వచ్చే జనవరిలోగా పూర్తిచేస్తాం

● మాజీ మంత్రి పీతల సుజాత

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో రూ. 4,500 కోట్లతో చేపట్టిన 30 వేల అభివృద్ధి పనుల్ని వచ్చే ఏడాది జనవరిలోగా పూర్తి చేయనున్నట్లు మాజీ మంత్రి పీతల సుజాత స్పష్టం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. "గత ప్రభుత్వం పంచాయతీలకు దక్కాల్సిన రూ. 13 వేల కోట్ల నిధుల్ని దారి మళ్లించింది. ఉపాధి హామీ పథకం కింద ఉన్న 45,180 జాబ్‌కార్డుల్ని తొలగించింది" అని పీతల సుజాత మండిపడ్డారు.

'ఎన్టీఆర్ బేబీ కిట్' పునరుద్ధరణకు యత్నాలు

ఈనాడు, అమరావతి: గత తెదేపా ప్రభుత్వంలో అమలైన ఎన్టీఆర్ బేబీ కిట్ల పంపిణీ పథకాన్ని పునరుద్ధరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెదేపా హయాంలో 2016 జులై 12న ఈ పథకాన్ని ప్రవేశపెట్టగా రూ.800 విలువైన దుప్పటి, దోమతెర, స్లీపింగ్ బెడ్, పౌడర్, లోషన్, న్యాప్‌కిన్, డైపర్స్‌తో పాటు చిన్నపిల్లల సబ్బులను జిప్ బ్యాగ్‌లో ఉంచి బాలింతలకు ఇచ్చేవారు. వైకాపా అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని రద్దు చేసింది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఒడిశా, ఝార్ఖండ్‌లో అమలవుతున్న ఈ తరహా పథకాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో ఒక్కొక్కరికి కనీసం రూ.1,200 నుంచి రూ.1,300 వరకు ఖర్చు పెడుతున్నారు. రాష్ట్రంలో 'ఆసరా' కింద బాలింతలకు ప్రస్తుతం రూ.5 వేలు ఇస్తున్న విషయం తెలిసిందే.

మాజీ సైనికోద్యోగుల కార్పొరేషన్ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన మరో హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. ఆంధ్రప్రదేశ్‌లో మాజీ సైనికోద్యోగుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. రూ.10 కోట్ల కార్పస్ ఫండ్‌తో దీన్ని నెలకొల్పింది. అవసరాన్ని బట్టి ఈ కార్పొరేషన్‌కు మరిన్ని నిధులు ఇవ్వనుంది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానంగా మాజీ సైనికోద్యోగుల రీ సెటిల్‌మెంట్, పునరావాసానికి వీలుగా సుస్థిరాభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టడం ఈ కార్పొరేషన్ ప్రధాన లక్ష్యం. మాజీ సైనికోద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పన, వైకల్యానికి గురైన సైనికులు, యుద్ధంలో ప్రాణాలు విడిచిన సైనికుల భార్యలు (యుద్ధ వితంతువులు), సైనికులైన భర్తలను కోల్పోయిన భార్యలు, వారిపై ఆధారపడి ఉన్న కుటుంబీకుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు అవసరమైన కార్యక్రమాలను ఈ కార్పొరేషన్ చేపట్టనుంది. మాజీ సైనికోద్యోగుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. రక్షణ మంత్రిత్వశాఖ కూడా అన్ని రాష్ట్రాలు ఈ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని గతంలోనే సూచించింది. నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఈ కార్పొరేషన్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా ఈ హామీని పొందుపరిచారు. గత నెలలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం తెలపగా.. ఇప్పుడు ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీని స్వరూపం, కార్యకలాపాలకు సంబంధించిన పూర్తి విధివిధానాలు త్వరలో ఖరారు కానున్నాయి.

హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్‌గా సునీల్‌కుమార్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: ఏపీ టిడ్కో ఎండీగా విధులు నిర్వర్తిస్తున్న బి.సునీల్‌కుమార్‌రెడ్డికి హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్‌గా ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. దీంతో పాటు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్, దెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్స్ ఎండీగానూ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉర్దూ అకాడమీ కార్యదర్శిగా మహ్మద్ మస్తాన్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఉర్దూ అకాడమీ కార్యదర్శిగా మహ్మద్ మస్తాన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మైనారిటీ సంక్షేమశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వాటిపై చర్యలు తీసుకోవాల్సింది ప్రభుత్వాలు, ఏజెన్సీలే

● హైకోర్టులో కౌంటర్ వేసిన బీపీసీఎల్

ఈనాడు, అమరావతి: రాష్ట్రాల సరిహద్దుల్లో జరిగే పెట్రోల్ ఉత్పత్తుల అక్రమ విక్రయాలను నిలువరించాల్సింది, వాటిపై చర్యలు తీసుకోవాల్సింది రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి ఏజెన్సీలేనని భారత పెట్రోలియం కార్పొరేషన్(బీపీసీఎల్) హైకోర్టుకు నివేదించింది. ఈ విషయంలో తమ పాత్ర ఉండదని పేర్కొంది. ఈ మేరకు బీపీసీఎల్ విశాఖ ప్రాంతీయ మేనేజర్ (రిటైల్) దినేష్ గాడ్గిల్ ఇటీవల రిప్లై కౌంటర్ వేశారు. అక్రమాలకు పాల్పడుతున్న డీలర్లను రక్షిస్తున్నామని పిటిషనర్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. యానాంలో విక్రయించడానికి ఉద్దేశించిన పెట్రోలియం ఉత్పత్తులను బ్లాక్ మార్కెట్‌లో ఏపీలో విక్రయించడాన్ని అడ్డుకోవాలని కోరుతూ రాజమహేంద్రవరానికి చెందిన భీమ నాగరమేశ్ హైకోర్టులో పిల్ వేశారు. బ్లాక్ మార్కెటింగ్ విక్రయ వ్యవహారంపై దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంలో బీపీసీఎల్ తాజాగా కౌంటర్ వేసింది. పిల్‌ను కొట్టేయాలని కోరింది.

లాసెట్ ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన లాసెట్-2024 ప్రవేశాలకు ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. లాసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులంతా ఈ నెల 16 నుంచి 20 లోపు కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కన్వీనర్ ఆచార్య సత్యనారాయణ చెప్పారు. 22 నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్ల ద్వారా కళాశాలలు ఎంపిక చేసుకోవాలని, 26న మార్పులు, 28న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు 29, 30 తేదీల్లో ఆయా కళాశాలల్లో చేరాల్సి ఉంటుందని చెప్పారు.

ప్రధాని ఫొటో ఉండాల్సిందే

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశం

ఈనాడు-అమరావతి: పల్లెపండుగ వారోత్సవాల ఫ్లెక్సీలు, వాల్ పెయింట్స్, సిటిజన్ నాలెడ్జ్ బోర్డులపై ప్రధాని నరేంద్రమోదీ ఫొటో కచ్చితంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. కొన్నిచోట్ల వాటిపై ప్రధాని ఫొటో లేని విషయం ఆయన దృష్టికి వచ్చింది. దీంతో ఆయా బోర్డులపై ప్రధాని, సీఎం, రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నం, పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకం లోగోలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు.

వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో ఉద్యోగాలు కోల్పోయాం

జనసేన కార్యాలయంలో వాపోయిన బాధితులు

ఈనాడు డిజిటల్, అమరావతి: 'దేశవ్యాప్తంగా నిర్వహించిన జర్మన్ భాష శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాం. అప్పటికే చేస్తున్న ఉద్యోగాలు వదులుకోవాలని నిర్వాహకులు చెప్పడంతో ఉద్యోగాలు కూడా మానేశాం. ఏపీ మినహాయించి ఆ పరీక్షలో ఎన్నికైన అన్ని రాష్ట్రాల వారిని జర్మనీ పంపించారు. ఈ విషయంలో గత వైకాపా ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డాం' అని జర్మనీ భాష పరీక్షలో ఉత్తీర్ణులైన నర్సులు జనసేన కార్యాలయంలో వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సోమవారం బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తన మూడున్నర ఎకరాల భూమిని స్థానిక వైకాపా నాయకుడు ఆక్రమించుకున్నాడని బంగారుపాళ్యం మండలం బొమ్మాయపల్లి గ్రామానికి చెందిన రామ్మూర్తి ఫిర్యాదు చేశారు.

● తన కుమారుడు 20 రోజుల క్రితం పాఠశాలకు వెళ్లి తిరిగి రాలేదని విజయవాడకు చెందిన గువ్వల దుర్గ కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆచూకీ లభించలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

న్యాస్‌కు సన్నద్ధం దిశగా ముందస్తు పరీక్షలు

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వం డిసెంబరు 4న నిర్వహించనున్న జాతీయ సాధన సర్వే(న్యాస్) కోసం విద్యార్థులను ముందుగానే సన్నద్ధం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ప్రతి శనివారం అన్ని యాజమాన్య పాఠశాలల్లో ప్రత్యేక పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మండల స్థాయిలో పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఎంఈఓలతోపాటు పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లోని 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ సర్వే నిర్వహిస్తోంది. తెలుగు, గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహించి, విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నారో గుర్తిస్తుంది. దీనికి సంబంధించిన షెడ్యూల్ ముందుగానే తెలియడంతో విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు నమూనా ప్రశ్నపత్రాలతో పరీక్షలు పెట్టాలని అధికారులు నిర్ణయించారు.

'ప్రతిభ' పరీక్ష నోటిఫికేషన్ విడుదల

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 7, 10వ తరగతుల విద్యార్థులకు ఎపిఫనీ సంస్థ నిర్వహించే ప్రతిభ అవార్డుల పరీక్ష ప్రకటనను పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు సోమవారం విడుదల చేశారు. కోడ్‌తంత్ర సాంకేతికత సహాయంతో ఈ పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. దీనిని రెండు దశల్లో నిర్వహిస్తారు. 29న నిర్వహించే ప్రిలిమ్స్‌లో 40 శాతం పైగా మార్కులు సాధించిన వారికి మెయిన్స్ పరీక్ష ఉంటుంది. అందులో రాష్ట్రస్థాయిలో పదో తరగతిలో ప్రథమ స్థానం పొందిన వారికి రూ.30 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి వరుసగా రూ.25 వేలు, రూ.20 వేల చొప్పున నగదు బహుమతి ఇస్తారు. ఏడో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున అందిస్తారు.

డ్రోన్ సదస్సు భాగస్వామిగా.. డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా

ఈనాడు, అమరావతి: అమరావతి డ్రోన్ సమ్మిట్‌లో భాగంగా జాతీయ సెమినార్ నిర్వహణ భాగస్వామిగా డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీఎఫ్ఐ)ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈనెల 22, 23 తేదీల్లో మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే జాతీయ సదస్సును ఏపీ డ్రోన్ కార్పొరేషన్‌తో కలిసి డీఎఫ్ఐ పర్యవేక్షిస్తుంది. దీని నిర్వహణకు రూ.5.54 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. వివిధ శాఖల ద్వారా ప్రజలకు సేవలను మరింత సులభతరం చేసేలా డ్రోన్ సాంకేతికతను వినియోగించాలని ప్రభుత్వం భావిస్తోంది. డ్రోన్‌ల వినియోగానికి అవకాశమున్న శాఖలు, వాటిలో వాణిజ్యపరంగా డ్రోన్ల వినియోగాన్ని పెంచడం, పెట్టుబడిదారులు, నిపుణులను భాగస్వాములను చేసి, ఈ రంగంలో అవకాశాలను అన్వేషించడం, రాష్ట్రంలో డ్రోన్ సిటీ ఏర్పాటుపై చర్చించనున్నారు.

డిమాండ్లను నెరవేర్చకుంటే 29 నుంచి సమ్మె

ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్

ఈనాడు డిజిటల్, అమరావతి: తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ నెల 29 నుంచి సమ్మెకు దిగుతామని ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చవ్వాకుల గోవింద్, గుమ్మడి గురవయ్య వెల్లడించారు. 17 ఏళ్లుగా పని చేస్తున్న క్షేత్ర సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గుర్తించాలని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ హెల్త్‌కేర్ ట్రస్టు సీఈఓకు సోమవారం లేఖ రాశారు. 'సిబ్బందికి అంతర్గత పదోన్నతులు కల్పించాలి. చనిపోయిన సిబ్బంది కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా, పదవీ విరమణ పొందిన వారికి రూ.10 లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలి. మా డిమాండ్లను 29లోపు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతాం' అని పేర్కొన్నారు.

(c) eenadu